# క్రాంతి

లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| పత్రికా ప్రకటన | ...... | 4 |
| ఎస్సీఎస్టీ ఉప ప్రణాళిక | ...... | 5 |
| కూడంకుళం ప్రాజెక్టు | ...... | 7 |
| శ్రీలంక దారుణాలు | ...... | 9 |
| చైనాలో స్త్రీ విముక్తి | ...... | 12 |
| కా. గంటి ప్రసాదంకు జోహార్ | ...... | 15 |
| కా. ఆలూరి జీవిత చరిత్ర | ...... | 17 |
| పువ్వర్తి అమరుల చరిత్రలు | ...... | 21 |
| కా. మహిత జీవిత చరిత్ర | ...... | 36 |
| కా. సమిత జీవిత చరిత్ర | ...... | 41 |
| పోరాటాలు, సభలు | ...... | 43 |
| పత్రికా ప్రకటన | ...... | 49 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 37 సంచిక: 2 ఏప్రిల్ - జూలై 2013 వెల: పది రూపాయలు


## కాంగ్రెసు తదితర బూర్జువా పార్టీల మెడలు వంచి

## చారిత్రక విజయం సాధించిన తెలంగాణ ప్రజలకు మా విప్లవ జేజేలు!

## తెలంగాణాలో ప్రజల మౌలిక సమస్యల పరిష్కారం కోసం

## నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని కొనసాగించాలని ప్రజలకు పిలుపు

60 యేండ్లుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిపిన పోరాటం విజయవంతం అయ్యింది. యూపీఏ సమన్వయ సమితి, కాంగ్రెసు వర్కింగ్ కమిటీ సమావేశాల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌ను అంగీకరిస్తూ ప్రకటన చేసింది. ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరం అంతర్భాగమేనని, పది సంవత్సరాల వరకు అది ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ప్రకటించింది. పార్లమెంట్‌లో బిల్లు పెట్టే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు సి.డబ్ల్యు.సి. ప్రకటించింది. ఈ ప్రకటనను బిజెపి కూడా బలపరిచింది. దీనికి ముందు న్యూఢిల్లీలో పెద్దయెత్తున రాజకీయ కార్యకలాపాలు జరిగాయి. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడానికి సీమాంధ్ర రాజకీయ నాయకులు చివరి వరకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని ఈసారి వారి కుట్రలు దానిని అడ్డుకోలేకపోయాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు యావత్తు తెలంగాణ ప్రజల చారిత్రక పోరాట విజయం. కాంగ్రెసు, టిడిపి యితర బూర్జువా పార్టీల కుట్రలను ఎదుర్కొంటూ తెలంగాణ ప్రజలు గొప్ప ప్రజా ఉద్యమాన్ని నడిపారు. టిఆర్ఎస్ లాబీయింగ్ రాజకీయాలను ఓడిస్తూ పోరాట పథంలో ముందుకు సాగారు. దీర్ఘకాలంగా పట్టువదలకుండా ప్రజలు నడిపిన పోరాటం ముందు కాంగ్రెసు, టిడిపి పార్టీలు ఓడిపోక తప్పలేదు. దృఢనిశ్చయంతో పోరాడితే ప్రజలు దేనినైనా సాధించగలరని చరిత్రలో మరోసారి ఈ సందర్భంగా రుజువైంది. తెలంగాణ ప్రజల సుదీర్ఘ, రక్తసిక్త, త్యాగపూరిత పోరాట చరిత్రలో ఈ రోజు ఒక మైలురాయిగా నిలుస్తుంది.

ప్రజల ఆకాంక్ష అయిన ప్రత్యేక తెలంగాణ డిమాండ్‌ను మా పార్టీ 1969 నుండి సమర్థిస్తూనే, ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తూ వస్తున్నది. 1996 నుండి తిరిగి మలి దశ ఉద్యమాన్ని ప్రారంభించడంలో మా పార్టీ చేసిన కృషి ప్రధానమైనది. వరంగల్‌లో భారీ బహిరంగసభను జరిపి వరంగల్ డిక్లరేషన్‌ను ప్రకటించింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలో భాగంగా పేర్కొంటూ ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పాటుకై పోరాడాలని మా పార్టీ ప్రజలకు పిలుపు నిచ్చింది. ప్రజలు పోరాటం ద్వారానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోగలరని, లాబీయింగ్ రాజకీయాలతో సాధించలేరని ప్రజలను నిరంతరం పోరాట రంగంలో కదిలించింది. తెలంగాణ ప్రజల సమైక్య

పోరాటం ద్వారానే ఈ డిమాండ్ నెరవేరిందని ఈ రోజు ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ పోరాటంలో పాల్గొన్న అనేక మంది విద్యార్థులు, ప్రజలతో పాటు మా పార్టీ కార్యకర్తలు కూడ ప్రభుత్వ నిర్బంధకాండలో ప్రాణాలు కోల్పోయారు. అనేక మంది జైళ్ల పాలైనారు. మా పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై రాజీలేని మిలిటెంట్ పోరాటాన్ని నడుపుతూ ముందు పీఠిన నిలిచింది. అనేక క్లిష్ట పరిస్థితులలో ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించి నడిపింది. కాంగ్రెసు, టిడిపి, కోస్తాంధ్ర బడా పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాటం నడిపింది. 610 జి.ఓ.తో పాటు, తెలంగాణ వనరులను సీమాంధ్ర దోపిడిదారుల నుండి కాపాడుకోవాలని పిలుపు నిచ్చింది. బాబ్లీ ప్రాజెక్టు, పోలవరం, ఓపెన్ కాస్ట్ గనులు, బయ్యారం గనులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, కవ్వాల్ టైగర్ లాంటి ప్రజల జీవన్మరణ నిర్వాసిత సమస్యలపై ఆందోళన చేసింది. ఛలో అసెంబ్లీ, మిలియన్ మార్చ్ ప్రదర్శన, సాగరహారం, క్విట్ తెలంగాణతో పాటు అనేక మిలిటెంట్ ప్రదర్శనల్లో క్రియాశీలంగా పాల్గొంది. యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన నిలబడి ఆ ఉద్యమాలకు నాయకత్వం వహించింది. పార్లమెంటులో బిల్లు పెట్టాలనే రాజకీయ నినాదాన్ని బలపరిచి ముందుకు వచ్చింది. సకల జనుల సమ్మెలో చురుకుగా పాల్గొని సార్వత్రిక ఉద్యమంగా నడపాలని పిలుపు నిచ్చింది. ఇలా తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ ఉద్యమానికి నాయకత్వం వహించింది. ప్రజల మిలిటెంట్ పోరాటాలను పక్కదారి పట్టించజూసిన టిఆర్ఎస్ పార్టీ లాబీయింగ్ రాజకీయాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేసింది.

ఈ పోరాటంలో తెలంగాణ ప్రజలు సమైక్యంగా పోరాడడంతో పాటు, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్‌పై సీమాంధ్ర ప్రజల, ప్రజాస్వామికవాదుల మద్దతు కూడ పొందారు. సీమాంధ్ర నుండి లభించిన ఈ మద్దతు, అక్కడి బూర్జువా నాయకులను ఒంటరి చేసి తెలంగాణ ప్రజల ఉద్యమానికి నైతిక బలాన్నిచ్చింది. ఇలా మూడు ప్రాంతాల ప్రజల మధ్య సమైక్యత పెరుగుతూ ఉంటే బూర్జువా పార్టీలు, నాయకులు ప్రజల నుండి దూరం అవుతూ వచ్చారు. అయితే బూర్జువా నాయకులు ఆ ప్రాంతాల్లో ప్రజలను విద్యార్థులను రెచ్చగొట్టడానికి ఇప్పటికీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అన్నదమ్ములుగా విడిపోదాం – కలిసి మెలసి ఉందాం అనే వైఖరితో మూడు ప్రాంతాల ప్రజల మధ్య సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవడానికి కృషి చేస్తూనే, బూర్జువా నాయకులను ఒంటరి చేసి వారి కుట్రలను ఓడించాలి.

తెలంగాణ ప్రజలు రాష్ట్ర డిమాండ్‌ను సాధించుకొన్నామని సంబరపడుతూ కర్తవ్య సాధనలో ఆదమరచి ఉండకూడదు. పార్లమెంటులో బిల్లు పెట్టి, కాంగ్రెసు పార్టీ చేసిన నిర్ణయాన్ని అమలు చేసేంతవరకూ పట్టు సడలించవద్దు. గతంలో 2009లో ప్రభుత్వం తరఫున అప్పటి హోంమంత్రి తెలంగాణ ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేసి, తదుపరి సీమాంధ్ర నాయకుల రాజీనామాల ఒత్తిడితో తెలంగాణ ప్రజలకు వ్యతిరేకమైన రెండో ప్రకటన చేసి తెలంగాణ ప్రజలకు విద్రోహం చేసిన విషయం ప్రజలందరికీ తెలిసిందే. ప్రజలు ఈ విషయంలో సోయితో ఉండి, ఎలాంటి కుట్రలు ముందుకు వచ్చినా వాటిని తిప్పికొట్టాలి. పార్లమెంటులో బిల్లు పెట్టేంతవరకూ పోరాడాలి. పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడంతో ప్రజల ఆకాంక్షల్లో భాగంగా ప్రత్యేక తెలంగాణ ఏర్పడుతుంది. కాని ఈ రాష్ట్రంలో కూడ అధికారం ప్రజల చేతిలో కాకుండా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాల పార్టీలైన కాంగ్రెసు, టిడిపి, టిఆర్ఎస్, బిజెపి లాంటి పార్టీల చేతిలోనే ఉంటుంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో వివక్ష పోవడం, నీళ్లు, ఉద్యోగాలు లాంటి డిమాండ్ల విషయంలో కొంతమేరకు ప్రయోజనం చేకూరుతుంది. కాని ప్రజల మౌలిక సమస్యలకు పరిష్కారం దొరకదు. ప్రజలకు అధికారం లభిస్తేనే ఈ సమస్యలకు పరిష్కారం సాధ్యం అవుతుంది.

అందుకని తెలంగాణ ప్రజలంతా ఈ కింది ప్రజల ప్రజాస్వామిక డిమాండ్ల సాధన కోసం పోరాడాలి.

1) భూ సంస్కరణలు అమలు చేయాలి.

2) బడా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు, రాజకీయ నాయకులు దురాక్రమించిన ప్రభుత్వ, అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకొని పట్టణ పేదలకు పంపిణీ చేయాలి.

3) భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో ప్రజలు ఆక్రమించిన భూములపై వారికే హక్కు కల్పించాలి.

4) సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రవేశాన్ని అడ్డుకోవాలి. రాష్ట్రం స్వయం అభివృద్ధికై ప్రణాళికలు చేపట్టాలి.

5) ప్రభుత్వ రంగ పరిశ్రమలతో పాటు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలి. కార్మికుల హక్కులను కాపాడాలి.

6) రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ (పెసా)ను, 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తూ, ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఇవ్వాలి.

7) ప్రజలను నిర్వాసితులను చేస్తున్న పోలవరం, పులిచింతల, ఓపెన్ కాస్ట్ గనులు, బయ్యారం గనులు, కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్, ప్రత్యేక ఆర్థిక మండలాలను రద్దు చేయాలి. వీటికి సంబంధించి దళారీ నిరంకుశ బూర్జువాజీతో, బహుళజాతి సంస్థలతో చేసుకున్న ఎంఓయులన్నీ రద్దు చేయాలి.

8) భూమిలేని దళితులందరికి భూమి పంపిణీ చేయాలి. దళితులపై జరుగుతున్న అన్ని రకాల దాడుల నుండి వారికి రక్షణ కల్పించాలి.

9) మహిళలకు చట్టసభలు, విద్య, ఉపాధి రంగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి. మహిళలకు రక్షణ కల్పించాలి.

10) మైనారిటీలకు రిజర్వేషన్లు కల్పించాలి. భూమిలేని వారికి భూమిని పంపిణీ చేయాలి. ఉర్దూను రెండవ అధికార భాషగా అమలు చేయాలి.

11) విద్యారంగంలో ప్రైవేటీకరణను రద్దు చేయాలి. ప్రభుత్వ రంగంలోనే విద్యను కొనసాగించాలి.

12) ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి.

13) తాత్కాలిక, తక్షణ ఉపాధి అవకాశాలకై ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి.

14) బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలి. రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలి. గిట్టుబాటు ధరలు కల్పించాలి. విద్యుత్తు కోతలు ఎత్తివేయాలి. రుణాలు మాఫీ చేయాలి. వడ్డీలేని రుణాలు ఇవ్వాలి.

15) రాష్ట్రంలో పౌర, ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరించాలి. పోలీసు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి.

16) సి.పి.ఐ. (మావోయిస్టు)పై, ఇతర విప్లవ ప్రజా సంఘాలపై నిషేధాన్ని ఎత్తివేయాలి.

17) గ్రేహౌండ్స్ బలగాలను రద్దు చేయాలి.

18) రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి.

19) తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న కేసులన్నింటినీ ఎత్తివేయాలి.

20) తెలంగాణ అమరుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలి.

20) తెలంగాణకు న్యాయబద్ధంగా రావలసిన నీటిని కేటాయించి సాగు నీటిని రైతాంగానికి, ప్రజలకు తాగు నీటిని అందించాలి.

తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా వారు దేశ ప్రజల ముందు రాజకీయంగా ఒక నమూనాను నిలిపారు. ప్రాంతీయ ఆకాంక్షలతో పోరాడుతున్న ప్రజలకు తెలంగాణ ప్రజల పోరాటం ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. జాతుల పోరాటాలకు కూడ నూతన ఉత్తేజాన్ని ఇస్తుంది. దేశంలో సిపిఐ (మావోయిస్టు) నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలకు బలాన్ని యిస్తుంది. తెలంగాణ ప్రజలు గొప్ప పోరాట వారసత్వం కల్గినవారు. వారు అనేక త్యాగాలతో భూమి, భుక్తి, విముక్తి కోసం పలు పోరాటాల్ని నడిపారు. మహత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, నక్సల్బరీ మార్గంలో సాగుతున్న ప్రజాయుద్ధంలో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా భూస్వామ్య వ్యతిరేక పోరాటాలను నడిపి, వ్యవసాయ విప్లవాన్ని కొనసాగిస్తూ వేలాది ఎకరాల భూములను ఆక్రమించారు. గ్రామాల్లో భూస్వామ్య దోపిడిని అరికట్టారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు పోరాడి అనేక పోరాట విజయాలు సాధించారు. ప్రభుత్వం నిర్బంధంతో ఈ పోరాటాలను అణచివేసింది. ఇప్పటికీ మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవోద్యమాన్ని తీవ్రంగా అణచివేస్తున్నది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రదర్శించిన ఐక్యతా, పట్టుదలలను మరింత బలంగా కొనసాగిస్తూ ప్రజలు తమ మౌలిక సమస్యల కోసం పోరాడుతూ, తెలంగాణ ప్రజలంతా నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్య నిర్వహణలో దృఢంగా ముందుకు సాగాలి. దున్నేవారికే భూమి కావాలనే నినాదంతో వ్యవసాయ విప్లవాన్ని కేంద్రంగా చేసుకొని విముక్తి ఉద్యమంలో ముందుకు సాగాలి. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ప్రజలంతా ముందుకు రావాలి. ఇదే మనకు గొప్ప అవకాశం. బూర్జువా పార్టీలు, వారి తొత్తులు రేపు ప్రజలందరినీ బూర్జువా పార్లమెంటరీ ఎన్నికల్లోకి దింపి, వారి మధ్య నెలకొల్పబడిన పోరాట సమైక్యతను విచ్ఛిన్నం చేసి, తమ అధికారాన్ని, దోపిడిని కొనసాగింపజూస్తారు. ప్రజలు తమ ఐక్యత పునాదిగా ముందుకు సాగి కాంగ్రెస్, టిడిపి, బిజెపి, టిఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలతో పాటు రివిజనిస్టు సిపిఐ, సిపిఎంల కుట్రలను ఎదుర్కొని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింప చేయాలని మా పార్టీ యావత్తు ప్రజలకు పిలుపు నిస్తున్నది. ప్రజలు సాధించిన విజయాలను కాపాడుకుంటూ తెలంగాణ ఉద్యమకారులు, సంస్థలు ఐక్యంగా నూతన తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామిక డిమాండ్ల సాధన కోసం పోరాటాలు కొనసాగించాలి. కోస్తా, రాయలసీమ ప్రజలతో ఐక్యమై ఉమ్మడి శత్రువులైన బడా భూస్వామ్య, నిరంకుశ దళారీ బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా పోరాడాలి. గ్రామాలలో, పట్టణాలలో ప్రజలు విజయోత్సవ సభలు జరుపుకోవాల్సిందిగా, భవిష్యత్తు పోరాట కార్యక్రమాన్ని రూపొందించుకోవాల్సిందిగా మా పార్టీ విజ్ఞప్తి చేస్తున్నది.

**ఆనంద్**

**కార్యదర్శి**

**కేంద్ర రీజనల్ బ్యూరో**

**సీపీఐ (మావోయిస్టు)**

**జూలై 31, 2013**

# ప్రత్యేక రాష్ట్రాన్ని పోరాడి సాధించుకున్న తెలంగాణ ప్రజలకు విప్లవాభినందనలు

ప్రత్యేక రాష్ట్రం కావాలనే తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష ప్రాథమికంగా నెరవేరింది. ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, వెలకట్టలేని త్యాగాలతో తమ ఆకాంక్షను నెరవేర్చుకున్న తెలంగాణ ప్రజలకు మా పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన, విప్లవ ప్రజా సంఘాలు, క్రాంతికారీ జనతన సర్కార్లు, యావత్ దండకారణ్య ప్రజానీకం సగర్వంగా లాల్‌సలాం తెలియజేస్తున్నారు. నేడు తెలంగాణ వ్యాపితంగా వెల్లువెత్తిన సంబరాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులందరినీ స్మరించుకుంటున్నారు. ఈ పోరాటానికి నాయకత్వం వహించిన ప్రజా సంఘాలకు, సంఘీభావాన్ని ఇచ్చిన కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజానీకానికి అభినందనలు తెలియజేస్తున్నారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది మేమేనని కాంగ్రెస్ పార్టీ, తమ పోరాటం వల్లనే వచ్చిందని తెలంగాణ రాష్ట్ర సమితి, తమ మద్దతే కీలకమని భారతీయ జనతా పార్టీ, తదితర పార్లమెంటరీ పార్టీలన్నీ ఈ విజయాన్ని తమకు ఆపాదించుకోవడానికి పోటీ పడతాయి. కాని ప్రజల పోరాటశక్తి వల్ల, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఇంకెంత మాత్రం వాయిదా వేయలేని ఒక అనివార్య పరిస్థితికి తలవొంచి మాత్రమే నేడు కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించింది. ఇలా కాంగ్రెస్ పార్టీ మెడలు వంచిన ఘనత ముమ్మాటికీ తెలంగాణ ప్రజలదే. సుసంపన్నమైన, వీరోచితమైన పోరాట సాంప్రదాయాన్ని కలిగి వున్న తెలంగాణ ప్రజలు తమ ఆకాంక్షను నెరవేర్చుకోవడానికి సుదీర్ఘ కాలంగా పోరాడుతూ, ప్రాణ త్యాగాలు చేస్తూ, నమ్మకద్రోహాల నుండి గుణపాఠాలు నేర్చుకుంటూ చివరకు ఈ విజయాన్ని సాధించుకున్నారు. అలా ప్రజలే చరిత్ర నిర్మాతలనే సత్యాన్ని తెలంగాణ ప్రజలు మరోసారి రుజువు చేశారు.

ప్రత్యేక రాష్ట్రం కావాలనే తెలంగాణ ప్రజల ఆకాంక్షను మా పార్టీ మొదటి నుండి దృఢంగా సమర్థించింది. పోరాడుతున్న ప్రజలకు నాయకత్వం అందించింది. 1969లో ప్రత్యేక తెలంగాణ వుద్యమం తీవ్ర అణచివేతకు గురైన తర్వాత, తిరిగి 1996లో వుద్యమాన్ని ప్రారంభించడంలో మా పార్టీ కృషి ప్రధానమైనది. కోస్తాంధ్ర, రాయలసీమ పెట్టుబడిదారులకూ, దోపిడీ వర్గాలకు కొమ్ము కాస్తూ, ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్ష పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఎప్పటికప్పుడు ఎండగట్టింది. ప్రత్యేక తెలంగాణా వుద్యమంపై తెలుగుదేశం పార్టీ తన పాలనా కాలంలో కొనసాగించిన తీవ్ర అణచివేతను, ఆ తర్వాత అది చేసిన అన్ని రకాల మోసాలను, కుట్రలను ఎదిరించింది. పోరాటాలతో కాకుండా కేవలం లాబీయింగ్‌తోనే తెలంగాణను సాధించవచ్చుని తెలంగాణ రాష్ట్ర సమితి ప్రజల్లో కల్పిస్తున్న భ్రమలను పటాపంచలు చేసింది. రకరకాల కుతర్కాలతో తెలంగాణ వుద్యమాన్ని వ్యతిరేకిస్తూ వచ్చిన రివిజనిస్టు పార్టీల దివాళాకోరు రాజకీయాలను విమర్శించింది. ఈ క్రమంలో మా పార్టీ తీవ్ర నిర్బంధానికి గురైంది. కొందరు విలువైన కార్యకర్తలను కోల్పోయింది. అయినప్పటికీ తెలంగాణ ప్రజలకు నాయకత్వం అందించడానికి శాయశక్తులా కృషి చేస్తూ వచ్చింది.

సాధించుకున్న ఈ విజయం ప్రేరణతో ప్రజలు ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకుపోవాలని మా పార్టీ ఆకాంక్షిస్తున్నది. ఇంకెంత మాత్రమూ కాలయాపన చేయకుండా, వెంటనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడం కోసం పోరాడాలి. తెలంగాణ ప్రజలకు లెక్కలేనన్ని సార్లు విద్రోహానికి, వంచనకు బలైన చరిత్ర వుంది కనుక మరోసారి అలా జరగకుండా అప్రమత్తంగా వుండాలి. అంతేకాదు ఎన్నో పోరాటాల ఫలితంగా ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ తదితర ప్రాంతాలు ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడినప్పటికీ, అక్కడ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలేవీ నెరవేరలేదు. ఈ చేదు ఉదాహరణల నుండి తెలంగాణ ప్రజలు గుణపాఠాలు తీసుకొని, నేడు ఏర్పడబోయే తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజాస్వామిక తెలంగాణగా మార్చుకోవడం కోసం తమ పోరాటాన్ని నిరంతరం కొనసాగించవల్సే వుంది. ఇక ఇన్నాళ్లూ తెలంగాణను, ఇక్కడి ప్రకృతి వనరులను ఇష్టం వచ్చినట్టుగా దోచుకున్న దేశీయ, విదేశీయ పెట్టుబడిదారుల దోపిడీకి, ఈ దోపిడీకి మరింతగా దారులు సుగమం చేసే నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా రాజీ లేకుండా పోరాడాల్సి వుంది. భాకపా (మావోయిస్టు) నాయకత్వంలో తెలంగాణ ప్రజలు భూస్వామ్యవర్గాలకు వ్యతిరేకంగా పోరాడి సాధించుకున్న పదుల వేల ఎకరాల భూములను ప్రభుత్వ అణచివేత విధానాల మూలంగా ప్రజలు సాగులోకి తెచ్చుకోలేకపోతున్నారు. మరెన్నో చోట్ల రైతుల నుండి, ముఖ్యంగా ఆదివాసుల నుండి, దళితుల నుండి భూములను గుంజుకొనే ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారు. అలా ఇప్పటికీ భూమి సమస్య తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్యగానే వుంది. కనుక నేడు ఏర్పడే తెలంగాణాలో వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని చురుకుగా కొనసాగించాల్సిన అవసరం వుంది.

కొత్తగా ఏర్పడే తెలంగాణ రాష్ట్రంలో ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావనేది స్పష్టం. ఎందుకంటే నేడక్కడ అధికారంలోకి రాబోయేది దోపిడీ శక్తులే. మౌలిక సమస్యల పరిష్కారం కోసం

# ఎన్నికల బాగోతంలో భాగమే ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికా చట్టం

వేల ఏళ్లుగా నిచ్చెన మెట్ల కులవ్యవస్థలో అట్టడుగుకు నెట్టబడి, సాంఘిక, ఆర్థిక అణచివేతకు, అంటరానితనానికి గురిచేయబడిన దళితులకు రాజ్యాంగ నిర్దేశానుగుణంగా 1979లో ఆరో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఎస్‌సి ఉప ప్రణాళిక( షెడ్యూల్డ్ క్యాస్ట్ సబ్ ప్లాన్, (ఎస్‌సిఎస్‌పి)ని, అంతకుముందే 1974-75లో అయిదో పంచవర్ష ప్రణాళికా కాలంలో ఎస్‌టి ఉప ప్రణాళిక (ట్రైబల్ సబ్‌ప్లాన్, టిఎస్‌పి)ను కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

సాధారణంగా ప్రభుత్వాలు ప్రతిపాదించే బడ్జెట్‌లో ప్రణాళికా వ్యయం, ప్రణాళికేతర వ్యయం వుంటాయి. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు, ఆర్థిక పురోగతికి చేపట్టే కార్యక్రమాలకు చేసే వ్యయాన్ని పణాళికా వ్యయం అంటారు. రోజువారీ కార్యకలాపాలకు, ప్రభుత్వ నిర్వహణ, జీతాలు, పెన్షన్‌లు, వడ్డీల చెల్లింపులు తదితర ఖర్చులను ప్రణాళికేతర వ్యయం అంటారు. ప్రణాళికా వ్యయంలో జనాభా దామాషా ప్రకారం నిర్ణయించిన మొత్తాన్ని ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఖర్చు చేయడాన్ని ఉప ప్రణాళిక అంటారు. జనాభా దామాషా ప్రకారం ఎస్‌సి వుప ప్రణాళికకు 16.2 శాతం, ఎస్‌టి వుప ప్రణాళికకు 6.6 శాతం కేటాయించాలి. రాష్ట్రంలోని అన్ని మంత్రిత్వ శాఖలు, డిపార్టుమెంటులు, కేంద్రంలోని మంత్రిత్వ శాఖలు, డిపార్టుమెంట్లు వారి బడ్జెట్లలో వుప ప్రణాళికల కింద నిధులు కేటాయించి, ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలి. ఉదాహరణకు అంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్‌లో 2012-13 ప్రకారం ప్రణాళికా వ్యయం 54,030 కోట్ల రూపాయలు, ఇందులో రాష్ట్ర జనాభాలో 16.2 శాతంగా వున్న దళితులకు 8,750 కోట్లు, 6.6 శాతంగా వున్న ఆదివాసులకు 3565 కోట్ల రూపాయలు కేటాయించి వారి అభివృద్ధికే ఖర్చు చేయాలి. కాని దళితులకు 1263 కోట్ల రూపాయలు, ఆదివాసులకు 599 కోట్ల రూపాయలు కోతపెట్టారు. దళితులకు 7487 కోట్లు, ఆదివాసులకు 3006 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారు. ఇందులో దారి మళ్లింపులు, మురిగిపోవడం, అవినీతి వంటి కారణాల వల్ల వాస్తవంగా వారి అభివృద్ధికి ఖర్చు చేసేది చాలా తక్కువగా వుంటుంది.

ఇందిరాగాంధీ పాలనలో ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన ఎమర్జెన్సీ నిర్బంధానికి నిరసనగా పెల్లుబికిన ప్రజా ఉద్యమాల అణచివేత, రైతాంగ విప్లవ పోరాటాలపై ఉక్కుపాదం మోపడం వంటి చర్యలతో ఇందిరాగాంధీ ఓటు బ్యాంకు చెదిరిపోయింది. ఫలితంగా 1977లో జరిగిన ఎన్నికలలో ఘోర పరాజయం పాలైంది. అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ ప్రభుత్వాలు పతనమయ్యాయి. ఈ ప్రతికూల పరిస్థితి నుండి బయటపడటానికి 1980లో ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి దళితులను, ఆదివాసులను ఓటు బ్యాంకుగా మార్చుకోవటానికి కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. దీని కోసం ఆయా రాష్ట్రాలలో, కేంద్రంలో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని

---

నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా పీడిత ప్రజల రాజ్యాధికారాన్ని సాధించుకోవడం తప్ప మరో మార్గం లేదు. కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో మొదలై తెలంగాణా అంతటా విస్తరించిన విప్లవోద్యమమే దండకారణ్యంలో నేడు విముక్తి ప్రాంత లక్ష్యంతో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి ప్రేరణ, పునాది అనేది అందరికీ తెలిసినదే. దండకారణ్య వుద్యమానికి తొలి నుంచీ తెలంగాణ పీడిత ప్రజానీకం అండగా నిలబడింది. మరోవైపు తెలంగాణా ప్రజల ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి దండకారణ్య విప్లవోద్యమం, ఇక్కడి ప్రజల ప్రజాస్వామ్య అధికార సంస్థయైన 'క్రాంతికారీ జనతన సర్కార్' మద్దతుగా నిలిచాయి. ప్రత్యేక తెలంగాణ వుద్యమంపై అణచివేతకు పూనుకున్న పోలీసు వ్యవస్థ (ప్రత్యేకించి గ్రేహౌండ్స్, ఎస్ఐబీలు) దండకారణ్య వుద్యమంపై కూడ పాశవిక దాడులకు దిగుతున్నది. దీని విప్లవ ప్రతీఘాతుకత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగించేందుకు ప్రజలంతా సంసిద్ధం కావాలి. తెలంగాణా ప్రజలు నేడు సాధించుకున్న ఈ విజయం స్ఫూర్తితో నూతన ప్రజాస్వామిక విప్లవంలో మరింతగా చురుకుగా ముందుకు సాగాలని, దండకారణ్యంతో సహా దేశంలోని పలు ప్రాంతాల్లో సాగుతున్న ప్రజాయుద్ధంతో భుజం భుజం కలిపి నడవాలని మా పార్టీ పిలుపిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నేపథ్యంలో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు, వ్యతిరేక ఆందోళనలు చేపట్టడానికి స్వార్థ రాజకీయ శక్తులు, దోపిడీ వర్గాలు అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ ప్రయత్నాలను దృఢంగా తిప్పికొట్టి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంపూర్ణమైన మద్దతునిచ్చి, తమ సౌభ్రాతృత్వాన్ని చాటుకోవాలని మా పార్టీ స్పెషల్ జోనల్ కమిటీ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రజానీకానికి, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తున్నది.

ఇదే సందర్భంగా, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణా ప్రజల పోరాట స్ఫూర్తితో విదర్భ, గూర్ఖాలాండ్ తదితర ప్రాంతాల ప్రజలు తమ తమ ప్రాంతాల్లో ప్రత్యేక రాష్ట్ర వుద్యమాలను కొనసాగిస్తారని, తీవ్రతరం చేస్తారని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఆశిస్తున్నది.

**రామన్న**

**కార్యదర్శి**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

ఆదేశించింది. వెంటనే 1980 మార్చి 12న అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు, కేంద్ర మంత్రిత్వ శాఖలకు ఇందిరాగాంధీ లేఖలు రాసింది. దళితులు, ఆదివాసుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆ లేఖలో కోరింది.

కె.ఆర్.నారయణన్ రాష్ట్రపతిగా వున్నప్పుడు దళితులు, ఆదివాసుల ఆర్థిక స్థితిగతులు, సంక్షేమ కార్యక్రమాలు, సబ్‌ప్లాన్ నిధుల అమలు తీరు, ఎస్‌సి, ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసుల సత్వర పరిష్కారం తదితర విషయాలను కూలంకషంగా చర్చించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని గవర్నర్ల సమావేశంలో నిర్ణయించారు. దీని కోసం 2000లో మహారాష్ట్ర గవర్నర్ పి.సి.అలెగ్జాండర్ చైర్మెన్‌గా ఏడుగురు గవర్నర్లతో వున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి సమాచారాన్ని సేకరించింది. 2001లో గవర్నర్ల కమిటీ అనేక సిఫారసులతో తన నివేదిక రాష్ట్రపతికి సమర్పించింది. రాష్ట్రపతి ఆ నివేదికను తన ముందు మాటతో కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. గవర్నర్ల కమిటీ కింది సిఫార్సులు చేసింది.

1. ప్రతి రాష్ట్రంలో నోడల్ ఏజెన్సీగా సాంఘిక సంక్షేమ శాఖను గుర్తించి, అన్ని విభాగాల నుండి, మంత్రిత్వ శాఖల నుండి, ఉప ప్రణాళిక కింద కేటాయించిన నిధులను అప్పగించాలి. పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణలలో స్వతంత్రంగా వ్యవహరించేలా సాంఘిక సంక్షేమ శాఖకు అధికారాలు ఇవ్వాలి. 2. మహారాష్ట్ర మోడల్‌ను అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలి. మహారాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. 3. ఎస్‌సి, ఎస్‌టి వుప ప్రణాళికల నిధులను దారి మళ్లించరాదు. ఒకవేళ ఖర్చు కాకపోతే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఖర్చుపెట్టేలా చర్యలు తీసుకోవాలి. 4. జనాభా ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టిలకు ఎంత వాటా రావాలో, దాని కన్నా తక్కువ నిధులు కేటాయించకుండా వుండేలా కేంద్రమంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలుకు అవసరమైతే ఈ నిష్పత్తి కన్నా ఎక్కువ నిధులు కూడా కేటాయించాలి. 5. ఉప ప్రణాళిక నిధులు కేటాయించని అధికారులను, ఖర్చు చేయని అధికారులను శిక్షించాలి. చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

గవర్నర్ల కమిటీ చేసిన ఈ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదు. మొదటి నుండి ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలకు జనాభా దామాషా ప్రకారం కాకుండా తక్కువగా నిధులు కేటాయిస్తున్నారు. వాస్తవంగా, కేటాయించిన నిధులను కూడా పూర్తిగా ఖర్చు చేయకుండా మురిగిపోయేలా చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం ఖర్చు చేయకుండా మురగబెడుతున్నారని నాలుగేళ్ల క్రితం పార్లమెంటరీ స్థాయీ సంఘం తీవ్రంగా విమర్శించింది. 2010 ఆగస్టు 30న అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం రాజ్యసభలో మాట్లాడుతూ కామన్‌వెల్త్ క్రీడల కోసం ఢిల్లీ రాష్ట్ర ఎస్‌సి ఉప ప్రణాళిక నిధుల నుండి 744 కోట్ల రూపాయలు దారి మళ్లించిన విషయాన్ని అంగీకరించారు. ఈ దారి మళ్లించిన నిధులను తిరిగి ఎస్‌సి ఉప ప్రణాళిక ఖాతాలోకి ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం నుండి రాబడుతామని చిదంబరం ప్రకటించారు. కాని తర్వాత ప్రవేశపెట్టిన ఢిల్లీ రాష్ట్ర బడ్జెట్‌లో దారి మళ్లించిన నిధులను తిరిగి కేటాయించలేదు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత 20 సంవత్సరాలుగా ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల నిధులు సుమారు 22,000 కోట్ల రూపాయలను దారి మళ్లించారు. చంద్రబాబు నాయుడి తొమ్మిదేళ్ల పాలనలో ఆరు వేల కోట్ల రూపాయలు దారి మళ్లాయి. ఎస్‌సి, ఎస్‌టి హాస్టల్ల నిధులను జన్మభూమి ప్రచారానికి ఖర్చు పెట్టారు. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో జలయజ్ఞం, ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలకు 10,000 కోట్ల రూపాయలు దారి మళ్లించారు.

1977 అసైన్‌డ్ భూముల చట్టాన్ని సవరించి ఎస్‌సి, ఎస్‌టిల భూములను బడా పారాశ్రామిక వేత్తలకు, బహుళ జాతి సంస్థలకు ధారాదత్తం చేశారు. ఎన్ఎస్ఎఫ్‌డిసి (నేషనల్ షెడ్యుల్డ్ క్యాస్ట్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను రద్దు చేసి ఎస్‌సి కార్పొరేషన్‌ను మరణశయ్యా మీదికి చేర్చారు. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో చర్చ అనంతరం రాష్ట్ర స్థాయిలో సాంఘిక సంక్షేమశాఖ లేదా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నోడల్ అధికారిగా, జిల్లా స్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేశారు. శాసన సభ్యులను మహారాష్ట్రకు పంపించి ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల అమలు తీరును అధ్యయనం చేయించారు. తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల నిధులను హైదరాబాద్ ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణానికి, హుస్సేన్ సాగర్‌ను శుభ్రం చేయడానికి, ట్యాంక్‌బండ్ అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ పనులకు, పులివెందుల అభివృద్ధికి, పార్కులు, ఫ్లై ఓవర్లు, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, మంత్రుల వాహనాల కొనుగోలుకు, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబులింగ్, రోడ్ల విస్తరణ, టూరిజం, మెట్రో రైలు ప్రాజెక్టులకు బుద్ధిపూర్వకంగా దారి మళ్లించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇచ్చే సామాజిక ఫించన్లు, ఇందిరమ్మ గృహాల ఖర్చును, గ్రామీణ వుపాధి హామీ చెల్లింపులను కూడా ఉప ప్రణాళిక ఖాతాలో చూపించారు. ఉప ప్రణాళికల నిధుల వ్యయం, నియంత్రణ కోసం నియమించిన నోడల్ సంస్థలను నిర్వీర్యం చేశారు. ప్రతి ఏటా ఎస్‌సి ఉప ప్రణాళిక నిధులు 1500 కోట్లు, ఎస్‌టి ఉప ప్రణాళిక నిధులు 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయకుండా మురిగిపోతున్నాయని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రకటించాడు. కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం 2012-13 ఆర్థిక సంవత్సరంలో 4,000 కోట్ల రూపాయలను దారి మళ్లించింది.

ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల నిధులను తప్పనిసరిగా జనాభా దామాషా ప్రకారం కేటాయించడానికి, నిధులు దారి మళ్లించకుండా పూర్తిగా వారికే కేటాయించడానికి, ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళిక చట్టం తీసుకురావాలన్న డిమాండ్‌తో ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో 2012 మార్చి 23 నుండి 72 గంటల పాటు

# కూడంకుళం అణు విద్యుత్ ప్లాంట్‌ను వెంటనే నిలిపివేయాలి

దాదాపు 25–30 సంవత్సరాల క్రితం నుండి ప్రజలు అవిరామంగా వ్యతిరేకిస్తూ ఆందోళనలు, నిరసనలు, ఉద్యమాలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రజా ఉద్యమాలను లెక్కచేయకుండా, ప్రజల సమస్యలను, జీవించే హక్కును పరిగణలలోకి తీసుకోకుండా యుపిఏ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాలే పరమావధిగా భావించి కూడంకుళం అణువిద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పూనుకుంటున్నది. రష్యా సహాయంతో 13 వేల కోట్ల రూపాయల వ్యయంతో దాదాపు పదివేల మెగవాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంగల ప్లాంట్‌ను ప్రభుత్వం ఇక్కడ నిర్మించ తలపెట్టింది. దీనివల్ల పర్యావరణానికి ముప్పు వుందని, వుద్యమకారులు వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం కోర్టు, అణు విద్యుత్ ప్లాంట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి తన ప్రజా వ్యతిరేకతను మరోసారి చాటుకుంది.

కూడంకుళం ప్రాంతం తమిళనాడు రాష్ట్రంలోని తిరునవ్వేలి జిల్లాలో వుంది. సముద్రతీర ప్రాంతంలోని తిరునవ్వేలి, టుటీకోరన్, కన్యాకుమారి జిల్లాలోని ప్రాంత ప్రజల ప్రధాన జీవనాధారం చేపల వేట. కొంత మందికి భూమి వుంది. వీరు వ్యవసాయంపై ఆధారపడతారు. ఈ ప్రాంతము నుండి సంవత్సరానికి రెండు వేల కోట్ల రూపాయల చేపల ఎగుమతి జరుగుతుంది. ఇక్కడ దాదాపు 3 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. కూడంకుళం అణువిద్యుత్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభమైతే రియాక్టర్లను చల్లబరచడానికి వాడిన నీటిని (వేడి నీరు), వ్యర్థాలను సముద్రంలోనికి వదులుతారు. దీనివలన చేపల ఉత్పత్తి దెబ్బతిని లక్షలాది మంది జీవనోపాధిని కోల్పోతారు. దీని ప్రభావం దక్షిణ తమిళనాడు, దక్షిణ కేరళ ఆహార భద్రతపై కూడ పడే అవకాశం వుంటుంది. అంతే కాకుండా సముద్రంలోని ఇతర రకాల జీవులు నాశనమవుతాయి. కాలుష్యం వలన వాతావరణం దెబ్బతింటుంది. రియాక్టర్ల నుండి వెలువడే కాలుష్యం, వ్యర్థపదార్థాల వలన ప్రజల ఆరోగ్యాలు క్షీణిస్తాయి. మహిళలకు గర్భస్రావాలు అధికమవుతాయి. ఇప్పటికే దక్షిణ సముద్రతీర ప్రాంత గనుల తవ్వకాల కారణంగా ఇటీవల క్యాన్సర్, మానసిక రుగ్మతలే కాకుండా అంగవైకల్యాలతో పుట్టే పిల్లల సంఖ్య కూడా పెరుగుతున్నది.

ఈ విధమైన ప్రమాదాలతో కూడుకుని వున్న అణు విద్యుత్ ప్లాంట్ ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మిస్తున్నది. వాస్తవానికి దీని నిర్మాణానికి

---

హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిరసన ప్రదర్శన జరిగింది. 2012 మార్చి 26న తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. ఐక్య కార్యాచరణ సమితి నేతలు, కార్యకర్తలు ఎస్‌సి, ఎస్‌టి కుల సంఘాలు, ప్రగతిశీల విప్లవ ప్రజా సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు నిరసనలో పాల్గొన్నారు. ప్రభుత్వం ఛలో అసెంబ్లీ రోజున ఉద్యమాన్ని అణచివేయటానికి అరెస్టులకు పాల్పడింది. 2012 మార్చి 27న ముఖ్యమంత్రి, ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఉప సంఘం నివేదికను చర్చించి ఉప ప్రణాళికల అమలుకు చట్టబద్ధత కల్పించేలా నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

2012 ఏప్రిల్ 13న ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజ నరసింహ చైర్మెన్‌గా 8 మంది మంత్రులతో మంత్రివర్గ ఉప సంఘాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికకు చట్టబద్ధత, నిధుల కేటాయింపు, వాటి వినియోగం తదితర అంశాలపై మంత్రి వర్గ ఉప సంఘం అధ్యయనం చేసి రెండు నెలల్లోగా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం నిర్ధేశించింది. 2012 ఆగస్టు 25న మంత్రి వర్గ ఉప సంఘం ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. మంత్రి వర్గ ఉప సంఘం తన నివేదికలో పలు సూచనలు చేసింది. అయితే ఇందులో కొత్తవి ఏమీ లేవు. గతంలో గవర్నర్ల కమిటీ సూచనలనే దాదాపు వుప సంఘం పునరుద్ఘాటించింది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికకు చట్టబద్ధత కల్పించటానికి నవంబర్ 30, డిసెంబర్ 1, 2 వ తేదీలలో ప్రత్యేక శాసనసభ సమావేశాలు నిర్వహించారు. బిల్లును శాసనసభ, శాసనమండలి ఆమోదించాయి. ఎస్‌సి, ఎస్‌టి ఉప ప్రణాళికల చట్టానికి 10 సంవత్సరాల కాలపరిమితిని విధించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఉద్యమాల ఒత్తిడితోను, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, 2014 సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, దళితులను, ఆదివాసులను ఓటు బ్యాంకుగా మార్చుకోవడానికి చట్టాన్ని చేసింది. గతంలో దళితులు పోరాడి సాధించుకున్న ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని నిర్జీవం చేశారు. ఆదివాసులు పోరాడి సాధించుకున్న 1/70 చట్టం, షెడ్యుల్ తెగలు, ఇతర సాంప్రదాయక అటవీ హక్కుల గుర్తింపు చట్టం, వడ్డీ వ్యాపార నిషేధ చట్టం వంటి వాటిని అమలు చేయకుండా ఆదివాసుల్ని అడవుల నుండి తరిమివేస్తున్నారు. వున్న చట్టాలను అమలు చేయకుండా కొత్త కమిటీలు, కొత్త చట్టాలతో దళితులను, ఆదివాసులను పాలకులు మోసపూరితంగా భ్రమలలో ముంచుతూ తమకు ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారు. ఇందులో భాగంగానే రాజకీయ పార్టీల్లోని దళిత, ఆదివాసీ నాయకులను, కుల సంఘాల నాయకులను, ప్రభుత్వేతర సంస్థలను రంగంలోకి దింపి విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారు. వున్న చట్టాలను సక్రమంగా అమలు జరిగే విధంగాను, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక చట్టాన్ని దుర్వినియోగం చేసిన వారికి కఠినశిక్ష పడే విధంగా చట్ట సవరణ చేయటానికి, బలమైన ప్రత్యామ్నాయ ఉద్యమాన్ని నిర్మించాలి. ★

పునాదులు వేసింది 1988 నవంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం. సోవియట్ యూనియన్‌తో (రాజీవ్‌గాంధీ-గోర్బచేవ్) ఒప్పందం జరిగింది. కానీ రష్యాలో జరిగిన రాజకీయ అస్థిరత, అమెరికా కల్పించిన ఆటంకాలతో పాటు ఒప్పందానికి వ్యతిరేకంగా తమిళనాడు రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు జరపడంతో ఈ ఒప్పందాన్ని ప్రభుత్వం రద్దుచేసుకొంది. తిరిగి అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందంతో కూడంకుళం ప్రాజెక్టును 2008లో తిరిగి ప్రారంభించింది.

ప్రజల ఓటు హక్కుతో అధికారంలోకి వచ్చిన పాలకవర్గాలు ప్రజల ఆహారభద్రత, జీవించే హక్కు, విద్యా, వైద్యం లాంటి మౌలిక అవసరాలను పట్టించుకోకుండా, అభివృద్ధి పేరుతో పేదల బతుకులను, జీవన ప్రమాణాలను మరింత దిగజారుస్తున్నారు. సామ్రాజ్యవాదులకు, బహుళజాతి సంస్థలకు దేశంలోని ఖనిజ సంపదను ధారాదత్తం చేస్తూ, కూడంకుళంతో పాటు దేశంలోని హర్యానా (గోరఖ్‌పూర్,) గుజరాత్ (మిత్తిమిర్థీ కాకపార్), పశ్చిమ బెంగాల్ (హరిపూర్) మొదలైన రాష్ట్రాలలో ప్రజలు వ్యతిరేకిస్తున్నప్పటికీ అణుప్రాజెక్టులను నిర్మిస్తున్నారు.

అణు విద్యుత్ కేంద్ర స్థాపనకు వ్యతిరేకంగా ప్రజలు, పర్యావరణవేత్తలు ఆందోళనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ఖాతరు చేయడంలేదు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కొవ్వాడలో భూసేకరణకు రాష్ట్ర సర్కార్ అనుమతించింది.

అణు ప్రాజెక్టులతో పాటు థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, ఓపెన్‌కాస్ట్, సెజ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం లాంటివి చేపడుతూ ప్రజల భూములను అక్రమంగా కాజేస్తూ, ప్రజలను విస్థాపనకు గురిచేస్తూ నిర్వాసితులను చేస్తున్నారు.

1945 రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా జరిపిన అణుబాంబు దాడిలో హిరోషిమా, నాగసాకి నగరాల్లో మూడు లక్షల మంది చనిపోయారు. లెక్కలేనంత మంది రేడియేషన్ బారిన పడ్డారు. 1979లో అమెరికాలో త్రీమైల్ ఐలాండ్, 1986లో చెర్నోబిల్, 2011లో జపాన్ లోని ఫుకుషిమా అణు కేంద్రాల్లో ప్రమాదాలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్రపంచ అణు ప్రమాదాలలో 1986లో సోవియట్ రష్యాలోని చెర్నోబిల్ ప్రమాదం అత్యంత ప్రమాదకరమైనది. ఈ ప్రమాదం 5 లక్షల మందిని రేడియోషన్ బారిన పడేసింది. చుట్టుపక్కల 60 కిలో మీటర్ల వరకు రేడియేషన్ వ్యాపించింది. లక్షల మంది క్యాన్సర్ బారిన పడి మరణించారు. అలాంటి చెర్నోబిల్ అణు కేంద్ర సాంకేతిక పరిజ్ఞానంతోనే కూడంకుళంలో అణు ప్రాజెక్టును భారత ప్రభుత్వం నిర్మిస్తున్నది.

ఫుకుషిమా ప్రమాదం తర్వాత గుణపాఠం నేర్చుకున్న జపాన్ ప్రభుత్వం అణు సాంకేతికకు దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకుంది. మిగతా యూరోపియన్ దేశాలు కూడ కొత్త అణు విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయబోమని నిర్ణయించాయి. 1979 తీవ్రమైన ఐలాండ్ ఉదంతం తర్వాత అమెరికాలో ఒక్క కొత్త విద్యుత్ ప్లాంట్ కూడ రాలేదు.

ఇన్ని అనుభవాలున్నప్పటికీ భారతదేశం మాత్రం 2020 నాటికి 20 వేల మెగావాట్ల అణువిద్యుత్ వుత్పత్తి సామర్థ్యాన్ని ఒడిసి పట్టడమే తన లక్ష్యమంటున్నది. యుపిఎ ప్రభుత్వం అణువిద్యుత్ ప్లాంట్‌లపై తమ నిర్ణయాలను మార్చుకోవడానికి సిద్ధంగా లేదు. బహుళజాతి ప్రయోజనాల కోసం ప్రజల ప్రాణాలను సైతం బలిపెట్టడానికి సిద్ధపడుతున్నది. దేశం ఆర్థికంగా, పారిశ్రామికంగా ముందుకు పోవాలంటే, నిలదొక్కుకోవాలంటే పేదల భూములు, జీవితాలు ఫణంగా పెట్టి అణువిద్యుత్ ప్లాంట్,

థర్మల్ ప్రాజెక్టులు, సెజ్‌లు, రోడ్లు లాంటివి చేపట్టవలసిందే అంటూ బహిరంగంగానే మన ప్రజా ప్రతినిధులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. దేశ విద్యుత్ అవసరాలు తీర్చడంలో అణు ప్రాజెక్టులది ముఖ్యపాత్ర అంటూ ప్రచారం చేస్తున్న పాలకులు ప్రజల భద్రత ప్రమాణాలకు సంబంధించి వాస్తవాలను బహిర్గతం చేయడం లేదు. ప్రభుత్వాలు పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న బహుళజాతి సంస్థలకు అనుమతులిస్తూ, మరోవైపు పర్యావరణ వైవిధ్య సదస్సులకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారు. ఒక పక్క ప్రజల భద్రతకు హామీ, ప్రభుత్వం పారదర్శకత, జవాబుదారీతనం వుండాలంటూనే ప్రధానమంత్రి మరో పక్క ప్రమాదాలు జరిగినప్పుడు బహుళజాతి సంస్థలపై దావా వేసే అధికారం దేశ ప్రజలకు లేదంటూ షరతులు విధిస్తూ చట్టాలు రూపొందిస్తున్నాడు. నామమాత్రపు చట్టాలతో నష్ట పరిహారం కనీసం రెండున్నర వేల కోట్ల రూపాయలకు పరిమితం చేశారు. అయినా భారత ప్రభుత్వం భోపాల్ ఘటనలో నష్ట పరిహారం ఏమేరకు చెల్లించిందో ప్రజలకు తెలుసు. 2008లో భారత, రష్యా ప్రభుత్వాల మధ్య రహస్యంగా కుదిరిన అణు ఒప్పందంలో రియాక్టర్లు చెడిపోయినా, ఎటువంటి నష్టం వాటిల్లినా ఎన్‌సిపిఐఎల్ (న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్)దే బాధ్యత అని వుంది.

ఇంతటి ప్రమాదాలతో కూడుకుని వున్న ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కూడంకుళం ప్రజలు శాంతియుతంగా, ప్రజాస్వామిక పద్ధతిలో తమ పోరాటాలను వివిధ రూపాలలో చేపట్టారు. 2011 ఆగస్టు నుండి నల్లజెండాల ఎగరవేతతో తమ పోరాటం మొదలుపెడ్తూ, నిరసనలు, నిరహార దీక్షలు, ర్యాలీలు, ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఒక రోజు సముద్రం లోతులో మునిగి, మరో రోజు ఇసుకలో కూరుకుపోయి ప్రజలు వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగిస్తుండగా, ప్రజా ఆందోళనలపై అప్రజాస్వామిక పద్ధతిలో పోలీసులు హింసాకాండకు పాల్పడి వందలాది మందిని గాయపర్చారు. రియాక్టర్ల ముట్టడికి ప్రయత్నించిన ఉద్యమకారులపై ఘూతుకుడి వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో ఒకరు మరణించారు. 6 వేల మందిపై (పిల్లలు, వృద్ధులు అనే తేడా లేకుండా) కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టినారు. 2012 జనవరిలో ప్రధాని రష్యా పర్యటన తర్వాత కలెక్టరుతో చర్చలు జరపడానికి పోయిన కూడంకుళం ఆందోళన కమిటీ ప్రతినిధులపైనా, మహిళలపైనా సంఘ్ పరివారానికి చెందిన

# తమిళ జాతి విముక్తి పోరాటంపై శ్రీలంక ప్రభుత్వం పాల్పడిన అమానవీయ హింసాకాండను ఖండిద్దాం!

శ్రీలంకలోని పాలక సింహళ జాతి దురహంకారానికి వ్యతిరేకంగా, స్వతంత్ర తమిళ ఈళం కొరకు, సమాన హక్కులు, ఆత్మగౌరవం కొరకు గత మూడు దశాబ్దాలుగా లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈళం (ఎల్‌టీటీఈ) నాయకత్వంలో తమిళ జాతి విముక్తి పోరాటం ఉధృతంగా కొనసాగింది. వేలుపిళ్లై ప్రభాకరన్ నాయకత్వంలోని ఎల్‌టీటీఈ, శ్రీలంక సైన్యంతో జరిగిన అంతిమ పోరులో 2009 మే 17న వేలుపిళ్లై ప్రభాకరన్ వీరమరణం పొందాడు. తమిళుడై వుండి సింహళీయులతో రాజీపడుతున్నాడని, జాఫ్నా మేయర్ ఆల్ఫ్రెడ్ దురైయప్పను 1975లో హత్య చేసి వేలుపిళ్లై ప్రభాకరన్ వార్తల్లో కెక్కాడు. సంవత్సరం తర్వాత తమిళ న్యూటైగర్స్ అనే సంస్థ ఎల్‌టీటీఈగా ఆవిర్భవించింది. 1983 జూలై 23 నుండి తమిళ ఈళం ఉద్యమం తీవ్ర రూపం దాల్చింది. అప్పటి నుండి సాగిన పోరాటంలో సుమారు 70 వేల మంది తమిళులు మరణించారని అధికారిక లెక్కలు చెప్తుంటే, ఈ సంఖ్య దాదాపు రెట్టింపు వుంటుందని అనధికార లెక్కలు చెప్తున్నాయి.

ప్రభాకరన్ నాయకత్వంలోని ఎల్‌టీటీఈతో శ్రీలంక సింహళ ప్రభుత్వం 2009లో అంతిమ యుద్ధాన్ని ప్రారంభించింది. 138 రోజుల పాటు సాగిన ఈ అంతిమ యుద్ధంలో శ్రీలంక సైన్యం కొనసాగించిన మారణహోమంలో సుమారు 40 వేల మంది సాధారణ తమిళ పౌరులు చనిపోయారు. హత్యలు, సామూహిక అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం వంటి యుద్ధ నేరాలకు, ఊచకోతలకు, మానవహక్కుల వుల్లంఘనలకు శ్రీలంక సైన్యం పాల్పడింది.

అంతర్యుద్ధంలో పట్టుబడిన, లొంగిపోయిన ఎల్‌టీటీఈ కార్యకర్తలను నిర్దాక్షిణ్యంగా చంపివేశారు. ఎల్‌టీటీఈ కార్యకర్తలను, సాధారణ తమిళ ప్రజలను అనేక మందిని సైన్యం, బట్టలు విప్పేసి నగ్నంగా మార్చి, పెడరెక్కలు విరిచి చేతులు కట్టేసి, కళ్లకు గంతలు కట్టి కాల్చివేసింది. నోఫైజోన్‌లోని జనావాసాలపై వైమానిక, క్షిపణి దాడులు చేశారు. ఎంత మంది ప్రజల ప్రాణాలను బలిపెట్టయినా విజయాన్ని సాధించాలనే దుష్ట లక్ష్యంతో విచక్షణారహితంగా గ్రామాలు, పట్టణాలపై వైమానిక దాడులు చేశారు. ముళ్లైతీవు జిల్లాలోని పుదుకుడి యిరుప్పులో ఒక హాస్పిటల్‌లోని చిన్న పిల్లల వార్డుపై బాంబులు వేయడంతో, చాలామంది పిల్లలూ, పెద్దలూ చనిపోయారు. యుద్ధ నిషేధ ప్రాంతంలోని శిబిరాలలో

---

హిందూ మున్నవి కార్యకర్తలు పోలీసుల మద్దతుతో దాడిచేశారు.

అక్టోబర్ 17న పంచాయితీ ఎన్నికలుండగా వాటిని విజయవంతంగా వుపయోగించుకోడానికి, అణు రియాక్టర్లను ప్రారంభించకూడదని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తూ, ప్రజా ఆందోళనకు మద్దతు తెలుపుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నాటకమాడింది. ఎన్నికల అనంతరం తన అసలు స్వభావాన్ని చాటుకుంటూ ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతున్నది.

ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న వారిపై అక్రమ కేసులు బనాయించినారు. ఏ ఉద్యమాలనైనా సాయుధంగా అణచివేయడమే పరిష్కారమనుకుంటున్న ప్రభుత్వాలు అదే మార్గాన్ని అనుసరిస్తూ, ప్రజల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రజల ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు. ఆందోళనను నడిపిస్తున్న ఇడిందకరై వంటి గ్రామాలకు ప్రభుత్వం మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా, నీరు, పాలు వంటి నిత్యావసరాలను కూడా అడ్డుకుంది. విద్యుత్ కోతను విధిస్తూ ప్లాంట్ నిర్మాణం ద్వారానే విద్యుత్ కోతలుండవని ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

అణుశక్తి వ్యతిరేక ప్రజా ఉద్యమం (పీఎంఏఎన్) సంస్థ సారథ్యంలో శాంతియుతంగా ఉద్యమము సాగుతుండగా సంస్థ నేత వినయ్ కుమార్‌పై పోలీసులు రాజద్రోహ నేరం మోపి, విదేశీ సంస్థల డబ్బుతో మద్దతుతో ఉద్యమాన్ని నడుపుతూ, అభివృద్ధికి ఆటంకం కల్పిస్తున్నారని కేంద్ర హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే మాట్లాడాడు. విదేశీయుల, బహుళజాతి సంస్థల ప్రయోజనాలు కాపాడే పాలక వర్గాలు, వారి తొత్తులు విదేశాలతో సంబంధాలు లేనట్లు మాట్లాడుతున్నారు. వాస్తవానికి ముప్పై గ్రామాల్లో ప్రతీ మత్స్యకార కుటుంబం ఉద్యమం కోసం తమ కష్టార్జితం నుండి స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నారు.

కూడంకుళం ఆందోళనకారులకు మద్దతుగా 120 మంది ప్రముఖులు సంఘీభావం ప్రకటించారు. వారిలో అణుశక్తి నియంత్రణ మండలికి గతంలో సారథ్యం వహించిన గోపాలకృష్ణన్ కూడ వున్నారు. ఉద్యమానికి మద్దతుగా నిలుస్తున్న వివిధ దేశాలకు చెందిన పర్యావరణ ఉద్యమకారులను విదేశీ ఏజెంట్లుగా చిత్రీకరించి దేశం నుండి తరిమికొడ్తున్నారు. కూడంకుళం అణు రియాక్టర్ పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన నిజ నిర్ధారణ కమిటీ సభ్యులను అక్రమంగా అరెస్టు చేసి, విరసం కార్యదర్శి పి. వరలక్ష్మితో పాటు ఎనిమిది మంది హక్కుల కార్యకర్తలపై కేసులు పెట్టి నెల రోజుల పాటు జైలులో నిర్బంధించారు. అంతే కాకుండా వీరికి మావోయిస్టులతో సంబంధాలున్నాయని ప్రచారం చేస్తూ, ప్రజాస్వామికవాదులను కూడ ఉద్యమానికి మద్దతుగా నిలబడకుండా చేస్తున్నారు.

ప్రభుత్వం ప్రయోగిస్తున్న ఈ నిర్బంధకాండను మరింత సమైక్యంగా, మిలిటెంట్‌గా పోరాడడం ద్వారానే ఎదుర్కోవాలి.

★

శరణార్థులుగా తలదాచుకున్న 1 లక్ష 25 వేల మంది తమిళు లకు ఆహారము, నీళ్లు అందకుండా సైన్యం అడ్డుకోవడం వల్ల అధిక సంఖ్యలో సాధారణ తమిళ ప్రజలు చనిపోయారు. ఊచకోత కోసిన తమిళుల శవాలను గుట్టలుగా ట్రాక్టర్లలో తరలించారు. జాఫ్నా, కిలినోచ్చి ప్రాంతాల్లో సగం కాలిన తమిళుల శవాల గుట్టలను రోడ్డు పక్కన అమానవీయంగా పడవేశారు. తమిళ మహిళలపై సాయుధ బలగాలు జరిపిన సామూహిక అత్యాచారాలు, ధ్వంసమైన వేలాది గ్రామాలు, చెల్లా చెదురైన తమిళ జనావాసాలు, కుటుంబాలు శ్రీలంక సైన్యం క్రూరత్వానికి సాక్ష్యాలు. మైనారిటీలైన తమిళులకు చట్టబద్ధమైన రాజకీయ హక్కులను నిరాకరించారు. శ్రీలంకలోని తమిళ ప్రాంతాలలోకి అంతర్జాతీయ పరిశీలకులను అనుమతించలేదు.

ప్రపంచ దేశాల మద్దతు సంపూర్ణంగా పొందిన తర్వాతనే, భారతదేశం పరోక్ష సహకారంతోనే, శ్రీలంక ప్రభుత్వం ఎల్‌టీటీఈతో అంతిమ పోరాటానికి దిగింది. తమిళుల ఊచకోత నిర్దాక్షిణ్యంగా సాగుతుండగా, ఇండియాతో సహా ప్రపంచ దేశాలన్నీ ప్రేక్షక పాత్ర వహించాయి. అత్యంత దారుణంగా శ్రీలంక తూర్పు, ఉత్తర ప్రాంతాలలో నిస్సహాయ, అమాయక, సాధారణ తమిళ ప్రజల హత్యాకాండ సాగుతుంటే, తమిళనాడులో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. న్యాయస్థానాలతో సహా అన్ని వ్యవస్థలపై ప్రభావం కనిపించింది. ఇతర రాష్ట్రాలకు పరిస్థితి తెలియనీయకుండా, జాతీయ సమాచార మాధ్యమాలు మౌనం వహించాయి. సమాన హక్కులు, ఆత్మగౌరవం, స్వతంత్ర తమిళ రాజ్యం కోసం దశాబ్దాల పాటు పోరాడిన తమిళు లు, ఎల్‌టీటీఈ కార్యకర్తలు శ్రీలంక సైన్యం చేత చిక్కి నిస్సహాయంగా, అవమానకరంగా హతమవుతుంటే, తమిళనాడు రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు కనీసం అమాయక పౌరుల రక్షణ కోసమైనా, ఎటువంటి ప్రయత్నం చేయలేదు. పైకి హడావుడి చేస్తూనే, పరోక్షంగా ప్రజా ఆందోళన చెలరేగకుండా అణచివేయడంలో తమ వంతు పాత్ర పోషించాయి. తమిళనాడు నాటి ముఖ్యమంత్రి, నేటి ప్రతిపక్ష నాయకుడు డి.ఎమ్.కె. అధినేత కరుణానిధి, నాటి ప్రతిపక్ష నాయకురాలు నేటి ముఖ్యమంత్రి, ఎ.ఐ.డి.ఎమ్.కె. అధినేత జయలలిత, ఇతర రాజకీయ పార్టీలు, నాయకులు అంతర్యుద్ధం కొనసాగుతున్నప్పుడు ద్రోహ పూరితంగా శ్రీలంక సింహళ ప్రభుత్వానికి సహకరించి, ఊచకోత మొత్తం పూర్తైన తర్వాత ఇప్పుడు దొంగ సానుభూతి ప్రదర్శిస్తున్నారు.

శ్రీలంకపై ఒత్తిడి తేవడానికి, ఇండియా ఎల్‌టీటీఈ పోరాటానికి మద్దతు ఇచ్చింది. శ్రీలంక ప్రభుత్వం దారికొచ్చినప్పుడు ఎల్‌టీటీఈ అణచివేతకు సహకరించింది. అందులో భాగంగానే 1987 జూలై 29న నాటి శ్రీలంక అధ్యక్షుడు జె.ఆర్.జయవర్ధనే, నాటి ఇండియా ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీల మధ్య శ్రీలంకలో శాంతి స్థాపనకు ఒప్పందం జరిగింది. ఒప్పందం అమలుకు ఇండియా భారత శాంతి సైన్యాన్ని శ్రీలంకకు పంపింది. శ్రీలంకలో భారత శాంతి సైన్యం కార్యకలాపాలు వివాదాస్పదమయ్యాయి. భారత శాంతి సైన్యం కార్యకలాపాలను నిరసిస్తూ, స్థానిక తమిళులు ఎల్‌టీటీఈ నాయకత్వంలో శాంతియుత ప్రదర్శనలతో మొదలైన పోరాటం రాజీవ్‌గాంధీ హత్యతో పరాకాష్టకు చేరుకుంది. శ్రీలంకలో పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్న ప్రతిసారి, శ్రీలంకలోని తమిళులు తమిళనాడులోని రామేశ్వరం చేరుకోవడం సాధారణంగా జరుగుతుంది. కొన్ని సంవత్సరాలు తమిళనాడు రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఎల్‌టీటీఈ కార్యకర్తలు తలదాచుకోవడానికి, శిక్షణ పొందడానికి తమిళనాడును వుపయోగించుకునే వీలు కల్పించారు.

శ్రీలంక సైన్యం పాల్పడ్డ మానవ హక్కుల వుల్లంఘనలు, ఊచకోతలు, యుద్ధ నేరాలపై అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలు విమర్శించడంతో, శ్రీలంక సింహళ ప్రభుత్వం అంతర్యుద్ధం తర్వాత పరిస్థితిని సమీక్షించడానికి, పునర్నిర్మాణానికి సూచనలు ఇవ్వడానికి, శ్రీలంక అధ్యక్షుడు మహింద రాజపక్షే 'నేర్చుకున్న గుణపాఠాలు, ఐక్యత సాధన కమీషన్' (ఎల్ఎల్ఆర్‌సి)ని 2010లో ఏర్పాటు చేశారు. ఎల్.ఎల్.ఆర్.సి. నివేదికలో 300 సిఫార్సులు చేశారు. అందులో శ్రీలంక సైన్యం, ప్రభుత్వాధికారులు చేసిన యుద్ధనేరాలు, ఊచకోతలు, మానవ హక్కుల వుల్లంఘనలకు సంబంధించిన ఒక్క విషయాన్ని కూడా పేర్కొనలేదు. ఎల్ఎల్ఆర్‌సి నివేదికలో సిఫార్స్ చేసిన గల్లంతైన వ్యక్తులు, ఆదుపులోకి తీసుకున్న వ్యక్తులు, కిడ్నాపులు, హై సెక్యూరిటీ జోన్ల కుదింపు, సైన్యం చేతిలోని ప్రైవేటు భూముల అప్పగింత, తమిళులు అధికంగా వున్న వుత్తర, తూర్పు ప్రాంతాల నుండి భద్రతా దళాల వుపసంహరణ మొదలైన అంశాల్లో ఎటువంటి చర్యలు తీసుకోలేదు. శ్రీలంక తమిళులు అధికంగా వున్న ఉత్తర, తూర్పు ప్రాంతానికి స్వయం పాలనాధికారాలు కట్టబెడుతామని అంతర్యుద్ధం పూర్తయ్యాక ఇచ్చిన హామీని అధ్యక్షుడు రాజపక్షే నిలబెట్టుకోలేదు. ఎల్.ఎల్.ఆర్.సి. నివేదికలోని పక్షపాతాన్ని అంతర్జాతీయ మానవహక్కుల సంఘాలు తప్పుపట్టాయి. ఎల్.ఎల్.ఆర్.సి. నివేదిక స్పష్టంగా వెల్లడించని జవాబుదారీ అంశాన్ని విశదపరిచి, దాని సిఫార్సులను ఖచ్చితంగా అమలు పరచాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యు.ఎన్.హెచ్.ఆర్.సి.) శ్రీలంకను అభిశంసిస్తూ 2010లో తీర్మానం చేసింది. దీనికి ఇండియా మద్దతు తెలిపింది.

శ్రీలంక సైన్యం చేసిన యుద్ధ నేరాలు, ఊచకోతలు, మానవహక్కుల వుల్లంఘనకు సంబంధించిన ఫోటోలు, క్లిప్పింగ్‌లను 'నో వార్ జోన్' పేరుతో ఒక కథనాన్ని బి.బి.సి. ఛానల్ – 2012 మార్చి 4న ప్రసారం చేసింది. అందులో హత్యాకాండ దృశ్యాలతో పాటు, అందుకు ఆదేశాలు అత్యున్నత స్థానం నుండే వచ్చాయన్న ఆరోపణను కూడా చిత్రించిన వీడియో టేపును ప్రసారం చేశారు. 2013 ఫిబ్రవరి 18న తమ గత డాక్యుమెంటరీకి కొనసాగింపుగా, 'నో వార్ జోన్ : ద కిల్లింగ్ ఫీల్డ్స్ ఆఫ్ శ్రీలంక' పేరుతో డాక్యుమెంటరీని ఛానల్ – 4 ప్రసారం చేసింది. ఇందులో బాలచంద్రన్‌ను పట్టుకొని సైనిక శిబిరంలోని బంకర్లో కూర్చోబెట్టి, బిస్కట్లు ఇచ్చి అనంతరం కాల్చివేసిన దృశ్యాలు వున్నాయి. వీటితో పాటు రోడ్ల పక్కన సగం కాలిన తమిళుల శవాల గుట్టలు, ట్రాక్టర్లలో శవాలను కుప్పలుగా వేసి తరలించటం, నగ్నంగా కళ్లకు గంతలు

కట్టి, పెడరెక్కలు విరిచి చేతులు కట్టేసి కాల్చి చంపడం వంటి సైన్యం పాల్పడిన అనేక దురాగతాలకు సంబంధించిన ఫోటోలు వున్నాయి. బాలచంద్రన్ పైన రెండు అడుగుల దూరం నుండే తూటాలు పేల్చారని, ఫోటోలన్నీ ఒకే కెమెరాతో, ఒకటి, రెండు గంటల వ్యవధిలోనే తీసినవని ఇంగ్లండ్‌కు చెందిన బి.బి.సి. ఛానల్ – 4 తెలిపింది. అంత దగ్గర నుండి కాల్చడం వల్లనే తూటాలు దూసుకెళ్లిన రంధ్రాల చుట్టూ, శరీరంపై బొప్పలు ఏర్పడ్డాయని నిపుణులు తెలిపారు.

ఈశాన్య శ్రీలంకలోని ముల్లైతీవు సమీపంలోని ఎల్‌టీటీఈ ప్రధాన కేంద్రంపై దాడి చేసినప్పుడు జరిగిన కాల్పుల్లో ప్రభాకరన్ కుటుంబ సభ్యులంతా ప్రాణాలు కోల్పోయినట్లు సైన్యం ప్రకటించింది. ప్రభాకరన్ చనిపోయిన రెండు, మూడు రోజుల తర్వాత ఎదురుకాల్పులలో బాలచంద్రన్ చనిపోయినట్లు సైన్యం ప్రకటించింది. చానల్ – 4 ప్రసారం చేసిన 'నో వార్ జోన్ : ద కిల్లింగ్ ఫీల్డ్స్ ఆఫ్ శ్రీలంక' అనే డాక్యుమెంటరీ శ్రీలంక సైన్యం అకృత్యాలను చూపించి ఆ దేశాన్ని ప్రపంచం బోనులో నిలబెట్టింది. నిరాయుధులైన సాధారణ ప్రజలను, పిల్లలను హత్యలు చేయడాన్ని, విచక్షణారహితంగా కాల్పులు జరపడాన్ని చూపించింది. దీనితో తమిళనాడులో ప్రజా ఆందోళనలు ఉధృతమయ్యాయి. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఆందోళనల్లో పాల్గొన్నారు. రాస్తారోకోలు, రైలు రోకోలు, నిరహార దీక్షలు, మానవ హారాలు, మౌన పోరాటాలు ఇలా అనేక రూపాలలో తమ నిరసనలను తెలిపారు. విద్యా సంస్థలు మూతపడ్డాయి. ప్రభుత్వం కళాశాలలను నిరవధికంగా మూసివేసింది. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో, తంజావూరు బృహదీశ్వరాలయంలో శ్రీలంక బౌద్ధ సన్యాసులపై దాడులు చేశారు. పాండిచ్చేరిలోని అరబిందో ఆశ్రమంపై, మధురైలోని శ్రీలంక విమానయాన సంస్థ కార్యాలయంపై దాడులు చేశారు. శ్రీలంకలోని తమిళుల పరిస్థితిపై చెన్నైలో 2013 మార్చి 21న జరిగిన ఒక సమావేశం సందర్భంగా 30 ఏళ్ల వ్యక్తి ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ప్రజా ఆందోళనల ఒత్తిడితో తప్పనిసరి పరిస్థితుల్లో తమిళనాడు రాజకీయ పార్టీలు, నాయకులు ఉద్యమాల్లో పాల్గొన్నారు. తమిళులకు స్వతంత్ర రాజ్యం కావాలని తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం చేశారు. శ్రీలంకను మిత్రదేశంగా చూడకూడదని ముఖ్యమంత్రి జయలలిత డిమాండ్ చేశారు. వ్యాపార, సాంకేతిక, విద్య, క్రీడా రంగాలలో శ్రీలంకపై ఆంక్షలు విధించి, ప్రపంచంలో ఏకాకిని చేయాలని డిమాండ్ చేశారు. 2011లోనే శ్రీలంక ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షలు విధించాలని తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శ్రీలంకలోని తమిళులకు ప్రత్యేక తమిళ ఈలం సాధనకు తోడ్పాటునందించడం కోసం దాదాపు మూడు దశాబ్దాల క్రితం డి.ఎమ్.కె. అధినేత కరుణానిధి ఏర్పాటు చేసిన తమిళ ఈళం మద్దతుదారుల సంస్థ (టెసో)ను పునరుద్ధరించారు. కాని టెసో ఎజెండా నుండి 'ప్రత్యేక ఈలం సాధన' అంశాన్ని తొలగిస్తున్నట్లు కరుణానిధి ప్రకటించారు. 2013 మార్చి 21న జెనీవాలో జరిగే ఐరాస మానవహక్కుల మండలి (ఎన్‌హెచ్ఆర్‌సి) సదస్సులో శ్రీలంకకు వ్యతిరేకంగా అమెరికా ప్రవేశపెట్టే తీర్మానానికి మద్దతు తెలపాలని డిమాండ్ చేస్తూ యుపిఎ కూటమి నుండి, కేంద్ర ప్రభుత్వం నుండి డిఎమ్‌కె వైదొలిగింది. శ్రీలంక ప్రభుత్వాన్ని, తమిళుల ఊచకోత, యుద్ధ నేరాలు, మానవ హక్కుల వుల్లంఘనలపై అంతర్జాతీయ దర్యాప్తు జరిపి, అంతర్జాతీయ న్యాయస్థానంలో శిక్షించాలని డిమాండ్ చేశారు. శ్రీలంకలోని తమిళులకు సరైన వైద్యం కూడ అందడం లేదని బాధపడుతున్న కరుణానిధి 2010లో తాను ముఖ్యమంత్రిగా వున్నప్పుడు వైద్యం కోసం వచ్చిన ఎల్‌టీటీఈ అధినేత ప్రభాకరన్ తల్లిని విమానాశ్రయం నుండే తిప్పి పంపించారు.

ప్రజా వుద్యమాల, రాజకీయ పార్టీల ఒత్తిడికి తలొగ్గి ఐరాస మానవహక్కుల మండలి (ఎన్‌హెచ్ఆర్‌సి)లో అమెరికా ప్రవేశపెట్టే తీర్మానానికి మద్దతు తెలుపుతామని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే అమెరికా శ్రీలంకకు వ్యతిరేకంగా ప్రతిపాదించిన తొలి ముసాయిదాలోని ఊచకోత పదాన్ని, శ్రీలంకను నేరుగా అభిశంసించే వాక్యంలో ఆ దేశ ప్రస్తావనను తొలగించేలాగా అమెరికాను ఒప్పించడానికి శ్రీలంక అధ్యక్షుడు మహింద రాజపక్షేకు రహస్య దూతగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించింది.

అమెరికా తీర్మానాన్ని ప్రవేశపెట్టేది, శ్రీలంకలోని తమిళుల పట్ల సానుభూతితో కాదు. మానవహక్కుల వుల్లంఘనను ఆసరాగా తీసుకొని శ్రీలంకను తన ఆధిపత్యంలో వుంచుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ప్రపంచ టెర్రరిస్టు అమెరికాకు మానవ హక్కుల గురించి మాట్లాడే కనీస అర్హత కూడా లేదు. అమెరికా ప్రపంచ వ్యాప్తంగా తన సామ్రాజ్యవాద ప్రయోజనాలను, తన ఆధిపత్యాన్ని వ్యతిరేకించే దేశాల ప్రభుత్వాలను ప్రత్యక్ష యుద్ధాలలో కూల్చివేసింది. తనను ధిక్కరించే నాయకులను కుట్రపూరితంగా హత్యచేసింది. సైనిక తిరుగుబాట్లను ప్రోత్సహించింది. అమెరికా చేసిన అనేక యుద్ధాల్లో మానవ హక్కులను వుల్లంఘించి, లక్షలాదిగా సాధారణ ప్రజలను, ప్రజాస్వామిక వుద్యమకారులను, విప్లవకారులను చంపివేసింది. ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్, లిబియాలపై యుద్ధం చేసి అక్కడి ప్రభుత్వాలను కూల్చివేసి, నాయకులను, సాధారణ ప్రజలను లక్షలాదిగా చంపి, తన తొత్తు ప్రభుత్వాలను నెలకొల్పుకుంది. ఇరాన్, సిరియా, ఉత్తర కొరియాలతో యుద్ధం చేయడానికి సిద్ధపడుతున్నది.

2013 మార్చి 21న జెనీవాలో ఐక్య రాజ్య సమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్ఆర్‌సి)లో ఎల్‌టీటీఈపై యుద్ధంలో చివరి దశలో మానవ హక్కుల వుల్లంఘనలకు పాల్పడిందన్న ఆరోపణలపై, శ్రీలంక ప్రభుత్వం స్వతంత్ర, నమ్మదగిన దర్యాప్తు జరిపించాలంటూ అమెరికా ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని ఐరాస మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్ఆర్‌సి) ఆమోదించింది. ఇండియా తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసింది.

ఇండియా, అమెరికా ఎల్‌టీటీఈపై, సాధారణ తమిళ ప్రజలపై ఊచకోత కొనసాగించినంత కాలం శ్రీలంక ప్రభుత్వానికి

### 'చైనాలో స్త్రీ విముక్తి' గురించి తెలుసుకుందాం - 4

# చైనా కుటుంబం : నూతన గ్రామీణ సమిష్టితత్వం వైపు పయనం

అసమాన సమాజంలో కుటుంబం అంటే భర్తకు భార్య లొంగి వుండడం, భార్య నాలుగు గోడల మధ్య ఒంటరి జీవితం గడపడం, పిల్లల మీద తల్లి దండ్రులు పెత్తనం చేయడం, పురుషులు బయట అనేక సమస్యలతో ఒంటరిగా పోరాడుతూ కుటుంబం అనే చిన్న ద్వీపంలో రాజ్యం ఏలడం. కుటుంబానికున్న ఈ నిర్వచనం ప్రకారం చూస్తే చైనాలో కుటుంబం ధ్వంసం అయిందని చెప్పుకోవచ్చు.

కుటుంబం అంటే ఒక భార్య, ఒక భర్త, పిల్లలు, వృద్ధులతో కల్సి సుస్థిరంగా జీవించడం అయితే ఈ విధమైన కుటుంబం చైనాలో ఉనికిలో వుండింది.

విప్లవానంతరం చైనా కుటుంబాలు కొత్తరకం కుటుంబాలుగా వేగవంతంగా మారిపోయాయి. చైనా మహిళా ఉద్యమంలోని అనేక ప్రత్యేక కోణాలను ఈ కుటుంబాలు మనకు అర్థం చేయిస్తాయి.

**చైనా కుటుంబపు చారిత్రిక నేపథ్యం**

పాత చైనా సమాజంలోని కుటుంబంలో స్త్రీల పరిస్థితి చాలా ఘోరంగా ఉండేది. ఆడపిల్లల పాదాలను ఎదగనీయకుండా చేయడం కోసం వాటిని చిన్నప్పుడే కట్టేసేవారు. ఇక వాళ్ల జీవితాంతం కురచపాదాలతో కుంటుతూ కుంటుతూ నడవాల్సి వచ్చేది. ఆడపిల్లలను భారంగా చూసేవారు. వాళ్లకు చిన్నప్పుడే నిశ్చితార్థం జరిపేవారు. ఆమెకు వారిచ్చే తిండికీ, బసకూ బదులుగా ఆమె వారికి గొడ్డు చాకిరీ చేయాల్సివచ్చేది. అంతేకాదు చచ్చేలా దెబ్బలు తినాల్సివచ్చేది.

చిన్నప్పుడే నిశ్చితార్థం చేయడం వల్ల పెళ్లికి అమ్మాయిల ఇష్టాయిష్టాలతో ప్రమేయం ఉండేది కాదు. అయితే చిన్నప్పుడే నిశ్చితార్థం అయినప్పటికీ, పెళ్లి సమయంలో తరచుగా అమ్మాయిలు తమకు ఇష్టం లేని పెళ్లిని వ్యతిరేకించేవారు. అయినప్పటికీ అమ్మాయిలు ఈ పెళ్లిళ్లను తప్పించుకోగల్గేవాళ్లు కాదు. తల్లిదండ్రులు తిట్టీ కొట్టీ బలవంతంగా పెళ్లిళ్లు చేసేవాళ్లు. సియాంగ్‌లిన్ అనే అతని భార్య, తన పెళ్లిని ఎంతగా వ్యతిరేకించిందో ఒక మహిళ చెప్తూ "ఆమె దారంతా అరుస్తూ వారిని శాపనార్థాలు పెడుతూనే వుందిట. హెూ గ్రామానికి చేరే సరికి అరిచీ అరిచీ ఆమె గొంతు బొంగురు పోయింది. ఆమెను పల్లకీలోంచి బైటకీడ్చాక ఇద్దరు పురుషులు, ఆమె మరిదీ ముగ్గురూ కల్సి కూడా, అమెను పెళ్లి తంతులో కూర్చోబెట్టలేక పోయారు. ఒక్క క్షణం ఆమె మీద పట్టును ఏమరుపాటుగా సడలించారో లేదో ఇంకేముందీ ఓరి దేవుడో! ఆమె అక్కడ ఉన్న బల్లకు కొట్టుకుంది. తలకు పెద్ద చిల్లి పడింది. రక్తం మడుగులు కట్టింది. దోసిళ్ల నిండా బూడిద తెచ్చి పెట్టినా ఆగదు, గుడ్డలతో కట్టినా ఆగదు ఆ ప్రవాహం. ఆఖరికి అక్కడున్న అందరూ కలిస్తే గానీ బలవంతంగా ఆమెను భర్త వున్న గదిలోకి తోయలేక పోయారు. ఆమె లోపల కూడా శాపనార్థాలు పెడుతూనే వుంది. అబ్బా నిజంగా..." అని ఇంకేం చెప్పలేక ఆగిపోయిందామె.

తరచుగా ఇటువంటి బలవంతపు పెళ్లిళ్లకు తలవంచలేక మహిళలు ఆత్మహత్య చేసుకునేవారు. ఇదే కారణంగా చావో అనే యువతి ఆత్మహత్య చేసుకున్నప్పుడు, బలవంతపు పెళ్లిళ్ల పట్ల స్త్రీల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. చావో ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులను విశ్లేషిస్తూ కామ్రేడ్ మావో ఒక వ్యాసం కూడా రాశాడు.

చైనాలో తొంభై శాతం ప్రజలు హాన్ జాతికి చెంది వుండేవారు. హాన్‌జాతిలో బహు భార్యాత్వం చట్టవిరుద్ధం. కానీ 'ఉంపుడు గత్తెలను' ఉంచుకోవడం చట్టబద్ధం. ఎంతమంది వుంపుడుగత్తెలనైనా వుంచుకోవచ్చు. ఈ ఉంపుడుగత్తెలు సర్వ సాధారణంగా నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలే అయివుండేవారు. వీరిని 'వినియోగదారుడే' ఎన్నుకునే వాడు. వీరికి ఏ హక్కులు వుండేవి కావు. కుటుంబమంతటికీ వీరు విధేయంగా ఉండాలి. చట్టబద్ధమైన భార్యకు కూడా వీరు విధేయతను చూపాలి. సాధారణంగా వీరు జబ్బు పడ్డప్పుడో, వయసు మీద పడ్డప్పుడో వీరిని బైటకు తోలేస్తారు. ఇక వాళ్లు శేష జీవితాన్ని బిచ్చగాళ్లుగానో, ధనికుల ఇండ్లల్లో పని మనుషులుగానో గడపాల్సి వచ్చేది. వీరి పిల్లలకు చట్టబద్ధమైన పిల్లలకున్న హక్కులన్నీ ఉండేవి. కానీ ఆచరణలో వారు ఆ కుటుంబంలో బానిసలుగా బతకాల్సి వచ్చేది. ఆడపిల్లలు సర్వ సాధారణంగా ఎవరో ఒకరికి ఉంపుడుగత్తెలుగా మారేవారు.

పేద తల్లిదండ్రులు అప్పు కిందికో, ధనికుల బెదిరింపులకు భయపడో, తమ మిగతా పిల్లలను పోషించుకోవడానికో ఆడపిల్లలను ఉంపుడుగత్తెలుగా ధనికులకు అమ్మేసేవారు.

ఈ రకంగా చైనాలో బహు భార్యాత్వం అమల్లో ఉన్నట్టే. అయితే ఈ బహు భార్యాత్వం కేవలం ధనికులకే పరిమితమైందని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పేద పురుషులకు భార్యను పోషించడమే కష్టం. చాలా మంది పేద పురుషులు భార్యను పోషించే పరిస్థితి లేక పెళ్లి చేసుకోకుండా ఒంటరిగానే జీవించేవారు.

టిబెట్‌లోని మారుమూల ప్రాంతాల్లో బహు భర్తృత్వం ఉండేది. అయితే దీన్ని బహు భార్యాత్వంతో సమానంగా భావించలేం. ఎందుకంటే ఇక్కడ ఆడవాళ్లు అనేక మంది భర్తల్ని ఎన్నుకునేవారు

---

సహకరించి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాయి.

ఈ దేశాల కుట్రపూరిత వైఖరిని ఎండగడుతూ ప్రపంచవ్యాప్తంగా వున్న ప్రజాస్వామిక వాదులు, విప్లవ సంస్థలు, పార్టీలు తమిళులకు సంఘీభావాన్ని అందిస్తూ. మళ్లీ బలమైన తమిళజాతి విముక్తి వుద్యమం నిర్మాణమయ్యేందుకు తోడ్పడాలి. ★

కాదు. ప్రతివారూ ఒక్కో భార్యను పోషించలేక అనేక మంది పురుషులు కలిసి ఒక స్త్రీని ఎన్నుకునేవారు.

చైనా పాత సమాజాన్ని నిలబెట్టడానికి ఈ కుటుంబ వ్యవస్థ సమర్థవంతమైన సాధనంగా పనిచేసింది. భూస్వాములకు కుటుంబం అనేది వారసత్వాన్ని పొందే మార్గం. ఒకే క్రూరమైన వర్గం చేతుల్లో ఆస్తీ, అధికారం ఉండడం, అది ఒక తరం నుండి మరో తరానికి అందించడం. ఉంపుడుగత్తెలను ఉంచుకోవడం ఈ పథకంలో భాగమే. ఎంత మంది వారసులుంటే అంతగా ఆ భూస్వామి అధికార పునాది విస్తరిస్తుంది. రెండవది, భార్యా, వుంపుడుగత్తెలూ, పిల్లలూ ఉన్న పెద్ద కుటుంబం వుండడం, పని మనుషుల పటాలం ఉండడం అనేది, స్థానిక ప్రజలపై అతనికున్న అధికారానికి ప్రతీకా, సాధనమూ కూడా. పేద రైతాంగం నుండి ఉంపుడుగత్తెలను తెచ్చుకోవడం అంటే భూస్వామికీ, రైతులకూ మధ్య 'పవిత్రమైన' కుటుంబ సంబంధాలు ఏర్పడినాయని అర్థం. ఈ సంబంధాల వల్ల ఆ పిల్ల తల్లిదండ్రులకు ఆ భూస్వామి చేయాల్సింది ఏమీ ఉండదు గానీ, తన బంధువులకు గానీ వారి ఆస్తికి గానీ ఎటువంటి హానీ చేయకూడదనే రైతుల మూఢ నమ్మకాలకూ మత విశ్వాసాలకూ ఇది మరింత బలం చేకూర్చేది. ఈ విధంగా ప్రతి సామాజిక వర్గంలోని వివిధ కర్తవ్యాలకూ అవసరాలకూ అనుగుణంగా వివిధ కుటుంబ రూపాలు మారుతాయని అర్థం చేసుకోవాలి.

ఇటువంటి భూస్వామ్య వ్యవస్థలో స్త్రీ విముక్తికి అవకాశం లేదు. ఎందుకంటే తరతరాల ఆచారాలూ సాంప్రదాయాలు మాత్రమే స్త్రీలను అణచివేయడం లేదు. స్త్రీల అణచివేత అనేది ఆర్థిక వ్యవస్థతో ముడిపడి ఉన్న అంశం. ఏ స్త్రీ అయినా భర్తను వదిలిపెట్టి పోవాలంటే ఆమె భర్త నోటి నుండి 'నేను లేకుండా నువ్వేం చేస్తావు? నీకు తిండెవరు పెడ్తారు?' అనే మాట వినాల్సి వచ్చేది. విప్లవ కాలంలో మాత్రమే స్త్రీలకు తమ శక్తి తెలిసి వచ్చింది. తాము కుటుంబంలో సేవలు చేస్తూనే మగ్గి పోనవసరం లేదని మొత్తం సమాజంలో తాము నిర్వహించగల్గిన పాత్ర వుందనీ అర్థమైంది. ఎర్ర సైన్యం విముక్తి చేసిన ప్రాంతాల్లో మహిళా వుద్యమం వేగంగా పాకింది. ఈ ప్రాంతాలన్నింటా స్త్రీలు 'గొప్ప తిరుగుబాటు'కు నాయకత్వం వహించారు. వీరు స్త్రీలను ఘోరంగా చూసే కుటుంబాలను కనుగొనడానికి బృందాలను ఏర్పర్చారు. బాధలు పడుతున్న స్త్రీలకు ధైర్యాన్నిచ్చేవారు. బాధలు పెడుతున్న మగవాళ్లకు బుద్ధి చెప్పేవారు. తరచూ వాళ్లను కొట్టడం కూడా చేసేవారు.

### ప్రజాస్వామిక కుటుంబం

విముక్తి అయిన వెంటనే అమల్లోకి వచ్చిన 1950 వివాహ చట్టం నూతన ప్రజాస్వామిక విప్లవం వల్ల స్త్రీ పురుష సంబంధాల్లో వచ్చిన మార్పులకు సాక్ష్యం. ఈ చట్టంలో బహు భార్యాత్వాన్నీ వుంపుడుగత్తెలను ఉంచుకోవడాన్నీ నిషేధించారు. పద్దెనిమిదేళ్ల లోపు బాలికలకూ, బాలురకూ వివాహాన్ని కూడా నిషేధించారు. పరస్పర అంగీకారం మాత్రమే వివాహానికి ఏకైక ప్రాతిపదికగా మారింది. విడాకులకు చూపే కారణాలను పరిమితం చేయలేదు. ఏ విధమైన రుసుమూ చెల్లించకుండానే విడాకులు పొందవచ్చు.

విప్లవ భూసంస్కరణల్లో భాగంగా ఒంటరిగా బతికే స్త్రీలకూ, భర్త నుండి విడిపోవాలనుకునే స్త్రీలకూ భూమిని పంచడం వల్ల వివాహ వ్యవస్థ అధికారం తగ్గిపోయింది. ఆ తర్వాత దశలో పెద్ద ఎత్తున విడాకుల వెల్లువ చైనాను ముంచెత్తింది. పెద్దలు కుదిర్చిన అనేక పెళ్లిళ్లు ఉనికిలో లేకుండా పోయాయి. అంతకు ముందెన్నడూ వివాహానికి ఒక ప్రాతిపదికగా అంగీకరించబడని స్త్రీ పురుషుల మధ్య ప్రేమ ఇప్పుడు వివాహానికి సరిపోయే కారణం అయింది.

భూసంస్కరణలు భూస్వామ్య కుటుంబ నిర్మాణాలను చావుదెబ్బ తీసినట్లే. సమిష్టీకరణ కూడా బూర్జువా కుటుంబ నిర్మాణాల నాశనంలో శక్తివంతమైన పాత్ర నిర్వహించింది. అయితే సమిష్టీకరణను వ్యతిరేకించిన బూర్జువాలు, కుటుంబం ప్రాతిపదికగా జరిగే ఉత్పత్తికి తిరిగి పోవాలని సూచించడం ద్వారా, సమిష్టీకరణను దెబ్బతీయాలని చూశారు. అట్లా పెట్టుబడీదారీ ప్రయోజనాల కోసం కుటుంబాన్ని కాపాడాలని చూశారు. కానీ మహిళలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

ఒక ఆర్థిక యూనిట్‌గా వున్న కుటుంబం కుదుపుకు గురయిందేగానీ అప్పటికింకా అది నేలమట్టం కాలేదన్నది వాస్తవం. ఇంకా సమిష్టీకరణ, సామాజికీకరణ పూర్తి కాలేదు కనుక, పిల్లల సంరక్షణ, రిటైర్ అయినవారి సంరక్షణ, ఇంటిపనులు వంటి కర్తవ్యాలకు, ఇంకా కుటుంబం ఆశ్రయంగానే వుండింది. కుటుంబం ఇంకా తన యూనిట్ సభ్యులకు తిండి పెట్టే బాధ్యతను కొంతవరకు మోయవల్సి వస్తున్నది. ఇవన్నీ స్త్రీ విముక్తికి భౌతిక పరమైన అడ్డంకులుగానే అప్పటికి ఉండినాయి.

ఇక మరొక విషయం. సోషలిస్ట్ దశలో వేతన వ్యవస్థ అమల్లో ఉంటుంది. అంటే అవసరానికి తగిన ప్రతిఫలం కాక శ్రమకు తగిన ప్రతిఫలం అనేది వుంటుంది. అంటే శ్రమశక్తి సరుకుగానే వుంటుంది. శ్రమశక్తి సరుకుగా ఉన్నంతకాలం ఆ సరుకును వుత్పత్తి చేసే చిన్న ఫ్యాక్టరీగా కుటుంబం తప్పనిసరిగా ఉనికిలో వుంటుంది. అది ఆర్థిక యూనిట్‌గానే కొనసాగుతుంది. కుటుంబం ఆర్థిక యూనిట్‌గా ఉన్నంతకాలమూ స్త్రీల మీద పీడన వుంటుంది. స్రీలు సంపూర్ణంగా విముక్తి కావాలంటే వేతన వ్యవస్థ పూర్తిగా అంతరించాలి. శక్తి కొలదీ శ్రమ, అవసరం కొద్దీ ప్రతిఫలం అనేది అమల్లోకి రావాలి. అంటే పని ఇంకెంత మాత్రం తిండి సంపాదించుకొనే మార్గంగా ఉండకూడదు. పని అనేది స్వేచ్ఛాపూరితమైన, సంపన్నవంతమైన కార్యకలాపం కావాలి.

### వృద్ధుల పరిరక్షణ

నేటి సమాజంలోని మెజారిటీ కుటుంబాలు, వృద్ధులను అనవసరపు భారంగా పరిగణిస్తున్నాయి. చీకటి మూల గదుల్లో, కుక్కి మంచాల్లో, శాపగ్రస్తుల్లా, మరణం కోసం ఎదురు చూస్తూ క్షణాలు యుగాలుగా గడిపే వృద్ధుల అంతరంగంలోకి తొంగి చూసే తీరిక ఇప్పుడెవరికీ వుండడం లేదు. ఏ తప్పు చేయకపోయినా

కేవలం వయసు మీద పడ్డం వల్ల వాళ్లు పొందే అవమానాలకూ, ఈసడింపులకూ అంతూ పొంతూ ఉండదు. ఇలా వృద్ధాప్యం అనేది అనుభవించేవారికి దుర్భరంగా ఉండడం అనేది ఎంత వాస్తవమో, అదే సమయంలో ఒక కుటుంబంలో వృద్ధులుంటే ఆ కుటుంబంలోని స్త్రీల పరిస్థితీ దుర్భరంగానే ఉంటుందనేదీ అంతే వాస్తవం. ఎందుకంటే వృద్ధులకు సేవ చేసే బాధ్యత కేవలం వారిదే కాబట్టి.

మరి సోషలిస్ట్ చైనా కుటుంబంలో వృద్ధుల స్థానాన్ని గురించి చెప్పకపోతే దాని చిత్రాన్ని సంపూర్ణంగా చూపించనట్టే. ఆరోగ్యంగా వుండే వయోజనులు, రిటైర్ అయిన తల్లిదండ్రులను చూసుకోవాలి అని వివాహ చట్టం పేర్కొంది. రిటైర్ అయిన కార్మికులకు తమ జీతంలో ఎనభై శాతం పెన్షన్‌గా వచ్చేది. ఏడాదికి రెండు యువాన్లు నామ మాత్రమైన సొమ్మును కట్టి వృద్ధులు అన్ని రకాల వైద్య చికిత్సలను పొందగలిగేవారు. వృద్ధులున్న కుటుంబాలకు పెరిగే పని భారాన్ని సమిష్టి భోజనశాలలు, వివిధ సమిష్టి సేవా కేంద్రాలు తగ్గించేవి. ఉత్పత్తి శక్తుల పెరుగుదల వల్ల కూడా వృద్ధతరం భౌతిక అవసరాలు తీరేవి. వృద్ధుల సంరక్షణను సామాజికం చెయ్యడం పేరుతో చైనా సమాజం వారిని శరణాలయాల పాలు చేయలేదు. నా అన్న వాళ్లందరికీ దూరంగా, అరుదుగా వచ్చే ఉత్తరాల కోసం, ఎవరూ రాని ఆదివారాల కలయిక కోసం ప్రతిక్షణం ఎదురు చూస్తూ గడిపే దుస్థితిలోకి చైనా సమాజం వారిని నెట్టలేదు. వృద్ధులను కుటుంబాలే చూసుకునేలా చర్యలు తీసుకుని, ఆ కుటుంబాల ఆర్థిక, శ్రమ భారాన్ని తగ్గించే చర్యలు తీసుకుంది. అయితే శరణాలయాలు అస్సలు లేవని కాదు. దగ్గర బంధువులు లేని వృద్ధుల కోసం కొన్ని శరణాయాలు ఉండేవి. వాటిని ఇండ్ల సముదాయాల మధ్యనే నిర్మించేవారు. వీటికి ఎప్పుడైనా, ఎవరైనా వెళ్లవచ్చు. దగ్గర బంధువులు లేని వృద్ధులు కూడా తరచూ దూరపు బంధువులతో నివసించేవారు. లేదంటే అమ్మమ్మలూ, తాతలూ లేని కుటుంబాలతో కల్సి నివసించేవారు. ఇలా అన్ని వయసుల వాళ్లూ కలిసి జీవించడంలోని రాజకీయ ప్రాముఖ్యతనూ, వృద్ధుల అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించే కృషినీ, ఇక్కడ అర్థం చేసుకోవచ్చు. ఇలా బతుకు భారంగా కాని ఈ వృద్ధులు చైనా సోషలిస్ట్ సమాజం నిర్మాణంలో శక్తివంచన లేకుండా కృషి చేసిన తీరు ఆసక్తి కరమైనదే కాదు, ఉత్తేజకరమైనది కూడా.

## అనాథ పిల్లల్లేరు!

చైనాలో అనాథ శరణాలయాలు లేవు. మరి తల్లిదండ్రులు లేని పిల్లలు ఏమౌతారు? ఒక విప్లవ సమాజం పాలనా పరమైన యంత్రాంగం ద్వారా కాక, విప్లవ నిబద్ధతా శక్తి ద్వారా, వర్గ సహోదరత్వం ద్వారా, వ్యక్తిగత సమస్యల్ని పరిష్కరించి అధిగమించాలని సోషలిస్ట్ చైనా నమ్మింది.

తల్లిదండ్రులు లేని పిల్లలను బంధువులో, కుటుంబ స్నేహితులో దత్తత తీసుకునే వారు. సాధారణంగా చిన్న పిల్లలను బంధువులు, వారెంత దూరంగా ఉన్నా సరే దత్తత తీసుకునేవారు. పిల్లలు అప్పటికే బడికి వెళ్తూ, చుట్టు పక్కల వారితో బాగా స్నేహాలు ఏర్పడి వుంటే ఇరుగు పొరుగు వారే దత్తత తీసుకునేవారు. ఇదంతా చాలా సులభంగా జరిగిపోయేది. ఇటువంటి పిల్లలకు ప్రభుత్వం భృతి చెల్లించేది. కనుక దత్తత తీసుకునే కుటుంబాలపై ఆర్థిక భారం పడే అవకాశం వుండేది కాదు.

లెహ్ చాంగ్, చాంగ్ కువా అన్నదమ్ములు. వారి వయస్సులు 8 సంవత్సరాలు, 10 సంవత్సరాలు. షాంఘైలో పని చేస్తూండిన వారి తల్లిదండ్రులు కొద్ది నెలల తేడాతోనే చనిపోయారు. ఈ పిల్లలు ఎక్కువకాలం ఒంటరిగా లేరు. వారు తమ స్కూలునూ. స్నేహితులనూ వదలడానికి ఇష్టపడలేదు కనుక, ఇరుగుపొరుగు వారు సమిష్టిగా వారిని దత్తత తీసుకున్నారు. వారి పోషణకు అవసరమైన భృతిని ప్రభుత్వం చెల్లించింది. అన్ని కుటుంబాల వాళ్లూ, వాళ్లను చాలా శ్రద్ధగా చూసుకునేవారు. చలికాలంలో ప్రతి ఒక్కళ్లూ, వాళ్లకు బైటకు వెళ్లడానికి వెచ్చని దుస్తులు ఉన్నాయో లేవో చూసేవారు. సాయంత్రం పూట జిల్లా భోజనశాలలో ఏదైనా ఓ కుటుంబంతో గానీ, మిగతా పిల్లలతో గానీ వాళ్లు కలిసి తినేవారు. వారి ఆరోగ్యం గురించి పట్టించుకోవడంతోటే బాధ్యతను సరిపెట్టుకునే వారు కాదు, మరీ ముఖ్యంగా వృద్ధులు వీరికి గత జీవితాన్ని గురించిన కథలను చెప్పేవారు. ఇటువంటి కథలను వృద్ధులందరూ పిల్లలకు చెప్పేవారు. పిల్లలు గతాన్ని గురించిన వర్గ దృక్పథాన్ని అలవర్చుకునే విధంగా శ్రద్ధ తీసుకునేవారు. ఈ ఇద్దరు అన్నదమ్ములకు ఆప్యాయతకు కొదవ వుండేది కాదు. ఏ ఇంట్లోనైనా విందు వుంటే వీరిని పిలవకుండా అది జరిగేది కాదు. ప్రతి ఒక్కరూ వారి చదువు గురించీ, ఆటపాటల గురించీ పట్టించుకునేవారు. అదే సమయంలో ఆ పిల్లల తప్పులను విమర్శించేవారు.

పిల్లలను దత్తత తీసుకునేట్లుగా చూడ్డంతోనే చట్టం పని అయిపోయేది కాదు. ఆర్టికల్ 13 పిల్లలను వదిలేయడాన్ని నిషేధించింది. పిల్లలను పెంచి విద్యావంతులను చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులకుంటుంది. తల్లిదండ్రులకు సహాయ, సహకారాలను అందించాల్సిన బాధ్యత పిల్లలకుంటుంది. పిల్లలు గానీ, తల్లిదండ్రులు గానీ ఒకరినొకరు వదిలేయడం గానీ అవమానించుకోవడం గానీ చేయకూడదు. ఈ నిబంధన పెంపుడు తల్లిదండ్రులకూ, పెంపుడు పిల్లలకూ కూడా వర్తించేది.

## కుటుంబ నియంత్రణ

స్త్రీలకు కుటుంబ నియంత్రణ హక్కు వుండేది. నూతన చైనా, కుటుంబ నియంత్రణ గురించి బాగా ప్రచారం చేసింది. మొదట్లో ముగ్గురు, నల్గురు పిల్లలతో సరిపెట్టుకోవడానికి స్త్రీలు అస్సలు ఒప్పుకునేవారు కాదు. ఇక పురుషులైతే గర్భ నిరోధం అనేది తమకు సంబంధించిన విషయం కూడా అనేది ఒప్పుకునే వారు కాదు. సుదీర్ఘ చర్చల తర్వాత వీరి వైఖరి మారింది. తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో, పెద్ద ఎత్తున ప్రజలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

*(మిగతాది 20వ పేజీలో...)*

పత్రికా ప్రకటన జూలై 7, 2013

# కామ్రేడ్ గంటి ప్రసాదం దారుణహత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం!

# దుండగుల ముసుగులో ప్రభుత్వం పాల్పడిన పిరికిపంద చర్య ఇది!

# పీడిత ప్రజల విముక్తి బాటలో ప్రాణత్యాగం చేసిన కామ్రేడ్ గంటి ప్రసాదం అమర్ రహే!

## ఈ దారుణ హత్యకు నిరసనగా జూలై 15 నుండి 21 వరకు నిరసన వారాన్ని పాటించండి!

## జూలై 21న ఏపీ, ఎన్‌టీ, ఏఓబీల బంద్‌ను పాటించండి!

జూలై 4న నెల్లూరు జిల్లాలో దుండగుల ముసుగులో ప్రభుత్వ కాపలా కుక్కలు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ గంటి ప్రసాదం అమరుడయిన వార్త రాష్ట్ర విప్లవ ప్రజానీకం, రాష్ట్రంలోని, దేశంలోని వివిధ విప్లవ, ప్రజా, ప్రజాస్వామిక సంఘాల శ్రేణులతో పాటు మా పార్టీ శ్రేణులను విషాదంలో ముంచెత్తింది. ఈ హత్యను మా పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నది.

పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి దాదాపు నాలుగు దశాబ్దాల పాటు విప్లవోద్యమాన్ని అంటిపెట్టుకొని ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన ప్రజా యోధుడికి మా పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, ప్రజా సంఘాలు వినమ్రంగా తలవంచి అరుణారుణ జోహార్లర్పిస్తున్నాయి. కామ్రేడ్ గంటి ప్రసాదంను కోల్పోయి తీవ్ర దుఃఖంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులకూ, బంధు మిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాయి.



దేశ ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టిన భారత పాలక వర్గాలు, తమ లక్ష్యాన్ని నిరాటంకంగా కొనసాగించడం కోసం దేశవ్యాప్తంగా గత కొన్ని సంవత్సరాలుగా విప్లవోద్యమంపై, ప్రజా వుద్యమాలపై తీవ్రమైన అణచివేతను ప్రయోగిస్తున్న విషయం అందరికీ తెలిసినదే. మరీ ముఖ్యంగా విప్లవ, ప్రగతిశీల, ప్రజాస్వామిక వుద్యమాల సుసంపన్నమైన వారసత్వాన్ని కలిగివున్న ఆంధ్రప్రదేశ్‌ను తమ అణచివేతకు ప్రయోగశాలగా ఎన్నుకొని, సి.పి.ఐ.(మావోయిస్టు) నాయకత్వంలో సుదీర్ఘకాలంగా అక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమాన్ని అణచివేయడంలో విజయం సాధించామని గొప్పలు చెప్పుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేశామని ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నాయి. అయితే తాము సాధించిన విజయం తాత్కాలికమేనని పాలకవర్గాలకు స్పష్టంగా తెలుసు. సుసంపన్నమైన పోరాట వారసత్వమున్న ఆంధ్రప్రదేశ్ గడ్డ నుండి విప్లవోద్యమాన్ని పూర్తిగా తుడిచిపెట్టడం సాధ్యం కాదని, ఏ మాత్రం ఉపేక్షించినా అక్కడ మళ్లీ దావానలం చెలరేగుతుందని పాలకులు భయపడుతున్నారు. ఆ భయాన్ని నిజం చేస్తూ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరాయంగా వివిధ ప్రజా వుద్యమాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు మడమ తిప్పకుండా పోరాడుతున్నారు. మరోవైపు సామ్రాజ్యవాద, బహుళజాతి ప్రయోజనాల కోసం తలపెట్టిన అనేక ప్రాజెక్టులకు, సెజ్‌లకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ప్రభుత్వం దేశవ్యాప్తంగా తలపెట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఎండగట్టడంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం ముందు వీరిన నిలుస్తున్నారు. ఇంకా తమ దైనందిన సమస్యల కోసం వివిధ సెక్షన్ల ప్రజలు పోరాడుతున్నారు. ఈ విధంగా దేశంలో ప్రజా వుద్యమాలకు ఆంధ్రప్రదేశ్ ఒక నమూనాగా ముందుకొస్తున్నది. ఈ పోరాటాలకు వెరిచిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకం పన్ని ప్రజా వుద్యమ నాయకుడు, అమరవీరుల బంధు మిత్రుల కమిటీ అధ్యక్షుడు, ఆర్.డి.ఎఫ్. ఉపాధ్యక్షుడు కామ్రేడ్ గంటి ప్రసాదంను దుండగుల ముసుగులో హత్య చేసింది.

కామ్రేడ్ గంటి ప్రసాదం విప్లవ ప్రస్థానం నాటి శ్రీకాకుళ పోరాటం నుండే ప్రారంభమైంది. నక్సల్బరీ పంథాలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే లక్ష్యంతో ఏర్పడిన సి.పి.ఐ.(ఎం-ఎల్)లోనూ, ఆ తర్వాత ఏర్పడిన సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)లోనూ ఆయన క్రియాశీలక కార్యకర్త అయ్యారు. కామ్రేడ్ అప్పలసూరి నాయకత్వంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో ఆయన ఎన్నో పోరాటాలకు నాయకత్వం వహించి, వివిధ సెక్షన్ల ప్రజలను సంఘటితపరిచి బలమైన ప్రజా, కార్మిక వుద్యమాలను నిర్మించారు. చారిత్రాత్మక నెల్లిమర్ల జూట్‌మిల్ పోరాటానికి నేతృత్వం వహించారు. ఈ వుద్యమ ప్రస్థానం ఫలితంగా ఆయన సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ)లో కేంద్ర కమిటీ సభ్యులయ్యారు.

1998లో సి.పి.ఐ.(ఎం-ఎల్) (పార్టీ యూనిటీ), సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)ల ఐక్యత మూలంగా సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆవిర్భవించింది. ఈ క్రమంలో ఆయన సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికై 2005 వరకూ కొనసాగారు. ఆ బాధ్యతల్లో వుండి ఆయన నిర్మాణ, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో విశేషమైన కృషి చేశారు. పట్టణోద్యమ, విప్లవ ప్రజా సంఘాల నిర్మాణ బాధ్యతను నిర్వర్తించారు. రాష్ట్ర కమిటీ అధికార పత్రిక 'క్రాంతి'ని నడిపారు. ఈ క్రమంలో 2005 మేలో ఆయన మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో అరెస్టయ్యారు. జైలు జీవితం అనుభవించారు. విడుదలైన తర్వాత ఆయన బహిరంగ విప్లవోద్యమాలకు అంకితమయ్యారు. 1998 అగస్టులో కోవర్‌డెంగ్ ఎన్‌కౌంటర్‌లో అమరుడైన సి.పి.ఐ. (ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) నాయకుడు కామ్రేడ్ రాజన్నకు, స్వయాన సోదరుడైన కామ్రేడ్ గంటి ప్రసాదం అమరవీరుల బంధు మిత్రుల కమిటీకి అధ్యక్షులయ్యారు. అప్పటి నుండి ఎన్‌కౌంటర్ల పేరుతో పోలీసులు చేసే ప్రతి హత్యనూ ఆయన ఖండిస్తూ వచ్చారు. పాలకుల, పోలీసుల హంతక ముఖాలను బట్టబయలు చేస్తూ వచ్చారు. అమరులైన ఎందరో అమరవీరుల కుటుంబాలకు మద్దతుగా నిలిచారు. విప్లవకారుల మృతదేహాలకు సరైన అంత్యక్రియలు కూడా జరగకూడదనే పాలకుల, పోలీసుల వికృత కోరికలకు విరుద్ధంగా, అమరుల అంత్యక్రియలను ముందుండి గౌరవప్రదంగా, ఉత్తేజకరంగా జరిపించారు.

ప్రజా వుద్యమాలలో ఆయన కృషిని సహించలేని ప్రభుత్వం ఆయనపై నిర్బంధం కొనసాగిస్తూనే వుంది. ఒడిశా ప్రభుత్వం కూడా 2011లో ఆయనను అరెస్టు చేసి జైలులో పెట్టింది. అయితే ప్రజలు పోరాడి తమ నాయకుడిని విడిపించుకున్నారు.

ఇంకా తన విప్లవ కార్యాచరణను పెంచుకుంటూ 2012 ఏప్రిల్‌లో ఆర్.డి.ఎఫ్.కు అఖిల భారత ఉపాధ్యక్షులయ్యారు. దేశంలో కొనసాగుతున్న విప్లవోద్యమానికి సంఘీభావం కూడగట్టడంలోనూ, పాలకులు కొనసాగిస్తున్న గ్రీన్‌హంట్ దమనకాండకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలను సంఘటితం చేయడంలోనూ ఆర్.డి.ఎఫ్. చేస్తున్న కృషిని సహించలేని ప్రభుత్వం ఆర్.డి.ఎఫ్.ను నిషేధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సంఘ నాయకుడిని హత్య చేసేందుకు తెగించింది. పైగా నిస్సిగ్గుగా ఎవరో అనామక దుండగులు చేసిన చర్యగా దీన్ని ప్రచారం చేసుకుంటున్నది. ప్రజా వుద్యమాల్లో పనిచేసే నాయకులను చంపడానికి రక రకాల పేర్లతో ముఠాలు ఏర్పరిచి ప్రజా, పౌరహక్కుల సంఘాల నాయకులు పురుషోత్తం, ఆజం ఆలీ, కనకాచారి తదితరులతో పాటు ఇటీవలి కాలంలో మహబూబ్‌నగర్ జిల్లాలో వెంకటేశ్వర్లును హత్య చేసిన నీచ చరిత్ర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వున్నది. కాబట్టి ఇది ముమ్మాటికి గ్రీన్‌హంట్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏపీఎస్ఐబీ చేసిన, లేదా చేయించిన హత్య.

ఈ హత్య నేడు దేశంలోనూ, రాష్ట్రంలోనూ జరుగుతున్న ప్రజా వుద్యమాలకు ఒక హెచ్చరిక. రోజు రోజుకూ పెరుగుతున్న పాలకవర్గాల ఫాసిజంకు ఒక వుదాహరణ. ప్రజా వుద్యమాలను మరింతగా పెంపొందించడం ద్వారానే ఇటువంటి హత్యాకాండలను అడ్డుకోగలం.

ఈ దారుణ హత్యను ప్రజలు, ప్రజాస్వామికవాదులు ముక్త కంఠంతో ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

ఈ దారుణ హత్యను ఖండిస్తూ **జూలై 15 నుండి 21 వరకూ నిరసన వారాన్ని పాటించండి.** ఈ వారం రోజుల పాటు వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టండి. ఈ నిరసన కార్యక్రమాల్లో ప్రజలను విస్తృతంగా కదిలించండి. **21న ఏపీ, ఎన్‌టీ, ఏఓబీ బంద్‌ను పాటించండి.** ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ సెక్షన్ల ప్రజలు, ప్రజాస్వామికవాదులు విస్తృతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- ★ కామ్రేడ్ గంటి ప్రసాదం అమర్ రహే!
- ★ ప్రజా వుద్యమాలపై ఫాసిస్టు హత్యాకాండను ఖండించండి!
- ★ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రజా వుద్యమాన్ని నిర్మిద్దాం!
- ★ ఉద్యమకారులపై ఫాసిస్టు హత్యాకాండను ఖండించండి!

ఆనంద్
కార్యదర్శి
కేంద్ర రీజనల్ బ్యూరో
సీపీఐ (మావోయిస్టు)


**క్రాంతిని ఈ సైట్లో చూడొచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 2006 నుంచి అన్ని సంచికలు, 1994-2004 మధ్య కాలంలో వెలువడిన కొన్ని సంచికలు ఇందులో వున్నాయి.**

http://www.bannedthought.net/India/Kranti/index.htm

# ఆదర్శ కమ్యూనిస్టు, సాహితీ యోధుడు

# కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు అమర్ రహే!

2013, జూన్ 20న అనారోగ్యంతో కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు (84) గుంటూరులో కన్నుమూశారు. ఆయన పేరుపొందిన అనువాదకులు, రచయిత, అంతకు మించి సి.పి.ఐ. (మావోయిస్టు) పార్టీ సీనియర్ కార్యకర్త. దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రిక 'ప్రభాత్' వ్యవస్థాపక సంపాదక మండలి సభ్యుడు. భారత దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని బలంగా కాంక్షించి, అందుకు సాయుధ పోరాటమే ఏకైక మార్గమని నమ్మి, ఆ బాటలో తాను నడిచి, తన కలాన్నీ కవాతు చేయించిన ఈ సాహితీ యోధుడికి 'క్రాంతి' వినమ్రంగా జోహార్లర్పిస్తున్నది. ఆయన జీవిత భాగస్వామి కామ్రేడ్ లలితకు, ఇతర కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది.



తెలుగు సమాజానికి ఆయన చిరపరిచితుడు. సాహితీ ప్రపంచంలో ఆయనది చెరిగిపోని ముద్ర. అనువాదకుడిగా మొదలైన ఆయన సాహితీ ప్రయాణం ఆయనను కథకుడిగా, నవలాకారుడిగా, ఆఖరికి వృత్తి విప్లవకారుడిగా తీర్చిదిద్దింది.

రాహుల్ సాంకృత్యాయన్ రచనలను అమితంగా అభిమానించే కామ్రేడ్ భుజంగ రావు ఆయన రచనలను చాలా వరకు హిందీ నుండి తెలుగులోకి అనువదించారు. ఆయన రాసిన విస్మృత యాత్రికుడు, ప్రాక్పశ్చిమ దర్శనాలు, దర్శన్ దిగ్ దర్శన్, దివోదాసు, వైజ్ఞానిక గతితార్కిక భౌతిక వాదం; ప్రేమ్‌చంద్ రాసిన రంగ భూమి, గబన్; కిషన్ చందర్ రాసిన వాయుగుండం, పరాజయం; యశ్‌పాల్ రాసిన సింహావలోకనం తదితర రచనలను తెలుగులోకి అనువదించారు.

రాగో, అతడు, నేలతల్లి విముక్తి కోసం, బొగ్గు పొరల్లో, దండకారణ్య అమర వీరుల చరిత్ర తదితర పుస్తకాలు, నవలలను ఆయన తెలుగు నుండి హిందీలోకి అనువదించారు. ఆయన చేసిన అనువాదాలు ఏవీ అనువాదాలుగా అనిపించవు. మూల రచన కంటే అనువాదమే బాగుంది అనే ప్రశంసలు కూడా ఆయన అనువాదాలు పొందాయి.

అనువాదాలే కాక ఆయన కొండవాగు, ప్రజలు అజేయులు, నైనా, దిక్కుమొక్కు లేని జనం తదితర నవలలు రాశారు. గమనా గమనం పేరిట తన ఆత్మకథను రాశారు. ఆయన జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసిన శారద (నటరాజ్) జీవిత చరిత్రను 'సాహిత్య బాటసారి' అనే పేరుతో రాశారు. ఇరవైకి పైగా కథలు రాసారు. ఆయన కథలు 'అరణ్యపర్వం' పేరిట సంపుటిగా వెలువడింది. ఆయన పారదర్శి, పెద్దన్న, చక్రధర్, జనార్దన్ తదితర కలం పేర్లతో రాశారు.

అనువాదకుడిగా, రచయితగా విశేషమైన కృషి చేసిన ఆయన సహజంగానే సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేశారు. వేదాలు మొదలుకొని విశ్వనాథ రచనల వరకూ ఆయన దేనినీ వదలలేదు. రాహుల్‌జీతో పాటు ఆయన ప్రేమ్‌చంద్ సాహిత్యాన్ని బాగా అభిమానించేవారు. వేమనశతకాన్నీ, శ్రీశ్రీ కవిత్వాన్ని ఆయన బాగా ఇష్టపడేవారు. వేమన శతకం ఆయనకు కంఠతా వచ్చేది. గోర్కీ, టాల్‌స్టాయ్ రచనలను కూడా ఆయన బాగా అభిమానించేవారు. గోర్కీ గురించి ఆయన తన పిల్లలకు ఎక్కువగా చెప్పేవారు.

సాహిత్యంలో విశేషమైన కృషి చేసిన ఆయన జీవితం వడ్డించిన విస్తరి కాదు. స్వయం కృషితో, పట్టుదలతో, లక్ష్యశుద్ధితో, కష్టాలకు, అననుకూలతలకు ఎదురీదుతూ సాధించిన ఫలితమది. ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ విలువైన పాఠం వంటిది. అందుకే దాన్ని ఆయన 'గమనా గమనం' పేరిట భావితరాలకు భద్రపరిచే వెళ్లారు. ఆయన అమరత్వం సందర్భంగా ఒక్కసారి ఆయన జీవిత గమనాన్ని తడుముకుందాం.

గుంటూరు జిల్లా పొన్నూరు సమీపంలోని కొండముది గ్రామంలో 1928లో కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు పుట్టారు. సీతా రామమ్మ, వెంకటప్పయ్య దంపతుల ఆఖరి సంతానమైన కామ్రేడ్ భుజంగరావుకు ఇద్దరు అన్నలు, ఒక అక్క వుండేవారు. ఆయన రెండో తరగతి చదువుతుండగానే తండ్రిని కోల్పోయారు. తండ్రి చనిపోయిన తర్వాత, దగ్గరి బంధువులు తప్పుడు లెక్కలు చెప్పి, అప్పు కిందికి వాళ్లకు వున్న పన్నెండు ఎకరాల భూమిని లాక్కున్నారు. అభిమానవంతురాలైన ఆయన తల్లి, ఇక ఆ గ్రామంలో వుండలేక, పిల్లల్ని తీసుకొని బతుకుదెరువు వెతుక్కుంటూ తెనాలి పట్టణానికి వచ్చేసింది. ఇక అప్పటి నుండి ఆయన జీవితం ఎక్కువగా తెనాలిలోనే గడిచింది.

తెనాలిలో కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు జీవితం, ఒక హోటల్‌లో బాల కార్మికుడిగా మొదలయింది. ఆయన అన్నలిద్దరూ

కూడా చిన్న చిన్న పనులు చేస్తూ కుటుంబ భారాన్ని పంచుకునే వారు. భుజంగ రావు గారి చిన్నన్న ప్రకాశం ఆనాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పనిచేసేవారు. అయితే ఆయన ఎక్కువ కాలం జీవించలేదు. దాదాపు 20 యేళ్ల వయసులోనే ప్రమాదవశాత్తు చనిపోయారు. అయితే అప్పటికే ఆయన తన తమ్ముడు భుజంగరావుపై, జీవితాంతమూ చెక్కుచెదరనంత బలమైన ప్రభావాన్ని వేశారు. కామ్రేడ్ భుజంగ రావు తన తల్లిని అమితంగా ప్రేమించేవారు. ఆమె వ్యక్తిత్వం కూడా ఆయనపై బలమైన ప్రభావాన్ని వేసింది. సాహిత్యం చదివే వారసత్వం తనకు అమ్మ నుంచి వచ్చిందని ఆయన పలు సందర్భాల్లో చెప్పుకునే వారు.

కామ్రేడ్ భుజంగ రావు పని చేస్తున్న హొటల్ యజమాని బిడ్డకు రోజూ ఒక హిందీ ఉపాధ్యాయుడు వచ్చి హిందీ పాఠాలు చెప్పేవారు. కామ్రేడ్ భుజంగరావుతో వున్న స్నేహం వలన ఆ అమ్మాయి తాను నేర్చుకున్న పాఠాలను రోజూ ఆయనకు బోధించేది. తాను రాసుకున్న నోట్స్‌ను ఇచ్చేది. హొటల్ యజమాని బీడీల కోసమని ఇచ్చిన అణా, కాణీ పైసలతో కామ్రేడ్ భుజంగ రావు కాగితాలు కొనుక్కునేవారు. తండ్రి మరణంతో ఆగిపోయిన ఆయన చదువు ఆ తర్వాత అట్లా కొనసాగింది.

ఆనాడు ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ హొటల్ కార్మికుల్లో పనిచేసేది. ఆంధ్రా ప్యారిస్‌గా పేరొందిన తెనాలి, సాహిత్యానికి ఒక కేంద్రంగా వుండేది. కాబట్టి కామ్రేడ్ భుజంగ రావు అటు కమ్యూనిస్టు పార్టీ, ఇటు ప్రగతిశీల సాహిత్యం సంబంధాల్లోకి వచ్చారు. ముఖ్యంగా తన అన్న ప్రభావం మూలంగా కమ్యూనిస్టు పార్టీకి, శారద (నటరాజ్) ప్రభావం మూలంగా సాహిత్యానికి ఆయన చేరువయ్యారు. కమ్యూనిస్టు భావజాలపరంగా అన్న ప్రభావం ఆయనపై ఎంత బలంగా పడిందో, సాహిత్యపరంగా శారద ప్రభావం అంతే బలంగా పడింది.

హొటల్ యజమాని బిడ్డ వద్ద హిందీ పాఠాలు నేర్చుకున్న ఆయన ఆ తర్వాత స్వయంకృషితో హిందీపై మంచి పట్టు సాధించారు. హిందీ పరీక్షలు కూడా రాశారు. ఆ సమయంలో వుత్తరాది రాష్ట్రాల నుండి ఒక కమ్యూనిస్టు నాయకుడు తెనాలి వచ్చి హిందీలో ప్రసంగించారు. ఆయన ప్రసంగాన్ని కామ్రేడ్ భుజంగ రావు తెలుగులోకి అనువదించారు. అనువాదకుడిగా ఆయనకు అది తొలి అనుభవమే అయినప్పటికీ, అది ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టింది. అప్పటికి ఆయనకు పదిహేను, పదహారేళ్ల వయసు. అప్పటి నుండీ ఆయన పార్టీలో దాదాపు పూర్తికాలం కార్యకర్తగా మారారు. అనువాదకుడిగా, కార్యకర్తగా పలు ప్రాంతాలకు వెళ్తూ వుండేవారు. అట్లా ఆయన హొటల్ పనిని వదిలేశారు.

ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ రివిజనిస్టుగా మారి ఎన్నికల రొచ్చులో దిగబడింది. కామ్రేడ్ భుజంగ రావు వలె పార్టీకే తమ జీవితాలను అంకితం చేసిన ఎందరో కార్యకర్తలు ఆ సమయంలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కామ్రేడ్ భుజంగ రావు తిరిగి బతుకుదెరువు వెతుక్కోవాల్సి వచ్చింది. అప్పటికే హిందీలో మంచి ప్రావీణ్యాన్ని సాధించిన ఆయన, రెండు, మూడు ధనిక కుటుంబాల వారి పిల్లలకు వారి ఇండ్లకు వెళ్లి హిందీ పాఠాలు చెప్పడం మొదలుపెట్టారు. కొద్ది రోజులకు ఆయనకు ప్రభుత్వ వుపాధ్యాయుడిగా కర్నూల్‌లో వుద్యోగం వచ్చింది. దానితో ఆర్థికంగా ఆయన జీవితంలో కొంత స్థిరత్వం ఏర్పడింది. అదే సమయంలో ఆయన అనువాదాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు.

కామ్రేడ్ భుజంగ రావు వివాహం మొదట సత్యవతితో జరిగింది. ఒక బిడ్డ పుట్టిన తర్వాత ఆమె చనిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆయన వివాహం అదే వీధిలో వుండే కామ్రేడ్ లలితతో జరిగింది. మధ్య తరగతికి చెందిన ఒక ఉపాధ్యాయుడి బిడ్డ అయిన కామ్రేడ్ లలిత విద్యావంతురాలు, సాహిత్యాభిమాని. సాహిత్యం పట్ల వుండే మక్కువతోనే సాహిత్యకారుడయిన కామ్రేడ్ భుజంగ రావు పట్ల ఆమె అభిమానాన్ని పెంచుకున్నారు. సవితి పిల్లల్ని సొంత పిల్లలుగా పెంచగలమని నిరూపించడానికి కూడా, ఆమె, కామ్రేడ్ భుజంగరావును వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారు. పేదవాడు, బిడ్డ తండ్రి అంటూ, తన తల్లిదండ్రులు పెట్టిన అభ్యంతరాలను ధిక్కరించి, ఆమె కామ్రేడ్ భుజంగ రావు జీవితంలో అడుగుపెట్టారు. ఆ తర్వాత జీవితంలోని ప్రతి మలుపులోనూ ఆయనకు ఆమె అండ దండగానే కాదు, ఆలంబనగానూ నిలిచారు. మొదటి బిడ్డ కాకుండా ఈ దంపతులకు ఆరుగురు సంతానం కల్గారు. వారిలో ఇద్దరు కొడుకులు చనిపోగా ప్రస్తుతం ముగ్గురు బిడ్డలూ, ఒక కొడుకు వున్నారు.

పిల్లలను మొదటి నుండీ ఈ దంపతులు ప్రజాస్వామిక వాతావరణంలో పెంచారు. ఎటువంటి దాపరికం లేకుండా పిల్లలకు తమ ఆర్థిక పరిస్థితిని వివరించి, బరువు, బాధ్యతలెరిగేటట్టుగా వాళ్ల ప్రవర్తనను తీర్చిదిద్దారు.

కర్నూలు తర్వాత ఆయన క్రిష్ణా జిల్లాలోని ఉయ్యూరులో మిషనరీ పాఠశాలలో పని చేశారు. ఆ సమయంలో యాజమాన్యం వుద్యోగులకు జీతాలు సరిగా ఇచ్చేవారు కాదు. కామ్రేడ్ భుజంగ రావు ఈ అన్యాయాన్ని ఎదిరిస్తూ యాజమాన్యంతో నిరంతరం ఘర్షణ పడేవారు. యాజమాన్యం ఎంత వేధించినా రాజీపడేవారు కాదు. చివరికి ఆత్మాభిమానం చంపుకొని బానిసలా పని చేయలేనంటూ వుద్యోగానికి రాజీనామా చేశారు. అయితే నిజాయితీగా పనిచేసే కామ్రేడ్ భుజంగరావును తోటి వుద్యోగులు అభిమానించేవారు. రాజీనామా చేస్తే వున్న బతుకుదెరువు పోతుందని వాళ్లెంత నచ్చచెప్పినా ఆయన రాజీపడదల్చుకోలేదు. జిల్లా కలెక్టర్ కూడా సాహిత్యకారుడిగా కామ్రేడ్ భుజంగ రావును అభిమానించేవాడు. చివరకు కలెక్టర్ జోక్యం చేసుకొని కామ్రేడ్ భుజంగరావును మరో స్కూలుకు బదిలీ చేశారు.

బాల కార్మికుడిగా పనిచేసిన కామ్రేడ్ భుజంగ రావు శ్రమను ఎల్లప్పుడూ గౌరవించేవారు. ఉయ్యూరులో పనిచేసిన కాలంలో జీతం సరిగా అందక ఆర్థికంగా ఆ కుటుంబం చాలా ఇబ్బంది

పడేది. ఆ సమయంలో కామ్రేడ్ భుజంగ రావు సహచరి, పిల్లలు పెండ సేకరించి, పిడకలు చేసి, ఆయన పనిచేసే బడి ముందే పెట్టుకొని అమ్మేవారు. దాన్ని వాళ్లంతా ఆత్మ గౌరవంగానే భావించారు తప్ప నామోషీగా భావించలేదు.

బ్రాహ్మణ కులంలో పుట్టిన కామ్రేడ్ భుజంగ రావు కుల వ్యవస్థను అసహ్యించుకునేవారు. తమ పిల్లలపై కుల, మత భేద భావాలు పడకుండా జాగ్రత్త పడ్డారు. ఒకసారి బడిలో తమ బిడ్డను వుపాధ్యాయురాలు కులం అడిగినందుకు ఆయన ఆమెతో బాగా ఘర్షణపడ్డారు.

విద్యా విధానం పట్ల కూడా కామ్రేడ్ భుజంగరావుకు నిర్దిష్టమైన అభిప్రాయాలు వుండేవి. ప్రస్తుత విద్యా విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించేవారు. పరీక్షలు పెట్టి పిల్లల్ని ఫెయిల్ చేయడం ఆయనకు అస్సలు నచ్చేది కాదు. అందుకే ఆయన పరీక్ష పేపర్లు దిద్దితే ఎవర్నీ ఫెయిల్ చేసేవారు కాదు.

వాళ్ల ఇల్లు నిరంతరం ఒక చర్చా వేదికగా వుండేది. సాహితీ చర్చలూ, రాజకీయ చర్చలు జరుగుతూ వుండేవి. ఎంతో మంది స్నేహితులు నిరంతరం వచ్చి పోతుండేవారు. ఉపాధ్యాయుడిగా ఆయన తరిమెల నాగిరెడ్డి గ్రూపుకు అనుబంధంగా పనిచేసే వుపాధ్యాయ సంఘంలో చేరారు. అట్లా ఆ పార్టీ సంబంధాల్లోకి వెళ్లారు. ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఆ పార్టీ కార్యకర్తలు ఆయనతో క్లాసులు చెప్పించుకునేవారు. అట్లా ఆయన రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి క్లాసులు చెప్పేవారు. అయితే ఎక్కువ కాలం ఆయన ఆ రాజకీయాల్లో ఇమడలేకపోయారు. ఆ రాజకీయాలను ఆమోదించలేకపోయేవారు. వివిధ సమావేశాల్లో, చర్చల్లో ఆయన కామ్రేడ్ చారు మజుందార్ పంథాను ఎత్తిపట్టి మాట్లాడేవారు, బలంగా వాదించేవారు. ఆర్ఎస్‌యూను ఆయన బాగా అభిమానించేవారు. తరిమెల గ్రూపుకు చెందిన విద్యార్థి సంఘం (డీఎస్ఓ) వాళ్లతో ఆర్ఎస్‌యూ వలె పని చేయాలని చెప్పేవారు. డీఎస్ఓలో చేరిన తన కొడుకుతో ఆర్ఎస్‌యూలో చేరమని చెప్పేవారు. కొద్దికాలం తర్వాత తరిమెల గ్రూపు రాజకీయాల నుండి ఆయన పూర్తిగా వైదొలిగారు.

సింహావలోకనం పుస్తకాన్ని తెలుగులోకి అనువాదం చేసిన తర్వాత ఆర్ఎస్‌యూకు ఆయన సన్నిహితులయ్యారు. ఆర్ఎస్‌యూ కార్యకర్తలు భగత్సింగ్ వర్ధంతి సభలు జరిపి ఆయనను వక్తగా పిలిచేవారు. ఆ తర్వాత నాటి సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) ఏపీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు, నాటి రాష్ట్ర కమిటీ నాయకుడు నిమ్మలూరి భాస్కర్ రావు (మల్లిక్ పేరుతో పనిచేసి తర్వాత కాలంలో లొంగిపోయాడు) కామ్రేడ్ భుజంగరావును కలిసి చర్చలు జరిపాడు. కామ్రేడ్ భుజంగ రావు సానుకూలంగా స్పందించడంతో ఆ తర్వాత నాటి రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మల్లోజుల కోటేశ్వర్లు (2011 నవంబర్ 24న అమరత్వం చెందారు) కలిసి మాట్లాడారు. ఆ తర్వాత కామ్రేడ్ భుజంగ రావు సి.పి.ఐ.(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) కార్యకర్త అయ్యారు. ఆయనే కాదు, ఆయన సహచరి కామ్రేడ్ లలిత, పిల్లలు అంతా ఆ రాజకీయాలను సొంతం చేసుకున్నారు. పార్టీ తీసుకున్న పలు కార్యక్రమాల్లో దంపతులిద్దరూ పాల్గొనడమే కాక, తమ పిల్లలు కూడా పాల్గొనేలా ప్రోత్సహించేవారు. పార్టీ నాయకులకు షెల్టర్లు ఏర్పాటు చేయడం వంటి ఎన్నో సేవలను ఆ కుటుంబం అందించింది. ఎందరో పార్టీ యువ కార్యకర్తలకు ఆ దంపతులు తల్లిదండ్రులయ్యారు.

ఆ కుటుంబంలో నెలకొన్న అటువంటి రాజకీయ వాతావరణంలో ఈ దంపతుల ఇద్దరి బిడ్డలు పార్టీలో పూర్తికాలం కార్యకర్తలయ్యారు. మరో ఇద్దరు బిడ్డలు కూడా పార్టీ కార్యకర్తలను పెండ్లి చేసుకొని పార్టీలో భాగమయ్యారు. తమ బిడ్డలు ఉద్యమంలో పూర్తి కాలం చేరడాన్ని కామ్రేడ్ భుజంగ రావు దంపతులు ప్రోత్సహించారే గాని ఎన్నడూ నిరుత్సాహపరచలేదు.

పిల్లలందరూ పెద్దవాళ్లయి తమ భవిష్యత్‌ను తాము నిర్ణయించుకునే పరిస్థితి వచ్చాక ఆ దంపతులిద్దరూ ఇక కుటుంబం కోసం కాకుండా సమాజం కోసమే బతకాలనే నిర్ణయానికి వచ్చారు. అందుకోసం పార్టీలో పూర్తి కాలం పనిచేస్తామని పార్టీ ముందు ప్రతిపాదన పెట్టారు. ఈ ప్రతిపాదన పెట్టడంలో కామ్రేడ్ లలితదే కీలకపాత్ర. వాళ్ల కోరికను, ఉద్యమ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పార్టీ ఆ దంపతులిద్దర్నీ పూర్తికాలపు కార్యకర్తలుగా అజ్ఞాత జీవితంలోకి ఆహ్వానించింది. అట్లా వుద్యోగానికి రాజీనామా చేసి, దాదాపు 60 యేళ్ల వయసులో కామ్రేడ్ భుజంగ రావు, తన సహచరితో కలిసి అజ్ఞాత జీవితంలోకి వచ్చారు.

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రికగా 'ప్రభాత్'ను తీసుకురావాలని అప్పటికే పార్టీ నిర్ణయించింది. హిందీలో మంచి ప్రావీణ్యం వున్న కామ్రేడ్ భుజంగ రావు 'ప్రభాత్' వ్యవస్థాపక సంపాదక మండలి సభ్యులయ్యారు. దాదాపు ఆరేళ్లపాటు ఆయన 'ప్రభాత్'కు సంపాదకమండలి సభ్యులుగా, అనువాదకులుగా ఎనలేని కృషి చేశారు. కామ్రేడ్ భుజంగ రావు మొదటి నుండీ అనారోగ్య పీడితులే. బీపీ, పైల్స్ ఆయనను తరచూ బాధించేవి. అజ్ఞాత జీవితంలో వయసు పెరుగుతుంటే ఆయన అనారోగ్యం మరింత పెరిగింది. కంటి చూపు దెబ్బతిని మూడు సార్లు ఆపరేషన్ జరిగినా ఫలితం లేకపోయింది. కంటి చూపు దెబ్బతిన్నా, భూతద్దం సహాయంతో ఆయన రచనా వ్యాసాంగాన్ని కొనసాగించారు. రాత్రుళ్లు ఎక్కువ సేపు మేలుకొని పనిచేయడం వలన ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. పక్షవాతం కూడా వచ్చింది. ఆరోగ్యం ఎంత క్షీణించినా ఆయన లక్ష్య సాధనను వీడలేదు. శారీరకంగా వృద్ధాప్యం వచ్చినా మానసికంగా ఆయన 'ముందు యుగం దూత'గానే వున్నారు. వసివాడని మేధస్సుతో తన కలాన్నే కత్తిగా మార్చి దోపిడీ సమాజంపైకి ఎక్కుపెడుతూనే వున్నారు.

అయితే శత్రు నిర్బంధం తీవ్రమై పట్టణాల్లో పలు అరెస్టులు జరిగాయి. ఇక పత్రికను బయట నడపడం సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. దానితో పత్రికను అటవీ వుద్యమ ప్రాంతంలోనే

నడపాలనే నిర్ణయం జరిగింది. దెబ్బతిన్న ఆరోగ్యంతో, ఆ వయసులో రహస్య జీవితమైనా, అడవి జీవితమైనా కష్టమని భావించిన పార్టీ, ఆ దంపతులను బహిరంగ జీవితంలోకి వెళ్లమని సూచించింది. పార్టీకి ప్రత్యక్షంగా సేవ చేసే అవకాశానికి దూరం అవుతున్నందుకు, ఆ దంపతులు ఎంతో ఆవేదన చెందినప్పటికీ, తప్పని పరిస్థితిలో ఏడెనిమిదేళ్ల అజ్ఞాత జీవితాన్ని వీడి బహిరంగ జీవితంలోకి వెళ్లారు.

ఇతర రాష్ట్రాల్లో, వివిధ పట్టణాల్లో వుంటూ 'ప్రభాత్' పనే కాకుండా ఆ దంపతులు విప్లవానికి ఎనలేని సేవలందించారు. ఆ వయసులో ఇతర ప్రాంత భాషలు నేర్చుకున్నారు. వాళ్ల ఇల్లు కేంద్ర కమిటీ నాయకత్వానికి ఒక ముఖ్యమైన షెల్టర్‌గా వుండేది. పార్టీపై కొనసాగుతున్న తీవ్ర నిర్బంధం, నిరంతర నిఘాల నడుమనే ఆ దంపతులు ఎంతో నిబ్బరంతో పార్టీ అగ్రశ్రేణి నాయకత్వాన్ని కంటికి రెప్పలా కాపాడారు. ఆ క్రమంలో వాళ్లకు ఎంతో మంది నాయకులతో ఆత్మీయమైన అనుబంధం ఏర్పడింది. అమరుడు కామ్రేడ్ ఐ.వి. సాంబశివ రావుతో వాళ్లకు ఏర్పడిన అనుబంధాన్ని కామ్రేడ్ భుజంగ రావు కథగా మలిచారు.

వాళ్లు రహస్య జీవితంలో వుండగానే పార్టీలో రెండవ సంక్షోభం వచ్చింది. ఆ సంక్షోభ సమయంలో కామ్రేడ్ భుజంగ రావు సరైన రాజకీయాలను దృఢంగా అంటిపెట్టుకొని వున్నారు. ఈ సంక్షోభంలో కామ్రేడ్ భుజంగ రావు పెద్ద కూతురు సహచరుడు సిరా (సి. రామచంద్రా రెడ్డి) కె.ఎస్.పక్షం వహించి ఆయనతోనే పార్టీ నుండి బయటకు వెళ్లిపోయాడు. సిరా పట్ల ఈ దంపతులిద్దరికీ అమితమైన అభిమానం వుండేది. అయినప్పటికీ సిరా, కె.ఎస్.ను అనుసరిస్తున్నందుకు వ్యథ చెందారే తప్ప వాళ్లు సిరాను సమర్థించలేదు.

రహస్య జీవితంలోకి వెళ్లక ముందే విప్లవ రచయితల సంఘంలో పనిచేసిన కామ్రేడ్ భుజంగ రావు, ఆ తర్వాత తుది వరకూ విరసం సభ్యులుగా కొనసాగారు. పలు ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు నిర్వహించే సభలు, కార్యక్రమాలకు దంపతులిద్దరూ హాజరయి యువతరం కార్యకర్తలకు స్ఫూర్తినిచ్చేవారు. బహిరంగ జీవితంలోకి వెళ్లిన తర్వాత కూడా కామ్రేడ్ భుజంగ రావు పలు కథలు, నవలలు రాశారు. ప్రత్యక్ష ఆచరణలో పాల్గొనడానికి తన శారీరక ఆరోగ్యం సహకరించక పోయినా, మేధస్సునే ఆయుధంగా మలిచి విప్లవోద్యమానికి బాసటగా నిలిచారు. కంటి చూపు దెబ్బ తిని ఈ కలం యోధుడికి కలం పట్టుకోవడం కూడా కష్టమైన సమయంలో ఆయన చెపుతుంటే కామ్రేడ్ లలిత రాసేవారు. అట్లా అలసిపోని ఒక రైతు వలె ఆయన చివరి వరకూ అక్షర సేద్యం చేస్తూనే వుండినారు. ఓటమిని అంగీకరించని సిపాయి వలె అక్షర కవాతును సాగిస్తూనే వుండినారు.

మొదట నలుగురు బిడ్డలు వుద్యమంలో భాగమైనప్పటికీ ముగ్గురు బిడ్డలు వుద్యమం నుండి వెళ్లిపోయి ప్రస్తుతం సాధారణ జీవితం గడుపుతున్నారు. దానికి ఆ దంపతులు బాధపడ్డారే గాని ఉద్యమం పట్ల వారి విశ్వాసం కించిత్తు కూడా సడలిపోలేదు.

నరహంతక చంద్రబాబు పాలనలో ఈ దంపతుల జీవితంలో పెను విషాదం చోటు చేసుకుంది. తాము అమితంగా ప్రేమించే ఇద్దరు అలుళ్లను వాళ్లు కోల్పోయారు. సిరాను, వుద్యమంలో కొనసాగుతున్న చిన్న బిడ్డ సహచరుడు కామ్రేడ్ కిరణ్‌ను కొంత కాలం తేడాతోనే పోలీసులు పొట్టన పెట్టుకున్నారు. ఈ సంఘటనలు వాళ్లను దుఃఖంలో ముంచెత్తినప్పటికీ నిరాశకు మాత్రం గురిచేయలేదు.

ఇట్లా జీవితంలో ఎన్నో ఆటు పోట్లను ధైర్యంగా ఎదుర్కొని, భారత దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావాలని కలలు కని, ఆ కలలను సాకారం చేయడానికి ప్రత్యక్ష ఆచరణలో సైతం పాల్గొని, నేటి తరాలకు తన జీవితాన్నే ఒక పాఠంగా అందించి 84వ ఏట కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు కన్నుమూశారు.

ఆయన నెలకొల్పిన ఆదర్శాలను స్వీకరిద్దాం. ఆయన కలలు కన్న సమ సమాజాన్ని సాధించడానికి అవిశ్రాంతంగా ముందుకు సాగుదాం. అదే కామ్రేడ్ భుజంగ రావుకు మనం అందించగలిగిన నిజమైన నివాళి.

**కామ్రేడ్ ఆలూరి భుజంగ రావు అమర్ రహే!** ★

---

*(14వ పేజీ తరువాయి...)*

చేయించుకున్నారు. వీరిలో పురుషులు దాదాపు డెబ్బయ్ శాతం వుండేవారు.

గర్భస్రావం కోరుకున్న మహిళలకు ఉచితంగా చేసేవారు. పిల్లలు లేనివారికీ, ఒక్క బిడ్డే వున్నవారికీ గర్భస్రావం చేయాలంటే మాత్రం ఆ తర్వాత పిల్లలు పుట్టకపోయే అవకాశం వుందని చెప్పేవారు. తుది నిర్ణయం ఆ జంటదే వుండేది. గర్భస్రావాన్ని భర్త వ్యతిరేకించినా స్త్రీల నిర్ణయాన్నే పరిగణనలోకి తీసుకునేవారు.

పెద్ద కుటుంబం స్త్రీలు అడుగు బయట పెట్టడానికి ఆటంకంగా వుంటుందనడంలో సందేహం లేదు. అందువలన సోషలిస్ట్ ప్రభుత్వం చేసిన కుటుంబ నియంత్రణ ప్రచారం కుటుంబ స్వరూపంలో మార్పులు తీసుకువచ్చి మహిళా విముక్తికి దోహదం చేసింది.

ఈ విధంగా సోషలిస్ట్ చైనాలో కుటుంబం ఒక ఆర్థిక యూనిట్‌గా ఉనికిని కోల్పోతుండిన తీరూ, అదే సమయంలో కుటుంబంలో ప్రజాస్వామిక సంబంధాలు నెలకొంటూ ఉండిన తీరు మనకర్థమవుతుంది. కుటుంబపు ఉనికి బలహీన పడుతుండిందంటే దానర్థం సమాజంలో సమిష్టితత్వం పెరిగిందనే. కుటుంబం నిర్వహించే పాత్రను సమాజం సమిష్టిగా నిర్వహిస్తుండిందనే. ★

# పువ్వర్తి అమరులకు ఎర్రెర్రని జోహార్లు!

## అమరుల త్యాగాల వారసత్వాన్ని తుదకంటా కొనసాగిద్దాం!

దండకారణ్యంలోని దక్షిణ బస్తర్ డివిజన్, బీజాపూర్ జిల్లా పామేడ్ ఏరియా పువ్వర్తి (పువ్వార్) గ్రామ పరిధిలో ఏప్రిల్ 16న కేంద్ర బలగాలతో పాటు ఆంధ్రప్రదేశ్ గ్రేహౌండ్స్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎస్‌టీఎఫ్, సీఏఎఫ్ సాయుధ బలగాలు సి.పి.ఐ.(మావోయిస్టు) గెరిల్లాలపై ఒక భారీ దాడికి పాల్పడ్డాయి.

ఈ దాడిని తిప్పికొట్టే క్రమంలో, వీరోచిత ధైర్య సాహసాలతో హోరాహోరీగా పోరాడుతూ, ఉత్తర తెలంగాణ ప్రత్యేక జోన్‌లోని ఖమ్మం-కరీంనగర్-వరంగల్ (కె.కె.డబ్ల్యు.) డివిజన్‌కు చెందిన తొమ్మిది మంది కామ్రేడ్స్ వీర మరణం పొందారు. వీరిలో కె.కె.డబ్ల్యు. డివిజనల్ కమిటీ కార్యదర్శి, ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కామ్రేడ్ మర్రి రవి (సుధాకర్), కె.కె.డబ్ల్యు. డివిజనల్ కమిటీ సభ్యురాలు కామ్రేడ్ గుగులోతు లక్ష్మి (పుష్ప), ఏటూరు నాగారం-మహాదేవ్‌పూర్ ఏరియా కమిటీ కార్యదర్శి కామ్రేడ్ ఎట్టి నర్సక్క (సబిత), ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ ఆరెల్లి వెంకట్ (గౌతం, కిరణ్), ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ దుర్గం రాజు, ఏరియా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ బడే ఊర్మిళ, దళ సభ్యురాలు కామ్రేడ్ కురుసం సుమలత (వసంత), డీవీసీఎం గార్డు కామ్రేడ్ అజయ్, డీవీసీఎం గార్డు కామ్రేడ్ మద్ది సీత (నవత) వున్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం తమ నులివెచ్చని రక్తాన్ని ధారపోసిన ఈ అమరులందరికీ పేరు పేరునా వినమ్రంగా జోహార్లర్పిద్దాం. వాళ్ల ఆశయాలను తుదివరకూ కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.



కామ్రేడ్ పుష్ప, కామ్రేడ్ సుధాకర్

### ఉత్తర తెలంగాణ పోరు బావుటాను ఎత్తిపట్టిన యోధుడు కామ్రేడ్ సుధాకర్

కామ్రేడ్ సుధాకర్ (మర్రి రవి) దాదాపు 38 ఏళ్ల క్రితం వరంగల్ జిల్లా గణపురం మండలం, సీతారాంపూర్ గ్రామంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. అతని తల్లి ఐలమ్మ, తండ్రి ఐలయ్య. అతనికి ఒకే ఒక చెల్లెలు వుంది. చిన్న కుటుంబం కావడం, ఒక్కడే మగ పిల్లవాడు కావడంతో తల్లిదండ్రులు కొడుకును గారాబంగా పెంచుకున్నారు. ఉన్నత చదువులు చదివించాలని కలలు కన్నారు.

కామ్రేడ్ సుధాకర్ పదవ తరగతి వరకూ గణపురంలో, ఇంటర్మీడియట్ పరకాలలో పూర్తి చేశాడు. తనకున్న అపారమైన జ్ఞాపకశక్తి వల్ల ఎప్పుడూ ఫస్ట్ క్లాసులో పాసయ్యేవాడు.

**మితవాద, అవకాశవాదాలను తిరస్కరించిన కామ్రేడ్ సుధాకర్**

సీతారాంపూర్ సీపీఐ(ఎం-ఎల్) (ప్రతిఘటన) ప్రాబల్యమున్న గ్రామం. చిన్నప్పటి నుండి రాజకీయాల పట్ల జిజ్ఞాస, ప్రజల పట్ల ప్రేమ వుండడం వల్ల సహజంగానే కామ్రేడ్ సుధాకర్ ప్రతిఘటన పార్టీకి అనుబంధంగా వున్న పీడీఎస్‌యూలో చేరాడు. 1992 నుండి ఇందులో చురుకైన పాత్ర వహించాడు. విద్యార్థి సంఘం కార్యకలాపాల్లో పాల్గొంటూనే, ప్రతిఘటన పార్టీ ఇచ్చిన రాజకీయ, ఎన్నికల ప్రచార క్యాంపెయిన్‌లో చురుకుగా పాల్గొనేవాడు. ఈ క్రమంలో రెండుసార్లు అరెస్టయి వెంటనే విడుదలయ్యాడు.

1995లో ఆ పార్టీ పిలుపు మేరకు దళంలో చేరి, సెల్ సభ్యుడిగా వుంటూ, 1997 వరకూ పనిచేశాడు. ఈ రెండు సంవత్సరాలు పార్టీ కార్యక్రమాలన్నింటిలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. ఇదే సమయంలో ప్రతిఘటన గ్రూపు మితవాద అవకాశవాద లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించడం మొదలుపెట్టాడు. సాయుధ పోరాటానికి సిద్ధంగా లేని ప్రతిఘటన పార్టీ, దేశంలో విప్లవానికి పరిస్థితి పరిపక్వం కాలేదని, ఇలాంటి పరిస్థితులలోనే రష్యా కమ్యూనిస్టు పార్టీ లెనిన్ నాయకత్వంలో ఎన్నికలలో పాల్గొందని, మన దేశంలో కూడా ఎన్నికలలో పాల్గొంటూ ప్రజలను చైతన్యం చేయాలని, ఆ తర్వాత సాయుధ పోరాటం చేయాలని, దివాళాకోరు సిద్ధాంతాలను వల్లిస్తూ, ఎన్నికలలో పాల్గొంటూ వచ్చింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ పదవులకు పోటీ చేయడం, గెలుపు కోసం బూర్జువా పార్టీలతో పొత్తులు పెట్టుకోవడం, ప్రత్యర్థులను కొట్టడం, కిడ్నాప్‌లు చేయడం ప్రతిఘటన పార్టీ దళాల కార్యక్రమంగా వుండేది. బూర్జువా పార్టీలకు

ఏ మాత్రం తీసిపోని ప్రతిఘటన పార్టీ కార్యకలాపాలను కామ్రేడ్ సుధాకర్ అసహ్యించుకున్నాడు. అంతేకాదు, ఆ పార్టీకి చెందిన లీగల్ నాయకులు ఆస్తులు, భూములు సంపాదించుకుంటూ, భూస్వాములుగా అవతారమెత్తడం చూసి నిలదీశాడు.

అదే సమయంలో పక్కనే సీపీఐ(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) నిరంతరం రివిజనిస్టు, మితవాద, అవకాశవాద పార్టీల దివాళాకోరు రాజకీయాలను ఎండగడుతూనే, ప్రజలను సాయుధం చేస్తుండడాన్ని, పురోగమిస్తుండడాన్ని చూశాడు. సీపీఐ(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)లో చేరాలని నిర్ణయించుకున్నాడు. ప్రతిఘటన పార్టీ పంథాను విభేదిస్తూ, ఆ పార్టీ నాయకత్వం ముందు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పి 1997లో కొద్దిమందితో కలిసి సీపీఐ(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్)లో చేరాడు. తనతో వచ్చిన వారిలో కొద్దిమంది సీపీఐ(ఎం-ఎల్) (పీపుల్స్‌వార్) క్రమశిక్షణ, పని విధానం కఠినంగా వున్నాయని భావించి వెళ్లిపోగా, విప్లవోద్యమంలోని ఆటుపోట్లను, నిర్బంధాలను ఎదుర్కొంటూ మంచి క్రమశిక్షణతో చివరి వరకూ నిలబడి అమరత్వం చెందిన వారిలో కామ్రేడ్ సాగర్, కామ్రేడ్ అంజన్న (మహేందర్)లతో పాటు కామ్రేడ్ సుధాకర్ కూడా వున్నాడు.

### ప్రజా యుద్ధ బావుటాను ఎత్తి పట్టిన నాయకుడు

కామ్రేడ్ సుధాకర్ తీవ్రమైన శత్రు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, విప్లవోద్యమంలో పదహారేళ్ల పాటు పని చేసి, అంచెలంచెలుగా ఎదిగి, అనేక బాధ్యతలు నిర్వహించాడు.

1997 నుండి 1999 వరకు గుండాల దళ సభ్యుడిగా పనిచేశాడు. 1999లో ఏరియా కమిటీ సభ్యుడిగా కోఆప్ట్ అయ్యి, గుండాల ఎల్‌ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషనల్ స్క్వాడ్)కు డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 2001లో గుండాల ఎల్‌ఓఎస్ దళ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి, 2004 వరకూ కొనసాగాడు. 2004లో ఏరియా కమిటీ కార్యదర్శిగానూ, 2005 జనవరిలో ఖమ్మం-వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టాడు. 2006 మార్చిలో ఏర్పడిన కె.కె.డబ్ల్యూ. డివిజనల్ కమిటీలో సభ్యుడై, 2010 ఫిబ్రవరిలో ఆ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. 2011 ఆగస్టులో జరిగిన ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ (ఎన్‌టీఎస్‌జడ్‌సీ) ప్లీనంలో ఎస్‌జడ్‌సీఎంగా ఎన్నికయ్యాడు.

2001లో కామ్రేడ్ సుధాకర్ వివాహం పుష్పతో జరిగింది. కామ్రేడ్ పుష్ప కూడా ఇదే ఎన్‌కౌంటర్లో అమరురాలయింది. వీరిద్దరి జంట అన్యోన్యంగా వుండేది. 2004లో వీరికి కొడుకు పుట్టాడు. బాబును సుధాకర్ తల్లిదండ్రులు పెంచుకుంటున్నారు.

కామ్రేడ్ సుధాకర్ తన విప్లవ జీవితంలో ఎక్కువ కాలం కొత్తగూడెం, ఇల్లెందు, గుండాల, బయ్యారం, నర్సంపేట ప్రాంతంలో పనిచేశాడు. ఈ ప్రాంతంలోని ప్రజలకు పిల్లల నుండి పెద్దల వరకూ అందరికీ సుపరిచితుడు. ఈ ప్రాంత ప్రజలపై, గ్రామాలపై, భౌగోళిక స్థితిగతులపై మంచి పట్టు వుండేది.

ఈ ప్రాంతంలో ప్రజలు నువ్వులు, జొన్నలు, పప్పు దినుసులు వంటి పంటలు ఎక్కువగా పండిస్తారు. ఈ పంటలకు, వడ్డీ వ్యాపారులు విపరీతమైన వడ్డీలతో అప్పులు ఇచ్చి తక్కువ రేటుకు దిగుబడులు కొనుగోలు చేసేవారు. ఇలా అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న వడ్డీ వ్యాపారులను జనంలో నిలదీసి, వడ్డీలను నియంత్రించడంలో కామ్రేడ్ సుధాకర్ చురుకైన పాత్ర వహించాడు. అంతేకాదు రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లభించేలా పోరాటాలకు నాయకత్వం వహించాడు. ఈ గిట్టుబాటు ధరల పోరాటం ఆనవాయితీగా ప్రతి సంవత్సరం జరిగేది.

ఆదివాసులకు జల్, జంగల్, జమీన్‌పై అధికారం కోసం ఆదివాసీ గూడేలన్నింటినీ ఒక్కటి చేసి కదిలించాడు. 5వ, 6వ షెడ్యూల్ అమలుకు, 1/70 చట్టం అమలుకు, ఆదివాసీ స్వయం ప్రతిపత్తి కోసం ఆదివాసులను కదిలించాడు. లంబాడీల సమస్యలను చేపట్టి పోరాటాలను నిర్మించాడు. ఈ ప్రాంతంలో ఐటీడీఏ అవినీతికి వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు చేపట్టాడు. ఆదివాసుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం కోసం ఆదివాసీ సంఘాలను కదిలించి అనేక సభలు, సమావేశాలు, సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం వెనుక ఆయన కృషి వుంది.

కామ్రేడ్ సుధాకర్ ఆధ్వర్యంలో పలు నిర్వాసిత వ్యతిరేక పోరాటాలు జరిగాయి. బయ్యారం గనులకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాడు. ఈ విషయంలో నష్టపరిహారాన్ని డిమాండ్ చేస్తున్న న్యూ డెమొక్రసీ పాలసీని ఎండగట్టాడు. వరంగల్ జిల్లాలోని రంగరాయ చెరువు కారణంగా 15 గ్రామాల ప్రజలు నిర్వాసిత సమస్యను ఎదుర్కొంటాయి. దీనికి వ్యతిరేకంగా పెద్ద పోరాటాన్ని నిర్మించడంలో కామ్రేడ్ సుధాకర్ చురుకైన పాత్ర వహించాడు. కొత్తగూడెం మండలంలో కోయగూడ ఓపెన్‌కాస్ట్ గనులకు వ్యతిరేకంగా ప్రజలను ఉద్యమింపజేశాడు. గనుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూడా ప్రజలను పోరాటాల్లోకి కదిలించాడు. పెద్ద ఎత్తున ప్రజలను నిర్వాసితులను చేసే పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పలు పోరాట కార్యక్రమాలు తీసుకున్నాడు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల మీద కదిలించడానికి కృషి కొనసాగించాడు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల మీద కదిలించడానికి నిరంతరం ప్రయత్నించాడు.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్లు న్యాయమైనవనే పార్టీ వైఖరిని ముందుకు తీసుకొని పోవడంలో తన వంతు కృషి చేశాడు.

శత్రు తీవ్ర నిర్బంధం మధ్యనే ప్రజా సంఘాలను నిర్మిస్తూ, వాటిలో పార్టీ నిర్మాణాలను చేస్తూ, వాటికి నిర్దిష్ట కార్యక్రమాన్ని ఇచ్చేవాడు. అవి సరైన దిశలో నడిచే విధంగా నేతృత్వం వహించేవాడు. ఆ నిర్మాణాల నుండి పూర్తి కాలపు కార్యకర్తలను, వృత్తి విప్లవకారులను తయారు చేసుకోవడానికి కృషి చేసేవాడు. శత్రు నిర్బంధంలో, ప్రజా సంఘాల నిర్మాణం సాధ్యం కానిచోట

రహస్య సంఘాలను, కవర్ సంఘాలను ఏర్పాటు చేసి శత్రు నిర్బంధం మధ్య కార్యకలాపాలు కొనసాగించేవాడు. దైనందిన సమస్యలపై ప్రజలను నిరంతరం ఆందోళన బాట పట్టించేవాడు.

పలు పోరాటాలు, నిర్మాణాల ద్వారా ఈ ప్రాంతంలో బలమైన ప్రజా పునాదిని నిర్మించి వరంగల్ జిల్లా ఉద్యమానికి దీన్నొక ఆధారపడే ప్రాంతంగా అభివృద్ధి చేశాడు. ఫలితంగా 2002 నుండి 2005 వరకూ, తీవ్ర శత్రు నిర్బంధం మధ్య సైతం ఈ ప్రాంతంలో పలు జిల్లా వ్యాప్త రాజకీయ తరగతులు, మిలిటరీ క్యాంపులు జరిగాయి. జిల్లాలోనూ, జోన్‌లోనూ జరిగిన మిలిటరీ చర్యలకు అవసరమైన వస్తు సామాగ్రిని సమకూర్చడంలో కూడా ఈ ప్రాంతం ముఖ్యమైన పాత్ర పోషించింది.

డివిజనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మూడు జిల్లాల ఉద్యమంపై పట్టు సాధించాడు. తీవ్ర నిర్బంధం మధ్యనే, దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడానికి డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న కృషికి నాయకత్వం వహించాడు. నూతనంగా పలు రంగాల్లో నిర్మాణాలు చేయడానికి కృషి చేశాడు. నిత్య నిర్బంధం మధ్యనే ప్రజలను కదిలించడానికి కృషి చేశాడు. ఇటీవలి కాలంలో కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలం పంకెన గ్రామంలోనూ, వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం దీక్షకుంటలోనూ భూ పోరాటాలను నిర్వహించి ప్రజలకు భూములు పంచడంలో డివిజనల్ కమిటీ నేతృత్వం వహించింది.

కామ్రేడ్ సుధాకర్ డివిజన్ కార్యదర్శి అయిన తర్వాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఊపందుకున్నది. అదొక న్యాయబద్ధమైన, ప్రజాస్వామికమైన డిమాండని గుర్తిస్తూనే, ప్రత్యేక తెలంగాణ కాదని, ప్రత్యేక ప్రజాస్వామిక తెలంగాణ సాధన కొరకు పోరాడాలనే పార్టీ పిలుపును ముందుకు తీసుకుపోవడంలో, కామ్రేడ్ సుధాకర్ చురుకైన పాత్ర వహించాడు. డివిజన్‌వ్యాప్తంగా వివిధ సంఘాలను తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర వహించేలా నాయకత్వం అందించాడు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్యమంలో మిలిటెంట్‌గా నడిపించడానికి కృషిసల్పాడు. ఈ ఉద్యమంలో భాగంగా జరిపిన ర్యాలీ, సభలు, సదస్సులు, బంద్ కార్యక్రమాలు డివిజన్‌లో విజయవంతం అయ్యేవిధంగా కృషి చేశాడు.

విప్లవోద్యమ సమూల నిర్మూలనకు, దోపిడీ పాలకవర్గాలు తలపెట్టిన, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించడంలో భాగంగా, వివిధ మిలిటరీ చర్యల్లో చురుకైన పాత్ర వహిస్తూనే, దీన్ని రాజకీయంగా ఎండగట్టడానికి, డివిజన్‌లో ప్రజా ఉద్యమాలను నిర్వహించడానికి, కామ్రేడ్ సుధాకర్ చురుకైన పాత్ర వహించాడు. ఈ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా పార్టీ ఇచ్చిన పిలుపులను డివిజన్‌లో విజయవంతం చేయడానికి కృషిచేశాడు. అదే విధంగా, శత్రువు అమలుచేస్తున్న బహుముఖ దాడిని అర్థం చేసుకొని, పార్టీ శ్రేణులకు అర్థం చేయించి, నిప్పులు చెరిగే నిర్బంధంలో వారిని దృఢంగా నిలబెట్టాడు. బహుముఖ దాడిలో భాగంగా, శత్రువు అమలు చేస్తున్న సంస్కరణల మోసపూరిత స్వభావాన్ని ప్రజలకు అర్థం చేయించి, వారిలో విప్లవోద్యమం పట్ల విశ్వాసాన్ని పెంచడానికి నిరంతరం కృషి చేస్తూ వచ్చాడు.

జిల్లా కమిటీలోనూ, ఏరియా కమిటీలోనూ సమస్యలను చర్చించడంలో, పరిష్కరించడంలో, కమిటీల్లో ఐక్యత సాధించడంలో మంచి కృషి చేసేవాడు. కమిటీ సభ్యుల రాజకీయ ఎదుగుదలకు డివిజన్‌లో క్రమం తప్పకుండా సమిష్టి అధ్యయనం చేపట్టేవారు. ఈ సమిష్టి అధ్యయనం ద్వారా, మార్క్సిస్టు ప్రాథమిక సూత్రాలను, పార్టీ డాక్యుమెంట్లను లోతుగా అర్థం చేసుకోవడానికి కృషి చేసేవారు. ఈ సమిష్టి అధ్యయనాలకు కామ్రేడ్ సుధాకర్ నాయకత్వం వహించేవాడు. ఏ విషయాన్నయినా సులువుగా అర్థమయ్యేలా, అనేక ఉదాహరణలతో వివరించేవాడు.

మహిళా కామ్రేడ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి, ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, సమస్యలు చర్చించి, వాటిని పరిష్కరించడంలో శ్రద్ధ వహించేవాడు. ఈ ప్రక్రియ మహిళా కామ్రేడ్స్ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడేది.

2007 ఆగస్టులో జరిగిన జోన్ మహాసభలోనూ, 2011 ఆగస్టులో జరిగిన ప్లీనంలోనూ కామ్రేడ్ సుధాకర్ చురుకైన పాత్ర వహించాడు. ఆటు స్థితిలో వున్న ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి చేయవలిసిన కృషి గురించి విస్తృతంగా చర్చించాడు. ఇదే ప్లీనంలో తను ఎస్‌జడ్‌సీలోకి ఎన్నికయ్యాడు. ఎస్‌జడ్‌సీలోకి ఎన్నికైన తర్వాత మొత్తం జోన్ ఉద్యమాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి కృషి చేశాడు. రాష్ట్రవ్యాప్త ప్రజాసంఘాలను నడపడంలో కామ్రేడ్ సుధాకర్ కృషి ప్రారంభమైంది.

కామ్రేడ్ సుధాకర్‌కు విషయాల పట్ల మంచి స్పష్టత వుండేది. రాజకీయ చర్చలు, వాదోపవాదాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఈ వాదోపవాదాల్లో ఎన్‌డీ పార్టీ రివిజనిజాన్నీ, పోస్ట్ మాడర్నిజాన్ని ఎండగట్టేవాడు.

ఆటు స్థితిలో వున్న ఉద్యమాన్ని పునరుద్ధరించడానికి ఎన్‌టీఎస్‌జడ్‌సీ చేసిన కృషిలో కామ్రేడ్ సుధాకర్ క్రియాశీలక భాగస్వామయ్యాడు. దెబ్బతిన్న ప్రజా పునాదిని పెంచడానికి దృఢ సంకల్పంతో పాటుపడ్డాడు. ప్రజలను సంఘటితం చేయడానికి వివిధ పోరాటాలను చేపట్టాడు. పూర్తి కాలం కార్యకర్తలను తయారు చేసుకోవడానికి ప్రత్యేకంగా కృషి చేశాడు. ఈ కృషి మూలంగా మొత్తంగా ఎన్‌టీ ఉద్యమ పునరుద్ధరణలో కె.కె.డబ్ల్యు.డివిజన్ పాత్ర కీలకంగా నిలుస్తున్నది.

### రివిజనిజాన్ని అడుగడుగునా అడ్డుకున్న కమ్యూనిస్టు

కామ్రేడ్ సుధాకర్ చేసిన రాజకీయ కృషిలో సీపీఐ(ఎం-ఎల్) (న్యూడెమోక్రసీ)తో చేసిన పోరాటం ముఖ్యమైనది. ఇది మితవాద అవకాశవాద ఎం-ఎల్ పార్టీలకు ముఖ్యంగా రివిజనిస్టు న్యూ డెమొక్రసీ (ఎన్‌డీ) పార్టీకి బలమైన పట్టు వున్న ప్రాంతం. వాళ్ళ

చెప్పిందే నీతి, వాళ్లు చెప్పిందే న్యాయం అన్నట్టు, ప్రజలపై ఎన్‌డీ పార్టీ దళాలు, సంఘాల నాయకులు నియంతృత్వం చెలాయించేవారు. ఎన్‌డీ పార్టీ నాయకులు కొందరు భూస్వాములుగా అవతారమెత్తారు. ఆ భూస్వాములకు, బూర్జువా పార్టీలకు తొత్తులుగా ఆ పార్టీ నాయకులు, దళ నాయకులు వ్యవహరిస్తారు. ప్రజలను ఆర్థిక పోరాటాలకు పరిమితం చేస్తూ, వారి పోరాట శక్తిని చంపేస్తూ, వారిని వర్గ పోరాటం నుండి, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకునే కర్తవ్యం నుండి పక్కదారి పట్టిస్తారు. పార్లమెంటరీ వ్యవస్థపై భ్రమలు కల్పిస్తున్నారు. మావోయిస్టులను గ్రామాల్లోకి రానివ్వవద్దని, వస్తే అన్నం పెట్టొద్దని, తుపాకులు గుంజుకోవాలని, వాళ్లొస్తే పోలీసు నిర్బంధం పెరుగుతుందని ప్రజలకు నూరిపోస్తారు.

ఇట్లా ఒకవైపు మితవాద రాజకీయాలతో ప్రజల చైతన్యాన్ని మొద్దుబారుస్తూ, మరోవైపు సీపీఐ(మావోయిస్టు)కు సహకరిస్తున్న ప్రజలను కొట్టడం, బెదిరించడం, గ్రామాల నుండి బహిష్కరించడం వంటి అప్రజాస్వామిక విధానాలకు పాల్పడ్డారు. చివరికి, మావోయిస్టు దళాల కోసం జమ చేసిన అన్నంలో మట్టి కల్పిన సందర్భాలు కూడా వున్నాయి. అంతేకాక సీపీఐ(మావోయిస్టు) దళాలపై, రాజకీయంగానే కాక భౌతికంగా కూడా దాడులకు పాల్పడుతూ, నిరంకుశ విధానాలకు పాల్పడ్డారు.

ఇటువంటి పరిస్థితిలో, ఇక్కడ ప్రజలను గెలుచుకొని విప్లవోద్యమాన్ని నిర్మించాలంటే, ముందుగా వారిని, మితవాద రాజకీయాల ప్రభావం నుండి బయటపడేయాల్సి వుంటుంది. ఈ ప్రాంతంలో దోపిడీ వర్గాలతో కంటే, ఎన్‌డీ పార్టీతోని వైరుధ్యమే ప్రధానంగా ముందుకొచ్చిన పరిస్థితి. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి, కామ్రేడ్ సుధాకర్ ఎన్‌డీ పార్టీ వైఖరిని రాజకీయంగా ఎండగడుతూనే, ఆ పార్టీ పాల్పడిన భౌతిక దాడులను, భౌతిక చర్యల ద్వారా తిప్పికొట్టాడు. ప్రజలను సరైన రాజకీయాలతో చైతన్య పరిచి, వారిని భౌతిక శక్తిగా మార్చి, ఎన్‌డీ పార్టీ పాల్పడిన భౌతిక దాడులను ప్రజల చేతనే తిప్పికొట్టించాడు. 2012 నవంబర్‌లో ఎన్‌డీ పార్టీ దివాళాకోరుతనాన్ని ఎండగడుతూ ఒక కరపత్రం తీసుకువచ్చాడు.

మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు ప్రాపంచిక దృక్పథంపై దృఢమైన స్పష్టతతో కామ్రేడ్ సుధాకర్ మితవాద, అవకాశవాద రాజకీయాలను ఎదుర్కొని, ఓడించాడు. తనకున్న వాక్ చాతుర్యంతో బహిరంగ సభలలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో, ఆకట్టుకునే ఉదాహరణలతో ఎన్‌డీ పార్టీ కుటిల నీతిని కుండబద్దలు కొట్టినట్లు చెప్పేవాడు.

సీపీఐ (మావోయిస్టు)కు సహకరిస్తున్నారనే నెపంతో, ఎన్‌డీ దళాలు ప్రజలపై విచక్షణారహితంగా దాడులు చేస్తుంటే, ఆ వేధింపులను భరించలేక వలసపోతున్న ప్రజలకు ధైర్యాన్నిచ్చి తిరుగుబాటు నేర్పాడు. కామ్రేడ్ సుధాకర్ కల్పించిన చైతన్యంతో, ప్రజలే స్వయంగా బీరోనిమడవ గ్రామం వద్ద, ఎన్‌డీ దళం తుపాకులు లాక్కొని సీపీఐ(మావోయిస్టు) దళాలకు అందించారు.

కామ్రేడ్ సుధాకర్ నాయకత్వంలో సరైన రాజకీయాలతో చైతన్యవంతమైన ప్రజలు అనేక సార్లు ఎన్‌డీ పార్టీ దళాలను ప్రశ్నించారు. గ్రామాల నుండి తరిమికొట్టారు. ఇలా ఎన్‌డీ పార్టీని రాజకీయంగా, సైద్ధాంతికంగా ఎదుర్కొంటూ, ప్రజలను చైతన్యపరుస్తూ ఎన్‌డీ పార్టీ, తమకు కోటలని భ్రమిస్తున్న గ్రామాలలోనే, కామ్రేడ్ సుధాకర్ మావోయిస్టు పార్టీ సెల్స్‌ను నిర్మాణం చేశాడు.

ఇలా ఎన్‌డీ పార్టీతో పోరాటం చేస్తూనే, ఆర్థిక సమస్యలపై అన్ని ఎం-ఎల్ పార్టీలతో కలిసి పనిచేసిన అనుభవం కూడా కామ్రేడ్ సుధాకర్‌కు వుంది.

### యుద్ధరంగంలో సాహసి

కామ్రేడ్ సుధాకర్ మిలిటరీ ఎత్తుగడలు వేయడంలో కూడా దిట్టనే చెప్పాలి. మొదటి నుండి తీవ్ర నిర్బంధంలో, మరీ ముఖ్యంగా చర్చల కాలం తర్వాత మునుపెన్నడూ ఎరగని నిర్బంధంలో, ఎక్కడా దళాలు కాలూనలేని పరిస్థితి నెలకొన్నది. అటువంటి పరిస్థితిలో డివిజన్ ఉద్యమాన్ని, దళాలను తక్కువ నష్టాలతో నడపడమే మిలిటరీపరంగా తను సాధించిన విజయమని చెప్పుకోవచ్చు. పదహారేళ్ల తన గెరిల్లా జీవితంలో, కామ్రేడ్ సుధాకర్ ఎన్నో ఎన్‌కౌంటర్లను తిప్పికొట్టడంలో, చుట్టివేత దాడులను ఛేదించడంలో తన బలగాలకు నాయకత్వం వహించాడు. కాశనపల్లి ఎన్‌కౌంటర్ మొదలుకొని, పెద్దతోగు, అల్లిగూడెం తండా, పాండవులగుట్ట చుట్టివేత, వాటివాగు, దుద్దేడ, సింగం చుట్టివేత దాడులన్నింటినీ తిప్పికొడుతూ వచ్చాడు. పువ్వార్‌లో తాను ఎదుర్కొన్న చిట్టచివరి చుట్టివేత దాడిని కూడా, తీవ్ర అనారోగ్యంతో వుండి కూడా, కామ్రేడ్ సుధాకర్ వీరోచితంగా పోరాడాడు. ఇక తాను ఆ చక్ర వ్యూహం నుండి తప్పుకోవడం సాధ్యం కాదని అర్థమయిన తర్వాత, సహచరులను వెళ్లి పొమ్మని చెప్పి నిబ్బరంగా అమరత్వాన్ని వరించాడు.

ఎన్‌కౌంటర్లను ఎదుర్కోవడమే కాక, తను పలు మిలిటరీ ఘటనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. యాక్షన్ టీంలో సభ్యుడిగా వుండి మహబూబాబాద్‌లో కుమార స్వామి అనే ఎస్ఐని ఖతం చేయడంలో కామ్రేడ్ సుధాకర్ పాల్గొన్నాడు. నర్సాపూర్ గ్రామం వద్ద, గెరిల్లా బలగాలు పెట్టిన డైరెక్షనల్ మైన్‌ను, పోలీసులు స్వాధీనం చేసుకొని పోతుంటే, వాహనానికి అడ్డం తిరిగి, కాల్పులు జరుపుతూ పోలీసులను పారదోలి, తిరిగి ఆ మైన్‌ను స్వాధీనం చేసుకున్న సాహసోపేత చర్యలో, కామ్రేడ్ సుధాకర్ పాత్ర ముఖ్యమైనది. బొల్లపల్లి ఆంబుష్‌లో పాల్గొన్నాడు. చెంబునిగూడెం ఆంబుష్, చెట్టుపల్లి దగ్గర పాలగండి ఆంబుష్‌లకు పథక రచన చేయడంలో, వాటిని విజయవంతం చేయడంలో తాను ముఖ్య భూమిక పోషించాడు. 2006లో తీవ్ర నిర్బంధ కాలంలో, ఈ ఆంబుష్‌లు జరగడంతో శత్రువు ఖంగుతిన్నాడు. దీనితో తాత్కాలికంగా శత్రువు

కూంబింగ్ ఆపుకున్నాడు. 2007లో డీకే, ఎన్‌టీ సరిహద్దులో గ్రేహౌండ్స్ దాడులు, సల్వాజుడుం దాడులు జరుగుతున్న సమయంలో సీఆర్‌బీ నిర్ణయం మేరకు ఎన్‌టీ బలగాలు, డీకే బలగాలతో కలిసి డీకే భూభాగంలో ఎత్తుగడల ఎదురుదాడులు (టీసీఓసీ)ని చేపట్టాయి. ఇందులో భాగంగా గొడ్డలి, ఆరణ్‌పూర్ ఘాటిలో ఆంబుష్‌లు నిర్వహించి పోలీసు బలగాలను చంపడం, గాయపర్చడం జరిగింది. ఈ టీసీఓసీని సఫలం చేయడానికి కామ్రేడ్ సుధాకర్ తన వంతు కృషి చేశాడు. ఎన్‌టీ, డీకే సరిహద్దులో 2009, 2010, 2011, 2012లలో నిర్వహించిన అన్ని టీసీఓసీలలో పాల్గొన్నాడు. ఇందులో భాగంగా సరిహద్దులో వున్న ఎన్‌టీ గ్రామాల్లో శత్రు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడంలో చురుకైన పాత్ర వహించాడు. కొంతమంది కాంగ్రెస్ నాయకులను ఖతం చేయడానికి పథకాలు రూపొందించాడు. అదే విధంగా కార్మికులను తీవ్రంగా అణచివేస్తున్న కమలాపురం రేయాన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌ను ఖతం చేయడానికి తగిన పథకాన్ని రూపొందించి విజయవంతం చేయడంలో ముఖ్యపాత్ర వహించాడు. గోదావరి నదిని దాటనిచ్చేది లేదని శత్రువు చేసిన సవాల్‌ను నిర్వీర్యం చేస్తూ, శత్రు బలగాల మధ్య నుండే నదిని దాటిపోయి, ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ప్రజలను కూడగడుతూ శత్రువు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేస్తూ, శత్రువుపై దాడులు చేసిన ధీరోదాత్త, కామ్రేడ్ సుధాకర్. ఆ విధంగా శత్రువు పథకాలను వమ్ముచేస్తూ వాడిని కలవరపర్చాడు.

### స్నేహశీలి, కళాకారుడు, రచయిత

కామ్రేడ్ సుధాకర్ ఎల్లప్పుడూ చిరునవ్వుతో అందరితోనూ కలివిడిగా వుండేవాడు. అన్ని స్థాయిల పార్టీ శ్రేణులతో సన్నిహితంగా వుండేవాడు. అతను మంచి కళాకారుడు, గాయకుడు. అవకాశం దొరికినప్పుడల్లా తన పాట, ఆట, నటనతో ప్రజలను, పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేవాడు. ఎన్‌డీ పార్టీతో పోరాడిన అనుభవాలను నాటికలుగా మలిచి వివిధ సందర్భాల్లో గెరిల్లాల క్యాంపుల్లో ప్రదర్శించేవారు. వాటిలో కామ్రేడ్ సుధాకర్ ఒక ఎన్‌డీ నాయకుడి పాత్రలో చాలా సహజంగా నటించేవాడు. ఈ నాటికలు మితవాద, అవకాశవాద రాజకీయాలను ప్రేక్షకులకు కళ్లకు కట్టినట్టుగా అర్థం చేయించేవి. బడే నాగేశ్వరరావు, చైతన్య పేర్లతో కవితలు రాసేవాడు.

ఇలా ఎన్నో సమర్థతలు, ఎంతో భవిష్యత్తు వున్న ఒక ఔత్సాహిక యువనేతను, ఎన్‌టీ వుద్యమం కోల్పోయింది. ఈ నష్టం వెంటనే పూడ్చుకోగలిగినది కాదు. కామ్రేడ్ సుధాకర్‌లోని చురుకుదనాన్నీ, పట్టుదలనూ, రాజకీయ స్పష్టతనూ, నిర్మాణ దక్షతనూ, సాహసాన్నీ పుణికిపుచ్చుకోవడం ద్వారానే కామ్రేడ్ సుధాకర్ లేని లోటును పూడ్చుకోగలం. కామ్రేడ్ సుధాకర్ తదితర ఎందరో అమరుల ఆశయాలను నెరవేర్చగలం. ఇదే కామ్రేడ్ సుధాకర్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి.

**కామ్రేడ్ సుధాకర్ అమర్ రహే!**

## ఉత్తర తెలంగాణ గడ్డపై ఎగిసిన పోరు కెరటం కామ్రేడ్ పుష్ప



కొడుకుతో కామ్రేడ్ పుష్ప

కామ్రేడ్ పుష్ప (గుగులోతు లక్ష్మి)కి అమరత్వం చెందేనాటికి దాదాపు 32 ఏళ్ల వయసు వుంటుంది. వరంగల్ జిల్లా, భూపాలపల్లి మండలం, రాంపూర్ గ్రామంలో నిరుపేద లంబాడ కుటుంబంలో పుట్టింది. ఆమె తల్లి శారద, తండ్రి నమ్మయ్య. కామ్రేడ్ పుష్పకు తోడపుట్టిన చెల్లెలు రెండేళ్ల క్రితం చనిపోగా, ప్రస్తుతం ఒక తమ్ముడు వున్నాడు.

భూమి లేక పోవడంతో కామ్రేడ్ పుష్ప కుటుంబం పొట్ట చేతపట్టుకొని ఇతర గ్రామాలకు వలస వెళ్లి కూలీ పనులు చేసి బతికేవారు. దానితో వారి బతుకు భారంగా గడిచేది. ఒక పూట తిండి దొరకడమే కష్టంగా వుండడం, వలసలు వెళ్లడం వల్ల ఎక్కడా స్థిరత్వం లేని జీవితం కావడంతో, కామ్రేడ్ పుష్ప చిన్నతనం నుండి ఎన్నో కష్టాలు పడింది. విప్లవోద్యమానికి బలమైన ప్రాంతంలో వీళ్ల గ్రామం వుండడంతో కామ్రేడ్ పుష్పకు చిన్నతనం నుండి పార్టీతో పరిచయం వుంది. పార్టీ అందించిన చైతన్యంతో తమ దీనస్థితికి కారణం ఈ దోపిడీ సమాజమని త్వరలోనే గ్రహించింది.

దళం చెప్పే మాటలు, పాటలకు ఆకర్షితురాలైన కామ్రేడ్ పుష్ప, 1998లో దళంలో చేరింది. కొన్ని నెలల కాలం మహదేవ్‌పూర్ దళ సభ్యురాలిగా పనిచేసి, 1998లోనే ఏటూరు నాగారం దళానికి బదిలీ అయ్యి, 2000 సంవత్సరం వరకూ ఆ దళ సభ్యురాలిగా కొనసాగింది. 2001లో కొత్తగూడెం దళానికి డిప్యూటీ కమాండర్‌గా బదిలీ అయ్యింది. 2002లో ఏరియా కమిటీ సభ్యురాలయింది. 2008లో కొత్తగూడెం-నర్సంపేట ఏరియా కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టింది. 2010లో కె.కె.డబ్ల్యు. కమిటీలో సభ్యురాలయింది.

2001లో పుష్ప కామ్రేడ్ సుధాకర్‌ను పెళ్లి చేసుకుంది. ఇదే ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సుధాకర్ కూడా అమరుడయ్యాడు.

2004లో ఈ జంటకు ఒక కొడుకు పుట్టాడు. బాబు ప్రస్తుతం కామ్రేడ్ సుధాకర్ తల్లిదండ్రుల వద్ద పెరుగుతున్నాడు.

కామ్రేడ్ పుష్ప పేదరికం వలన ఇంటి దగ్గర చదువుకోలేక పోయినా పార్టీలో చేరిన తర్వాత పట్టుదలతో చదువు నేర్చుకొని, రాజకీయ జ్ఞానాన్ని పెంపొందించుకుంది. ఆ రాజకీయాలను తన ఆచరణకు జోడించి దాదాపు తన పదిహేనేండ్ల విప్లవ జీవితంలో ఎన్నో పోరాటాల్లో పాల్గొన్నది, స్వయంగా నాయకత్వం వహించింది.

కొత్తగూడెం-నర్సంపేట ఏరియాలో వడ్డీ వ్యాపారుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించింది. జొన్నలు, నువ్వులు, పప్పు దినుసులకు గిట్టుబాటు ధరలు పెరిగే విధంగా ప్రజలను ప్రతి సంవత్సరం పోరాటాల్లోకి కదిలించింది.

మద్యం వల్ల ప్రజలు విపరీతంగా దోపిడీకి గురికావడమే కాక, మద్యం ప్రజల ఒళ్లు గుల్ల చేస్తుందనీ, మహిళలపై హింసను మరింత పెంచుతుందనీ, ప్రజలను విప్లవోద్యమం నుండి పక్కదారి పట్టిస్తుందని, ప్రజలకు వివరంగా అర్థం చేయించి, మద్య నిషేధ పోరాటాలను నడిపించింది. ఈ పోరాటాలలో మహిళలను విస్తృతంగా కదిలించింది.

జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఆదివాసులదే అంటూ ఆదివాసులను సంఘటితం చేసింది. 5వ, 6వ షెడ్యూల్ అమలుకు, 1/70 చట్టం అమలుకు పోరాటాలను నడిపింది.

ఆటులో వున్న ఉద్యమాన్ని పురోగమింప జేయుడానికి జరుగుతున్న కృషిలో కామ్రేడ్ పుష్ప భాగస్వామ్యం కూడా ముఖ్యమైనదే. నిప్పులు చెరిగే నిర్బంధం మధ్యనే గట్టి పూనికతో ప్రజలను సంఘటితం చేసింది. పోరాటాల్లోకి కదిలించింది.

ఉద్యమాన్ని సమీక్షించుకొని, మరింత ముందుకు తీసుకొని పోవడం కోసం జరిగిన ప్లీనాల్లో, కామ్రేడ్ పుష్ప చురుకైన పాత్ర వహించింది. 2011 జూన్‌లో జరిగిన కొత్తగూడెం-నర్సంపేట ఏరియా ప్లీనంలోనూ, అదే నెలలో జరిగిన కె.కె.డబ్ల్యు. డివిజన్ ప్లీనంలోనూ, 2011 ఆగస్టులో జరిగిన జోన్ ప్లీనంలోనూ కామ్రేడ్ పుష్ప చురుగ్గా పాల్గొని, రాజకీయ, నిర్మాణ సమీక్షలను సంపద్వంతం చేయడంలో చురుకైన పాత్ర వహించింది.

ఒక మహిళగా కామ్రేడ్ పుష్ప సహజంగానే మహిళా సమస్యల పట్ల ఎక్కువగా స్పందించేది. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వరకట్న హత్యలు, ప్రేమోన్మాద దాడులు, అణచివేత అంతం కావాలంటే బలమైన మహిళా వుద్యమాన్ని నిర్మించాలని చాటి చెప్పేది. మహిళా హక్కులకై పలు పోరాటాలను నడిపింది.

ఉద్యమంలో మహిళల అభివృద్ధిని ఎల్లప్పుడూ కాంక్షించేది. అందుకోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని కోరుకునేది. ఆ సమావేశాల్లో చురుగ్గా పాల్గొనేది. 2008లో, ఉత్తర తెలంగాణ 2వ మహిళా ప్రత్యేక సమావేశంలో పాల్గొని, సమావేశపు కీలక నిర్ణయాలలో తానూ భాగమైంది. కె.కె.డబ్ల్యు. డివిజన్ ప్రత్యేక మహిళా సమావేశానికి నాయకత్వం వహించి, సమర్థవంతంగా నడిపించింది.

పార్టీలో వున్న కార్మిక వర్గేతర ధోరణులతో, ముఖ్యంగా పితృస్వామ్య ధోరణులతో పోరాడేది. 2008లో జరిగిన పితృస్వామ్య వ్యతిరేక క్యాంపెయిన్‌లో పాల్గొని, నిశితంగా చర్చించడమే కాకుండా, సమావేశాలలో నిర్దిష్ట విమర్శలతో సరిదిద్దే కృషి చేసింది.

ప్రజలపై న్యూ డెమొక్రసీ పార్టీ అనుసరిస్తున్న పెత్తందారీ నియంతృత్వ విధానాలను వ్యతిరేకించింది. ఆ పార్టీ దివాళాకోరు, మితవాద, అవకాశవాద రాజకీయాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యవంతం చేసింది. న్యూ డెమొక్రసీకి బలమైన గ్రామాల్లోని ప్రజలను సంఘటితం చేసి పార్టీ నిర్మాణాలను చేసింది. భూస్వాములకు కొమ్ముగాస్తున్న న్యూ డెమొక్రసీ గ్రామ పార్టీ నాయకుడు, పెత్తందారు, పోలీసు ఇన్ఫార్మర్ పులుసు వెంకన్నను చంపి, ఆ పార్టీ అసలు రంగును బయటపెట్టింది.

నిత్య నిర్బంధంలో పని చేసే క్రమంలో కామ్రేడ్ పుష్ప పలు సందర్భాలలో పోలీసు దాడులకు గురయింది. ఆ దాడులను ధైర్యంగా ప్రతిఘటిస్తూ సురక్షితంగా బయటపడింది. 2006లో కొమురారం వద్ద పాండవుల గుట్టల్లో, శత్రువు నిర్దిష్ట సమాచారంతో 300 మంది పోలీసు బలగాలు డేరాను చుట్టుముట్టి దాడి చేస్తే, ఎలాంటి నష్టం లేకుండా శత్రువు ఎత్తులు తిప్పికొడుతూ బయట పడింది.

2012 ఫిబ్రవరి 20న, గుండాల మండలం కొమ్ముగూడెం గ్రామం వద్ద, శత్రువు నిర్దిష్ట సమాచారంతో పెద్ద ఎత్తున దెబ్బతీయాలనే పథకంతో, 150 మంది పోలీసులు ఆంబుష్ కూర్చొని అతి సమీపం నుండి కాల్పులు జరిపారు. ఆ దాడిలో సింగన్న అనే కామ్రేడ్ అమరుడు కాగా, కామ్రేడ్ పుష్ప కాలుకు గాయమైంది. అయినా గుండె చెదరకుండా ఫైరింగ్ చేస్తూ ఆంబుష్ నుండి బయటపడింది.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం భూపాలపట్నం బ్లాక్‌లో దుద్దేడ గ్రామం వద్ద 2012 నవంబర్ 12న గ్రేహౌండ్స్ బలగాలు చేసిన దాడిలోనూ, 2013 జనవరి 6న వాయిపేట గ్రామం వద్ద ఛత్తీస్‌గఢ్ పోలీసులు చేసిన దాడిలోనూ, 2013 ఫిబ్రవరి 4న సింగం గ్రామం వద్ద గ్రేహౌండ్స్ బలగాలు చేసిన దాడిలోనూ శత్రువును నిర్భయంగా ప్రతిఘటిస్తూ దళాన్ని కూడా సురక్షితంగా రిట్రీట్ చేసింది. పువ్వార్ గ్రామ సమీపంలో ఆమె ఎదుర్కొన్న ఆఖరి దాడిలో కూడా సాహసోపేతంగా ప్రతిఘటిస్తూ వీరమరణం పొందింది.

విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి, పోలీసులు గ్రామాలలో ఇన్ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటూ, సమాచార ఆధారిత దాడులను చేస్తున్నారు. దళాలపై దాడులు చేస్తూనే గ్రామాల్లో వున్న సంఘాలు, సంఘ నాయకులు, సానుభూతిపరుల వివరాలను తెలుసుకొని, అరెస్టు చేసి, అక్రమ కేసులు బనాయించి, జైళ్లలో తోస్తున్నారు. ఇన్ఫార్మర్ వ్యవస్థను దెబ్బతీయకుండా గ్రామాలలోని విప్లవోద్యమాన్ని నిలబెట్టడం కష్టం కనుక, శత్రువు నెట్‌వర్క్‌ను దెబ్బతీయడానికి కామ్రేడ్ పుష్ప చాలా కృషి చేసింది.

కామ్రేడ్ పుష్ప మంచి గాయని. అధ్యయనం ద్వారా, ఇతరుల

నుండి తెలుసుకోవడం ద్వారా తన జ్ఞానాన్ని పెంచుకోవడానికి నిరంతరం ప్రయత్నించేది. తాను నేర్చుకుంటూ క్యాడర్‌కు బోధించేది. ఏ విషయాన్నయినా నిర్మొహమాటంగా మాట్లాడేది. అందరితో కలుపుగోలుగా వుంటూ, అందరి ఆదరాభిమానాలు పొందింది.

కామ్రేడ్ పుష్ప ఎంతో భవిష్యత్తు వున్న యువ మహిళా నేత. ఎల్లప్పుడూ ఆమెలో ఆత్మ విశ్వాసం తొణికిసలాడేది. తీవ్ర అనారోగ్యం వున్నప్పటికీ నిరంతర శత్రు దాడులు, ప్రతికూల పరిస్థితుల నడుమ ఉద్యమంలో దృఢంగా పనిచేసింది. ప్రజల మీద చెక్కుచెదరని విశ్వాసంతో, ఎంతటి కఠిన పరిస్థితులకయినా ఎదురీదింది. అట్టడుగు వర్గంలో పుట్టి, ఉన్నతమైన ఆశయాలను ఎంచుకొని, ఆ ఆశయాలకు అనుగుణంగా తనను తాను మలుచుకుంటూ, జిల్లా స్థాయి నేతగా ఎదిగిన కామ్రేడ్ పుష్ప జీవితం అందరికీ ప్రేరణాదాయకం. ఉత్తర తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ స్థాయికి ఎదిగి, అమరత్వం చెందిన మహిళా నేతలు, కామ్రేడ్స్ న్యాలకొండ రజిత, ఎల్లంకి అరుణలకు సగర్వమైన వారసురాలిగా ఎదిగిన కామ్రేడ్ పుష్ప మరణం అక్కడి ఉద్యమానికి తీరని నష్టం.

కామ్రేడ్ పుష్ప విప్లవ జీవితమూ, అమరత్వమూ అందించిన ప్రేరణతో మునుముందుకు సాగుదాం. ఆమె కలలు కన్న సుందర ప్రపంచాన్ని నిర్మిద్దాం!

**కామ్రేడ్ పుష్ప అమర్ రహే!**

## నిర్బంధ కొలిమిలో రాటు దేలిన ఉక్కు మహిళ కామ్రేడ్ సబిత



కామ్రేడ్ ఎట్టి నర్సక్క (సబిత) దాదాపు 33 ఏళ్ల క్రితం, వరంగల్ జిల్లా, ఏటూరు నాగారం మండలం, గోగుపల్లి గ్రామంలో, నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగింది. ఆమె తల్లి సమ్మక్క, తండ్రి పాపయ్య. కామ్రేడ్ సబిత, తల్లిదండ్రులకు రెండవ సంతానం. సబితకు తోడుగా ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, ఇద్దరు తమ్ముళ్లూ వున్నారు. కామ్రేడ్ ఎట్టి నర్సక్క చిన్నతనంలోనే, తండ్రి అనారోగ్యంతో మరణించాడు. తండ్రి మరణంతో కామ్రేడ్ ఎట్టి నర్సక్క, తల్లితో పాటు కుటుంబ బాధ్యతలు మోసింది. పేదరికం వల్ల తను చదువుకోకపోయినా తన తోటి చెల్లెండ్లను, తమ్ముండ్లను కూలీ చేస్తూ చదివించడంలో తన తల్లికి తోడ్పడింది. మగ దిక్కు లేకుండా బతకలేమని భావించే, ఈ పితృస్వామ్య సమాజంలో కామ్రేడ్ ఎట్టి నర్సక్క కుటుంబాన్ని పోషిస్తూ సబలగా నిరూపించుకుంది.

ఊహ తెలిసినప్పటి నుండి పార్టీని, దళాలను చూస్తూ వచ్చింది. దళాలు పాడుతున్న పాటలు, చెబుతున్న రాజకీయాలు కామ్రేడ్ ఎట్టి నర్సక్కను ఆలోచింపజేశాయి. క్రమంగా కామ్రేడ్ సబిత విప్లవ మహిళా సంఘంలో చేరింది. వయసులో చిన్నదే అయినప్పటికీ సంఘంలో పెద్ద వాళ్లతో సమానంగా పని చేసింది. చుట్టుపక్కల అన్ని గ్రామాల వలెనే, ఈ గ్రామంలోనూ పీపుల్స్‌వార్ పార్టీనే కాకుండా అన్ని ఎమ్ఎల్ గ్రూపులు పని చేసేవి. అయితే ఈ గ్రామానికి వున్న ప్రత్యేకత ఏంటంటే, ఇక్కడ అన్ని పార్టీల్లోనూ మహిళలే ముందుండి పని చేసేవారు. విప్లవ మహిళా సంఘం చురుగ్గా పనిచేసేది. దళం ఊరికి వస్తే అన్నం తీసుకెళ్లడం నుండి కూలి రేట్లు పెంచడం వరకూ ఊరిలో ఏ వైరుధ్యమైనా విప్లవ మహిళా సంఘమే పరిష్కరించేది. విప్లవ మహిళా సంఘంలో ఎట్టి నర్సక్క ముఖ్య పాత్ర పోషించేది.

1992-93 ప్రాంతంలో ఉత్తర తెలంగాణ గడ్డపై బిఎస్ఎఫ్ కవాతు మొదలైన తర్వాత పరిస్థితులు చాలా కఠినంగా మారాయి. ఏటూరు నాగారం ఏరియాలో అయిదారు గ్రామాల్లో తప్ప అన్ని గ్రామాల్లో నిర్మాణాలు దెబ్బతిన్నాయి. నిర్బంధానికి నిలబడిన అయిదారు గ్రామాల్లో గోగుపల్లి ఒకటి. అప్పటికి కామ్రేడ్ సబిత వయసు పన్నెండేళ్లకు మించదు. కాని ఆ పన్నెండేళ్ల చిన్నారి ఆ గడ్డు కాలంలో దళానికి పెద్ద ఆధారంగా మారిందంటే నమ్మశక్యం కాని వాస్తవం. దళం ఎంత దూరంలో వున్నా, నడిచైనా, బస్సులోనైనా ఎట్లా వీలయితే అట్లా ప్రయాణించి దళానికి సమాచారం చెప్పి వెళ్లేది.

1997లో జరిగిన ఉత్తర తెలంగాణ ప్రత్యేక మహిళా సమావేశ తీర్మానంలో భాగంగా, మహిళలను ఆర్గనైజ్ చేయడానికి ప్రత్యేక సాయుధ దళాలతో పాటు, లీగల్ టీంలు ఏర్పాటయ్యాయి. అందులో భాగంగా ఒక లీగల్ టీంలో కామ్రేడ్ సబిత సంవత్సర కాలం పని చేసింది. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల సాంఘిక అణచివేతకు, వివక్షకు వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేయడంలో ఉత్సాహంగా కృషి చేసింది. మహిళలను ఉద్యమాలలో సమీకరిస్తూనే చదువు నేర్చుకోవడం ప్రారంభించింది.

పాటలంటే ఆసక్తి వున్న కామ్రేడ్ సబిత 1997లో జెఎన్ఎమ్ శిక్షణా శిబిరంలో పాల్గొంది. విప్లవ మహిళా సంఘంలో క్రియాశీలంగా పాల్గొనడం చూసిన తల్లి తన బిడ్డ ఏమైపోతుందోననే ఆందోళనతో, పెళ్లి చేస్తే ఇంటిపట్టున వుంటుందని భావించింది. కాని కామ్రేడ్ సబిత పెళ్లి ప్రయత్నాలను తిరస్కరించి, 1998లో పూర్తి కాలం కార్యకర్తగా మారింది. కామ్రేడ్ సబిత పూర్తికాలం రావడానికి కామ్రేడ్ బడే నాగేశ్వర్‌రావు (ప్రభాకర్ ప్రభావం బలంగా పనిచేసింది.

1999లో కొత్తగూడెం దళంలో దళ జీవితం ప్రారంభించి, 2000లో ఏటూరునాగారం ఏరియాలోని గోవిందరావు పేట ఎల్ఓఎస్‌లో ఒక సంవత్సరం పనిచేసి, తిరిగి 2001లో కొత్తగూడెం దళంలోకి బదిలి అయింది. మళ్లీ 2003 చివరిలో ఏటూరు నాగారం ఏరియాకు బదిలీ అయి తను అమరత్వం చెందే వరకు అక్కడే వివిధ బాధ్యతలు నిర్వహించింది.

ఈ విప్లవ ప్రయాణంలో కామ్రేడ్ సబిత, తాను ఇష్టపడిన కామ్రేడ్‌ను, పార్టీ ఆమోదంతో పెళ్లి చేసుకుంది. వారి దాంపత్య జీవితం పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా అన్యోన్యంగా, ఆదర్శంగా కొనసాగింది.

2003 నుండి మేడారం ఎల్ఓఎస్‌లో సెల్ సభ్యురాలుగా పనిచేసిన, కామ్రేడ్ సబితను 2006లో ఏటూరు నాగారం ఏరియా కమిటీలోకి తీసుకున్నారు. 2011 సెప్టెంబర్ నుండి ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ కార్యదర్శిగా కొనసాగుతూ వచ్చింది.

కామ్రేడ్ సబిత విప్లవోద్యమంలోని పలు ఆటు, పోట్లను చవిచూసింది. ఉత్తర తెలంగాణ వుద్యమంలో 1998 నుండి రోజురోజుకు నిర్బంధం పెరిగి, శత్రువు చేస్తున్న దాడులలో నాయకత్వం, దళాలు నష్టపోయాయి. మరో పక్క పిరికితనంతో ప్రజలకు ద్రోహం చేసి చాలా మంది పారిపోయారు. అయినా కామ్రేడ్ సబిత ఏ మాత్రం గుండె జారక, దృఢ నిశ్చయంతో అమరుల ఆశయాలను భుజాన వేసుకొని మడమ తిప్పకుండా తుదివరకు పోరాడింది.

2004లో కాంగ్రెస్ ప్రభుత్వంతో జరిగిన, చర్చల వెసులుబాటును వుపయోగించుకొని, అనేక వర్గ సంఘాలతో పాటు, ప్రాథమిక పార్టీ నిర్మాణాలను చేస్తూ, ఉద్యమ పురోగమనానికి చాలా పాటుపడింది. అదే సమయంలో పట్టణాలలో, గ్రామాలలో పార్టీ నిర్వహించిన బహిరంగ సభలకు వేలాదిగా ప్రజలను కదిలించింది. అమరవీరుల జ్ఞాపకార్థం చేపట్టిన స్థూపాల నిర్మాణ కార్యక్రమంలో, ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడంలోనూ, ఆ స్థూపావిష్కరణలకు ప్రజలను వేలాదిగా కదిలించడంలోనూ కామ్రేడ్ సబిత ప్రముఖ పాత్ర నిర్వహించింది.

2004లో కన్నాయిగూడెం గ్రామంలో అమరవీరుల స్మృతిలో ఆటల పోటీలను నిర్వహించింది. ఈ పోటీలలో వయసుతో నిమిత్తం లేకుండా ఏటూరు నాగారం, మంగపేట, తాడ్వాయి మండలాల నుండి ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

2004లో ఏటూరు నాగారం మండలం గోదావరి బెల్ట్ ప్రాంతంలో దాదాపు 20 గ్రామాలను కలిపి 30 మంది మహిళలలో సారా వ్యతిరేక పోరాట కమిటీ నిర్మాణం చేసి దాదాపు మూడు నెలలపాటు ఉద్యమాన్ని నడిపింది.

2013లో భూపాలపల్లి మండలం, దీక్షకుంట గ్రామంలో గతంలో ప్రజల స్వాధీనమై, ఘర్షణల కారణంగా, గత కొన్ని సంవత్సరాలుగా పంపిణీ కాకుండా వున్న 180 ఎకరాల భూమిని పంపిణి చేయడంలో చురుకైన పాత్ర వహించింది.

మహదేవ్‌పూర్ మండలం పంకెన గ్రామంలో ప్రజలు గతంలో పోరాడి సాధించుకున్న 300 ఎకరాల భూమిని భూస్వాములు, మధ్య దళారీలు కబ్జా చేస్తుంటే, కబ్జా దారులతో మధ్యవర్తిత్వం వహిస్తున్న కమ్మ రాఘవులును ఖతం చేయాలనే నిర్ణయంలో చురుకైన పాత్ర వహించింది.

పార్టీ నిర్వహించిన అనేక టీసీఓసీలలో పాల్గొంటూ తనకిచ్చిన బాధ్యతలను ఉత్సాహంగా నిర్వహించేది. 2000లో వరంగల్ జిల్లా కలెక్టర్ ఆదిత్యనాథ్ దాస్‌పై మన పీఎల్‌జీఏ చేసిన దాడిలో తన వంతు పాత్ర పోషించింది.

2001లో ఏటూరు నాగారం పోలీస్‌స్టేషన్‌పై కొత్త తరహాలో డైరెక్షన్ మైన్ పేల్చి, రాష్ట్రంలో సంచలనం సృష్టించి, శత్రు బలగాలను గందరగోళపర్చిన దాడిలో, కామ్రేడ్ సబిత ప్రహరీ గోడను పేల్చే బాంబింగ్ టీమ్‌లో, సభ్యురాలిగా వుండి తన బాధ్యతను నిర్వహించింది. 2005లో వరంగల్ జిల్లా తాడ్వాయి మండల కేంద్రంలో, రాత్రిపూట ఆంబుష్ చేసి పోలీసులను పరిగెత్తించిన ఘటనలో పాల్గొని, టెర్రయిన్, గ్రామాలు, ప్రజలు ఏమాత్రం తెలియని మన ఆంబుష్ పార్టీ బలగాలకు మంచి సహకారాన్నందించి చర్యను సఫలం చేయడంలో భాగస్వామి అయింది.

కొమురారం, కాల్వపల్లి, చిన్నబోయినపల్లి, నార్లాపూర్, దుద్దేడ, సింగం తదితర చోట్ల జరిగిన అనేక శత్రు దాడులలో, ధైర్యంగా నిలబడి ప్రతిఘటిస్తూ రిట్రీట్ అవుతూ తనను, తన దళాన్ని రక్షించుకోగల్గింది.

ఏరియా ఉద్యమ పునర్నిర్మాణానికి ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని విజయవంతం చేయడానికి, ఏరియా కమిటీ సభ్యుల, దళ సభ్యుల మానసిక, నైతిక స్థైర్యాన్ని పెంచడానికి కృషి చేసింది. తను శారీరకంగా బలహీనంగా వుండడంతో, తనకు సాధ్యం కాని పనులను చేయడానికి తోటి కమిటీ సభ్యులను, దళ సభ్యులను ప్రోత్సహించేది. ఆ కార్యక్రమాలను విజయవంతం చేసేది.

వెనకబడిన ఆదివాసీ కుటుంబంలో పుట్టడం, పేదరికం, ఆడవాళ్లకు చదువులు అవసరం లేదనే పితృస్వామ్య భావజాలం మూలంగా కామ్రేడ్ సబిత ఇంటివద్ద చదువుకోలేకపోయింది. కాని, పార్టీలో చేరిన తర్వాత పట్టుదలతో చదువు నేర్చుకుంది. తన రాజకీయ చైతన్యాన్ని అభివృద్ధి పర్చుకోవడానికి నిరంతరం అధ్యయనంపై కేంద్రీకరించేది. తన అభివృద్ధితో పాటు తనకు వున్న జ్ఞానంతో పట్టుదలతో, విశ్వాసంతో తన సభ్యులను అభివృద్ధి పరిచేది.

2011 జూలైలో జరిగిన ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ ప్లీనంలో ఉద్యమ నిర్మాణ సమీక్షను సంపద్వంతం చేయడంలో ఏరియా కమిటీ సభ్యురాలుగా ముఖ్య భూమిక

పోషించింది. అనంతరం కెకెడబ్ల్యూ డివిజన్ కమిటీ ప్లీనంలో అధ్యక్షత వహించి సరైన దిశలో నడిపించింది.

2008లో పితృస్వామ్య రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా, పార్టీలో వున్న పితృస్వామ్య భావజాలంపై పోరాటం చేసింది. సమావేశాలలో నిర్దిష్టంగా విమర్శలు చేస్తూ సరిదిద్దే కృషి చేపట్టింది. ఆ తరువాత జరిగిన ఉత్తర తెలంగాణ ప్రత్యేక మహిళా సమావేశంలో పాల్గొని సద్వినియోగం చేసుకొంది. 2013 ఫిబ్రవరి చివరిలో కెకెడబ్ల్యూ ప్రత్యేక మహిళా సమావేశంలో పాల్గొని చేసుకున్న తీర్మానాలలో ముఖ్య భూమిక పోషించింది.

కామ్రేడ్ సబిత ఎన్నో శత్రు నిర్బంధాలను, దాడులను ఎదుర్కొంటూ విప్లవోద్యమంలో రాటుదేలుతూ తన పదిహేనేండ్ల విప్లవ జీవితంలో ఎదుగుతూ వచ్చింది. తన కండ్ల ముందే, అనేక మంది కామ్రేడ్స్ అమరులైనా వెరవక, వెనుదిరగక మరింత వర్గకసితో, వారి ఆశయసాధనకు, తనను తాను పదును పెట్టుకొంటూ ముందుకు నడిచింది.

ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియా ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కామ్రేడ్ సబితను కోల్పోవడం, ఏరియా ఉద్యమానికి, డివిజన్ వుద్యమానికి తీరని నష్టం. కామ్రేడ్ సబిత భౌతికంగా మనముందు లేకపోయినా ఆమె కన్న కలలు, ఆశయాలు మన ముందు వున్నాయి. వాటిని నిజం చేయడానికి మనమంతా అమరుల ఆశయాల స్ఫూర్తితో తుది వరకు పోరాడాల్సి వుంది.

**కామ్రేడ్ సబిత అమర్ రహే!**

## రగిలే ఆశయజ్వాల కామ్రేడ్ గౌతమ్ కిరణ్

కామ్రేడ్ ఆరెళ్ళ వెంకట్ (గౌతం కిరణ్) దాదాపు 35 ఏండ్ల క్రితం కరీంనగర్ జిల్లా మంథని మండలం ఖానాపురం గ్రామంలో దళిత కుటుంబంలో పుట్టాడు. తల్లిదండ్రులకు అయిదుగురు సంతానంలో కిరణ్ మూడవ వాడు. తను చిన్నతనంలో వుండగానే తండ్రి అనారోగ్యంతో మరణించాడు. కనుక కూలి పని చేస్తూ తల్లి లక్ష్మమ్మ కుటుంబ భారమంతా మోసింది. కామ్రేడ్ కిరణ్ 9వ తరగతి వరకు చదువుకున్నాడు.



మంథని ఏరియాలో గ్రామీణ ప్రాంతంలో, భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలు, అణచివేతలు, తీవ్రంగా వుండడంతో, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు ఎక్కువగా జరుగుతుండేవి. ఖానాపూర్ గ్రామంలో కూడ భూస్వామ్య వ్యతిరేక వుద్యమాలు బలంగా వుండేవి. కామ్రేడ్ కిరణ్ ఈ వుద్యమాలను చిన్నతనం నుండే చూస్తూ ఉత్తేజితుడయ్యాడు. విప్లవోద్యమానికి బలమైన గ్రామం కావడంతో, తరచుగా వచ్చే దళాలను కలుస్తూ, రాజకీయాలు వింటుండేవాడు. పార్టీ పెట్టిన బాలల సంఘంలో చేరి, ఆ సంఘ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవాడు. బాలల సంఘంలో వున్నప్పుడే పాటలు పాడడం, డప్పు కొట్టడం నేర్చుకున్నాడు. ఈ నేపథ్యం నుండి వచ్చిన కామ్రేడ్ గౌతం మంథని హాస్టల్లో చదువుతున్నప్పుడు సహజంగానే ఆర్.ఎస్.యు.లో చేరి పని చేసాడు. శాస్త్రీయ విద్యా విధానం కోసం పోరాడుతూనే, హాస్టల్‌లో, బడిలో పలు సమస్యలపై వుద్యమించాడు. పోరాటాలలో విద్యార్థులను కూడగట్టడంలో కామ్రేడ్ కిరణ్ చురుకైన పాత్ర పోషించాడు.

పార్టీ ప్రచార క్యాంపెయిన్ బృందాలలో పాల్గొంటూ డప్పు కొట్టడం, పాటలు పాడడం చేస్తూ అనేక గ్రామాలలో తిరుగుతూ, భూస్వామ్య, ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ, ప్రజలను చైతన్యవంతులను చేసేవాడు. ఈ క్రమంలోనే పూర్తికాలం విప్లవోద్యమంలో చేరాలని నిర్ణయించుకొని, సమాజానికి పనికిరాని అశాస్త్రీయ చదువును 9వ తరగతిలోనే వదిలి 1997లో దళంలో చేరాడు.

మంథని ఏరియాలో కొయ్యూర్ ఎల్.ఓ.ఎస్.లో సభ్యుడుగా కొంత కాలం పని చేసి, 1998-2000లలో ఎన్.టి.ఎస్.జెడ్.సి. సభ్యుడికి గార్డుగా పనిచేశాడు. 2001లో మొదటి పి.ఎల్. సభ్యుడుగా బదిలీ అయ్యాడు. 2003లో ఎస్.జెడ్.సి.సభ్యుడి ప్రొటెక్షన్ దళంలో, 2004లో ఖమ్మం జిల్లాలోని స్పెషల్ గెరిల్లా దళంలో, 2005లో కొంత కాలం పాటు ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏసీలో, ఆ తర్వాత తిరిగి ఖమ్మం జిల్లాలోని స్పెషల్ గెరిల్లా దళంలో పనిచేశాడు. 2007 నుండి రీజనల్ కంపెనీలో, 2010 నుండి కె.కె.డబ్ల్యూ. డివిజన్‌లోని ఎస్.జి.ఎస్. బాధ్యతలు చేపట్టాడు. తన జీవితం మొత్తంగా మిలటరీ రంగంలోనే వుంటూ సభ్యుడుగా, కమాండర్‌గా బాధ్యతలను చేపట్టి పార్టీ నిర్ణయించిన వివిధ యాక్షన్‌లలో పాల్గొంటూ సఫలీకృతుడయ్యాడు.

2001 జనవరిలో మహారాష్ట్రలోని అహ్రవెల్లి పోలీసు స్టేషన్‌పై దాడి చేసి, ఎనిమిది మంది పోలీసులను చంపి, తుపాకులను స్వాధీనం చేసుకున్న ఘటనలో, కామ్రేడ్ కిరణ్ రెయిడింగ్ పార్టీ కమాండర్‌కు గార్డుగా వుండి తన వంతు పాత్ర పోషించాడు.

2003 ఏప్రిల్‌లో, కరీంనగర్ జిల్లా మహా ముత్తారం మండలం రెడ్డిపల్లి గ్రామం వద్ద రెండు పి.ఎల్.లు కలిసి, పెద్ద ఆంబుష్ చేసి, శత్రువును తీవ్ర గందరగోళపర్చి తరిమికొట్టిన ఘటనలో, సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా వున్నాడు.

2003 జూన్‌లో మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌పై డైరెక్షన్ మైన్‌తో చేసిన దాడిలో కామ్రేడ్ గౌతం సెక్షన్ కమాండర్‌గా వున్నాడు.

2009లో ఛత్తీస్‌గఢ్ కుంట ఏరియా పరిధిలో బండ గ్రామం వద్ద ఆంబుష్ చేసి, 9 మంది ఎస్.పి.ఓ.లను మట్టికరిపించిన

ఘటనలో రీజనల్ కంపెనీలో ఒక సెక్షన్ కమాండర్‌గా వుండి ముఖ్య పాత్రను పోషించాడు. ఒడిశా రాష్ట్రంలో దామన్ జోడి ఎన్.ఎమ్.డి.సి. పరిశ్రమ రక్షణ కోసం ఏర్పాటు చేసిన, ఔట్ పోస్ట్‌పై చేసిన దాడిలో క్రియాశీలంగా పాల్గొన్నాడు.

2002 మార్చిలో తుపాకుల గూడెం వద్ద శత్రువు చుట్టుముట్టి చేసిన దాడిలో వీరోచితంగా పోరాడుతూ ఎనిమిది మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. ఈ దాడిలో, కామ్రేడ్ కిరణ్ ధైర్యంగా పోరాడుతూ, అందరితో పాటు సురక్షితంగా రిట్రీట్ అయ్యాడు. మిలటరీలో ఈ ముఖ్యమైన ఘటనలతో పాటు అనేక చిన్న యాక్షన్స్‌లో పాల్గొన్నాడు. ఇలా కామ్రేడ్ కిరణ్ ఎన్నో చిన్నా, పెద్దా, మధ్యరకం చర్యలలో పాల్గొని తన మిలిటరీ నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ వచ్చాడు.

కామ్రేడ్ గౌతం జీవిత సహచరి పేరు సులోచన. 2006లో నార్లపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ సులోచన అమరురాలయింది. ఆ వేదనను కామ్రేడ్ గౌతం శత్రువుపై మరింత కసిగా మలుచుకుని ఉద్యమంలో దృఢంగా నిలబడ్డాడు.

పువ్వార్ దాడిలో తను అమరత్వం చెందే నాటికి కంటి సమస్యతో బాధ పడుతున్నాడు. కండ్ల మంటలతో, ఒక్క క్షణం కూడ చూడలేనంత సమస్యతో, తుపాకిని కూడ పట్టుకోలేని స్థితిలో వున్నాడు. అంతకు ముందే తన తుపాకీని సహ కామ్రేడ్స్‌కు ఇచ్చాడు. ఈ సమస్యతో రెండు రోజుల నుండి తిండి లేక బలహీనంగా వున్నాడు. దానితో పాటు చాలా కాలం నుండి వేధిస్తున్న కాలు మడమ నొప్పి కూడ తీవ్రంగానే వుండింది. అయినా ధైర్యంగా వుండి లేనిశక్తిని కూడగట్టుకొని, శత్రువు చుట్టివేత నుండి బయట పడడానికి, సహచర కామ్రేడ్స్ సహకారంతో చివరి వరకు ప్రయత్నించాడు. ఆఖరికి శత్రువు తూటాల వర్షం నుండి బయట పడలేకపోయాడు. పదహారేళ్ల విప్లవ జీవితంలో మిలిటరీ రంగంలో మంచి అనుభవం సంపాదించిన సీనియర్ కామ్రేడ్‌ను కోల్పోవడం ఎన్.టి. ఉద్యమానికి తీవ్ర నష్టం.

అనారోగ్యం పీడిస్తున్నప్పటికీ ఎలాంటి ఊగిసలాట లేకుండా చివరి వరకు విప్లవోద్యమంలోనే కొనసాగుతానని శపథం చేసిన కామ్రేడ్ కిరణ్ మనందరికీ ఆదర్శం. ఆ కామ్రేడ్ కిరణ్ ఆశయాన్ని తప్పకుండా నెరవేరుద్దామని శపథం చేద్దాం.

**కామ్రేడ్ గౌతం కిరణ్ అమర్ రహే!**

## విప్లవాకాశంలో మెరిసిన ఆశా కిరణం

## కామ్రేడ్ రాజు

ఓరుగల్లు జిల్లాలోని ఏటూరు నాగారం అడవుల్లో బందూకును ఎత్తిపట్టిన కామ్రేడ్ దుర్గం రాజుది బుట్టాయిగూడెం గ్రామం. దళిత (నేతకాని) కుటుంబంలో జన్మించిన ఏడుగురు సంతానంలో కామ్రేడ్ రాజు అందరి కంటే చిన్నవాడు. రాజు తల్లి బుచ్చమ్మ, తండ్రి రామయ్య, రాజుకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రాజబాబు. అందరూ రాజు అని పిలిచేవారు. దళంలో కూడా రాజు అనే పేరే స్థిరపడింది. తండ్రి గ్రామ సుంకరి (గ్రామ సేవకుడు). కామ్రేడ్ రాజు చిన్నతనంలోనే, తండ్రి చనిపోతే తన అన్ననే తండ్రి చేసే పని చేసేవాడు. తల్లి కూలికి వెళ్తూ కుటుంబ భారాన్ని మోసింది. ఇప్పుడిప్పుడే తమకున్న కొద్ది భూమిలో వ్యవసాయం కూడ చేసుకొంటున్నారు.



కామ్రేడ్ రాజు 21 సంవత్సరాలు నిండిన యువకుడు. అయిదున్నర అడుగుల ఎత్తుతో గుండ్రని ముఖం. చామనఛాయతో, ఎప్పుడూ చిరునవ్వుతో కనిపిస్తాడు. నవ్వకుండానే పిడుగుల్లాంటి జోకులు పేలుస్తూ, అందర్నీ నవ్విస్తూ వుంటాడు. చూడడానికి ఉలుకూ పలుకూ లేని కదలికతో, నెమ్మదిగా, కంటికి ఆకర్షించలేనంతటి సాధారణంగా వుంటాడు. శత్రువుపై చర్యకు దిగితే ఉట్టిపడే గడుసుతనంతో మెరుపులా పనిని పూర్తి చేస్తాడు. యాక్షన్‌కు వెళ్లినప్పుడు గేటువద్ద సెక్యూరిటీ గార్డ్ కూడా పిలిచి సిగరెట్ తెప్పించుకునేంత అమాయకుడిలా కనబడతాడు. ఏపీ రేయాన్స్ పరిశ్రమలో రామకృష్ణను మెరుపు వేగంతో మట్టికరిపించిన సమయస్ఫూర్తి కలవాడు. ఈ యాక్షన్ చిత్రాన్ని సిసి కెమెరాల సహాయంతో చూసి ఇంటెలిజెన్స్ వర్గాలే ఆశ్చర్యపోక తప్పలేదు. ఈ నిజానికి నివ్వెరపోయిన పోలీసులు, డిజిఎమ్ రామకృష్ణను చంపిన ప్రధాన నిందితుడిగా, దుర్గం రాజును గుర్తించి, ఫోటోలతో సహా దిన పత్రికలలో ప్రకటించారు.

బుట్టాయిగూడెం గ్రామంలో, అన్ని విప్లవ ప్రజా సంఘాలు ఏర్పడి, విప్లవోద్యమానికి బలమైన గ్రామంగా వుండింది. పార్టీ విస్తృత కార్యక్రమాలు చేపట్టి, ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పార్టీపై ప్రజలకు గట్టి విశ్వాసం ఏర్పడింది. ఆ గ్రామంలో బహిరంగ సభలు జరిపితే, వందలాదిగా జనం గుంపులు గుంపులుగా పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేవారు. ఈ నేపథ్యంలోనే బుట్టాయిగూడెం గ్రామం నుండి కామ్రేడ్స్ కొండగొర్ని దుర్గ, కుమ్మరి బెంజిమెన్ (గిరిబాబు), మార్కొని సుధాకర్, సునార్కని ప్రమీల విప్లవంలో చేరి అమరులయ్యారు. ఈ ప్రభావం బాలలపై కూడా పడింది. గోలీలతో ఆడుకునే చిన్న వయసు పిల్లలంతా కలిసి, కట్టె తుపాకులతో 'నక్సలైట్లు-పోలీసులు' ఆటలో కాల్పులు చేసుకుంటూ ఉత్సాహపడిపోతారు. ఒక్కొక్కరికి అలియాస్ పేర్లు, దళంలో వున్నవారి పేర్లు లేదా అమరుల పేర్లు పెట్టుకుంటారు. ఈ కాల్పుల్లో

పోలీసులందరూ చనిపోతారు. నక్సలైట్లు గెలుస్తారు. రాజ్యాధికారం ఎలా సాధిస్తామో ఆ బాలలకి తెలియకపోయినా పార్టీ గెలుస్తుందనే బలమైన విశ్వాసం మాత్రం వాళ్లకుంది. ఈ ఆటలాడుకున్న కామ్రేడ్ రాజుకు బాల్యంలోనే పార్టీపై బలమైన విశ్వాసం నాటుకుంది. అందుకే చిన్న వయసులోనే దళంలో చేరుదామని నిర్ణయించుకున్నాడు.

నీవు పెద్దయ్యాక ఏమవుతావురా? అనే ఉపాధ్యాయుడి ప్రశ్నకు నేను కలెక్టరవుతాను, డాక్టరవుతాను, ఇంజనీరవుతాను, పోలీసవుతానని తోటి విద్యార్థులు చెప్తుంటే, నేను నక్సలైట్‌నవుతానని బహిరంగంగా చెప్పలేక, మనస్సులోనే అనుకున్న మాటకు కామ్రేడ్ రాజు గట్టి పట్టుదలతో అంకితమై వున్నాడు.

కామ్రేడ్ రాజు చదువుకున్న మంగపేట సంక్షేమ హాస్టల్‌లో, వివిధ రకాల విప్లవ పార్టీల రాజకీయ ప్రభావంతో వచ్చిన విద్యార్థులు, వారి వారి పార్టీల గొప్పలు, ఎదుటి పార్టీల వైఫల్యాలను, సిద్ధాంతాలు, రాజకీయాల పట్ల అవగాహన లేకపోయినా, వారికి తెలిసిన కార్యాచరణకు సంబంధించిన విషయాలను, కోపతాపాలతో చర్చలు జరుపుకునే వాళ్లు. అందులో కామ్రేడ్ రాజు మావోయిస్టు పార్టీ పక్షం చర్చలు చేసేవాడు. కామ్రేడ్ రాజు దళంలో చేరాలనే తపనతో చదువును మధ్యలోనే వదిలి పదమూడేండ్లకే పదహారేళ్లని అబద్ధం చెప్పి 2005లో చేరాడు.

మొదట రాజు 2006లో కెకెడబ్ల్యూ డివిజన్ కమిటీ సభ్యుడికి గార్డుగా రెండేండ్లు పని చేశాడు. 2008లో ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ దళం సభ్యుడిగా, 2010 నుండి ఏరియా కమిటీ సభ్యుడిగా కొనసాగుతూ వచ్చాడు. 2011లో కెకెడబ్ల్యూ డివిజన్ కమాండ్ సభ్యుడి బాధ్యతలతో పాటు, ఇంటెలిజెన్స్ బాధ్యతలు కూడా చేపట్టాడు. తన ఎనిమిదేండ్ల విప్లవ జీవితంలో దెబ్బతిన్న ఉద్యమ పునర్నిర్మాణం చేయడానికి అనేక కష్టాలను, నిర్బంధాలను ఎదుర్కొంటూ ముందుకు సాగాడు.

ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియా ఉద్యమ నిర్మాణంలో అనేక సంక్లిష్టతలు, సవాళ్లు, సమస్యలు ఎదురవుతున్నాయి. శత్రువుకు గ్రామాలలో విపరీతంగా నెట్‌వర్క్ పెరిగి, ప్రతి కార్యక్రమం శత్రువుకు తెలిసిపోతున్న పరిస్థితులలో కూడా, శత్రువు కండ్లుగప్పి చిన్న టీంతో, లేదా ఒంటరిగా నిబ్బరంగా వెళ్లి చొరవతో, నైపుణ్యంతో, మంచి ప్లానింగ్‌తో పనిని పూర్తి చేసేవాడు. వ్యయ ప్రయాసాలకు ఓర్చి ప్రజా సంఘాల నిర్మాణానికి కృషి చేసేవాడు.

నీళ్లలో చేపలాగా ప్రజలతో మాట, మాట కలుపుతూ, సులువుగా కలిసి పోయే స్వభావం గలవాడు. దళం ఇంటికి వస్తే ఎక్కడ శత్రువుకు తెలుస్తుందోనని భయందోళనకు గురై వున్న ప్రజలకు, ఎంతో ధైర్యాన్నిస్తూ వాళ్లని పార్టీ వైపు నిలబెట్టేవాడు. ఎంతటి కఠినమైన పనిని కూడా ఈ పని నాతో కాదు, నేను చేయలేను, ఇది సాధ్యం కాదేమో అనే ఆలోచనే లేకుండా ఎంతో విశ్వాసంతో పనిలోకి దిగేవాడు.

కామ్రేడ్ దుర్గం రాజు కెకెడబ్ల్యూ డివిజన్ కమిటీ సభ్యుడికి గార్డుగా వున్నంత కాలం, గార్డు డ్యూటీని బాధ్యతాయుతంగా నిర్వహించాడు. కాంగ్రెస్ ప్రభుత్వంతో చర్చల క్రమంలో శాంతి కాలానికి విఘాతం కల్గించే కుట్ర పూరితమైన అప్రకటిత దాడితో గ్రామాలు, అడవులు అల్లకల్లోలంగా మారినప్పుడు దళాల్లో కమాండర్లు, తన తోటి సభ్యులు పిరికితనంతో పారిపోయినా, గుండె చెదరకుండా ధైర్యంగా వుండి నష్టాల మధ్య కమాండర్‌ను రక్షిస్తూ వచ్చాడు.

ఉత్తర తెలంగాణ ఉద్యమంలో ప్రస్తుతం గొప్ప గొప్ప విజయాలు, గుణాత్మకమైన మార్పులు ఏమీ లేకపోయినా, సాధించిన చిన్న చిన్న విజయాలనే స్ఫూర్తిగా తీసుకొని పట్టుదలతో గట్టి విశ్వాసంతో ఏరియా కమిటీ బాధ్యతలను మోస్తు వుద్యమ పురోగమనానికి కృషి చేశాడు. పార్టీ సభ్యత్వం పెంచే క్యాంపెయిన్ తీసుకున్నప్పుడు ఏరియాలో పార్టీ సభ్యత్వాన్ని పెంచుతూ సెల్ నిర్మాణాలు పెట్టడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. వర్గ సంఘాలు నిర్మాణం చేసే వద్ద యువతను ఎక్కువగా సమీకరించే కృషిని చేపట్టి, మంచి ఫలితాలను రాబట్టడంలో కామ్రేడ్ రాజు కృషి అమూల్యమైనది.

2010 జూన్‌లో జరిగిన ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ ప్లీనంలో ప్రాతినిధ్యం వహిస్తూ ఉద్యమ నిర్మాణ సమీక్షను సుసంపన్నం చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2012లో దీక్షకుంట గ్రామంలో వివాదస్పదంగా వున్న 180 ఎకరాల భూమిని పరిష్కరించి పంపిణీ చేయడంలో ఏరియా కమిటీ సభ్యుడిగా బాధ్యతాయుత పాత్ర పోషించాడు.

జిల్లా కమాండ్ సభ్యుడిగా, ఇంటెలిజెన్స్ వంటి బాధ్యతలను చేపట్టి వాటి అభివృద్ధి కోసం ఎంతో తపన పడ్డాడు. మెరుగైన పని విధానాన్ని పెంపొందించడానికి, దళాల్లో మిలిటరీ క్రమశిక్షణను అభివృద్ధి పరచడానికి, ఎన్‌టీలోని భౌతిక యుద్ధ పరిస్థితులకు తగిన విధంగా గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి పరచడానికి, తక్కువగా వున్న మన పిఎల్‌జిఎ శక్తిపై ఆధారపడి, బలమైన శత్రువును చిన్న చిన్న చర్యలతో దెబ్బకొడుతూ, క్రమంగా చొరవను మన చేతుల్లోకి తీసుకునే విధంగా, సృజనాత్మక ఎత్తుగడల కోసం అనేక విధాలుగా ఆలోచన చేసేవాడు. కార్యరూపం దాల్చడానికి, పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకొంటూ, పార్టీ శ్రేణుల్లో మానసిక నైతిక స్థైర్యాన్ని నింపడానికి ఎంతో శ్రమించాడు.

2010లో ఏటూరు నాగారం మండల కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్‌పిటిసి జాడి రామ్మూర్తిపై చేసిన కాల్పుల ఘటనలో కామ్రేడ్ రాజు ధైర్యంగా వెళ్లి, రెక్కి చేసి, యాక్షన్ టీమ్‌కు సమాచారం అందించాడు.

కమలాపురం ఏపీ రేయాన్స్ పరిశ్రమలో కార్మికుల శ్రమను విపరీతంగా దోపిడీ చేస్తున్న, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్న కార్మికులపై, పోలీసులను ఉసిగొల్పి అణచివేస్తున్న యాజమాన్యంలో, ముఖ్యుడైన డిజిఎమ్ రామకృష్ణను, 2011 మార్చిలో పట్టపగలే పరిశ్రమలోని అతడి ఛాంబర్‌లోనే ఖతం

చేయడంలో అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించిన వీరయోధుడు కామ్రేడ్ రాజు.

మహదేవ్‌పూర్ మండలంలోని పంకెన గ్రామంలో, గతంలో ప్రజలు పోరాడి సాధించుకున్న 300 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేసుకొంటున్న వారిలో ముఖ్యుడైన ఆ గ్రామానికి చెందిన కమ్మ రాఘవులును ఖతం చేసి జిల్లాలో సంచలనం సృష్టించాడు. దీని ప్రభావం పెద్ద యెత్తున కరీంనగర్ జిల్లాలో పడింది.

మిలిటరీ రంగంలో ఇప్పుడిప్పుడే నైపుణ్యాన్ని పెంచుకుంటూ, తనకు తెలిసిన విషయాలను క్యాడర్‌కు చెబుతూ వారి నైపుణ్యాన్ని పెంపొందించడానికి మంచి ప్రోత్సాహాన్నందిస్తుండేవాడు. ఎదిగివస్తున్న నవయువ కెరటం, నేర్పు, ఓర్పు వున్న కామ్రేడ్ రాజు, అందరితో కలిసిపోతు, అందర్నీ నవ్విస్తూ, ముసిముసిగా చిరునవ్వులు చిందిస్తూ, అందరి మన్ననలు, అప్యాయతలు పొంది ప్రజల్లో, పార్టీ శ్రేణుల హృదయాల్లో చెరగిపోని ముద్రవేశాడు.

పువ్వర్తి ఎన్‌కౌంటర్‌లో కామ్రేడ్ రాజు వీరోచితంగా పోరాడుతూ, శత్రు వలయాన్ని ఛేదిస్తున్న సమయంలో శత్రు తూటాలకు నేలకొరిగాడు.

ఎల్లప్పుడూ ఉత్సాహంగా తిరిగే రాజు ఈ రోజు మన మధ్య లేడు. అతను లేకపోవడం జిల్లా ఉద్యమానికి ముఖ్యంగా ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియా ఉద్యమానికి తీరని నష్టం.

ప్రజల్లో, పార్టీ శ్రేణుల్లో చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ రాజు పట్టుదల, ఆదర్శం, నైపుణ్యం, సృజనాత్మకత, ధైర్య సాహసాలు, నిరంతరం మనకు ప్రేరణనిస్తూ అంతిమ విజయం దిశగా దృఢంగా నడిపిస్తాయి. మహోన్నతమైన కామ్రేడ్ దుర్గం రాజు ఆశయాలను తుదివరకూ తీసుకెళుదాం. వారి ఆశయ సాధన కోసం అమరులు చూపిన మార్గాన్ని తుదివరకూ కొనసాగిద్దాం.

**కామ్రేడ్ రాజు అమర్ రహే!**

## పోరు వారసత్వాన్ని ఎత్తిపట్టిన కామ్రేడ్ బడే ఊర్మిళ

కామ్రేడ్ బడే ఊర్మిళ (21)ది వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం లోని కాల్వపల్లి గ్రామం. ఆమె తల్లి భారతి, తండ్రి సత్యం. తల్లిదండ్రుల మధ్య వైరుధ్యాలు వచ్చి, వాళ్లిద్దరూ విడివిడిగానే వుండడంతో, కామ్రేడ్ ఊర్మిళ కూడా తన తల్లితో పాటు కాల్వపల్లిలో మేన మామల వద్ద పెరిగి పెద్దదైంది. వాళ్లది త్యాగాల వారసత్వం వున్న కుటుంబం. పార్టీ కొరియర్‌గా పని చేస్తుండిన ఊర్మిళ మేనమామ సిద్ధబోయిన అశోక్ (శ్రీధర్)ను 1998 జూన్‌లో పోలీసులు పట్టుకొని మొట్లగూడెం వద్ద కాల్చి చంపారు. అప్పటికి కామ్రేడ్ అశోక్ వయస్సు 20 సంవత్సరాలు మాత్రమే. కామ్రేడ్ ఊర్మిళ తల్లి ఊర్మిళ పుట్టిన తర్వాతనే పార్టీలో చేరి పని చేసింది. ఆ తరువాత అనారోగ్యం కారణంగా ఇంటికి వెళ్లి శత్రువుకు లొంగిపోకుండా, పార్టీ సానుభూతిపరురాలిగా సాధారణ జీవితం గడుపుతున్నది. ఇదే కుటుంబం నుండి ఊర్మిళకు మేనమామ బడే మురళీధర్‌రావు, బడే నాగేశ్వరరావులు అమరులయ్యారు. ఇదే గ్రామం నుండి 2006లో ఖాన్‌పాలపట్నం బ్లాక్‌లోని అన్నారం వద్ద కామ్రేడ్ రొక్కల అశోక్ శత్రువు చేసిన ఆంబుష్‌లో చిక్కి



అమరుడయ్యాడు. 2007లో కంచాల వద్ద జరిగిన కోవర్టు దాడిలో కొప్పుల పాపారావు (భాస్కర్) అమరుడయ్యాడు. వీరంతా కామ్రేడ్ ఊర్మిళకు ప్రేరణగా నిలిచారు.

నిరుపేద కుటుంబం కావడంతో తల్లితో పాటు కూలి పనులకు వెళ్లేది. పితృస్వామ్య సమాజం మహిళలకు నిర్దేశించిన అన్ని పనులను చేస్తూ, నాలుగు గోడల మధ్య బందీ అయి ఇంటి వద్ద చదువుకోలేక పోయింది. కూలి చేస్తే గాని పూటగడవని పరిస్థితులలో అనేక కష్టాలను ఎదుర్కొంది. కష్టాల నుండి బయట పడే ఆలోచనలు పరిపరి విధాలుగా చేసింది. ఆ గ్రామానికి, కుటుంబానికి వున్న నేపథ్యం, అమరుల వారసత్వం మూలంగా, కామ్రేడ్ ఊర్మిళ ఉత్తర తెలంగాణ ఉద్యమం దెబ్బతిని, ఆటులో అనేక సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలోనే 2008లో దళంలో చేరింది. విప్లవోద్యమంలోని ఎత్తు పల్లాలను అర్థం చేసుకుంటూ, అధిగమిస్తూ, సంక్లిష్ట పరిస్థితుల్లో కూడా వెనుతిరిగి చూడకుండా విప్లవానికి అంకితమై చివరి వరకు పోరాడింది.

కామ్రేడ్ ఊర్మిళ 2008 నుండి 2011 ఆగస్టు వరకు ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ దళం సభ్యురాలుగా, 2011 ఆగస్టు నుండి 2012 జూలై వరకు కెకెడబ్ల్యూ డివిజన్ ఎస్‌జిఎస్ సభ్యురాలుగా పనిచేసింది. 2012 జూలైలో ఏరియా కమిటీ సభ్యురాలుగా ప్రమోట్ అయి అమరత్వం చెందేనాటి వరకు కొత్తగూడెం-నర్సంపేట ఏరియా కమిటీలో కొనసాగింది.

కామ్రేడ్ ఊర్మిళ పార్టీలో చేరిన తరువాతే కష్టపడి చదువు నేర్చుకుంది. పుస్తకాలు చదువుతూ, తెలియని విషయాలు ఇతరుల నుండి తెలుసుకుంటూ చైతన్యాన్ని పెంచుకుంది. కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఉత్సాహపడేది. శ్రద్ధ చూపేది.

కామ్రేడ్ ఊర్మిళ ఐదు సంవత్సరాల విప్లవ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను సహజంగానే తీసుకుంది. ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, ప్రజాయుద్ధంలో ప్రజలను సమీకరించడానికి కృషి చేసింది. పార్టీ కమిటీలు, వర్గ సంఘాలను నిర్మించడంలో భాగస్వామి అయింది. ప్రజలతో ఆప్యాయంగా కలిసిపోయింది.

ప్రజా సంఘాలకు పార్టీ రాజకీయ ప్రచార కార్యక్రమాలను ఇచ్చి విజయవంతం చేయడంలో ముఖ్య భూమిక పోషించింది. సమిష్టి పనులు, బరువులు మోయడంలో వెనుకాడేది కాదు. అన్ని పనులను, బాధ్యతలను పట్టుదలతో చేసేది. మిలిటరీ క్రమశిక్షణను ఖచ్చితంగా అమలుచేస్తూ వుండేది. శారీరక దారుఢ్యంపై శ్రద్ధపెట్టేది. మిలిటరీ విన్యాసాల్లో నైపుణ్యం పెంపొందించుకోవడానికి కృషి చేసేది.

తోటి కామ్రేడ్స్‌తో కలుపుగోలుగా వుంటూ, ఎవరితోనైనా ఆప్యాయంగా మాట్లాడడం, తన మాటను నవ్వుతో ప్రారంభించడం ఆమె సహజ లక్షణం. ఈ విధంగా పార్టీ శ్రేణుల, ప్రజల ఆదరాభిమానాలు, మన్ననలు చూరగొన్నది.

కామ్రేడ్ ఊర్మిళ 2011లో జరిగిన ఏటూరు నాగారాం-మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ ప్లీనానికి హాజరై, ఉద్యమ నిర్మాణ సమీక్షలో తన వంతు బాధ్యతను పోషిస్తూనే, తన అభివృద్ధికి కూడా ఉపయోగించుకుంది.

2013లో కెకెడబ్ల్యూ డివిజన్ ప్రత్యేక మహిళా సమావేశంలో ప్రతినిధిగా పాల్గొని, తగిన నిర్ణయాలు చేయడంలో తన వంతు భూమికను పోషించింది.

ఉద్యమ పునర్నిర్మాణానికి ఆటంకంగా వున్న, శత్రు నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయాలనే నిర్ణయంలో భాగంగా, 2010లో ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ మధును, అమరుడు సింగన్న ఎన్‌కౌంటర్‌కు కారణమైన మాజీ దళ సభ్యురాలు ఆగబోయిన అనసూర్యను, భూస్వామి, కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రజా కంతకుడు రెడ్డిగూడెం గ్రామానికి చెందిన కళ్లెం వెంకటరెడ్డిలను ఖతం చేయడంలో చురుకుగా వ్యవహరించింది.

శత్రువు తీవ్ర నిర్బంధాన్ని తెస్తూ, సమాచార ఆధారిత దాడులు కొనసాగిస్తూ దళాలను నిర్మూలించాలనుకొంటున్నాడు. అందులో భాగంగానే దళాలపై అనేక దాడులు కొనసాగించాడు. కొమ్ముగూడెం, వాయిపేట, సింగం వద్ద గ్రేహౌండ్స్-ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు కలిసి కుట్ర పూరిత దాడులు చేశాయి. ఈ దాడులలో కామ్రేడ్ ఊర్మిళ శత్రువును ప్రతిఘటిస్తూ సురక్షితంగా రిట్రీట్ అయింది. పువ్వార్ ఎన్‌కౌంటర్‌లో సహచర కామ్రేడ్స్‌తో సహా, వీరోచితంగా పోరాడుతూ, అత్యంత ధైర్య సాహసాలు ప్రదర్శించి, శత్రువును గండికొట్టి తన తోటి, నాయకత్వ కామ్రేడ్స్‌ను కాపాడిన వీరవనిత కామ్రేడ్ ఊర్మిళ. కామ్రేడ్ ఊర్మిళ భౌతికంగా నేడు మన ముందు లేదు. కాని, కామ్రేడ్ ఊర్మిళ ప్రదర్శించిన పట్టుదల, ధైర్య సాహసాలు, అంకిత భావం, ఆమె నెలకొల్పిన ఆదర్శాలు అలవర్చుకోవడం ద్వారా ఆమె భౌతికంగా లేని లోటును తీర్చుకోగలం. కామ్రేడ్ ఊర్మిళ ఆశయాలను నెరవేరుద్దాం. తను కన్న కలలను నిజం చేద్దామని శపథం చేద్దాం.

**కామ్రేడ్ ఊర్మిళ అమర్ రహే!**

# నిర్బంధ శిశిరంలో విరిసిన పోరు వసంతం



కామ్రేడ్ కురుసం సుమలత (వసంత) దాదాపు 23 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా, భూపాలపట్నం బ్లాక్, అన్నారం గ్రామంలో పుట్టింది. కురుసం నమ్మక్క, రామారావు దంపతులకు కల్గిన ఆరుగురు సంతానంలో కామ్రేడ్ వసంత రెండో బిడ్డ. కామ్రేడ్ వసంత అన్న రవి 2006లో అమరుడు కాగా, ప్రస్తుతం ఇద్దరు చెల్లెండ్లు, ఇద్దరు తమ్ముండ్లు వున్నారు. తమకున్న కొద్దిపాటి భూమిలో ఆరుగాలం కష్టించి పని చేసినా బతుకు జరగని స్థితిలో తల్లి కూలికి వెళుతూ, తండ్రి జీతం వుంటూ పిల్లలందర్ని పెంచి పెద్ద చేశారు. అన్న రవి ఇంటికి పెద్దవాడు కావడంతో తను కొద్ది కాలం కుటుంబ భారాన్ని మోస్తూ ఈ సమాజాన్ని అధ్యయనం చేశాడు. తమ బాధలకు, కష్టాలకు ఈ దోపిడీ సమాజమే కారణమని అర్థం చేసుకున్నాడు. చిన్న నాటి నుండే పార్టీతో పరిచయం వున్న కామ్రేడ్ రవి పార్టీ రాజకీయాలకు ఆకర్షితుడై ఈ దోపిడి సమాజాన్ని మార్చాలని కాంక్షించి 2005లో దళంలో చేరాడు. కాని, 2006 మేలో గ్రేహౌండ్స్ బలగాలు మాటువేసి మద్రిమల్ల గ్రామం వద్ద కామ్రేడ్ రవిని కాల్చి చంపాయి. ఆ విధంగా దళంలో చేరిన అతి తక్కువ కాలంలోనే కామ్రేడ్ రవి అమరత్వం చెందాడు.

కామ్రేడ్ రవి భావాలు సహజంగానే కామ్రేడ్ కురుసం సుమలతపై కూడా పడ్డాయి. అన్న బాటలో నడవాలని, అన్న ఆశయాలను నెరవేర్చాలని నిశ్చయించుకుంది. పట్టుదలతో 2009 అక్టోబర్‌లో పదిహేడేండ్ల లేత వయసులో గెరిల్లాగా మారింది.

గెరిల్లా జీవితంలోకి వచ్చిన తర్వాత మొదట ఒక ఎస్‌జెడ్‌సీ సభ్యుడి ప్రొటెక్షన్ దళంలో సభ్యురాలుగా పనిచేసింది. 2011 ఆగస్టు నుండి ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ దళంలో, 2012 జూన్ నుండి కొత్తగూడెం-నర్సంపేట దళంలో పనిచేసింది.

పితృస్వామ్య సమాజంలో మహిళలకు విధించిన నియమాలు, పేదరికం, కామ్రేడ్ వసంత చదువును అడ్డుకోవడం మూలంగా ఇంటి వద్ద చదువుకోలేకపోయింది. దళంలో చేరినప్పటి నుండి

చదువు నేర్చుకోవడం మొదలుపెట్టి సంవత్సర కాలంలోనే చదవడం, రాయడం నేర్చుకుంది. వెనకబాటుతనం నుండి బయటపడడానికి, నేర్చుకోవడానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చేది. తెలియని రాజకీయ, మిలిటరీ విషయాలను ఎప్పుడూ అడిగి తెలుసుకుంటుండేది.

దళంలోకి వచ్చిన తర్వాత నేర్చుకున్న చదువుతోనే వైద్యం చేయడం కూడా నేర్చుకొంది. చదువుకొని ఇంగ్లీష్ మందులను గుర్తుపెట్టుకుంటూ మంచిగా వైద్యం చేసేది. జ్వరం వచ్చిన వారిని రోగ లక్షణాలు అడిగి తెలుసుకుంటూ, సేవలు చేస్తూ మంచిగా చూసుకునేది. అందరితో కలుపుగోలుగా వుంటూ, సమిష్టి పనులలో ముందుంటూ క్యాడర్, ఆదరాభిమానాలు పొందింది.

పార్టీ యిచ్చిన బాధ్యతలను తూ.చ. తప్పకుండా పాటిస్తూ, పార్టీ నిర్వహించిన మిలిటరీ, రాజకీయ తరగతులను శ్రద్ధగా నేర్చుకుంటూ తనను తాను అభివృద్ధి పరుచుకుంటూ వచ్చింది.

దెబ్బతిన్న ఎన్‌టి ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో తనవంతు కృషిని అందించింది. ముఖ్యంగా మహిళలను సంఘటితం చేయడానికి తపన పడింది. మహిళలపై జరుగుతున్న అణచివేతలు, అత్యాచారాలు, యాసిడ్ దాడుల వంటి సమస్యలకు ఈ పితృస్వామ్య సమాజమే కారణమని, ఈ సమాజం మారకుండా స్త్రీ విముక్తి జరగదని చెప్పుతూ మహిళలందరినీ సమీకరించేది. మహిళలపై కేంద్రీకరించి, వారిని సంఘటితం చేయడానికి కృషి చేస్తూనే, తనను తాను అభివృద్ధి చేసుకోవడానికి, మహిళా సాహిత్యం చదివేది. మహిళల సమస్యలను అధ్యయనం చేసేది. మహిళల సమస్య రాజ్యాధికార సమస్యతో ముడిపడి వుందని అర్థం చేసుకొంది.

దళంలో వున్న పితృస్వామ్య భావాలపై పోరాటం చేసింది. 2013 మార్చిలో జరిగిన ఎన్‌టీ మహిళా ప్రత్యేక సమావేశంలో తన అభిప్రాయాలను స్పష్టంగా మాట్లాడింది. పార్టీలో వున్న అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా దళ సమావేశాలలో నిర్దిష్టంగా విమర్శలు చేస్తూ, పోరాడుతూ వుండేది. తనకు అనారోగ్య సమస్యలున్నప్పటికీ వాటినన్నింటిని అధిగమిస్తూ ఉద్యమ నిర్మాణం కోసం పాటు పడింది.

ఉత్తర తెలంగాణ ఉద్యమాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే లక్ష్యంతో శత్రువు తీవ్ర నిర్బంధాన్ని తలపెడుతూ, ప్రజాస్వామిక ఉద్యమాలపై, వాటికి నాయకత్వం వహిస్తున్న పార్టీపై దాడులు కొనసాగిస్తున్నాడు. ఈ దాడులు, సమస్యలు, నష్టాల మధ్యన కామ్రేడ్ వసంత ఉద్యమంలో నిలబడింది. అన్నారం గ్రామం నుండి దళంలోకి వచ్చిన వారందరూ ఉద్యమాన్ని వదిలిపోయి, తన బంధువులే కొంతమంది శత్రుపక్షం చేరిపోయినప్పటికీ, తను మాత్రం రక్త సంబంధం కంటే వర్గ సంబంధమే గొప్పదని నమ్మింది. లోదేడ్ గ్రామంలో తన బంధువైన ఇన్‌ఫార్మర్‌ను, ఖతం చేయాలనే పార్టీ నిర్ణయాన్ని అంగీకరించి, ఎంతో పరిణతినీ, చైతన్యాన్నీ ప్రదర్శించింది.

తల్లిదండ్రులు తనను ఇంటికి రమ్మని చెప్పినప్పటికీ కామ్రేడ్ వసంత అంగీకరించలేదు. అమరుల ఆశయాలను నెరవేర్చాల్సిన లక్ష్యం మిగిలే వుందని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చే వరకు పార్టీలోనే వుంటానని చెప్పింది. ఈ సమాజం మారకుండా మన బతుకులు మారవని తల్లిదండ్రులకు అర్థం చేయించింది.

ఒక ఏరియా కమిటీ సభ్యుడిని 2012 మార్చిలో కామ్రేడ్ వసంత పెళ్లి చేసుకుంది. పరస్పర ఇష్టం, అవగాహనలతో జరిగిన పెళ్లి అది.

కామ్రేడ్ వసంత మిలిటరీ చర్యల్లో, శత్రు దాడుల్లో పాల్గొంటూ, మిలిటరీ నైపుణ్యాన్ని పెంచుకొంది. గుండాల మండలంలో 2012 అక్టోబర్‌లో ఇన్‌ఫార్మర్ అయిన అనసూర్యను, పాల్వంచ మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూస్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కళ్లెం వెంకటరెడ్డిని ఖతం చేయడంలో పాల్గొంది.

2011 అక్టోబర్‌లో చిన్నబోయిన పల్లి వద్ద, 2012 ఫిబ్రవరిలో కొమ్ముగూడెం వద్ద, 2013 జనవరిలో వాయిపేట వద్ద, 2013 ఫిబ్రవరిలో సింగం వద్ద జరిగిన పోలీసు దాడులలో ప్రతిఘటిస్తూ సురక్షితంగా దళంతో పాటు రిట్రీట్ అయ్యింది.

తను అమరత్వం చెందిన చివరి దాడిలో సైతం, కామ్రేడ్ వసంత వీరోచితంగా పోరాడింది. కామ్రేడ్ వసంత మిగిల్చిన లక్ష్యాన్ని నెరవేర్చే కర్తవ్యాన్ని, మరింత దృఢంగా కొనసాగించడమే కామ్రేడ్ వసంతకు మనం ఇచ్చే సరైన నివాళి.

**కామ్రేడ్ వసంత అమర్ రహే!**

## బతుకు పోరు నుండి వర్గ పోరుకు సాగిన కామ్రేడ్ అజయ్



కామ్రేడ్ మడకం భీమాల్ (అజయ్) ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మాడక్ అనే చిన్న ఆదివాసీ గూడెంలో దాదాపు 18 ఏళ్ల క్రితం పుట్టాడు. చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడంతో కామ్రేడ్ అజయ్ అన్నా, వదినల వద్ద పెరిగాడు. ఏ ఆధారం లేని ఆ కుటుంబం పొట్టచేత పట్టుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని, వరంగల్ జిల్లా, తాడ్వాయి మండలం, కౌశెట్టివాయి గ్రామంలో స్థిరపడింది.

కామ్రేడ్ అజయ్ అన్నా, వదినలతో పాటు కూలి పనికి వెళ్లేవాడు. ఆదివాసుల అమాయకత్వం, అక్కడ ఏ అండా లేని వారి బలహీనతను ఆసరా చేసుకొని, కూలీ డబ్బులు ఇవ్వకపోవడం, ఇచ్చినా తక్కువ కూలీ ఇచ్చి మోసం చేయడంతో, చేసిన పనికి ఫలితం దక్కక పోయేది. కామ్రేడ్ అజయ్ కొద్ది కాలం పాటు గొడ్లు కాశాడు. అలా కూడా కుటుంబం గడవకపోవడంతో, కాటాపురం గ్రామం ధనికుల వద్ద ఒక సంవత్సరం జీతం వున్నాడు. అయినా బతుకు సాగకపోగా, తను అక్కడ అనేక బాధలు పడ్డాడు. అధిక శ్రమ, వేధింపులను భరించలేక మరో పనిని వెతుక్కున్నాడు. బోరింగ్ పనులు చేశాడు. ఇండ్లు కట్టే పనిలో కూలీగా వెళ్లాడు. ఈ

పనుల కోసం ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాలు, నగరాలు, గ్రామాలు తిరిగి, తిరిగి విసిగి వేసారిపోయాడు. ఎక్కడ తిరిగినా, ఏ పని చేసినా కష్టాన్ని దోచుకున్న వారే తప్ప, కష్టానికి తగిన కూలీ ఇచ్చిన వాళ్లు లేరు. సమాజం మారితేనే తనలాంటి వారి కష్టాలు తీరుతాయని అర్థం చేసుకున్నాడు. ఈ సమాజాన్ని మార్చే కృషిలో భాగం కావాలనుకున్నాడు. అందుకే 2011 నవంబర్‌లో పార్టీలో చేరి కొత్త జీవితాన్ని ప్రారంభించాడు.

కామ్రేడ్ అజయ్ రిక్రూట్ అయిన వెంటనే కొత్తగూడెం-నర్సంపేట దళంలో సభ్యుడిగా పనిచేసి, ఆ తరువాత కెకెడబ్ల్యూ డివిజన్ కమిటీ సభ్యుడికి గార్డ్‌గా పనిచేస్తూ అమరత్వం చెందాడు. తను ఎక్కడ వున్నా, ఏ పని చేసినా ఆ పనికి అంకితమై పనిచేశాడు. బాధ్యతాయుతంగా వుండేవాడు. రోజువారి స్టాండింగ్ ఆర్డర్స్‌ను, మిలిటరీ క్రమశిక్షణను పాటిస్తూ వుండేవాడు, తన శరీర దారుఢ్యం పెంచుకోవడానికి రోజూ వ్యాయామం చేస్తూ, మిలిటరీ టెక్నిక్‌లను శ్రద్ధతో నేర్చుకునేవాడు.

కామ్రేడ్ అజయ్ విప్లవోద్యమంలో చేరి ఒకటిన్నర సంవత్సరాలే అయినా శత్రువు చేస్తున్న కుట్రపూరిత దాడులను తిప్పికొట్టడంలో మంచి నైపుణ్యాన్ని సంపాదించాడు. తను దళంలోకి చేరిన రెండు నెలలకే, గుండాల మండలం కొమ్ముగూడెం వద్ద, శత్రువు రాత్రి అతి సమీపం నుండి దాడి చేశాడు. ఆ దాడి తనకు కొత్తదే అయినా ఏ మాత్రం గందరగోళ పడకుండా నిలబడ్డాడు. ఆ తరువాత 2012 నవంబర్ 12న దుద్దేడ వద్ద గ్రేహౌండ్స్ పోలీసులు చేసిన దాడిలో కామ్రేడ్ అజయ్ అన్న కొడుకు కామ్రేడ్ మడకం దేవాల్ (జగన్) అమరుడయినా, అధైర్య పడకుండా శత్రువును ప్రతిఘటించాడు. అనంతరం జరిగిన కామ్రేడ్ దేవాల్ సంస్మరణ సభలో కామ్రేడ్ అజయ్ మాట్లాడుతూ, 'మేము ఇద్దరం ఒకేసారి, ఒకే లక్ష్యం కోసం దళంలో చేరాము. చివరి వరకు పోరాడాలని నిర్ణయించుకున్నాము. ప్రజా రాజ్యాధికార సాధనే లక్ష్యంగా శత్రువు మూకలతో కొట్లాడుతూ కామ్రేడ్ దేవాల్ అమరుడయ్యాడు. అతని అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకొని అతని ఆశయాలను తుదివరకూ తీసుకెళ్తాను' అంటూ కన్నీరును కసిగా మలిచి శపథం చేస్తూ తన ఉపన్యాసాన్ని ముగించాడు. ఆ మాటలకు అక్షరాలా కట్టుబడ్డాడు.

ఆ తరువాత 2013 ఫిబ్రవరిలో, సింగం వద్ద శత్రువు చేసిన దాడిలో ధైర్యంగా వుండి, ఒక్క వస్తువు కూడా శత్రువుకు దొరకకుండా తీసుకొచ్చి, గార్డ్ బాధ్యతలకు సరైన అర్థానిచ్చాడు. శత్రువు ఎంత మంది బలగాలతో వున్నా, వెళ్లి ఒక్కన్నయినా చంపి వస్తాననే మాటలు అతని ధైర్య సాహసాలను, కసిని పోరాట పటిమను తెలియజేస్తాయి.

పువ్వార్ దాడిలో కామ్రేడ్ అజయ్ శత్రువు చుట్టివేతను వీరోచితంగా ఛేదించే క్రమంలో చివరి క్షణంలో అమరుడయ్యాడు.

కామ్రేడ్ అజయ్ బక్క పల్చటి మనిషి. ఎప్పుడూ చురుకుగా కదలాడుతూ, ముసిముసిగా నవ్వుతూ, అందిరిలో కలిసి పోయేవాడు. కఠోరమైన శ్రమను ఇష్టంతో చేసేవాడు. అది ఎంత కష్టమైనదైనా వెనుకడుగు వేసేవాడు కాదు. వర్తమానంలో ఎదిగి వస్తున్న విప్లవ కెరటాన్ని నష్టపోవడం తీవ్ర బాధను, దుఃఖాన్ని కల్గించే విషయం. కామ్రేడ్ అజయ్ ఆశయాలను తుదివరకు కొనసాగిస్తామని ప్రతిన బూనుదాం.

**కామ్రేడ్ అజయ్ అమర్ హై!**

## దండకారణ్య పోరు వారసత్వం

## కామ్రేడ్ నవత



కామ్రేడ్ మిచ్చే సీత (నవత) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ఆవువల్లి బ్లాక్ తిమ్మాపురం గ్రామంలో ఆదివాసీ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది. కామ్రేడ్ సీత (19) తల్లి పేరు సమ్మక్క, తండ్రి పేరు భీమయ్య. తండ్రికి ఇద్దరు భార్యలు వుండడంతో వాళ్ల కుటుంబం చాలా పెద్దది. 2005లో సల్వాజుడుం పాశవిక దాడుల నుండి రక్షణ కోసం, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ఎనిమిదేండ్ల క్రితం, ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా, మంగపేట మండలం, పూరేడుపల్లి గ్రామానికి వలసవెళ్లి, ఆ కుటుంబమంతా స్థిరపడింది. అక్కడ కొద్దిపాటి భూమిని పోడు చేసుకొని, దానితో పాటు కూలిపని చేసుకుంటూ బతుకు వెళ్లదీసేవారు. కామ్రేడ్ నవత కూడా తల్లిదండ్రులతో పాటు కూలీ పనులకు వెళ్లేది. తల్లిదండ్రులు నవతకు ఇష్టం లేని పెళ్లిని బలవంతంగా చేయతలపెట్టారు. ఈ పెళ్లిని ఎలా తప్పించుకోవాలా అని, కామ్రేడ్ నవత ఆలోచిస్తున్న సమయంలోనే, అనుకోకుండా ఆ గ్రామానికి వెళ్లిన దళం నవతకు కలిసింది. దళం చెప్పిన రాజకీయాలతో, తన ఆలోచనలకు పరిష్కారమార్గం దొరికినట్లయింది. ఆ పరిష్కార మార్గంలో భాగంగానే, దళంలో చేరాలని నిర్ణయించుకొని 2012 జనవరి 30న పార్టీలో చేరింది.

కామ్రేడ్ నవత దళంలో చేరిన 20 రోజులకే కొమ్ముగూడెం వద్ద దళంపై దాడి జరిగి, కామ్రేడ్ సింగన్న అమరుడయ్యాడు. కామ్రేడ్ పుష్పకు కాలుకు తూటా తగిలి గాయమైంది. దాడి జరిగిన మరుసటి రోజు నుండి, తీవ్రమైన కూంబింగ్స్‌తో అన్నం దొరకని గడ్డు పరిస్థితి ఎదురయింది. అయినప్పటికీ కామ్రేడ్ నవత అధైర్యపడకుండా నిర్భయంగా నిలబడింది.

కామ్రేడ్ నవతలోని కష్టపడే తత్వం, ఓపిక, క్రమశిక్షణను చూసి, పార్టీ ఆమెను 2012 జూన్‌లో కామ్రేడ్ పుష్పకు (డివిసిఎమ్) గార్డ్‌గా నియమించింది.

# మహిళా ఉద్యమ నేత, మేధావి, మార్క్సిస్టు ఉపాధ్యాయురాలు

# కామ్రేడ్ మహిత అమర్ రహే!

2013 ఏప్రిల్ 29న సీనియర్ మహిళా నేత, సెంట్రల్ రీజినల్ పొలిటికల్ స్కూల్ సభ్యురాలు కామ్రేడ్ మహిత ఏఓబీలోని మల్కన్‌గిరి డివిజన్‌లో కన్నుమూసింది.

మహిత అనగానే అందరికీ బక్కపలచని రూపం, అనారోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా అడవి దారుల్లో, కొండల్లో తిరిగే మొండితనం, పట్టుదల గుర్తుకు వస్తాయి. అమరుడు పులి అంజన్న 'ఒట్టి మొండిపిల్ల' అన్నా, అమరుడు శ్యామన్న 'పుస్తకాల పురుగు' అన్నా మురిసిపోయేది. సిద్ధాంత, రాజకీయ విషయాలు తెలుసుకోవాలనే తపన, స్పష్టత, మొండితనం కలిసి 30 యేళ్ళ రాజకీయ జీవితంలో తనకు ఎదురైన ఎన్నో సమస్యల్ని తట్టుకునేలా చేశాయి. ప్రేమ బంధాలు మధ్యలోనే తెగిపోయినా, మాతృప్రేమ కాళ్ళకు బంధాలు వేయజూసినా రాజకీయ చైతన్యంతో, మొండిగా ఆ బంధనాలు తెంచుకుని ప్రజల వైపే నిలిచింది. సైద్ధాంతిక, రాజకీయ విషయాలను ఎంతో దృఢంగా చర్చించేది. శత్రు చేత చిక్కినాగానీ, వాడి అదిలింపులు, బెదిరింపులను లెక్క చేయకుండా కొనగోటితో తీసిపారేసింది. శత్రు పన్నాగాలు ఏవీ ఆమెని లొంగదీయలేకపోయాయి. శత్రువు పట్ల తీవ్రమైన కసిని, ప్రజల పట్ల అపారమైన ప్రేమను పెంచుకుంది.



## సుదీర్ఘ విప్లవ పయనం

మన మహిత అసలు పేరు లక్ష్మి. నల్గొండ జిల్లా, కోదాడ మండలం, కందిబండ గ్రామంలో పుట్టిన లక్ష్మి చిన్నతనంలోనే తల్లి ప్రేమకు దూరమైంది. లక్ష్మి చిన్నతనంలోనే ఆమె తల్లి మరణించింది. తల్లిలేని లక్ష్మి మేనమామ ఇంట అత్తనే 'అమ్మా' అని పిలిచింది. అప్పుడప్పుడు అమ్మమ్మ దగ్గరికి వెళ్ళి వస్తూ వుండేది. బాల్యము, విద్యాభ్యాసము మేనమామ దగ్గరే నడిచింది. మేనమామ ఉద్యోగి కావడంతో శ్రద్ధ పెట్టి చదివించాడు. తను పుట్టింది నల్లగొండ జిల్లా అయినా మేనమామ దగ్గర వుండి వరంగల్‌లో చదువుకున్నది. హన్మకొండలో సర్కారు బడిలో పదవ తరగతి వరకూ చదువుకుంది. క్రిష్ణా కాలేజీలో ఇంటర్ మీడియేట్ చదివింది. ఈ సమయంలోనే ఆర్ఎస్‌యూలో చేరి గ్రామాలకు తరలండి క్యాంపెయిన్ చేసింది. నూతన భావాలు తెచ్చే క్రొత్త ప్రశ్నలతో క్యాంపెయిన్ జట్టులోని సహ విద్యార్థుల్ని ఆలోచింపజేసి, వాళ్ళందరికి గుర్తుండిపోయేలా నిలిచిపోయింది. ప్రజల జీవితాన్ని దగ్గరగా చూసి తన జీవితాన్ని విప్లవకరంగా తీర్చిదిద్దుకోవడానికి తోడ్పడిన ఆ ప్రశ్నల పరంపర లక్ష్మిలో పట్టుదలను, విశ్వాసాన్ని, దృఢచిత్తాన్ని పెంపొందించింది. 30 సంవత్సరాల సుదీర్ఘ విప్లవ జీవితంలో అనేక రంగాల్లో పనిచేసి తన వ్యక్తిత్వాన్ని, విప్లవతత్వాన్ని మెరుగుపరుచుకుంది.

కామ్రేడ్ లక్ష్మి 1983 ఏప్రిల్ 14న పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలో చేరింది. 1983లో వరంగల్ ఆర్ఎస్‌యూ టౌన్ కమిటీ కాన్ఫరెన్స్‌లో, టౌన్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికయింది.

---

కామ్రేడ్ నవత దళంలో చేరిన కొద్ది కాలంలోనే ప్రాథమిక విద్యను పట్టుదలతో నేర్చుకుంది. మిలిటరీ, రాజకీయ తరగతులకు హాజరై శ్రద్ధతో రాజకీయ చైతన్యాన్ని పెంచుకున్నది. సమిష్టి పనులలో బాధ్యతాయుతంగా పాల్గొనేది. తనకిచ్చిన బరువులను మోయడంలో గాని, ఇతర ఏ పనులు చేయడంలో గాని, ఎప్పుడూ వెనుకాడేది కాదు. రోజు దిన చర్యను రాస్తూ, సమయపాలనను తప్పకుండా పాటిస్తూ మంచి క్రమశిక్షణతో మెలిగేది. మిలిటరీ ప్రాక్టీస్‌లో ఉత్సాహంగా పాల్గొనేది. తను వచ్చి కొద్ది కాలమే అయినప్పటికీ అందరి మన్ననలను పొందింది. అందరితో కలివిడిగా వుంటూ తెలియని విషయాలు తెలుసుకుంటూ వుండేది. తాను పార్టీలో చేరిన సంవత్సర కాలంలోనే, కొమ్ముగూడెం, దుద్దేడ, వాయిపేట, సింగం గ్రామాల వద్ద శత్రువు చేసిన దాడులలో నిబ్బరంగా వుండి పోరాడింది. ఈ దాడులలో కమాండర్‌ను రక్షిస్తూ తను సురక్షితంగా రిట్రీట్ అయ్యింది. చివరగా పువ్వర్తి దాడిలో, తన కమాండర్ కామ్రేడ్ పుష్పతో పాటు కామ్రేడ్ నవత శత్రువును ప్రతిఘటిస్తు, వీరోచితంగా పోరాడి తన నులివెచ్చని రక్తాన్ని ధారపోసింది.

కామ్రేడ్ నవత ఇపుడిప్పుడే విప్లవోద్యమంలో అనుభవం సంపాదిస్తూ రాటుదేలుతున్న నవతరం వీర గెరిల్లా. రెండు పదులు నిండని చిన్న వయసులోనే, సమస్త పీడిత ప్రజలను పీల్చుక తింటున్న ఈ దోపిడీ రాజ్యాన్ని కూల్చి, నూతన సమాజాన్ని నిర్మించాలని కలలు కన్నది. తన కలలు నిజమయ్యే మార్గంలో పోరాడుతూ, తన నవ యవ్వనాన్ని తృణప్రాయంగా అర్పించింది.

కామ్రేడ్ నవత నుండి మనం నేర్చుకోవల్సింది ఎంతో వుంది. ఆమె పోరాట పటిమ, కష్టపడేతత్వం, త్యాగనిరతి మనందరికీ ఆదర్శం.

కామ్రేడ్ నవత ఆశయాలను నిజం చేయడానికి మనమంతా తుదివరకు పోరాడుదామని శపథం చేద్దాం.

**కామ్రేడ్ నవత అమర్ రహే!** ★

1983-84లలో ఆ బాధ్యతల్లో కొనసాగింది. ఆ తర్వాత 18 ఏళ్ళ వయసులో పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పార్టీ ఇచ్చిన పనిని చేపట్టి నాయకత్వ రక్షణ కోసం డెన్ కీపర్‌గా మారింది. ప్రజలలో పనిచేయాలనే తన కోరికకు భిన్నమైన పని అయినప్పటికీ ఉద్యమ అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చి క్రమశిక్షణగా ఆ పనిని నిర్వహించింది. అమరులు ప్రకాష్ మాస్టారు, పులి అంజన్న, శ్యామన్న ఇంకా అనేక మంది కామ్రేడ్స్ రక్షణ బాధ్యతను చూస్తూనే వాళ్ళ ప్రేమానురాగాలను పొందింది. పార్టీ కార్యకర్త ఛూటే, తను పరస్పర ఇష్టంతో 1985లో వడ్డేపల్లిలో పెళ్ళి చేసుకుని డెన్ జీవితంలో వుంటూ రహస్య పార్టీ పనులు చేసేవారు. డెన్‌లో ఇంటి పని ఇద్దరు చేయాలని గట్టిగా చర్చించింది. దాంతో ఛూటే, లక్ష్మీ ఇద్దరూ వంతులవారీగా ఇంటి పని చేసేవారు. పితృస్వామ్య భావజాలానికి వ్యతిరేకంగా పోరాడడంలో ఎప్పుడూ ముందు వుండేది. 1986లో రామ్‌నగర్ అరెస్టులలో భాగంగా కామ్రేడ్ శ్యామన్నతో పాటు లక్ష్మీ, ఛూటే కూడా అరెస్టు కావడంతో వారి డెన్ కార్యకలాపాలకు తెరపడింది. రామ్‌నగర్ కుట్ర కేసులో ఒక 'కుట్రదారు' అయ్యింది.

పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టినా, లక్ష్మి శత్రువుతో తలపడి దృఢంగా నిలిచింది. ఆమె భయపడలేదు. లొంగలేదు. ఛూటే బలహీనపడడంతో లొంగదీసుకున్న పోలీసులు అమె విషయంలో ఓడిపోయారు. అదే పోరాట పటిమను నాలుగు సంవత్సరాల జైలు నిర్బంధంలో కూడా కొనసాగించి, అక్కడే డిగ్రీ పరీక్షలు రాసి పాసయ్యింది. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులలో జైలు నించి విడుదల అయ్యింది.

1990 మే 5-6న వరంగల్‌లో జరిగిన రైతుకూలీ సంఘం ద్వితీయ మహాసభల సన్నాహాలలోను, నిర్వహణలోనూ మంచి భూమికను నిర్వహించింది. అమరుడు కామ్రేడ్ సూర్యం (చింతల వెంకటస్వామి) గైడెన్స్, ప్రోత్సాహం, ప్రజా కదలిక ఆమెలో నూతన వుత్సాహాన్ని పెంచాయి. చిన్న, చిన్న విజయాలకే ఉప్పొంగిపోయే లక్ష్మి ఆ సభల వాతావరణం ఇచ్చిన ఉత్తేజంతో మరింత పట్టుదలగా పనిచేయడానికే నిర్ణయించుకుంది. కొంతకాలం పాటు పీస్‌బుక్ సెంటర్‌లో పనిచేసింది. చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవడంలో వుండే ఆసక్తికి ఈ బాధ్యత ఎంతో తోడ్పడింది. రాజకీయ, సిద్ధాంత విషయాల్లో తన అవగాహనను విస్తృతం చేసుకుంది. ఈ సమయంలోనే వాళ్ళకి బాబు పుట్టాడు.

నిజానికి కామ్రేడ్ మహిత పిల్లల్ని కనడం విప్లవ జీవితానికి ఆటంకమని భావించింది. పార్టీ అవగాహనను ఆమె పూర్తిగా ఆమోదించింది. అయితే జైలు నుండి విడుదలైన తరువాత ఛూటే వాళ్లింట్లో వుండడం, ఆయన ఊగిసలాడుతూ మహితను కూడా ఇంటి వద్దే వుండమని వత్తిడి చేస్తుండడం – ఈ పరిస్థితిలో ఆమె గర్భం ధరించింది. అబార్షన్ చేయించుకోవడానికి ఛూటే సహకారం లేక చాలా ఘర్షణ పడింది. పార్టీ బాధ్యులు కలిసే నాటికి అయిదవ నెల దాటిపోయింది. ఆ స్థితిలో అబార్షన్ చేయించుకోవడం ప్రాణానికి ప్రమాదం అని భావించడం వల్ల ఆమె అబార్షన్ చేయించుకోలేదు.

1990 చివరికల్లా లీగల్ అవకాశాలు తగ్గి నిర్బంధం తీవ్రమైంది. రహస్య జీవితంలోకి వెళ్ళాల్సిన సమయం ముందుకు వచ్చింది. లక్ష్మి సహచరుడు ఇంటి దగ్గర వుండి పనిచేద్దాం అన్నాడు. కాని, లక్ష్మి చివరి వరకూ పార్టీలో వుండి పనిచేయాలని అనుకుంది. ఛూటేతో వున్న సహచర బంధాన్ని, బాబుతో వున్న మాతృ బంధాన్ని కూడా వదులుకుని ఒక సంవత్సరం వయసున్న బాబు 'అరణ్య'ను ఛూటేకిచ్చి మళ్లీ పార్టీలోకి వచ్చింది. కొద్దికాలం జంట నగరాలలోని కంటోన్మెంట్ ప్రాంతంలో కామ్రేడ్ సుధాకర్‌తో (1993 మొదట్లో అమరుడయ్యాడు) కలిసి ఆర్గనైజర్‌గా పనిచేసింది. 1992 నుండి రహస్య జీవితంలోకి వచ్చింది. ప్రజలలో పనిచేయాలనే కోరికతో ఆర్గనైజేషన్ పనిలోకి వచ్చింది. 1992 చివరి నుండి గుంటూరు సెంటర్‌గా తెనాలి, నిజాంపట్నం, రేపల్లె ప్రాంతాల్లో మహిళా వుద్యమ నిర్మాణ కృషి చేసింది. గుంటూరు జిల్లా మహిళా ఉద్యమ నిర్మాణ సమయంలో రూప పేరుతో పనిచేసింది. సారా వ్యతిరేక ఆందోళన, మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, గృహ హింస వంటి సమస్యలు చేపట్టి పోరాటాల్లోకి మహిళల్ని కదిలించింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలలో మహిళల చైతన్యాన్ని పెంచింది.

1994లో జరిగిన కేంద్రస్థాయి ప్రత్యేక మహిళా సమావేశానికి హాజరై మహిళా సమస్యపై రాజకీయపరమైన విషయాలు చర్చించింది. పార్టీలో మహిళల అభివృద్ధికి ఆటంకంగా వున్న పితృస్వామ్య భావజాలాన్ని గురించి జరిగిన చర్చలో చురుకుగా పాల్గొన్నది. మహిళా ఉద్యమాన్ని సమన్వయం చేయడం కోసం 1994లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఏర్పరిచిన మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ (ఎమ్.సి.సి.)లో సభ్యురాలిగా వుండి పనిచేసింది. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో చురుకైన పాత్ర నిర్వహించింది. రాష్ట్రంలో మహిళా ఉద్యమ నిర్మాణానికి జరిగిన సిద్ధాంత, రాజకీయ కృషిలో కామ్రేడ్ లక్ష్మి పాత్ర ముఖ్యమైనది. కామ్రేడ్ లక్ష్మి గుంటూరులో ఆర్గనైజర్‌గా, ఎస్‌సిబిసి కమిటీలో పనిచేసిన సందర్భంలో ఇతర ప్రాంతాల కామ్రేడ్స్‌తో కలిసినపుడు ఎన్నో రాజకీయ విషయాలు చర్చించడంతో పాటు సిద్ధాంత విషయాల్ని అర్థం చేయించేది. అక్క కలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి, ప్రేమగా వుంటుందని అందరూ ఉత్సాహం చూపేవారు.

తీవ్ర నిర్బంధ పరిస్థితులలో 1994లో గుంటూరు జిల్లా కాన్ఫరెన్స్ జరిగింది. ఆ కాన్ఫరెన్స్‌లో కామ్రేడ్ లక్ష్మి చేసిన చర్చలు, నిర్వహించిన పాత్ర జిల్లా కేడర్‌లో గుర్తుండి పోయేలా చేశాయి.

పట్టణ ఉద్యమ నిర్మాణ అనుభవంతో లక్ష్మి 1996లో ఏర్పడిన దక్షిణ కోస్తా జిల్లాల బెల్టు కమిటీ (ఎస్‌సిబిసి)లో సభ్యురాలిగ వుంటూ, మహిళా రంగానికి బాధ్యత వహించింది. ఆనాడు ఎస్‌సిబిసి ఆయా సెక్షన్స్ ప్రజల్ని అనేక సమస్యల్లో కదిలించి పోరాటాలు చేయించింది.

ప్రకాశం జిల్లా టంగుటూరు, చీమకుర్తి, చీరాల ఏరియాలలో దళితుల సమస్యలు, రైతాంగ సమస్యలు, చేనేత కార్మికుల సమస్యలలో కదిలించి పోరాటాలు చేయించింది. చీమకుర్తిలోని భూ పోరాటానికి ఎస్‌సిబిసి నాయకత్వం వహించింది. ఆ భూములు సాగు చేసుకుంటున్న దళిత రైతాంగం ఇప్పటికీ ఎస్‌సిబిసి కామ్రేడ్స్‌ని గుర్తు చేస్తారు. ఎస్‌సిబిసి కమిటీ సభ్యురాలిగా కామ్రేడ్ లక్ష్మికి ఈ పోరాటాల్లో తగిన భాగస్వామ్యం వుంది.

ఆ క్రమంలోనే 1999లో మాచర్లలో అరెస్టు అయ్యింది. శత్రువు ఎంత ప్రయత్నించినా గానీ పార్టీ రహస్యాలు ఏమి చెప్పకుండా దృఢంగా నిలబడింది. లక్ష్మితో పాటు అరెస్టు అయిన కమిటీ సభ్యుడు బలహీనపడి కొన్ని విషయాలు చెప్పాడు. కానీ, లక్ష్మి నుంచి కొంచెం కూడా సమాచారం రాబట్టలేక పోయాడు. 'అబ్బ, నువ్వు చాలా మొండిదానివి' అని పోలీసులు విసుక్కున్నప్పుడు వాడి ఓటమి చూసి నవ్వుకునేది. మూడు నెలల తర్వాత బెయిల్ మీద బయటికి వచ్చాక మళ్ళీ విప్లవోద్యమంలోకి వచ్చింది. జైలులో వున్నప్పుడు అరణ్యతో మాట్లాడి మంచిగా చదువుకొని, ప్రజల కోసం పని చేయాలని చెప్పింది.

జైలు నించి వచ్చిన తరువాత గుంటూరు జిల్లాలోని దాచేపల్లి ఏరియా గ్రామీణ ప్రాంతంలో 'భాగ్య' పేరుతో పనిచేసింది. అక్కడ గిట్టుబాటు ధరల కోసం, కరువుకు వ్యతిరేకంగా, దేవుని మాన్యం భూముల కోసం ప్రజలని పోరాటాలలో పెద్ద ఎత్తున కదిలించడంలో చురుకైన పాత్ర నిర్వహించింది. దళిత సమస్యలు, మహిళల సమస్యలు, ముఠాల మధ్య తగువులు వంటి ఎన్నో సమస్యల్ని, ప్రజల మధ్య వైరుధ్యాలని పరిష్కరించడంలో లక్ష్మి కూడా పాల్గొనేది. 1998లో దాచేపల్లి ఎస్ఏసీ సభ్యురాలిగా వుంటూ మైదాన ప్రాంత వుద్యమాలను, అటవీ ప్రాంత వుద్యమాలను సమన్వయించింది. భట్రుపాలెం, రామాపురం, జూలకల్లు, గామాలపాడు, శ్రీనగర్, ముత్యాలపాడు, మాదిపాడు గ్రామాల్లో అనేక రకాల పోరాటాల్లో పాల్గొని అనుభవాన్ని సంపాదించింది. వేమవరంలో ఒక మహిళ హత్యకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమాన్ని నడిపించింది. ఆ సమయంలో దుర్గా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, సున్నపు బట్టీల సమస్యలు, నాపరాయి కార్మికుల సమస్యలు, సినీ, మోటారు వర్కర్స్ సమ్మెలు ఇలా ఎన్నో విషయాల్లో చొరవగా పాల్గొని వాటిని ఆర్గనైజ్ చేయడంతో దాచేపల్లి ఏరియాలో పార్టీ ప్రభావం పెరిగింది. విప్లవ ప్రజా సంఘాల నిర్మాణంలో భాగంగా విప్లవ మహిళా సంఘాల నిర్మాణం చేసింది. సారా వ్యతిరేక పోరాటాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు, ప్రజా పంచాయితీలు నిర్వహించడంతో పాటు, విప్లవ ప్రజా సంఘాలలో వున్న పితృస్వామ్య, పెత్తందారీ ధోరణులపై కూడా సూటిగా పోరాడింది. సంఘ నాయకులు, కార్యకర్తలు ఇద్దరు భార్యల్ని చేసుకోవడాన్ని సీరియస్‌గా వ్యతిరేకించింది. గుంటూరు జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి పని చేసిన లక్ష్మి అక్కడ భాగ్యక్కగా బాగా పరిచయం. వెల్దుర్తి, బొల్లాపల్లి, బెల్లంకొండ ఏరియాల్లో ప్రజలు భాగ్యక్కను బాగా గుర్తు చేస్తారు.

ఛూటే రాజకీయంగా బలహీనపడడం, తనను రాజకీయంగా బలహీనపరచే ప్రయత్నం చేయడంతో పార్టీ నిర్మాణ పద్ధతుల్లో 1996లో అతనితో విడాకులు తీసుకుంది. ఆ తర్వాత కొద్ది రోజులకు ఛూటే ఆత్మహత్య చేసుకున్నాడు. ఛూటేతో విడాకులు తీసుకున్న నాలుగేళ్ల తర్వాత లక్ష్మికి 2001లో సమ్మిరెడ్డితో వివాహం జరిగింది. ఆ తర్వాత ఏఓబీకి బదిలీ అయ్యి శ్రీకాకుళం జిల్లాలో జిల్లా కమిటీ సభ్యురాలిగా, కొండబారిడి ఏరియా కమిటీ కార్యదర్శిగా పనిచేసింది. మాధవి పేరుతో, గుడిమె పేరుతో (ఇది సవర పేరు) నాటి శ్రీకాకుళ ఉద్యమంలో పాల్గొన్న సవర, జాతాపు తెగల ప్రజల మధ్య వుంటూ వాళ్ళ పోరాటాలకి నాయకత్వం వహించింది. గమ్‌సరిలో జీడితోటల పంపకం, భామినిలో భూ పోరాటాలు, శ్రీరాంపురం ఏరియాలో భూ ఆక్రమణ పోరాటాల సమస్యలలో ప్రజలకి అండగా నిలిచింది. భూమిపై మహిళలకి హక్కు వుందని చెప్పేది. మహిళల పేరుతో భూమి పట్టాలు ఇవ్వాలని చెప్పేది. అక్కడ చింతపండు ప్రధాన పంట. చింతపండు, కందులు, పసుపు, జీడి పిక్కల గిట్టుబాటు రేటు కోసం ప్రతి సంవత్సరం పోరాటాలు జరిగాయి. ఆ పోరాటాలు నిర్వహించడం కోసం, తూనికల్లోని మోసాలను అరికట్టడం కోసం కృషి చేసింది. కరువు సమస్యని పరిష్కరించడంలో భాగంగా కరువు వ్యతిరేక పోరాటాల్లో ప్రజల్ని కదిలించి వాళ్ల మిలిటెన్సీని పెంచే విధంగా నాయకత్వం అందించింది. మంచి నీళ్ళ సమస్య పరిష్కారం కోసం కొన్ని బావులు తవ్వడం చేశారు. కూరగాయల పెంపకం కోసం విత్తనాలు పంచారు. మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఇలా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడంలో శ్రద్ధ చూపింది. ప్రజా కోర్టు నిర్వహించి అనేక రకాల ప్రజల సమస్యలను పరిష్కరించింది. జి.శివడ, రొంపలపాడు, లంకజోడి మున్నగు హాస్టల్స్‌లో విద్యార్థుల సమస్యలపై పోరాటాలు నడిపారు. 2004 చర్చల సందర్భంగా వలసగూడ-వలస బల్లేరు వరకు జరిగిన ప్రజా ప్రదర్శనలో చొరబడిన కానిస్టేబుల్‌ని పట్టుకుని పిస్టల్ సీజ్ చేశారు. ప్రజల మధ్య చొరబడిన శత్రువుని చెక్ చేయడంలో జాగరూకత చూపేది. క్రిష్టియానిటి ప్రభావం బలంగా వున్న కొండబారిడి ఏరియాలో పాస్టర్స్‌ని పిలిచి మాట్లాడి శ్రీకాకుళ వుద్యమ చరిత్రను గుర్తు చేసి ఆలోచింపచేసింది. శత్రువు ఉపయోగిస్తున్న సైలెంట్ వెపన్ మతం అనేదాన్ని నొక్కి చెప్పింది.

2004లో ఏఓబీ జోన్ స్థాయిలో ఏర్పాటు చేసిన మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ (ఎమ్.సి.సి.)లో భాగమై శ్రీకాకుళం డివిజన్‌లోని మహిళా ఉద్యమానికి నాయకత్వం వహించింది. పితృస్వామ్య అణచివేతకి వ్యతిరేకంగా, బలవంతపు పెళ్ళిళ్ళకి వ్యతిరేకంగా ఎన్నో మీటింగ్‌లు నిర్వహించింది. ఎన్నో సమస్యల్ని ప్రజా పంచాయితీలలో పరిష్కరించింది. సవర మహిళలలో ప్రత్యేకించి కేంద్రీకరించి పనిచేశారు. మహిళలకు మహిళా పర్‌స్పెక్టివ్ క్లాసులు నిర్వహించింది. ఆదివాసీ తెగలోని పితృస్వామ్య అణచివేత గురించి అధ్యయనం చేసింది. సారా వ్యతిరేక పోరాటంలో పెద్ద ఎత్తున మహిళల్ని కదిలించింది. ఆమె

నాయకత్వంలో మహిళలు పెద్ద ఎత్తున కదిలి సారా బట్టీలను ధ్వంసం చేశారు.

శ్రీకాకుళం డివిజన్‌లోని మైదాన ప్రాంతంలో వున్న ప్రజా సంఘాలను కూడా గైడ్ చేసింది. వారికి క్లాసులు నిర్వహించింది.

ఈ విధంగా శ్రీకాకుళ ప్రజల హృదయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంది. 2006లో ఏఓబీ జోన్ ప్లీనంలో ఆల్టర్‌నేట్ ఎస్‌జడ్‌సి సభ్యురాలిగా ఎన్నికైంది. 2007-2008 అక్టోబర్‌లో ఎస్‌జడ్‌సి సభ్యురాలిగా కమిటీలోకి తీసుకున్నారు.

## విద్యార్థి, ఉపాధ్యాయురాలు

కామ్రేడ్ మహిత మంచి చదువరి. వరంగల్లులో చదువుతున్నప్పుడు కామ్రేడ్ వరవరరావుతో, ఆ కుటుంబంతో ఏర్పడిన పరిచయం క్రమంగా గాఢమైన అనుబంధంగా మారింది. ఈ చదువుల లక్ష్మికి పుస్తకాల భాండాగారం అక్కడే దొరికింది. అనేక ప్రశ్నలకు సమాధానాలు అక్కడే దొరికాయి. పార్టీ కామ్రేడ్స్ నిరంతరం సైద్ధాంతిక, రాజకీయ విషయాలు అధ్యయనం చేయాలని, ప్రజా ఉద్యమాల్ని అధ్యయనం చేసి ఆచరణ, సిద్ధాంతాల్ని జోడించాలని కోరుకునేది.

కామ్రేడ్ మహిత మంచి ఉపాధ్యాయురాలు కూడా. ఆమెకు మొదటి నించీ పుస్తకాలు చదవడం, విషయాలను లోతుగా చర్చించడం అలవాటు కనుక, టీచర్‌గా తను క్లాసుల్లో సబ్జెక్టును ఎంతో లోతుగా, వివరంగా చెప్పేది. మహిళా పర్‌స్పెక్టివ్ క్లాసును తను స్పెషలైజ్ చేసింది. 1996, 1997 సంవత్సరాలలో మొదటగా మహిళా పర్‌స్పెక్టివ్ క్లాసులు నల్లమల డివిజన్, గుంటూరు, చిత్తూరు జిల్లాలలో చెప్పింది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మహిళా రంగంలో పని చేస్తున్న కార్యకర్తలకు కూడా చెప్పింది. రాజకీయ అర్థశాస్త్రం తనకి ఎంతో ఇష్టమైన సబ్జెక్టు. రాజకీయ అర్థశాస్త్రాన్ని బాగా అధ్యయనం చేసేది. బోధించేది. ఆర్థిక సంక్షోభ రాజకీయాలపై తను చేసే చర్చలు నాయకత్వాన్ని ఆశ్చర్యపరిచేవి. ఏఓబీకి వచ్చిన తర్వాత కూడా దళాలకు, గ్రామ ప్రజా సంఘాలకు, మైదాన ప్రాంతాల ప్రజా సంఘాల నాయకులకు అనేక సార్లు క్లాసులు చెప్పింది. కామ్రేడ్ మహిత గొంతు ఆడియో రికార్డింగ్‌కు అనుకూలంగా వుండేది.

ఉపాధ్యాయురాలుగా కామ్రేడ్ మహితకు ఉన్న సామర్థ్యం కారణంగా 2009 మార్చ్‌లో సి.ఆర్.బి. స్థాయిలో ఏర్పడిన రీజనల్ పొలిటికల్ స్కూల్ (రిపోస్) బాధ్యతలు చేపట్టింది. రిపోస్ టీచర్‌గా సీఆర్‌బీలోని మూడు జోన్లలో తిరిగి క్లాసులు చెప్పింది. మహిళా పర్‌స్పెక్టివ్, రాజకీయ అర్థశాస్త్రం, భారత ఆర్థిక వ్యవస్థ, సిపిఐ (మావోయిస్టు) చరిత్ర క్లాసులను లోతుగా బోధించేది. పాలసీ పేపర్లలో కేడర్ పాలసీ క్లాసును, పార్టీ నిర్మాణ క్రమశిక్షణలను అర్థం చేయించింది. పార్టీ సభ్యుల నుంచి కేంద్ర కమిటీ సభ్యుల దాకా ఎందరికో ఆమె క్లాసులు చెప్పింది. కోయ ప్రాంతం నుంచి వచ్చిన కామ్రేడ్స్‌కు క్లాసులు చెప్పడం కోసం, ఆమె కోయ భాషను కూడా నేర్చుకొని, ఆ భాషలోనే క్లాసులు చెప్పింది. డీకేలో జనతన సర్కార్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలల సిలబస్ తయారీలో సలహాలు, సూచనలు ఇచ్చి మద్దతు ఇచ్చింది. సహకరించింది. రిపోస్ బాధ్యతలు నిర్వర్తించే క్రమంలో ఆమె దూర భారాలను లెక్క చేయకుండా ఎంతో ప్రయాసకు ఓర్చి మూడు జోన్లలోనూ పలు దఫాలుగా పర్యటించింది.

## మిలిటరీ అనుభవం

దళ జీవితంలో మనుగడ సాగించాలంటే మిలిటరీ జ్ఞానం తప్పనిసరి. తన మిలిటరీ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కామ్రేడ్ మహిత 1996లో ఏపీలో రీజియన్ వ్యాప్తంగా జరిగిన మిలిటరీ క్యాంపులో పాల్గొన్నది. అక్కడ పొందిన మిలిటరీ శిక్షణ మూలంగా కామ్రేడ్ మహిత గ్రామీణ ప్రాంతంలో, అటవీ ప్రాంతంలో పనిచేసే సమయంలో శత్రువు ఎన్‌కౌంటర్ దాడులను తిప్పికొడుతూ తప్పుకోగలిగింది. 1997 డిసెంబర్ నెలలో జరిగిన మెదక్, వరంగల్ జిల్లాల సరిహద్దులో సాల్వాపూర్ గ్రామం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆమె సురక్షితంగా తప్పుకుంది. శ్రీకాకుళం డివిజన్‌లో డోర్బి పాకెట్‌లో శత్రువు దళం సమాచారం తెలిసి వచ్చి డేరాపై దాడి చేశాడు. ఈ ఎన్‌కౌంటర్ సమయంలో కామ్రేడ్ మహిత కమాండర్‌గా వుండి శత్రువుపై కాల్పులు చేస్తూ అందరూ క్షేమంగా తప్పుకునే విధంగా సమన్వయం చేసింది. శ్రీకాకుళంలో జరిగిన మరొక ఎన్‌కౌంటర్ నుండి కూడా ఆమె సురక్షితంగా తప్పుకుంది. 2005 ఫిబ్రవరి నెలలో ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా పప్పులూరు ఏరియా పూజారిగూడ వద్ద గెరిల్లాల క్యాంపుపై శత్రువు భారీ దాడి చేశాడు. రిట్రీట్ అవుతున్న గెరిల్లాలను దెబ్బతీయాలనే లక్ష్యంతో చుట్టూ అంబుష్‌లకు కూర్చున్నాడు. ఈ దాడి, అంబుష్‌ల నుండి కామ్రేడ్ మహిత సురక్షితంగా తప్పుకుంది. 2006లో విశాఖ జిల్లా గుర్తేడు ఏరియావ్యాప్తంగా శత్రువు అంబుష్‌లు కూర్చున్నప్పుడు, రెండు మూడు రోజుల్లో అయిదారుసార్లు ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఇతర కామ్రేడ్స్‌తో పాటు కామ్రేడ్ మహిత ఆ ఎన్‌కౌంటర్లను తిప్పికొడుతూ తప్పుకున్నది.

బక్క పలుచగా, బలహీనంగా వుండే కామ్రేడ్ మహిత అనుక్షణం శత్రు దాడికి అవకాశమున్న కఠినమైన గెరిల్లా జీవితంలో దృఢంగా నిలదొక్కుకొని ఆదర్శంగా నిలిచింది.

## పార్టీ మహాసభలు, వర్క్‌షాపులలో ప్రాతినిధ్యం

మహిళా రంగంలో విశేషమైన కృషి చేసిన కామ్రేడ్ మహిత 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో మహిళా ఆర్గనైజేషన్‌కి సంబంధించి జరిగిన వర్క్‌షాపులో పాల్గొన్నది. మహిళా ఆర్గనైజేషన్ ఎదుర్కొంటున్న సమస్యల్ని లోతుగా చర్చించి, పరిష్కారాలు వెతికే ప్రక్రియలో ఆమె చురుకైన పాత్ర వహించింది. 2008లో సి.ఆర్.బి. స్థాయిలో ఏపీ, ఎన్‌టీ, ఏఓబీ, డీకే జోన్స్ నుండి వచ్చిన మహిళా కామ్రేడ్స్‌తో జరిగిన వర్క్‌షాపులో పాల్గొని, మహిళా పర్‌స్పెక్టివ్ క్లాస్ చెప్పి, అందరినీ మెప్పించింది.

కామ్రేడ్ మహిత సిద్ధాంత రాజకీయాలను, నిర్మాణ సమస్యలను లోతుగా చర్చించేది. ఆ చర్చల ద్వారా ఉద్యమం ఎదుర్కొంటున్న

సమస్యలను అర్థం చేసుకున్నది. 1992లో జరిగిన జంట నగరాల పార్టీ ప్లీనంలో ప్రతినిధిగా పాల్గొన్నది. 1995లో జరిగిన గుంటూరు జిల్లా మహాసభలోనూ, దక్షిణ కోస్తా, రాయలసీమ ఉమ్మడి రీజినల్ కమిటీ(జెఆర్‌సి) మహాసభలోనూ పాల్గొన్నది. 1999లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్లీనంలో పాల్గొన్నది. 2000లో గుంటూరు జిల్లా మహాసభలో, జెఆర్‌సి మహాసభలో పాల్గొన్నది. 2003లో ఏఓబీ జోన్ ప్లీనంలో పాల్గొన్నది. 2006లో ఏఓబీ జోన్ మహాసభలో పాల్గొన్నది. ఈ మహాసభలో మహిత ప్రత్యామ్నాయ ఎస్‌జడ్‌సి సభ్యురాలిగా ఎన్నికైంది. 2011లో డీకే ప్లీనంలో సౌహార్ద్ర ప్రతినిధిగా పాల్గొన్నది. ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఏఓబీలోనూ మహాసభలలో, ప్లీనాలలో పాల్గొన్నపుడు ఉద్యమ సమస్యలను ఎంతో లోతుగానూ, విమర్శనాత్మకంగానూ చర్చించేది. సీనియర్ కామ్రేడ్‌గా తనకున్న అనుభవ జ్ఞానం ఉద్యమానికి ఎంతో ఉపయోగపడింది. మహిత మంచి ఉపన్యాసకురాలు. మార్చి 8 తదితర సందర్భాల్లో జరిగే సభల్లో ఆమె విశ్లేషణాత్మకంగా ప్రసంగించేది.

## అధ్యయనశీలి

కామ్రేడ్ మహిత పుస్తకాలనే కాక ఉద్యమ ప్రాంతంలోని ప్రజల జీవితాలను కూడా అధ్యయనం చేసేది. శ్రీకాకుళం డివిజన్‌లో వుండగా గొట్ట ఏరియాలో, బొరిగి ఏరియాలో వర్గ విశ్లేషణ చేసింది. దండకారణ్యంలో రిపోస్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న క్రమంలో సమయం చిక్కించుకొని ప్రజల్లోకి వెళ్లి పలు అధ్యయనాలు చేసింది. తూర్పు, దక్షిణ, పశ్చిమ బస్తర్ డివిజన్‌లలోని కొన్ని క్రాంతికారీ జనతన సర్కార్ గ్రామాలలో తిరిగి ప్రజల జీవితాల్లో జనతన సర్కార్ తీసుకుని వచ్చిన అభివృద్ధిని అధ్యయనం చేసింది. రాజకీయ అర్థ శాస్త్రాన్ని అమితంగా ఇష్టపడే కామ్రేడ్ మహిత తన అధ్యయనంలో ఆర్థిక కోణానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చేది. ఉత్పత్తి సంబంధాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంస్కరణలు, రీతి రివాజుల గురించి వివరంగా పరిశీలించేది. జరుగుతున్న మార్పులను మూలాల్లోకి వెళ్లి సూక్ష్మాన్ని పట్టుకునే విధంగా పరిశోధించేది. ప్రజా సంబంధాలు బలహీనపడడానికి నిర్మాణ కృషిలో లోపంతో పాటు రాజకీయ కేంద్రీకరణ తగినంత లేకపోవడం అని గుర్తించి చెప్పింది. జనతన సర్కార్‌లను మరింతగా అభివృద్ధి చేయడానికి తన సూచనలను, అభిప్రాయాలను తెలియ జేసింది. ఈ అధ్యయనాలలో సహకరించిన స్థానిక కామ్రేడ్స్ మహిత చేసిన అధ్యయనం వల్ల తమకు చాలా విషయాలు అర్థమయ్యాయన్నారు.

## విప్లవ రచయిత్రి

విస్తృతమైన అధ్యయనం చేసిన కామ్రేడ్ మహిత కొన్ని రచనలు కూడా చేసింది. ఆమె కలం పేరు అంజన. ముఖ్యంగా ఫెమినిస్టు సాహిత్యంపై విమర్శనాత్మక వ్యాసాలు రాసింది. ఓల్గా 'రాజకీయ కథల'పై లోతైన విమర్శ రాసింది. ఓల్గా రాసిన మరొక నవలపై కూడా ఆమె చాలా వివరమైన విమర్శ రాసింది. అయితే అనివార్య కారణాల వల్ల అది వెలుగు చూడలేదు. సెమినార్ల సందర్భంగా పేపర్స్ తయారు చేయడంలోనూ, చంద్రబాబు పథకాలపై రాసిన పుస్తకంలోనూ కామ్రేడ్ మహిత భాగస్వామ్యం వుంది. ఏపీలో మహిళా పత్రిక సంపాదక మండలిలో పనిచేసింది. ఏఓబీలో మహిళా పత్రిక 'విప్లవి' సంపాదక మండలిలో పనిచేసింది. ఈ రెండు పత్రికల్లోనూ కొన్ని రచనలు చేసింది. క్రాంతి పత్రికకు విద్యారంగం మీద ఒక వ్యాసం రాసింది. విశాఖలో 'వాకపల్లి' ఘటనపై ప్రచురించిన పుస్తకంలో పాలకవర్గ దోపిడీ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రధాన వ్యాసం రాసింది.

## అనారోగ్యంతో నిరంతర పోరాటం

మహితకి చిన్నప్పటి నించి కూడా మైగ్రేన్ తలనొప్పి వుండేది. ఎసిడిటి సమస్య వుండేది. ఉద్యమంలో పని చేస్తున్న క్రమంలో అవి మరింత పెరిగాయి. సీరియస్ తలనొప్పి, గ్యాస్ట్రిక్ ఎసిడిటీతో పాటు మలేరియా జ్వరం వరుసగా వచ్చేది. జ్వరంతోనే క్లాసులకి తయారయ్యేది, చెప్పేది. ఎంత అనారోగ్యంగా వున్నాగానీ తన పనులు ఏవీ ఆపేది కాదు. తన అనారోగ్యంతో పనులు ఆగకూడదని కోరుకునేది.

## మన నేస్తం

మహిత అందరితో కలిసి మెలిసి వుండేది. అందరి నుండి ప్రేమాప్యాయతలు కోరుకునేది. కామ్రేడ్స్ మధ్య ఒక రాజకీయ వాతావరణం, స్వేచ్ఛగా అభిప్రాయాలు, ప్రేమా ఆప్యాయతలు పంచుకునే వాతావరణం వుండాలని ఎప్పుడూ కోరుకునేది. కామ్రేడ్స్ ఎవరైనా అనారోగ్యంగా వుంటే వారికి బాగా సేవలు చేసేది. అన్నీ పట్టించుకునేది. వాళ్ల ఆరోగ్యం బాగై మంచిగా అయ్యేంత వరకూ తపన పడేది. మహిళా కామ్రేడ్స్‌కి వాళ్లు ఏమైనా వ్యక్తిగత సమస్యల్లో వున్నప్పుడు ధైర్యం చెప్పి, రాజకీయంగా నిలబడేలా ప్రోత్సాహపరిచేది. మహిళలు అన్ని రంగాల్లో పని చేయాలని, ఎదగాలని బలంగా కోరుకునేది. బాధలో, వూగిసలాటలో వున్న మహిళా కామ్రేడ్స్‌ను నిలబెట్టడానికి బాగా ప్రయత్నించేది. రిపోర్ట్స్ రాయడం, ప్రచారం చేయడం, ఉపన్యాసాల్లో గ్రామాల్లో మాట్లాడే విషయాలు చర్చించడం, క్లాసులు చెప్పే తీరు, ఆయా సబ్జెక్టు విషయాలు... ఇలా అనేక విషయాల్లో కేడర్‌కు సలహాలిచ్చి, సహకరించేది.

## మరచిపోలేని జ్ఞాపకం

30 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తెలంగాణాలో రాజకీయాలు నేర్చుకుని, హైదరాబాద్‌లో టెక్నికల్ పనుల్లో, ప్రచార పనుల్లో, జైలు నిర్బంధంలో పదేళ్లు గడిచిన తర్వాత, దక్షిణ కోస్తాంధ్రలో ఎనిమిదేళ్లు, ఏఓబీలో ఎనిమిదేళ్లు, డీకేలో నాలుగేళ్లు ఇలా పార్టీ ఎక్కడికి పంపితే అక్కడికి వెళ్లింది. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతల్ని నెరవేర్చింది. తెలంగాణ వారసత్వాన్ని చేతబట్టి, కోస్తాంధ్రకి విస్తరించి, శ్రీకాకుళ పోరాట జెండాను గుండెకి హత్తుకుని, ఈస్ట్ డివిజన్, ఒడిశా, దండకారణ్యాల్లోని ఆదివాసీ పోరాట ప్రవాహంలో లీనమైంది. వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. మొదటి సహచరుడు పార్టీకి దూరమై, ఇంటి దగ్గర వుండి, ఆ తర్వాత చనిపోయాడు. తర్వాత 2001లో పెళ్లి చేసుకున్న సమ్మిరెడ్డి 2008లో అరెస్టయి శత్రువు ముందు మోకరిల్లాడు. చిన్న వయసులో

# నిజమైన ప్రజా సేవకురాలు కామ్రేడ్ సమిత అమర్ రహే!

క్రాంతికారి జనతన సర్కార్ సీనియర్ కార్యకర్త, నిజమైన ప్రజా సేవకురాలు కామ్రేడ్ సమిత (నోహిరీ బాయి) తీవ్ర అస్వస్థతతో 2013, ఫిబ్రవరి 7న కనుమూసింది. ఆమె వయసు సుమారు 48 సంవత్సరాలు. విప్లవోద్యమంలో గత 22 ఏండ్లుగ ఎన్నో ఇబ్బందులు, ఆటంకాలను దృఢంగా ఎదుర్కొంటూ కామ్రేడ్ సమిత అరుణ పతాకను ఆఖరి వరకూ సమున్నతంగా ఎత్తిపట్టింది. మరణించే నాటికి ఆమె మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియా జనతన సర్కార్‌లో వ్యయసాయ విభాగ కార్యకర్తగా పనిచేస్తూ వుండింది. ఆమె మరణం పార్టీ క్యాడర్లను, ప్రజలను ముఖ్యంగా మాడ్ ప్రాంత ప్రజలను దుఃఖంలో ముంచెత్తింది. అనేక చోట్ల ఆమె స్మారక సభలు జరిపి ప్రజలు ఆమెకు ఘనంగా శ్రద్ధాంజలి అర్పించారు.



కామ్రేడ్ సమిత గడ్‌చిరోలి జిల్లా విప్లవోద్యమ మొదటి తరం కార్యకర్తల్లో ఒకరు. మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లా, టిప్రాగఢ్ ఏరియా, మరకనార్ అనే గ్రామంలో, ఒక మధ్య తరగతి ఆదివాసీ రైతు కుటుంబంలో, కామ్రేడ్ సమిత పుట్టింది. ఆ తర్వాత ఆ కుటుంబం పన్నెమర్ర గ్రామంలో స్థిరపడింది. కామ్రేడ్ సమిత అక్కడే పెరిగి, పెద్దదయింది. ఆమె తండ్రి పేరు జంగల్‌రాం ఉసెండీ. కామ్రేడ్ సమితకు ఒక చెల్లెలు వుంది. తల్లిదండ్రులు ఆమెకు పెట్టుకున్న పేరు నోహిరీ బాయి. ఇద్దరు బిడ్డలనూ తల్లిదండ్రులు ప్రేమగా పెంచుకున్నారు. కామ్రేడ్ సమిత చిన్నప్పటి నుండీ వ్యవసాయం, తదితర పనుల్లో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా వుండేది. పెద్దదయిన తర్వాత 1986-87లో కామ్రేడ్ సమిత తల్లిదండ్రుల ఇష్టానికి వ్యతిరేకంగా తనకు నచ్చిన వ్యక్తిని పెండ్లి చేసుకుంది. అట్లా ఆమె పన్నెమర్ర గ్రామంలోని ఒక మడావి కుటుంబంలోకి కోడలుగా వెళ్లింది.

ఆమె జీవిత భాగస్వామి అప్పటికే విప్లవోద్యమంలో చురుగ్గా పని చేస్తూ వుండినాడు. ఆ కుటుంబంలోకి వెళ్లిన తర్వాత కామ్రేడ్ సమితపై విప్లవ కార్యకలాపాల ప్రభావం పడింది. ఇదే సమయంలో ఈ దంపతులకు ఒక కొడుకు పుట్టి కొద్ది రోజులకే చనిపోయాడు. ఆ తర్వాత ఆమె విప్లవ ప్రయోజనాలకు ఉన్నతమైన ప్రాధాన్యతనిచ్చి పిల్లలను కనాలనే కోరికను త్యాగం చేసింది. పోలీసుల నిర్బంధం కారణంగా, ఆమె జీవిత భాగస్వామి ఇంట్లో వుండి పని చేయడం అసాధ్యం కావడం వల్ల, అతను రహస్యంగా వుంటూ పని చేయాల్సి వచ్చేది. ఇలా పనిచేయడంలో జీవిత భాగస్వామికి కామ్రేడ్ సమిత అన్ని రకాలుగానూ సహకరించింది. 1990లో ఆమె జీవిత భాగస్వామి పూర్తి కాలం కార్యకర్తగా

---

వున్న కొడుకును వదిలి దూరంగా వుండాల్సి వచ్చింది. ఈ వ్యక్తిగత సమస్యలు, తన మనసుని గాయపరిచి, మానసిక వేదనకు గురిచేశాయి. ఈ వ్యక్తిగత సమస్యలకు తోడు ఆమె ఉద్యమ జీవితంలోనూ కొన్ని సమస్యలను ఎదుర్కొంది. ఈ సమస్యలను గతితార్కికంగా చూడలేకపోయింది. ముఖ్యంగా ఆర్గనైజేషన్‌లో ఆమె కొన్ని వైఫల్యాలను ఎదుర్కొంది. ఈ వైఫల్యాలకు బాహ్య పరిస్థితులనే కారణాలుగా చూసింది. తన పరిమితులను ఆమె సరిగా అర్థం చేసుకోలేదు. ఆర్గనైజేషన్‌లో తను ఎదుర్కొంటున్న పరిమితులను, ఆమెకున్న ఇతర సమర్థతలను దృష్టిలో పెట్టుకొని పార్టీ ఆమెను విద్యా, ప్రచార రంగాలకు బదిలీచేయడాన్ని ఆమె పాజిటివ్‌గా అర్థం చేసుకోలేకపోయింది. తన పట్ల వివక్ష కొనసాగుతున్నట్టుగా భావించింది. క్రమంగా ఆమె ఒంటరి అవుతూ వచ్చింది. నిరాశలో కూరుకుపోయింది. ఆమెలో ఏర్పడిన ఈ ఒంటరితనానికి, నైరాశ్యానికి ఆమె దృక్పథంలో వున్న లోపమే ప్రధాన కారణమైనప్పటికీ, ఆమెను బలహీనతల నుండి బయటపడవేసే సందర్భాలలో పార్టీ కమిటీల నుండి కూడా లోపాలు జరిగాయి. ముఖ్యంగా ఆమెకున్న అనారోగ్యాన్నీ, ఆర్గనైజేషన్ రంగంలో వున్న అనుభవరాహిత్యాన్ని దృష్టిలో వుంచుకొని, అందించాల్సినంత సహకారాన్ని అందించలేకపోయాయి. ఈ నేపథ్యంలో కామ్రేడ్ మహిత తీవ్ర అసంతృప్తికీ, మనస్తాపానికీ గురయింది. ఫలితంగా ఆమె ఆత్మహత్య చేసుకొంది. ముప్పయ్యేళ్ల పాటు విప్లవోద్యమంలో కొనసాగి, ఉద్యమ జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ అనేక ఆటుపోట్లను ఎదుర్కొని, రాష్ట్ర స్థాయి నేతగా ఎదిగిన కామ్రేడ్ మహిత ఈ విధంగా తన జీవితాన్ని ముగించుకోవడం చాలా బాధాకరం.

ఇలా ఆత్మహత్య చేసుకోవడం రాజకీయ బలహీనతే అయినప్పటికీ, సుదీర్ఘ విప్లవోద్యమ జీవితంలో కామ్రేడ్ మహిత ఎన్నో ఆదర్శాలను నెలకొల్పింది. విప్లవ మేధావిగా గుర్తింపు పొందింది. ఆ మేధస్సును గురువుగా అందరికీ పంచింది. ఒక సీనియర్ మహిళా కామ్రేడ్‌గా తన అనుభవాన్ని పార్టీకి అందించింది. ఇలా తనకున్న సమర్థతల ద్వారా పార్టీకి ప్రజలకు పలు రకాల సేవలనందించిన కామ్రేడ్ మహిత ప్రజల, పార్టీ శ్రేణుల హృదయాల్లో ఒక మరిచిపోలేని జ్ఞాపకంగా ఎప్పటికీ నిలిచిపోతుంది.

**జోహార్ కామ్రేడ్ మహిత!** ★

విప్లవోద్యమంలో భాగమయ్యాడు. ఆ తర్వాత పోలీసులు అతడిని లొంగిపోయేలా చేయమని కామ్రేడ్ సమితపై వత్తిడి తెచ్చారు. ఆమెను మానసికంగా హింసించారు. వీటన్నింటినీ కామ్రేడ్ సమిత దృఢంగా ఎదుర్కొంది. ఆఖరికి ఆమె తన జీవిత భాగస్వామి బాటలోనే నడవాలని నిర్ణయించుకొని, 1992లో పూర్తి కాలం కార్యకర్తగా విప్లవోద్యమంలో భాగమైంది. మొదట్లో ఒక సంవత్సరం పాటు ఆమె భండారా (ఇప్పుడు గోందియా) జిల్లాలోని దేవ్‌రీ ఏరియాలో దళ సభ్యురాలిగా పని చేసింది. 1993లో తిరిగి టిప్రగఢ్ ఏరియాకు వచ్చింది.

ఒక సాధారణ గృహిణిగా వుంటూ గెరిల్లా దళంలో చేరిన కామ్రేడ్ సమితకు గెరిల్లా నియమాలను కచ్చితంగా అమలు చేయడం, అన్ని రకాల కట్టుబాట్లను ఛేధించడం ఏమీ కష్టం కాలేదు. చాలా తక్కువ సమయంలోనే ఆమె తనను తాను గెరిల్లా జీవితానికి అనుగుణంగా మలచుకుంది. తన స్నేహపూరిత, కలివిడి స్వభావంతో ఆమె ప్రజలకు, తోటి సహచరులకు సన్నిహితురాలైంది. ముఖ్యంగా 1992–93లో శత్రువు టిప్రాగఢ్ ఏరియాలో తీవ్ర నిర్బంధాన్ని తీసుకువచ్చాడు. ఆ తీవ్ర నిర్బంధంలో సైతం కామ్రేడ్ సమిత తన తోటి దళ సభ్యులతో పాటు ప్రజల్లో తిరుగుతూ పనిచేసింది. ఈ సమయంలో కామ్రేడ్ సమిత పలు శత్రు దాడులను ధైర్యంగా ఎదుర్కొంది. 1995లో జమిడి గ్రామం వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో ఆమె గాయపడింది. 1998లో జారావండి ఏరియాలో పైడి గ్రామం వద్ద జరిగిన మరో ఎదురు కాల్పుల ఘటనలో పలు తూటాలు తగిలి ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమె కుడి భుజం, పక్కటెముకలు విరిగి పోయాయి. తలలోనూ, కడుపులోనూ తూటాలు పడ్డాయి. అయినప్పటికీ కామ్రేడ్ సమిత తన తుపాకీని వదలకుండా, తోటి సహచరులతో పాటు రిట్రీట్ అయింది. తర్వాత ఆమెకు చికిత్స అందినప్పటికీ, జీవితాంతం ఆమె చేయి, కాలు పూర్తిగా బాగుపడనే లేదు. బరువు ఎత్తడం, ఎక్కువ దూరం నడవడం ఆమెకు కష్టంగానే వుండేది. ఆమె తలలో ఒక తూటా ఎప్పటికీ వుండిపోయింది. అయినప్పటికీ ఆమె విప్లవోద్యమంలో దృఢంగా నిలబడింది.

1999లో పార్టీ ఆమెను దండకారణ్యంలోని ప్రెస్ విభాగానికి బదిలీ చేసింది. అప్పటి నుండి 2003 వరకూ కామ్రేడ్ సమిత ప్రెస్‌లో వివిధ రకాల పనులు చేసింది. కష్టపడే స్వభావమున్న కామ్రేడ్ సమిత పలు పత్రికలు అచ్చు వేయడంలో, బైండింగ్ చేయడంలో ఎంతో కృషి చేసింది.

కామ్రేడ్ సమిత స్నేహశీలి. పెద్దా, చిన్నా అన్న తేడా లేకుండా అందరితోనూ కలివిడిగా వుండేది. తప్పుడు ధోరణులు ఎవరిలో కనబడినా సమావేశాల్లో నిర్మొహమాటంగా విమర్శించేది. పార్టీలోకి వచ్చిన తర్వాతనే చదవడం, రాయడం నేర్చుకున్న కామ్రేడ్ సమిత పార్టీ పత్రికలను చదివి అర్థం చేసుకోవడమే కాకుండా, ఇతర కామ్రేడ్స్ నుండి నేర్చుకోవడం ద్వారా తన రాజకీయ అవగాహనను పెంపొందించుకున్నది.

2001లో జరిగిన మునుపటి సి.పి.ఐ.(ఎం–ఎల్) (పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్ విజయవంతం కావడంలో కామ్రేడ్ సమిత కృషి కూడా చెప్పుకోదగినది. ఆ క్యాంపులో ఆమె వంట బాధ్యతలు నిర్వర్తించింది. పలు రాష్ట్రాల నుండి వచ్చిన ప్రతినిధులే కాకుండా నేపాల్, టర్కీ నుండి వచ్చిన పర్యవేక్షకులతో పాటు, ఎందరో కామ్రేడ్స్‌కు ఆహార పానీయాలను సక్రమంగా సమకూర్చడంలో కామ్రేడ్ సమిత పాత్ర ఎన్నటికీ మరవరానిది. ఆ సందర్భంలో అందరూ ఆమె నుండి తల్లి ప్రేమను పొందగలిగారు.

2001 తర్వాత దండకారణ్య వ్యాప్తంగా ప్రజల అధికార అంగాలైన జనతన సర్కార్లు విస్తృత రూపు దాల్చాయి. అక్కడి ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మక మార్పు తీసుకురావడంలో భాగంగా, జనతన సర్కార్లు ఏర్పడిన చోట వ్యయసాయాన్ని అభివృద్ధి చేయడం కోసం వ్యవసాయ కమిటీలు ఏర్పడ్డాయి. ఈ కమిటీల్లో పని చేయడం కోసం, కొంత మంది కార్యకర్తలను పార్టీ నియమించింది. అందులో భాగంగా కామ్రేడ్ సమితను మాడ్ డివిజన్, కుతుల్ ఏరియాలోని ఒక క్రాంతికారీ జనతన సర్కార్ ప్రాంతంలో, వ్యవసాయ శాఖా కార్యకర్తగా పార్టీ నియమించింది. ఈ బాధ్యతను నెరవేర్చడానికి కామ్రేడ్ సమిత విశేషమైన కృషి చేసింది. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరలు పండించేలా ప్రజలను ప్రోత్సహించింది. గ్రామాల్లో శుభ్రత పట్లా, ముఖ్యంగా మహిళల ఆరోగ్యం పట్ల ప్రజల్లో జాగరూకతను పెంచడంలో కృషి చేసేది. ఆమె ప్రజలను ఎంతగానో ప్రేమించేది. తాను ఏ గ్రామానికి వెళ్లినా, ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్ట సుఖాలు తెలుసుకొనేది.

మాడ్ డివిజన్‌లో ఈ విధంగా ప్రజల్లో పనిచేసే కార్యకర్తలను చంపడానికి, శత్రువు గత రెండు మూడేళ్లుగా హంతక ముఠాలను ఏర్పాటు చేసి, దాడులు చేయిస్తున్నాడు. ఇటువంటి ముఠాల చేతుల్లో వ్యవసాయ విభాగ కార్యకర్త కామ్రేడ్ కుమిలి, ప్రెస్ విభాగ కార్యకర్త కామ్రేడ్ చైతే దారుణ హత్యకు గురయ్యారు. నిరాయుధంగా పనిచేసే కార్యకర్తల్లో, ముఖ్యంగా మహిళా కార్యకర్తల్లో అభద్రత, భయాందోళనల వాతావరణాన్ని సృష్టించడానికి శత్రువు ఇటువంటి నీచ ఎత్తుగడలకు పాల్పడుతున్నాడు. కాని కామ్రేడ్ సమిత ఇటువంటి ఎత్తుగడలను సవాల్ చేస్తూ ప్రజల క్రియాశీలక మద్దతుతో తన బాధ్యతలను నిర్భయంగా కొనసాగించింది.

కామ్రేడ్ సమిత వైవాహిక జీవితం కూడా ఆదర్శపూరితమైనది. సహచరులిద్దరూ ప్రతి క్షణం ప్రజా సేవలోనే ఎనలేని ఆనందాన్ని పొందేవారు. వాళ్లిద్దరూ ఎల్లప్పుడూ విప్లవ ప్రయోజనాలనే ఎత్తిపట్టారు.

గత రెండేళ్ల నుండి కామ్రేడ్ సమిత కంటి చూపు తగ్గిపోయింది. ప్రస్తుతం అమలవుతున్న తీవ్ర నిర్బంధం కారణంగా ఆమెకు చికిత్స అందలేదు. ఈ మధ్య కాలంలో కామ్రేడ్ సమితకు క్యాన్సర్ వ్యాధి వున్నట్టు బయటపడింది. అయితే వ్యాధి బయట పడేనాటికే అది బాగా ముదిరిపోయింది. ఇక తాను మరణానికి దగ్గరవుతున్నట్టు కామ్రేడ్ సమితకు అర్థమైంది. అయినప్పటికీ ఆమె ధైర్యం సడలిపోలేదు. వ్యాధి బయటపడిన వెంటనే, పార్టీ ఆమెకు చికిత్స

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఏఓబీ

## ఈస్ట్ డివిజన్

### నిత్య నిర్బంధంలోనే విజయవంతమైన అమరుల సంస్మరణ వారం

ఈస్ట్ డివిజన్‌లో 2012 జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారం విజయవంతం అయింది. ఈ సభలను విజయవంతం చేయడానికి సుమారు వారం రోజుల ముందు నుంచే ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. దీని కోసం 8 నుంచి 10 మందితో కూడిన పదకొండు క్యాంపెయిన్ టీంలను ఏర్పాటు చేసారు. వీరు ఆ వారం రోజులు డివిజన్ వ్యాప్తంగా రోడ్డు పరిసర గ్రామాల వరకు వెళ్ళి మీటింగ్‌లు జరుపుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. డివిజన్‌లో వున్న రెండు ఏరియా కమిటీల పరిధిలోని ముఖ్యమైన సెంటర్లలో సైతం బ్యానర్లు, పోస్టర్లు వేశారు. అమరుల జ్ఞాపకార్థం కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో నాలుగు స్థూపాలు, గాలికొండ ఏరియా కమిటీ పరిధిలో ఒక స్థూపాన్ని ప్రజలు నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా గాలికొండ ఏరియా కమిటీ పరిధిలో రెండు బహిరంగ సభలు నిర్వహించారు. ఒక సభలో 500 మంది ప్రజలు (వీరిలో 200 మంది మహిళలు) పాల్గొన్నారు. మరొక సభలో 800 మంది ప్రజలు (వీరిలో 300 మందికి పైగా మహిళలున్నారు) పాల్గొన్నారు. కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలో నాలుగు సభలు నిర్వహించారు. ఈ సభల్లో సుమారు మూడు వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభల్లో వక్తలు మాట్లాడుతూ, సమాజంలో దోపిడి పీడనలను తొలగించి నూతన సమాజ స్థాపనకై జరుగుతున్న ప్రజా వుద్యమంలో ప్రజలందరూ క్రియాశీలకంగా భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. అమరుల త్యాగాలు లేకుండా విప్లవోద్యమ పురోగమనాన్ని ఊహించలేమనీ, వాళ్ళ త్యాగాల ప్రేరణతో దృఢంగా ముందుకు సాగుదామనీ, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి అమర వీరులందరూ కన్న కలల్ని నిజం చేద్దామని ప్రతిన బూనారు.

### విజయవంతమైన పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు

ఈస్టు డివిజన్‌లో కోరుకొండ ఏరియా పరిధిలోని పెదబయలు మండలం ఇంజేరి గ్రామం వద్ద 2012 సెప్టెంబర్ 21న పార్టీ ఆవిర్భావ సభ జరిపారు. ఈ సభలో చుట్టు పక్కల గ్రామాల నుండి సుమారు 800 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సంఘ నాయకత్వం మాట్లాడుతూ దేశంలో అనేక రైతాంగ తిరుగుబాట్లకు, కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీ 1952 నాటికి రివిజనిస్టుగా మారిపోయిందనీ, తెలంగాణా సాయుధ పోరాటం విద్రోహానికి బలైందనీ, నక్సల్బరీ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా మళ్ళీ సాయుధ పోరాట ఎజెండాను ప్రజల్లోకి తీసుకు వచ్చినది మావోయిస్టు పార్టీనే అనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేసారు. మెజార్టీ ఆదివాసీల జీవితాలు దుర్భరంగా తయారయ్యాయనీ, క్రూరమైన అటవీ చట్టాల బంధనాల్లో బందీ అవుతున్నారనీ, అటవీ వుత్పత్తుల సేకరణపై అనేక ఆంక్షలు చోటు చేసుకుంటున్నాయనీ, 'స్వాతంత్ర్య' భారతంలో ఆదివాసులు పరాధీనం పాలవుతున్నారనీ, మరో వైపు ఇక్కడి ఖనిజాలను సామ్రాజ్యవాదులు తరలించుకు పోవడానికి స్థానిక ప్రజలపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో యుద్ధం చేపట్టి ప్రజలను అడవి నుండి గెంటివేస్తున్నారనీ మాట్లాడినారు. దేశ అసమాన అభివృద్ధిని మార్చడానికి సాయుధ పోరాట మార్గం ఒక్కటే సరైనదనీ, అందుకు ప్రజలు నడుంబిగించి పోరాడాలనీ పిలుపునిచ్చారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామ గ్రామాన పార్టీని నిర్మించుకోవాలనీ, పార్టీని నిర్మూలించాలనే శత్రు ఎత్తుగడలను ప్రజా యుద్ధం ద్వారా ఓడిద్దామని, రహస్య పార్టీని నిర్మించి బలోపేతం చేయటానికి కృషి చేద్దామని నినదించారు.

### విజయవంతమైన పి.ఎల్.జి.ఎ. 12వ వార్సికోత్సవాలు

ఈస్ట్ డివిజన్‌లో పి.ఎల్.జి.ఎ. 12వ వార్సికోత్సవాలను విజయవంతం చేసేందుకు సుమారు వారం రోజుల ముందు నుంచీ ప్రచార కార్యక్రమాలు చేపట్టారు. దీనికోసం గాలికొండ, కోరుకొండ ఏరియాల పరిధిలో 8 నుండి 15 మందితో కూడిన ఆరు క్యాంపెయిన్ టీంలను ఏర్పాటు చేసారు. ఈ క్యాంపెయిన్ టీంలు

---

అందించగలిగినప్పటికీ ఆమెను కాపాడుకోలేకపోయింది. భారత విప్లవ త్యాగాల బాటలో ఒరిగిపోయిన ఎందరో అమరుల సరసన కామ్రేడ్ సమిత చేరిపోయింది.

కామ్రేడ్ సమిత ఒక నిస్వార్థ కార్యకర్త, నిజమైన కమ్యూనిస్టు. 'ప్రజలకు సేవ చేయండి' అనే మావో సూక్తి సారాన్ని ఆమె మనస్ఫూర్తిగా గ్రహించి ఆచరించింది. జీవితంలో, విప్లవోద్యమంలో ఎన్ని కష్టాలు వచ్చినా ఆమె చలించలేదు. ఆమె ప్రజలను ఎంత ప్రేమించిందో, వర్గ శత్రువును అంతగా ద్వేషించింది. అందుకే దోపిడీ వర్గాలను కూలదోసే ప్రజా యుద్ధంలో ఆమె చివరి వరకూ దృఢంగా పోరాడింది.

కామ్రేడ్ సమిత నడిచిన దారిలో మరింత దృఢంగా ముందుకు సాగుదాం. ఆమె కలలు కన్న సమ సమాజాన్ని సాధిద్దాం. అదే కామ్రేడ్ సమితకు నిజమైన నివాళి.

**కామ్రేడ్ సమిత అమర్ రహే!** ★

ఆ వారం రోజుల పాటు ఆయా ఏరియాల పరిధిలోని గ్రామాల వరకూ వెళ్ళి, మీటింగులు చేస్తూ, విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ముఖ్యమైన మండల కేంద్రాలకు, పంచాయితీ కేంద్రాలలో పోస్టర్లు, బ్యానర్లు వేశారు. ఈసారి ప్రచారంలో దండకారణ్యంలో సైన్యం మోహరింపుకు వ్యతిరేకంగా, స్కూల్ భవనాల్లో పారా మిలిటరీ బలగాలు మకాం వేయడాన్ని వుపసంహరించుకోవాలనీ, గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను ప్రజాయుద్ధం ద్వారా ఓడించాలనీ ప్రచారం చేశారు. శత్రుదాడి కొనసాగుతున్న నేటి స్థితిలో పెద్ద పెద్ద సభలకు పూనుకోవద్దనీ, ఒకటి రెండు గ్రామాల పరిధిలో చిన్న చిన్న సభల ద్వారా పి.ఎల్.జి.ఎ. ఆవశ్యకతను, అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలనీ ఎస్.జెడ్.సి. ఇచ్చిన పిలుపు ప్రకారం మిలీషియా, సంఘ నాయకత్వం, గ్రామ పార్టీ ఎక్కడికక్కడ వీధి మీటింగ్‌లు, సభలు, సమావేశాలు జరిపారు. ఈ క్యాంపెయిన్ ద్వారా పి.ఎల్.జి.ఎ. సాధించిన విజయాలను, ఎదుర్కొన్న అపజయాలను, వాటి గుణపాఠాలనే కాక, పి.ఎల్.జి.ఎ. కోల్పోయిన ప్రజాయుద్ధ యోధుల గురించి కూడా ప్రజలకు వివరించి చెప్పారు. దోపిడీ పీడనలు లేని నూతన సమాజ స్థాపన జరగాలంటే, సమాజంలో వేళ్ళూనుకొని వున్న భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాదులను కూకటి వేళ్ళతో పెకిలించి వేయడానికి ప్రజాసైన్యం ప్రజలకు వుండాలనీ, అందుకే ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారం కోసం ప్రజలు విధిగా ప్రజాసైన్యంలో చేరాలనీ ప్రజలకు వివరించారు.

### అంతర్జాతీయ శ్రామిక మహిళ దినం జరుపుకున్న ఆదివాసీ మహిళలు

ఈస్టు డివిజన్‌లో కోరుకొండ ఏరియా పరిధిలోని మల్కన్‌గిరి జిల్లా కుడుములగుమ్మ బ్లాక్ తొల్లాల్ గ్రామంలో 2013 మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దిన సభ జరిగింది. సభకు సుమారు 800 మంది ప్రజలు పాల్గొన్నారు. వీరిలో సుమారు 500 మంది మహిళలు వున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ ఇక్కడ జీవిస్తున్న ప్రజలలో, మహిళల బతుకులు మరింత అధ్వాన్నంగా వున్నాయనీ, ఆదివాసీ రీతి, రివాజుల పేరుతో పితృస్వామ్య దోపిడీ, వివక్ష, అణచివేతలకు మహిళలు గురవుతున్నారనీ, ఆదివాసీ మహిళలు ఎంతగా సామాజిక శ్రమలో భాగస్వాములవుతున్నప్పటికీ ఆర్థిక, సాంస్కృతిక జీవనంలో నిషేధాలను భరిస్తున్నారనీ, మరోవైపు రాజకీయ నిర్ణయాల్లో వాళ్లకు ఎలాంటి భాగస్వామ్యం లేకుండా పోతున్నదనీ, మహిళలు సంఘటితపడి పోరాడడాన్ని తెగ పెద్దలు సహించలేక పోతున్నారని పైగా అసత్యాలతో, తప్పుడు ఆరోపణలతో మహిళలను నిందిస్తూ వీలైన అన్ని పద్ధతుల్లో ప్రచారం చేస్తున్నారన్నారు. సామ్రాజ్యవాద విష సంస్కృతి, మొబైల్ ఫోన్ల వాడకం విపరీతంగా పెరగడం, పారిశ్రామికీకరణ మూలంగా మహిళల జీవితాలపై దుష్ప్రభావం పడుతున్నదనీ, హీనమైన సంస్కృతికి బీజాలు పడి మహిళలు అత్యాచారాలకు గురికావడం జరుగుతున్నదని వివరించారు. విముక్తి లక్ష్యంతో పోరాడుతున్న మహిళలు మన్యంలో తొలి నుండి తీవ్రమైన ప్రభుత్వ, పోలీసు నిర్బంధం, అణచివేత విధానాలకు గురవుతున్నారనీ, అందులో భాగంగానే వాకపల్లి, భల్లుగూడ ఘటనలు జరిగాయన్నారు. సాంప్రదాయ హింసా, అణచివేతలకు, రాజ్యహింసకు వ్యతిరేకంగా మహిళలు మిలిటెంట్‌గా పోరాడుతూనే, విముక్తి లక్ష్యంతో కొన సాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సభకు హాజరైన మహిళలు బహు భార్యాత్వానికి, బలవంతపు పెళ్లిళ్లకు, బాల్య వివాహాలకు, ఓలి, మొగనాలిలకు వ్యతిరేకంగానూ, ఆస్తిలో మహిళలకు హక్కు కల్పించాలని తీర్మానాలను ప్రతిపాదించి, ఏకగ్రీవంగా ఆమోదించారు.

## మల్కన్‌గిరి డివిజన్

### సాగునీటి కోసం పోరాడుతున్న రైతులు

మల్కనగిరి జిల్లాలోని ప్రధానంగా ఆదివాసీలు నివసించే ప్రాంతాలలో వ్యవసాయం నేటికీ వర్షం పైనే ఆధారపడి వుంది. అతివృష్టి, అనావృష్టి మూలంగా పంటలు చేతికి రాక రైతులకు కరువు కాటకాలు సాధారణమయ్యాయి. పంటలు పండక, వుపాధి లేక ప్రతి సంవత్సరము ప్రజలు కూలి పనులు వెతుక్కుంటు పక్క రాష్ట్రాలకు వలస పోతున్నారు. జిల్లాలో పుష్కలమైన నీటి వనరులున్నా వాటిని ఆదివాసీల భూములకు అందించాలనే చిత్తశుద్ధి లేని పాలకులు, చిత్రకొండలో భారీ డ్యాంను నిర్మించి వందలాది గ్రామాల ప్రజలను నిర్వాసితులను చేసి నీటిని, కరెంటును ఆంధ్రాకు తరలిస్తున్నారు. మిగులు నీటిని (కరెంటు ఉత్పత్తికి వినియోగించి వదులుతున్న నీరు) వృధాగా ఎక్కువ భాగం నదుల్లోకి వదులుతున్నారు. కొంత భాగాన్ని మైదాన గిరిజనేతరుల(బెంగాలీల) భూములకు కెనాల్ ద్వారా అందిస్తున్నారు.

ఆదివాసీ గ్రామాల పక్క నుండి కెనాల్ వెళ్తున్నా, నదిలో నీరు వృధాగా పోతున్నా వారి భూములకు నీరందించడం లేదు. కలిమెల బ్లాక్‌లోని చింతలవాడ, బెజ్జంకివాడ, మరిగట్ట, తెల్లరాయి, మన్నెంకొండ పంచాయితీల ప్రజలు, 2009 నుండి సాగునీటి సాధన పోరాట ఐక్య కార్యాచరణ కమిటిని ఏర్పాటు చేసుకొని, కొరకటపల్లి నుండి మన్నెంకొండ వరకు కెనాల్ నిర్మాణం చేసి రైతులకు సాగునీరు అందించాలని ఆందోళన చేస్తున్నారు. గత సంవత్సరము ఆగస్టు-సెప్టెంబర్‌లలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా (రాష్ట్ర వ్యాప్తంగా) చేపట్టిన పొలి (రెవెన్యు గ్రామం) గ్రామ సభల (పంచాయితి స్థాయి) ఎన్నికలను పూర్తిగా బహిష్కరించి తమ నిరసనను తెలియజేశారు. అయినా ప్రభుత్వం స్పందించక పోవడంతో 500 మంది ప్రజలు కలిమెల బ్లాక్ ఆఫీసును దిగ్బంధించి, తాళాలు వేసి అధికారులను పంపించి వేసారు. ఏరియా ఆర్.సి.ఎస్. నాయకత్వంలో మూడు వేల మంది ప్రజలు సమావేశమై బ్లాక్‌లోని ప్రజా ప్రతినిధులందరిని (బ్లాక్ చైర్మన్, జెడ్.పి.టి.సి.లు, సమితి సభ్యులు, సర్పంచ్) ప్రజా కోర్టులో నిలదీసి

రాజీనామాలను డిమాండ్ చేసారు. దీనితో ప్రజా ప్రతినిధులందరు మూకుమ్మడిగా రాజీనామాలు చేసారు. దానితో గందరగోళపడిన ప్రభుత్వం కలెక్టర్ ద్వారా ప్రజా ప్రతినిధులతో మంతనాలు జరిపి మూడు నెలల్లో సర్వే పనులు ప్రారంభిస్తామని, రాజీనామాలు ఉపసంహరించుకోవాలని, ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. ఆ తర్వాత సర్వేలు తూతూ మంత్రంగా ప్రారంభించి మరోసారి ప్రజలను మోసగించారు. ఆరు నెలలు గడిచినా అది ముందుకు సాగలేదు. ఈసారి మరోమారు ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో 2500 మంది ప్రజలు సమావేశమై ప్రజా ప్రతినిధులను నిలదీయగా, వారు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం, మోసపూరిత విధానాలను నిరసిస్తూ మూకుమ్మడి రాజీనామాలు చేసారు. దానితో కలిమెల బ్లాక్ అధికారులు ఆఫీసులకు తాళాలు వేసి వెళ్ళిపోగా, ప్రభుత్వ పరిపాలన తాత్కాలికంగా స్తంభించి పోయింది. కలెక్టర్ చర్చలకు ఆహ్వానించినా ఎవరు వెళ్ళకుండా తమ డిమాండ్ పరిష్కరించే వరకు పోరాడుతామని దృఢంగా ప్రకటించారు.

## పశువుల స్వాధీనం - పంపిణీ

మల్కనగిరి జిల్లా కలిమెల ఏరియాలో ప్రతి సంవత్సరము వర్షాకాలం పశువులకు అంటు వ్యాధులు సోకుతాయి. ప్రభుత్వం నుండి పశు సంరక్షణకు పశు వైద్యశాలలు, డాక్టర్లు లేకపోవడంతో వందల పశువులు చనిపోయి రైతులకు దున్నుకోవడానికి పశువులు లేని పరిస్థితి ఏర్పడుతున్నది. మరొక వైపు పశువుల వ్యాపారులు అప్పుల పాలైన రైతులు, పేద రైతుల నుండి పశువులను కొనుగోలు చేసి ప్రతి సంవత్సరము వేలాదిగా కబేళాలకు తరలిస్తున్నారు. ఈ విషయంపై ఎ.వి.ఆర్.సి.ఎస్. ప్రచారం చేయడంతో పాటు స్థానిక వ్యాపారులను పిలిచి నచ్చజెప్పింది. కాని లాభాలను మాత్రమే ఆశించే వ్యాపారులు పెడ చెవిన పెట్టారు. దీనితో ఆగ్రహించిన రైతులు ఎ.వి.ఆర్.సి.ఎస్ నాయకత్వంలో కబేళాలకు తరలిస్తున్న 200 పశువులను స్వాధీనం చేసుకొని 12 గ్రామాలలోని పూర్తిగా పశువులు లేని 120కి పైగా పేద రైతు కుటుంబాలకు పంపిణి చేసారు. పశువులను వ్యాపారులకు అమ్మవద్దని, వ్యాపారులు కబేళానికి తరలించడాన్ని మానుకోవాలని, రైతులు పశు సంరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, పద్ధతుల గురించి ప్రచారం చేసారు. గ్రామాలలో అంటు వ్యాధులు సోకిన పశువులకు మందులు తెప్పించి వైద్యం చేయించే బాధ్యతను ఆర్.పి.సి.లు చేపట్టాయి.

## సిమెంటు ఫ్యాక్టరీని అడ్డుకొన్న ప్రజలకు విప్లవ జేజేలు

మల్కనగిరి జిల్లా పొడియా ఏరియాలోని కోరుకొండ బ్లాక్ పరిధిలోని బురస మట్టేరు, ఉస్కాలు పరిసర గ్రామాల భూములలో సిమెంటు రాయి నిక్షేపాలు వున్నాయని, 2007లో ప్రైవేట్ సిమెంటు ఫ్యాక్టరీని స్థాపించే లక్ష్యంతో మధ్య దళారీల ద్వారా రైతుల భూములను కారుచౌకగా కొనుగోలు చేసి లేదా ఆక్రమించే ప్రయత్నం చేసారు. ప్రజలు వ్యతిరేకించడంలో స్థానిక గ్రామపెద్దలను, ప్రజా వ్యతిరేకులను జిల్లా బి.జె.పి నాయకుడు ఇంద్రమాడి కూడగట్టి ప్రజలను బెదిరించే ప్రయత్నం చేశాడు. దానితో పి.ఎల్.జి.ఎ. అతన్ని ఖతం చేసింది. ఆ తర్వాత వెనక్కి తగ్గిన కంపెనీ యాజమాన్యం తిరిగి 2012లో మరోమారు స్థానిక గ్రామ పెద్దలు, భూస్వాములను ఆర్గనైజు చేసి ముందుగా పెద్దాలు, వుస్కాల్ భూస్వామి అరుణ్ (పారిపోయిన భూస్వామి) భూములను కొనుగోలు చేశారు. వారి సహాయంతో భర్తలు చనిపోయిన మహిళలకు ఫించన్లు ఇప్పిస్తామని భూమి పట్టాలను తీసుకొని డబ్బులు ఇచ్చి క్రమంగా భూమి లీజు ఒప్పందాలు రాయించుకున్నారు. ఈ కుట్రను పసిగట్టిన కుటుంబాలు సంఘాలను ఆశ్రయించాయి. అసలు విషయాలు వెలికితీసిన ఎ.వి.ఆర్.ఎస్. పది గ్రామాలకు చెందిన 1500 మంది ప్రజల సమక్షంలో మధ్య దళారీలను ప్రజాకోర్టుకు ఈడ్చి నిలదీశారు. దీనితో మధ్యదళారీలు తప్పు అంగీకరించి ఫ్యాక్టరీ యాజమాన్యం నుండి భూముల కొనుగోలుకు తీసుకున్న 2 లక్షల 50 వేలు గ్రామానికి యిచ్చేందుకు ఒప్పుకున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కుట్రలను ఈ విధంగా ప్రజలు ఎదుర్కొని దాని ప్రయత్నాలను, ఒప్పందాలను రద్దు చేయించి అడవులు, భూములను రక్షించుకున్నారు.

## మద్య నిషేధంను డిమాండు చేస్తూ మహిళల ర్యాలీ

మల్కనగిరి జిల్లా, గుమ్మ ఏరియాలోని కట్ ఆఫ్ ఎల్.ఓ.ఎస్ ప్రాంతంలో, కొంత మంది వ్యాపారులు, ప్రభుత్వ మద్యం దుకాణాల నుండి మద్యం కొనుగోలు చేసి, గ్రామాల వరకు సరఫరా చేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు స్థానికంగా సారా తయారుచేసి పెద్ద ఎత్తున సంతలలో అమ్ముతున్నారు. సారా తాగడం మూలంగా ఆర్థిక నష్టమే కాకుండా, సారా మత్తులో మహిళలను హింసించడం, కుటుంబ సమస్యలు పట్టించుకోకపోవడం, అనారోగ్యాలకు గురై చనిపోవడం తదితర సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ సమస్యపై పోరాడడానికి గ్రామ వి.ఎమ్.ఎస్.లు ప్రజలతో, ముఖ్యంగా మహిళలతో మద్య నిషేధ పోరాట కమిటీని ఏర్పాటు చేశాయి. ఈ కమిటీ సభ్యులు గ్రామగ్రామాన, సంతలలో తిరిగి మద్యం తయారీ, అమ్మకాలు నిలిపివేయాలని, తాగడం మానుకోవాలని ప్రచారం చేసారు. 2012 ఆగస్టులో వి.ఎమ్.ఎస్., పోరాట కమిటీ నాయకత్వంలో మూడు పంచాయితీల సరిహద్దులోని గురిశెట్టి గ్రామం వద్ద సుమారు నాలుగు వేల మంది మహిళలు ర్యాలీ నిర్వహించి, సభ జరుపుకొని మద్య నిషేధంకై పోరాడాలని నిర్ణయం తీసుకొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై కలెక్టర్ ఆఫీసు ముందు ధర్నా

మల్కనగిరి జిల్లా గుమ్మ బ్లాక్‌లోని పనసపుట్ హైస్కూల్ విద్యార్థులకు పాత శిధిలావస్థలో వున్న చాలీచాలని ఇరుకు గదులలో స్కూల్, హాస్టల్ నిర్వహిస్తున్నారు. వుండాల్సిన సంఖ్యలో టీచర్‌లను నియమించకపోవడము, వున్న టీచర్‌లు కూడ సరిగా స్కూలుకు రాకపోవడం, హాస్టల్‌కు ఆహార పదార్థాల సరఫరాలు సరిగా చేయకపోవడం, హాస్టల్ మాన్యువల్ అమలు చేయక వార్డెన్ అవినీతికి

పాల్పడడంతో పాటు ఇతరేతర వసతులు అధ్వాన్నంగా వున్నాయి. పై సమస్యలను సర్పంచ్, బి.డి.ఓ. దృష్టికి తీసుకువెళితే, హామీలు యిచ్చారు తప్ప అమలుకు నోచుకోలేదు. 2012 డిసెంబర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకొని విద్యార్థి సంఘాల నాయకత్వంలో సుమారు 300 మంది కలెక్టర్ ఆఫీస్ ముందు బైఠాయించారు. వీరి డిమాండ్లపై నేరుగా కలెక్టర్ విద్యార్థులతో చర్చలు జరిపాడు. ఆ తర్వాత కొత్తగా మరికొందరు టీచర్లను కేటాయించారు. హాస్టల్ వసతులు మెరుగుపర్చడంతో పాటు స్కూల్‌కే కొత్త భవనాన్ని మంజూరు చేశారు. విద్యార్థులు తమ సమస్యల పరిష్కారంకు పోరాటమే సరైన మార్గమని ఆచరణాత్మకంగా నిరూపించి మిగిలిన విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

## రాజకీయ ఖైదీల హక్కుల వారంను విజయవంతం చేసిన ప్రజలు

మార్చి 23 భగత్ సింగ్ వర్ధంతి నుండి మార్చి 28 వరకు జైళ్ళలో వున్న రాజకీయ ఖైదీల సమస్యలపై వివిధ రూపాలలో పోరాట కార్యక్రమం చేపట్టాలని సి.ఆర్.బి. నిర్ణయించింది. ఈ కార్యక్రమం అమలు చేయడంలో భాగంగా జైలు సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్లతో పోస్టర్లు, బ్యానర్ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రచారం జరిగింది. పొడియా, కలిమెల ఏరియాలో ఏ.ఆర్.సి.ఎస్, వి.ఎమ్.ఎస్, మిలీషియా, జి.ఎన్.ఎస్ నిర్మాణాలలో పని చేస్తున్న కామ్రేడ్స్ క్యాంపెయిన్ టీంలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా సభలు జరుపుతూ ప్రచారం చేశారు. ప్రజల నుండి విరాళాలు సేకరించారు. దళాలు జైళ్ళలో వున్న వారి కుటుంబ సభ్యులను కలిసి వారితో సమావేశం జరిపి బైపరిగూడ, కలిమెలలో కుటుంబ సభ్యుల పత్రిక విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశాయి. ఈ సమావేశంలో ఆపరేషన్ గ్రీన్ హంట్‌లో భాగంగా చేసిన అక్రమ అరెస్టులు, జైలు నిర్బంధం, కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వారి బేషరతు విడుదలను డిమాండ్ చేస్తూ మాట్లాడారు. కలిమెలలో వెయ్యి మంది ప్రజలు టేగ్గూడ నుండి బొద్దేలు వరకు, ర్యాలీ నిర్వహించి రాజకీయ ఖైదీల సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ సభ జరిపారు.

ప్రజల నుండి విరాళాలుగా సేకరించిన 36 క్వింటాళ్ళ ధాన్యం, 1 లక్ష 23 వేల 6 వందల రూపాయలు, బట్టలను 28 కుటుంబాలకు పంపిణీ చేయడం జరిగింది. జైలులో వున్న కుటుంబాల అవసరాలు, వ్యవసాయ పనులను దృష్టిలో పెట్టుకొని, గ్రామ సంఘాలు, ప్రజలు బాధ్యత పడి సమిష్టిగా సహాయం అందిస్తూ ఆర్థిక, హార్థిక, రాజకీయ మద్దతును అందిస్తున్నాయి.

## ఫిలిపినో విప్లవోద్యమానికి సంఘీభావం

ఫిలిపినో విప్లవోద్యమంపై, ప్రజలపై అమలు జరుపుతున్న దాడిని వ్యతిరేకిస్తూ, వుద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ డివిజనల్ కమిటీ కరపత్రం రాసింది. అలాగే పోస్టర్స్, బ్యానర్స్, పత్రికా ప్రకటనల ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయడం జరిగింది. ఏప్రిల్ 22 నుండి 28 వరకు కలిమెల, పొడియా ఏరియాలలో జి.ఎన్.ఎస్, ప్రచార క్యాంపెయిన్ టీం ద్వారా మీటింగ్, ప్రదర్శనల ద్వారా ప్రచారం చేసారు. మెజారిటీ గ్రామాలలో ప్రజలు మీటింగ్‌లు జరిపారు. కాగడాల ప్రదర్శనలు నిర్వహించి తమ అంతర్జాతీయతను చాటారు.

## మహిళలపై పోలీసు అత్యాచారాలకు వ్యతిరేకంగా...

దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, అమానుష హత్యలకు వ్యతిరేకంగా మొత్తం సమాజం, ప్రధానంగా మహిళలు తీవ్రంగా స్పందిస్తున్నారు. పెద్ద ఎత్తున నిరసన వుద్యమాలు కూడ జరుగుతున్నాయి. ఇది మంచి పరిణామమే. అయితే ఈ సమస్యకు మూలాలను, పరిష్కారాలను గుర్తించడంలో ఈ వుద్యమాలు స్పష్టతకు రాలేకపోతున్నాయి. ఈ సమస్యలకు మూలమైన ఈ ఫ్యూడల్ పితృస్వామిక వ్యవస్థను పరిరక్షిస్తూ, సామ్రాజ్యవాద వ్యాపార సంస్కృతిని, యువతలో విశృంఖలత్వాన్ని పెంచిపోషిస్తున్న పాలకులు, పోరాడుతున్న ప్రజలను అణచివేయడంలో భాగంగా మహిళలపై సాయుధ బలగాలతో అత్యాచారాలను ఒక సాధనంగా ప్రయోగిస్తున్నారు. ఇదే పాలకులు ఈ సమస్యను పరిష్కరించడానికి అంటూ చట్టాలు చేసి, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి మొసలి కన్నీరు కార్చి మహిళా వుద్ధారకులుగా, పరిరక్షకులుగా పోజు పెట్టి మహిళ వుద్యమాలను పక్కదారి పట్టించే కుట్ర చేస్తున్నారు.

ఈ కుట్రలను ప్రజలకు విప్పి చెప్పడానికి "మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, అణచివేత, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుదాం. వర్గ సమాజ విముక్తిలో భాగంగా మహిళా విముక్తికి దారులు వేద్దాం రండి" అంటూ కలిమెల ఏరియా ఆదివాసీ విప్లవ మహిళా సంఘం పిలుపు నిచ్చింది. ఈ పిలుపుకు మద్దతుగా డివిజనల్ పార్టీ కమిటీ, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల మూలాలను వివరిస్తూ, వాటి పరిష్కారం కోసం బలమైన మహిళా విముక్తి వుద్యమం నిర్మించాలనీ పిలుపునిస్తూ కరపత్రం వేసి, జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేసింది. ఈ కరపత్రంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమయిన తర్వాత నుండి జిల్లాలో సాయుధ బలగాలు మహిళలపైన జరిపిన అత్యాచారాలను ప్రధానంగా పేర్కొన్నది.

కలిమెల ఏరియా ఎ.వి.ఎమ్.ఎస్. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మే 5న ర్యాలికి పిలుపు నిచ్చింది. అందులో భాగంగా గ్రామ గ్రామాన మీటింగ్‌లు జరిపి, ప్రచారం చేసి మహిళలను సమీకరించింది. పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రచారం చేసింది. జి.ఎన్.ఎస్‌ల ద్వారా ప్రదర్శనలు యిప్పించింది. ఈ సమస్యపై ఏరియా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, అన్ని వర్గాల, అన్ని వయసుల మహిళల నుండి గొప్ప స్పందన వచ్చింది. ఈ ర్యాలీని అడ్డుకొని విఫలం చేయడానికి మే 5న ఏరియాలో అన్ని వైపుల నుండి పోలీసు బలగాలను మోహరించారు. పోలీసు బెదిరింపులను, మోహరింపును లెక్కచేయకుండా కలిమెల బ్లాక్‌లోని చింతలవాడ, బెజ్జంకివాడ, మరిగట్ట, తెల్లరాయి, కలిమెల, కుర్మనూరు,

పప్పులూరు పంచాయితీ గ్రామాల నుండి విద్యార్థినులు, అన్ని వయసుల మహిళలు వుదయం 9 గం॥లకే బొద్దేలు గ్రామానికి చేరుకున్నారు. బ్యానర్స్, ప్లేకార్డులు, జి.ఎన్.ఎస్. సాంస్కృతిక ప్రదర్శనలతో 5 వేల మంది మహిళలు మండుటెండను సైతం లెక్కచేయకుండా బొద్దేలు నుండి బెజ్జంగవాడ వరకు 3 కి.మీ. భారీ ర్యాలీ నిర్వహించి, బహిరంగ సభ జరిపారు. ఈ సభలో మాట్లాడిన వక్తలు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తూ, మహిళా విముక్తికి నూతన ప్రజాస్వామిక విప్లవ పోరాటంలో భాగంగా వుద్యమిద్దాం అంటూ పిలుపు నిచ్చారు. జిల్లాలో పోలీసులు మహిళలపై జరిపిన అత్యాచార ఘటనలను నిర్దిష్టంగా పేర్కొంటూ దోషులను శిక్షించాలని డిమాండ్ చేసారు. ఈ పోరాట వార్తలను పత్రికలు ప్రముఖంగా రాశాయి. జిల్లాలో ఈ వుద్యమం మహిళలపై మంచి ప్రభావం వేసింది. పోలీసులు వారి సహజ పద్ధతిలో పోలీసు అత్యాచారాలు లేవని అబద్ధాలు ప్రకటించి మరోమారు ప్రజా ఆగ్రహానికి వ్యతిరేకతకు గురయ్యారు.

# కోరాపుట్ జిల్లా

### పుట్టంగి బ్లాక్ లో భూపోరాటాలు

నారాయణపట్నా భూ పోరాటం ప్రభావం పక్కనే వున్న బందుగాం, లక్ష్మీపూర్ బ్లాకుల్లోకి విస్తరించింది. అలాగే పుట్టంగి, నందపూర్, లమతాపుట్ బ్లాకులకూ విస్తరించింది. ఈ క్రమంలో పుట్టంగి బ్లాకులో భూమి, సారా, కరెంట్, నిర్వాసిత సమస్యలపై ప్రజలు ధర్నా, ర్యాలీలు చేయడమే కాకుండా, సంఘటితంగా భూస్వాములను ఎదిరిస్తూ భూ ఆక్రమణ పోరాటాలు చేపట్టి, విజయవంతం చేశారు.

2012 జనవరిలో మర్రిపుట్ ప్రాంతంలో 15 గ్రామాల ప్రజలు సంఘటితమై భూస్వామి నిరంజన్ ముదిలి ఆక్రమించుకున్న సుమారు 400 ఎకరాల భూమిని ఆక్రమించారు. దీనిలో 17 ఎకరాల, 8 సెంట్ల జీడిమామిడి తోటలు, 126 ఎకరాల, 40 సెంట్ల నీలగిరి (యూకలిప్టస్) ప్లాంటేషన్లు, సుబాబుల్ ప్లాంటేషన్లు వున్నాయి. రెండు గ్రామాల్లో వున్న 57 ఎకరాల, 32 సెంట్ల ధాన్యం పండే భూమిని ఆక్రమించారు. ఈ భూములన్నిటి నుండి సంవత్సరానికి 5 లక్షల రూపాయల డబ్బు, 150 క్వింటాళ్ళ ధాన్యం భూస్వామి, అతని కుటుంబ సభ్యులు రాబట్టుకునే వారు. ఈ భూస్వామి తమ్ముడు విశాఖ జిల్లా పెద్దబయలు మండలం ఆర్.ఐ. గా పని చేస్తున్నాడు. పట్టా భూములు ఆక్రమించుకోవడం తప్పని కేసులౌతాయని ప్రజలను బెదిరించాడు. అయినా ప్రజలు వెనకడుగు వేయకుండా, బెదిరింపులు, పోలీసు కేసులను ఎదిరించి నిలబడ్డారు. ప్రస్తుతానికి భూమి పంపకాలు కాలేదు. ఉమ్మడిగానే సాగు చేసుకుంటున్నారు.

2012 జూలై 28న నిరంజన్ ముదిలి తప్పులపై, భూ ఆక్రమణలపై ప్రజాకోర్టు నిర్వహించాలని, ముందు నుంచే ప్రజలు ప్రచారం చేశారు. చివరి వరకూ గాంభీర్యాన్ని ప్రదర్శించిన ముదిలి 27న రాత్రికే తన కారులో పారిపోవడానికి ప్లాన్ చేసుకున్నాడు. ఈ విషయం అర్థమైన ప్రజలు అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో 70 నాటు తుపాకులతో ఇంటిని చుట్టిముట్టి ముదిలిని ఇంటి నుంచి బైటకు రానివ్వకుండా చేశారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన ప్రజాకోర్టులో ఏడు గ్రామాల నుండి 500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఇదే ప్రజాకోర్టులో ముదిలి తమ్ముళ్లు ముగ్గుర్ని విచారించి, హెచ్చరికతో వదిలేశారు. వాళ్లు భూముల జోలికి రామని, కేసులు పెట్టబోమని కాగితం రాసి ఇచ్చారు. కొందరు మాట్లాడిన విషయాలపై తప్పులు ఒప్పుకున్నారు. గతంలో ఇతడితో మాట్లాడ్డానికే భయపడే ప్రజలు ప్రజాకోర్టులో వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడం, ఆ చుట్టు పక్కల ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. కొందరు అతనికున్న ట్రాక్టర్, రెండు జీపులు, ఒక అంబాసిడర్ కారు, రెండు బైకులు స్వాధీనం చేసుకోవాలని మాట్లాడారు. సుమారు ఇరవై సంవత్సరాల నుండి ఈ సమస్య నలుగుతున్నది. ఉన్న భూములు జోలాపుట్ డ్యామ్ ముంపులో పోతుండగా (ప్రతి సంవత్సరం నీరు పెరిగినప్పుడు మిగిలిన కాస్త భూములు కూడా మునిగి పోయేవి) కొండ భూములు, మెట్ట భూములు ముదిలి కుటుంబం ఆధీనంలో వుండేవి. కొత్త పోడు కొట్టడానికి ఫారెస్టు వాళ్ల భయం. ఇప్పుడీ సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు కొత్త పోరాటాలకు సిద్ధమౌతున్నారు.

2012 జూన్ 10న కోరాపుట్ ఎమ్.ఎల్.ఏ., జిల్లా కాంగ్రెస్ నేతల సహకారంతో, పద్మాపురంలో పదకొండు ఎకరాల 42 సెంట్ల భూమిని జగత్‌రామ్ అనే అతను ఆక్రమించుకున్నాడు. ముందు ఇల్లు కట్టుకోవడానికి కొంత భూమిని కొనుక్కున్నాడు ఇతడు. ఇతనిది ప్రక్కెలి గ్రామం. ఆ తర్వాత కాలంలో భూమిని కోల్పోయిన ఆ కుటుంబంలో అందరూ అనారోగ్యాలతో చనిపోయారు. ఆ తర్వాత పది, పన్నెండు సంవత్సరాల నుండి పద్మాపురం ప్రజలు ఆ భూమి గురించి మాట్లాడినప్పుడు మొత్తం అమ్మేశారని, పట్టా అయిపోయిందని, భూమిలోకి దిగితే, కేసులు పెడతానని బెదిరించేవాడు. ఈ ప్రాంతంలోకి పార్టీ ప్రవేశించాక, పార్టీ నేతృత్వంలో ప్రజలు కదిలి, విత్తనాల సమయంలో ఆక్రమించడంతో, బెదిరింపులకు పాల్పడ్డాడు. కానీ ప్రజలందరూ 70 నాగళ్ళతో భూములు దున్ని విత్తనాలు వేశారు. నాగలి లేని వారు పారలతో పనిలో కలిశారు. ప్రస్తుతం ఈ భూమి పంపిణీ కాలేదు. ఉమ్మడిగానే వుంది.

ఇదే సమయంలో పెద్దపాడులో తమ భూములను ఆక్రమించుకున్న వారి నుండి ప్రజలు తిరిగి స్వాధీనం చేసుకుని, పంపకాలు చేసుకున్నారు. సుమారు 15 ఎకరాల భూమి అది. దానిలో కొంత భూమిని సంత జరపడానికి కేటాయించారు.

కొట్టూబులో భూస్వామి ఆక్రమణలో వున్న నీలగిరి తోటలను నాలుగు గ్రామాల ప్రజలు ఉమ్మడిగా నరికి కలపను తీసుకెళ్ళారు. ఆ భూమిపై భూస్వామి వెంకట్రావు, అతని తమ్ములకు అధికారం లేదని ప్రజా కోర్టులో స్పష్టం చేశారు.

# అమర వీరులకు ఎర్రెర్రని జోహార్లు



**కామ్రేడ్ జంగయ్య (రవి)**

కామ్రేడ్ జంగయ్య (రవి) నల్లగొండ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ, 2005 ఆగస్టు 22న బూటకపు ఎన్‌కౌంటర్లో అమరత్వం చెందాడు. గతంలో ఈ అమరుడి జీవిత చరిత్ర ప్రచురించినప్పటికీ అప్పుడు ఫోటో దొరకనందున ప్రచురించలేకపోయాం.



**కామ్రేడ్ మడకం దేవాల్ (జగన్)**

2012 నవంబర్ 11న కేకేడబ్ల్యు డివిజన్ బలగాలపై జరిగిన గ్రేహౌండ్స్ దాడిలో, కామ్రేడ్ మడకం దేవాల్ (జగన్) అమరత్వం చెందాడు. ఈ కామ్రేడ్ జీవిత చరిత్ర అందుబాటులో లేనందువల్ల ప్రచురించలేక పోతున్నాం.

సెప్టెంబర్ 2012లో పెద్దపాడు చుట్టు పక్కల మహిళలు ఏకమై సంతలో సారా, బ్రాందీ, కల్లు నిషేధంకై మీటింగ్ చేసి సారా, బ్రాందీలను ధ్వంసం చేసారు. ప్రస్తుతం సారా, బ్రాందీలు బంద్ అయినాయి.

సెప్టెంబర్ 2012లోనే సుంకి పంచాయితీలో రెండు గ్రామాలు, రాళ్ళగడ్డ పంచాయితీలో ఆరు గ్రామాల ప్రజలు కరెంట్ సమస్యలపై పుట్టంగి బ్లాక్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు.

ఆగస్టు, సెప్టెంబర్ 2012లో రాళ్ళగడ్డ పంచాయితీ లీలగాం, సుంకీ పంచాయితీ ముంగాం గుమ్మ, ఈతల పాడులవద్ద ప్రభుత్వం మినీ హైడల్ ప్రాజెక్టులను నిర్మించ తలపెట్టింది. ఈ డ్యాముల వలన పంట భూములే కాక, వేలాది చింతచెట్లు, వందలాది పనస, ఇతర ఆధారిత చెట్లు నాశనమౌతాయి. చింతచెట్ల నుండి వచ్చేదే ఇక్కడి ప్రజల ప్రధాన ఆదాయం. ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా 13 గ్రామాల ప్రజలు సుంకిలోను, పుట్టంగిలోను ధర్నాలు నిర్వహించారు. దానితో లీలగాం, ఈతలపాడు డ్యామ్‌లను వుపసంహరించుకున్నారు. (ముంగారి గుమ్మ ప్రాజెక్టు గురించి ప్రకటించలేదు) ప్రజలు ఐక్యమై వ్యతిరేకించడంతో నిర్వాసిత సమస్య నుండి తప్పుకున్నారు.

**కూరగాయల గిట్టుబాటు ధరల పెంపుదల కోసం**

నందపూర్, సిమిలిగూడ, పుట్టంగి బ్లాకుల్లో చల్లని వాతావరణం కారణంగా కూరగాయులు, ఆకు కూరల పంటలు బాగా పండుతాయి. ఆదివాసీ, గైరాదివాసీ రైతులు సంప్రదాయక వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు పండించడంతో పాటు హైబ్రీడ్ విత్తనాలు కూడా వాడుతున్నారు. అలా వేసిన పంటలు సీజనల్‌గా మంచిగా పండి విశాఖ, హైద్రాబాద్, భువనేశ్వర్ వంటి నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. మన్యం, ఏజెన్సీ ప్రాంతాల కాయగూరలు, దినుసులు, ఆకుకూరలకు పట్టణాల్లో గిరాకీ ఎక్కువ. కానీ ఇక్కడ దళారులు రైతాంగానికి కనీస గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు. కొత్తిమీర బస్తా 200-250 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేసి, తిరిగి వాటిని పట్టణాల్లో 1000-1200 రూపాయలకు అమ్ముతున్నారు. కేరెట్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, టమోటో వంటి కూరగాయల పరిస్థితి కూడా ఇంతే. 2012లో క్యాబేజీ కిలో పావలా కావడంతో రైతాంగం ఆ తోటలను గొడ్లకు వదిలివేశారు. కిలో విత్తనాలు 500 నుంచి 1000 రూపాయల మధ్య వుంటుంది. శ్రమకు కనీస ఫలితం లేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనిపై ఏకమైన రైతాంగం కుందెల గ్రామంలో 2012, ఆగస్టులో ఆరు వేల మందితో ర్యాలీ చేసి, సభ జరిపారు.

సంతల్లో బుట్టలతో తీసుకెళ్ళే వీరి దగ్గర సంత పన్ను (ఆశీలు) వసులు చేయడం బంద్ చేయాలని, గిట్టుబాటు ధరలు నిలకడగా వుంచాలని, శీతల గిడ్డంగులు నిర్మాణం చేయాలని, సంతల్లో లంచాలు బంద్ చేయాలని, రౌడీల దౌర్జన్యాలను అరికట్టాలని డిమాండ్ చేసారు.

వెంటనే సంతపన్ను (ఆశీలు), లంచాలు, రౌడీల దౌర్జన్యాలు బంద్ అయినాయి. గిట్టుబాటు ధరలు, శీతల గిడ్డంగుల విషయం మాత్రం అలాగే వుండి పోయింది. ★

# శుభ్రాంశు చౌధరి వ్యాఖ్యలు
# మావోయిస్టు ఉద్యమాన్ని కించపరిచే ప్రయత్నాల్లో భాగమే!

మే 25న ఛత్తీస్‌గఢ్‌లోని జీరంఘాటీ దగ్గర పీఎల్‌జీఏ జరిపిన దాడిలో మహేంద్ర కర్మ, నందకుమార్ పటేల్ సహా మరి కొందరు చనిపోయిన దరిమిలా, విలేకరి శుభ్రాంశు చౌధరి బీబీసీ హిందీ డాట్ కామ్‌లో 'మాస్టర్ చేతిలో నక్సలైట్ల కమాండ్?' అనే శీర్షికతో ఒక వ్యాసం రాశాడు. ఈ వ్యాసాన్ని మరి కొన్ని మీడియా సంస్థలు కూడ ప్రచురించాయి, ప్రసారం చేశాయి. అందులో ఆయన ఈ దాడిని మా పార్టీ దండకారణ్య యూనిట్ నాయకత్వంలో జరిగిన మార్పుతో లంకె వేయాలని చూశాడు. కామ్రేడ్ కోస స్థానంలో కామ్రేడ్ రామన్న కార్యదర్శిగా ఎన్నికవడం వల్ల ఇప్పుడు హింసాత్మక చర్యలపై ఎక్కువగా మొగ్గు చూపుతారని నిరూపించడానికి ప్రయత్నించాడు. తన కపోల కల్పిత విశ్లేషణను వాస్తవమని నమ్మించడం కోసం ఆయన "కోస వంటి నాయకులను రామన్న ఇష్టపడడు" అని కూడ రాశాడు. ఇదంతా ఉత్త చెత్త వాగుడే తప్ప మరేమీ కాదని మా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ భావిస్తున్నది. ఈ సందర్భంగా కామ్రేడ్ రామన్నతో తాను జరిపిన సంభాషణను ఉటంకిస్తూ ఆయన పలు అభ్యంతరకర మాటలు రాశాడు. మా స్పెషల్ జోనల్ కమిటీ శుభ్రాంశు చేసిన అమర్యాదకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నది.

నేడు దోపిడీ రాజ్యం, మా పార్టీ నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి భారీ అణచివేత యుద్ధాన్ని నిర్వహిస్తున్నది. మానసిక యుద్ధం ఇందులో ఒక ముఖ్యమైన భాగం. దీంట్లో భాగంగా మీడియా ద్వారా, తదితర పలు సాధనాల ద్వారా అబద్ధాలను, కట్టుకథలను, పుకార్లను వ్యాపింప జేస్తున్నారు. ఇందులో ప్రత్యేకించి ఉద్యమ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. నాయకత్వం మధ్యన విభేదాలు, మనస్పర్ధలు వున్నట్టుగా దుష్ప్రచారాన్ని పెద్ద ఎత్తున చేస్తూ, ప్రజలను తప్పుదారి పట్టించాలని చూస్తున్నారు. తెలిసో, తెలియకో శుభ్రాంశు చౌధరి కూడ ఇందులో భాగమయ్యాడని మేం భావిస్తున్నాం.

ఆ తర్వాత జూన్ 1న బీబీసీ రేడియో వీక్లీ కార్యక్రమం 'ఇండియా బోల్'లో పాల్గొన్న శుభ్రాంశు మా ఉద్యమ సంబంధంలో మరిన్ని వ్యాఖ్యలు చేశాడు. మావోయిస్టుల రాజకీయ లక్ష్యం, వాళ్ల నాయకత్వంలో పోరాడుతున్న ఆదివాసుల సమస్య రెండూ, వేరు వేరని ఆయన పేర్కొన్నాడు. ఆయన ప్రకారం, "కొంత మంది మావోయిజం పేరుతో ప్రపంచంలో రాజకీయాలను మార్చాలని కోరుకుంటున్నారు. కాగా అత్యధికులు... వాళ్లను మీరు ఆదివాసులని అంటారు, వాళ్లను నేను దిగువ స్థాయి సైనికులు (ఫుట్ సోల్జర్స్) అంటాను, వీళ్లు వాళ్లతో ఎందుకు కలుస్తారంటే నేటి వ్యవస్థ ద్వారా వీళ్లకు న్యాయం లభించడం లేదు కనుక. మావోయిస్టులు ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురవేయాలనుకుంటున్నారు. మావోయిస్టుల పోరాటం అడవి కోసం, భూమి కోసం చేస్తున్న పోరాటం కాదు... వాళ్లు ఈ ప్రపంచంలో సోషలిజం, ఆ తర్వాత కమ్యూనిజం తేవాలనుకుంటున్నారు...".

శుభ్రాంశు చౌధరి ఇటీవలే మావోయిస్టు ఉద్యమం గురించి 'లెటజ్ కాల్ హిమ్ వాసు' అనే పేరుతో ఒక పుస్తకం రాశాడన్నది గమనార్హం. అయితే విచారకరమైన విషయం ఏమంటే తన పుస్తకంలో మావోయిస్టులతో ఏడేళ్ల పాటు సంబంధం కొనసాగించినట్టు చెప్పుకున్న శుభ్రాంశు మా ఉద్యమాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి ఎప్పుడూ సీరియస్‌గా ప్రయత్నించనే లేదు. వర్గ పోరాట మౌలిక సూత్రాలను కూడ అర్థం చేసుకోవడానికి అతను ప్రయత్నించలేదు. ఆదివాసుల పోరాటాలన్నీ - వాటికి నాయకత్వం మావోయిస్టులు వహించినా, వహించక పోయినా - రాజ్యానికి వ్యతిరేకంగా సాగుతున్న వర్గ పోరాటంలో భాగమే. దీర్ఘకాలిక దృష్టితో చూసినపుడు లేదా అంతిమంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) లక్ష్యం రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడమే అనే దాంట్లో సందేహానికి తావే లేదు. లేదంటే మనం మన దేశ ప్రజానీకాన్ని సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా బంధనాల నుండి విముక్తి చేయలేం. అంటే ఈ విధంగా తప్ప మరే విధంగా కూడ అన్యాయమైన ప్రస్తుత సామాజిక-ఆర్థిక వ్యవస్థను మార్చలేం. అయితే కమ్యూనిస్టులకు, ఆ మాటకొస్తే కార్ల్ మార్క్స్‌కు కూడ సాయుధ విప్లవం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని స్థాపించాలనే కలేమీ రాలేదు. అది కార్మికవర్గం, తదితర పీడిత వర్గాల సమస్యల, సమాజపు ఆర్థిక-రాజకీయ-సామాజిక పరిస్థితుల, యావత్ వర్గ పోరాటాల సమగ్ర, శాస్త్రీయ విశ్లేషణా సారం. ప్రస్తుత రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకిలించి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై నాలుగు వర్గాల - ఇందులో దేశీయ, చిన్న తరహా పెట్టుబడిదార్లు కూడా వుంటారు - ఐక్య సంఘటన ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడమనే రాజకీయ వ్యూహం భారత సమాజ నిర్దిష్ట, సమగ్ర విశ్లేషణ ఆధారంగానే రూపొందింది తప్ప కొద్ది మంది మెదళ్లలో పుట్టిన ఊహలతో కాదు. ఇది మా పార్టీ తక్షణ కార్యక్రమం. దీనినే మేం నూతన ప్రజాస్వామిక విప్లవం అని అంటున్నాం.

భారత అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజంలో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదార్లు తదితర పీడిత వర్గాలకు; ఆదివాసులు, దళితులు, మతపరమైన మైనారిటీలు, మహిళలు మొదలైన పీడిత సెక్షన్లకు చెందిన మౌలిక సమస్యలన్నీ ఈ వ్యవస్థను సమూలంగా మార్చివేసినపుడే, పీడిత వర్గాల

ప్రజాస్వామిక రాజ్యాధికారాన్ని నెలకొల్పినపుడే శాశ్వతంగా పరిష్కారం కాగల్గుతాయి. ఈ విప్లవకర ప్రక్రియకు మా పార్టీ నాయకత్వం వహిస్తున్నది.

ఈ లక్ష్యంతోనే మా పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అనేక దశాబ్దాలుగా పీడిత ప్రజలను సంఘటితం చేస్తున్నది. ఆదివాసులు ఇందులో ఒక ముఖ్య భాగం. ప్రజల ప్రయోజనాలే మా పార్టీ ప్రయోజనాలు. జల్-జంగల్-జమీన్ సహా ప్రజల దైనందిన సమస్యలన్నిటినీ చేపట్టి మా పార్టీ ప్రజా పోరాటాలను నిర్మిస్తున్నది. పీడిత ప్రజలను వివిధ ప్రజా సంఘాల్లో సంఘటితం చేస్తున్నది. చరిత్రను పరిశీలిస్తే ఇప్పటి వరకు జరిగిన విప్లవాలేవీ కూడ ప్రజల దైనందిన సమస్యలతో ముడిపడకుండా విడిగా లేవు. నిజానికి ప్రజల ఆకాంక్షలకు, అవసరాలకు సరైన వ్యక్తీకరణ గానే విప్లవాలు విజయవంతం అవగలిగాయి. 1917 రష్యా విప్లవం విజయవంతమైంది 'శాంతి-రొట్టె' అనే నినాదంతోనే. అలాగే భారతదేశంలో కూడ జల్-జంగల్-జమీన్ సమస్య నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఇరుసైన వ్యవసాయ విప్లవంలో భాగమే. కాని శుభ్రాంశు మావోయిస్టు ఉద్యమంలో భాగస్వాములైన ఆదివాసులకు, ఉద్యమ నాయకత్వానికి మధ్య కృత్రిమ విభజన చేసి వాళ్ల లక్ష్యాలు వేరు వేరని చూపడానికి వృథా ప్రయత్నం చేస్తున్నాడు. మావోయిస్టు ఉద్యమంలో భాగమైన ఆదివాసులను 'దిగువ స్థాయి సైనికులు'గా అభివర్ణించడం కూడ అతని కొంచెపు బుద్ధినే ఎత్తి చూపుతున్నది.

ఆదివాసులు ఎవరో ఇతరుల 'రాజకీయ లక్ష్యం' కోసం కాక, తమ విముక్తి కోసమే పోరాడుతున్నారని శుభ్రాంశు అర్థం చేసుకోలేకపోతున్నాడు. దేశ చరిత్రలో నేటి వరకూ ఆదివాసులు చేసిన ఏ పోరాటమయినా, తిరుగుబాటయినా ఏదో ఒక రూపంలో జల్-జంగల్-జమీన్‌తో ముడిపడి వున్నదే. జల్-జంగల్-జమీన్‌ల సమస్యకు రాజ్యాధికారంతో సూటి సంబంధం వున్నది. శుభ్రాంశు 'దిగువ స్థాయి సైనికుల'ని పేర్కొంటున్న ఆదివాసులు వలస పాలనా కాలంలో, బ్రిటిష్ వాళ్లకు వ్యతిరేకంగా పదుల సార్లు తిరుగుబాట్లు చేశారు. ఒకవేళ ఎవరైనా ఆ ఆదివాసుల సమస్య వేరు, భారత స్వాతంత్ర్య లక్ష్యం వేరు అని మాట్లాడితే అది హాస్యాస్పదమే అవుతుంది. నిజానికి ఆదివాసుల పట్ల శుభ్రాంశు దృష్టే చాలా అస్తవ్యస్తంగా వుంది. ఆయన ఆదివాసుల సమస్యల గురించి మాట్లాడడం అయితే చేస్తాడు కాని, ఆ సమస్యలు ఎలా పరిష్కారమవుతాయనేది అతనికి తెలియనే తెలియదు. సామ్రాజ్యవాదులతో కుమ్మక్కయిన భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల చేతిలో రాజ్యాధికారం వున్నంత కాలం, ఆదివాసులకు జల్-జంగల్-జమీన్‌లపై అధికారం గాని లేదా శుభ్రాంశు ప్రకారం 'న్యాయం' గాని దక్కదు గాక దక్కదనే నిజాన్ని అతను గ్రహించ లేకపోతున్నాడు. నేడు దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి ఆదివాసీ ప్రాంతాల్లో గనులు, భారీ ప్రాజెక్టులు, భారీ పరిశ్రమలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, అభయారణ్యాలు, సైనిక కేంద్రాలు నిర్మించే పథకాల వలన కోట్లాది ప్రజలు నిర్వాసితులవుతున్నారు. ఆదివాసులను జీవన్మరణ పోరాటంలోకి ఈడ్చుతున్న ఈ కార్పొరేటు నిలువుదోపిడీకి, ప్రస్తుత వ్యవస్థతోనూ, అది అమలు చేస్తున్న నయా ఉదారవాద విధానాలతోనూ వున్న సంబంధాన్ని కూడా శుభ్రాంశు అర్థం చేసుకోలేకపోతున్నాడు. లేదా బహుశా అతను ప్రస్తుత దోపిడీ, పీడక వ్యవస్థను యదాతథంగా వుంచుతూనే కొన్ని 'బ్యాండ్‌ఎయిడ్ పరిష్కారాల'తో ప్రజల సమస్యలను పరిష్కరించవచ్చనే లేదా పరిష్కరించాలనే భ్రమలో వున్నాడు.

నేడు దండకారణ్యంలో, దేశంలోని విభిన్న ప్రాంతాల్లో ఆదివాసులు మావోయిస్టు ఉద్యమంలో సంఘటితం అయ్యారంటే, మొదటి నుండి వాళ్లను మా పార్టీ రాజ్యాధికారాన్ని గుంజుకోవాలనే లక్ష్యంతోనే ప్రేరేపించిందనే విషయాన్ని మరచిపోవద్దు. వాళ్ల పోరాటాలన్నిటికి తొలి నుండీ రాజ్యాధికార సమస్యనే కేంద్ర బిందువుగా వుంది. ప్రజల ప్రజాస్వామ్య రాజ్యాధికారపు పిండరూపమైన క్రాంతికారీ జనతన సర్కార్ నేడిక్కడ నిర్మాణమయింది. వాళ్లలో చాలా మంది, శుభ్రాంశు తన పుస్తకంలో పలు మార్లు అసంతృప్తి స్వరంతో పేర్కొన్నట్టుగా, రాయపూర్, ఢిల్లీ లాంటి నగరాలనైతే చూడకపోవచ్చు కాని గత అరవై అయిదేళ్లలో ఢిల్లీ, రాయ్‌పూర్‌లు వాళ్లకు ఏం ఒరగబెట్టాయో అనేదయితే అర్థం అయింది. శుభ్రాంశు అంటున్నట్టు ఎర్రకోట మీద ఎర్రజెండా ఎగురవేయాలనేది భాకపా (మావోయిస్టు) కల మాత్రమే కాదు. అది మొత్తం భారత శ్రామిక, పీడిత, అణగారిన ప్రజా సముదాయాలు దశాబ్దాలుగా కంటున్న కల. ఎందుకంటే, అప్పుడు మాత్రమే వాళ్లకు కూడూ, గుడ్డా, గూడులతో పాటు గౌరవప్రదంగా బతికే హక్కుకు హామీ వుంటుందని వాళ్లకు తెలుసు.

ఇక చివరన అతని పుస్తకంపై మా కమిటీ సంక్షిప్తంగా కొన్ని వ్యాఖ్యలు చేయదలుచుకుంది. ఈ పుస్తకం బోలెడన్ని అబద్ధాలతో, ఎన్నో అర్ధ సత్యాలతో, స్వల్ప వాస్తవాలతో కూడిన కలగూరగంప మాత్రమే. ఆయన రాసిన వాస్తవాలు కూడ చాలా వరకు వక్రీకరణకే గురయ్యాయి. ఈ పుస్తకంలో రాసిన చాలా అంశాలు పచ్చి అబద్ధాలే. ప్రత్యేకించి డాక్టర్ బినాయక్‌సేన్ విషయంలో, జీత్-ముక్తిలతో మా పార్టీ సంబంధాల గురించి, ఎస్సార్ కంపెనీ నుండి డబ్బులు తీసుకున్నామన్న విషయంలో... ఈ మూడు విషయాలపై అతను రాసినదాన్ని మా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రజాస్వామిక ఉద్యమాలకు, విప్లవోద్యమాలకు, ఆ వుద్యమ శ్రేయోభిలాషులకు నష్టం చేకూర్చాలని కోరుకునే వాళ్లు, ఆ వుద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్న రాజ్యం సరసన నిలబడాలనుకునే వాళ్లు మాత్రమే ఇటువంటివి రాయగలరని మేమనుకుంటున్నాం.

**(గుడ్సా ఉసెండి)**
**అధికార ప్రతినిధి,**
**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**
**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

*(చివరి పేజీ తరువాయి...)*

మధ్యలో కాంగ్రెస్‌లో చీలిక వచ్చి మాధవరావు సింధియా ఏర్పాటు చేసిన పార్టీలో చేరి 1996లో లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్‌లో చేరాడు. 1996లో బస్తర్‌లో ఆరవ షెడ్యూల్ అమలు చేయాలని ఒక పెద్ద ఉద్యమం సాగింది. ఈ ఉద్యమానికి ప్రధానంగా సీపీఐ నాయకత్వం వహించగా, మునుపటి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) కూడ ఆ వుద్యమంలో చురుగ్గా పాల్గొని ప్రజలను పెద్ద ఎత్తున కదిలించింది. అయితే బైటి ప్రాంతాల నుండి వలస వచ్చి బస్తర్‌లో పాగా వేసి కోట్లకు పడగలెత్తిన స్వార్థపర పట్టణ వ్యాపార వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ మహేంద్ర కర్మ ఆ ఉద్యమానికి పచ్చి వ్యతిరేకిగా నిలబడ్డాడు. అలా అప్పుడే అతని ఆదివాసీ వ్యతిరేక, దళారీ స్వభావం ప్రజలకు తేటతెల్లమైంది. 1980వ దశాబ్దం నుండే అతనికి బస్తర్‌లోని బడా వ్యాపార/పెట్టుబడిదారీ వర్గాలతో సంబంధాలు బలపడ్డాయి.

తర్వాత 1999లో 'మాలిక్ మక్బూజా'గా పేరుగాంచిన ఒక పెద్ద భూముల కుంభకోణంలో కర్మ పేరు బైటపడింది. 1992-96 మధ్య దాదాపు 56 గ్రామాల్లో బినామీ పేర్లతో పేద ఆదివాసుల భూములను చవకగా కొని రెవిన్యూ, ఫారెస్టు అధికార్లతో, జిల్లా కలెక్టర్‌తో కుమ్మక్కయ్యి ఆ భూముల్లో వున్న విలువైన చెట్లను నరికించాడు. దొంగ వ్యాపారులకు ఆ కలప అమ్ముకొన్న మహేంద్ర కర్మ కోట్లు సంపాదించినట్టు లోకాయుక్త రిపోర్టు బైటపెట్టింది. దీనిపై సీబీఐ విచారణకు కూడ ఆదేశించినప్పటికీ సహజంగానే దోషులెవరినీ శిక్షించింది లేదు.

దళారీ పెట్టుబడిదారీ వర్గాల, బస్తర్‌లోని బడా వ్యాపార వర్గాల ప్రతినిధిగా కాంగ్రెస్ తరఫున ఎన్నికలలో గెలిచిన కర్మ అవిభాజిత మధ్యప్రదేశ్‌లో జైళ్ల మంత్రిగా, ఛత్తీస్‌గఢ్ ఏర్పాటు తర్వాత పరిశ్రమల మంత్రిగా కొనసాగాడు. ఆ సమయంలో నగర్నార్‌లో రోమెల్ట్/ఎన్ఎండీసీ తలపెట్టిన స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం బలవంతంగా భూముల ఆక్రమణ జరిగింది. స్థానిక ప్రజలు తమ భూములను ఇవ్వబోమని ఆందోళనకు పూనుకోగా మహేంద్ర కర్మ పెట్టుబడి అనుకూల, ప్రజా వ్యతిరేక వైఖరిని చేపట్టాడు. తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి, ప్రజలను హింసించి, అక్రమ కేసుల్లో అరెస్టులు చేసి చివరకు బలవంతంగా భూముల్ని ఆక్రమించుకోవడంలో ప్రముఖ పాత్ర పోషించాడు. ఈనాటికీ నగర్నార్‌లో భూములు కోల్పోయిన ప్రజలకు నష్టపరిహారం గాని, ప్రభుత్వం వాగ్దానం చేసినట్టుగా ఉపాధి గాని దొరకక చెట్టుకొకరు, పుట్టకొకరయ్యారు.

ఇక విప్లవోద్యమానికి మహేంద్ర కర్మ తొలి నుండి బద్ధ శత్రువుగానే నిలిచాడు. అచ్చమైన భూస్వామ్యవర్గంలో పుట్టి, బడా వ్యాపార/పెట్టుబడిదారీ వర్గాల ప్రతినిధిగా 'పెరిగిన' వాడు కావడమే ఇందుకు కారణం. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా 1990-91లో మొట్టమొదటి జన్ జాగరణ్ నిర్బంధ క్యాంపెయిన్ నడిచింది. అందులో రివిజనిస్టు పార్టీయైన సీపీఐ క్రియాశీలంగా పాల్గొంది. కర్మతో పాటు అతని బంధువులైన చాలా మంది భూస్వాములు ఈ విప్లవప్రతిఘాతుక, ప్రజావ్యతిరేక క్యాంపెయిన్‌లో చురుగ్గా పాల్గొన్నారు. 1997-98లో జరిగిన రెండో జన్‌జాగరణ్ అభియాన్‌ను మహేంద్ర కర్మ స్వయంగా ముందుండి నడిపించాడు. తన స్వగ్రామమైన ఫర్సపాల్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో మొదలై భైరంగఢ్, కుట్రు ప్రాంతాల దాకా ఇది నడిచింది. వందలాది మందిని పట్టుకొని కొట్టి, అరెస్టు చేయించి జైలుకు పంపారు. లూటీలకు, గృహదహనాలకు పాల్పడ్డారు. మహిళలపై అత్యాచారాలు జరిపారు. అయితే మా పార్టీ, ప్రజా సంఘాల నాయకత్వంలో ప్రజలు సమీకృతమై ఈ దాడిని సమరశీలంగా ఎదిరించారు. దాంతో తక్కువ కాలంలోనే ఈ క్యాంపెయిన్ తోకముడిచింది.

ఆ తర్వాతి క్రమంలో విప్లవోద్యమం మరింత సంఘటితపడింది. అనేక ప్రాంతాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు తీవ్రతరం అయ్యాయి. ఇందులో భాగంగా జరిగిన ప్రజా ప్రతిఘటనలో మహేంద్ర కర్మ స్వంత సోదరుడైన భూస్వామి పొదియా పటేల్ సహా కొందరు దగ్గరి బంధువులు కూడ ఖతమయ్యారు. గ్రామగ్రామాన భూస్వామ్య/పెత్తందారీ శక్తుల అధికారాన్ని కూలదోసి విప్లవ ప్రజా రాజ్యాధికార అంగాల నిర్మాణం మొదలయ్యింది. గ్రామాల్లో ప్రజావ్యతిరేక, భూస్వామ్య శక్తుల నుండి భూములు గుంజుకొని ప్రజలకు పంచడం, గతంలో తెగపెద్దలు పంచాయితీల పేరుతో అన్యాయంగా దండుగలు విధించే పద్ధతులకు పూర్తిగా స్వస్తి చెప్పి ప్రజల ప్రజాస్వామిక పాలన మొదలు కావడం కరడుగట్టిన భూస్వామ్య దురంహంకారియైన కర్మకు మింగుడు పడలేదు. మహిళల బలవంతపు పెళ్లిళ్లను అడ్డుకోవడం, బహుభార్యాత్వాన్ని నిరుత్సాహపర్చడం వంటి ప్రగతిశీల మార్పుల్ని సైతం భూస్వామ్య శక్తులు జీర్ణించుకోలేకపోయాయి. అదే సమయంలో బస్తర్ ప్రాంతంలో భారీ ప్రాజెక్టులు నిర్మించి ప్రజలను పెద్ద ఎత్తున నిర్వాసితుల్ని చేసి, ఇక్కడి సహజ వనరుల దోపిడీకి పాల్పడడానికి పూనుకున్న టాటా, ఎస్సార్ వంటి కార్పొరేట్ ప్రభువులకు కూడా ఇక్కడ పెంపొందుతున్న విప్లవోద్యమం కంటగింపుగా తయారైంది. కనుక సహజంగానే మహేంద్ర కర్మ వంటి విప్లవప్రతిఘాతుక శక్తులతో వాళ్లు కుమ్మక్కయ్యారు. తమ విచ్చలవిడి దోపిడీకి అనువైన వాతావరణం నెలకొల్పాలని అతనికి కోట్ల రూపాయల లంచాలు మేపారు. మరోవైపు, దేశవ్యాప్తంగా నిజమైన విప్లవ సంస్థల విలీనంతో ఒక సంఘటిత పార్టీగా సీపీఐ (మావోయిస్టు) అవతరణ దరిమిలా దానిని అణచడానికి దేశ దోపిడీ పాలకవర్గాలు తమ సామ్రాజ్యవాద ప్రభువుల కనుసన్నల్లో విప్లవప్రతిఘాతుక దాడిని తీవ్రతరం చేశారు. తమ ఎల్.ఐ.సీ. విధానంలో భాగంగా మహేంద్ర కర్మ వంటి కరడుగట్టిన విప్లవ వ్యతిరేక శక్తులను ముందుంచుతూ ఒక ఫాసిస్టు దాడికి కుట్ర పన్నారు. అలా, ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీల కుమ్మక్కుతో ఒక బీభత్సకర దాడిని ప్రారంభించి దానికి

'సల్వాజుడుం' అని నామకరణం చేశారు. మీడియాలో మహేంద్ర కర్మను రమన్‌సింగ్ కేబినెట్‌లో '16వ మంత్రి'గా అభివర్ణించారంటే వాళ్లిద్దరి మధ్య ఎంత సమన్వయం వుండిందో అర్థం చేసుకోవచ్చు. సోయం మూక, రాంభువన్ కుష్వాహా, అజయ్‌సింగ్, విక్రం మండావి, గన్నూ పటేల్, మధుకర్‌రావు, గోటా చిన్నా తదితర మహేంద్ర కర్మ సన్నిహితులు, బంధువులు సల్వాజుడుంలో కీలక నాయకులుగా ముందుకొచ్చారు. అదే సమయంలో అతని కొడుకులు, ఇతర సన్నిహిత బంధువులు సర్పంచ్ నుండి జిల్లా పరిషత్ వరకు అన్ని స్థానిక పదవులను చేజిక్కించుకొని గూండా రాజకీయాలు నడుపుతూ, ప్రభుత్వ నిధుల వినియోగంలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడుతూ, కార్పొరేట్ కంపెనీల, బడా వ్యాపారుల ప్రయోజనాలకు కొమ్ము కాయసాగారు.

## సల్వాజుడుం నాయకుడు

ఇక 'సల్వాజుడుం' బస్తర్ ప్రజా జీవనంలో సృష్టించిన విధ్వంసాన్ని, అది పాల్పడ్డ క్రూరత్వాన్ని పోల్చడానికి చరిత్రలో చాలా తక్కువ వుదాహరణలే లభిస్తాయి. మొత్తం వెయ్యి మందికి పైగా హత్య చేసి, 640 గ్రామాలను వల్లకాడుగా మార్చి, వేలాది ఇండ్లను లూటీ చేసి, కోళ్లు, మేకలు, పందులు వంటి వాటినెన్నిటినో కోసుకొని తిని, దోచుకెళ్లి, 2 లక్షలకు పైగా ప్రజలను నిర్వాసితుల్ని చేసి, 50 వేల మందికి పైగా ప్రజలను బలవంతంగా 'సహాయ' శిబిరాలకు తరలించిన సల్వాజుడుం బస్తర్ ప్రజల పాలిటి శాపంగా పరిణమించింది. వందలాది మంది మహిళలపై సామూహిక అత్యాచారాలకు పాల్పడ్డారు. అనేక మందిని అత్యాచారం తర్వాత చంపేశారు. అనేక చోట్ల సామూహిక హత్యాకాండలకు పాల్పడ్డారు. సుప్రీంకోర్టులోనే 500 హత్యలు, 99 బలాత్కారాలు, 103 గృహదహనాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయంటే ఈ నేరాల వాస్తవ సంఖ్య ఎంత వుండవచ్చో అంచనా వేయవచ్చు. సల్వాజుడుం గూండా మూకలు, పోలీసు-అర్ధసైనిక బలగాలు, ప్రత్యేకించి నాగా, మిజో బెటాలియన్లు ప్రజలపై అమలు చేసిన హింసాదౌర్జన్యాలకు అంతే లేదు. ఘోరాతిఘోరంగా మనుషుల్ని ముక్కలుగా నరికి వాగుల్లో పడవేసిన ఘటనలెన్నో. చెర్లి, కోత్రపాల్, మన్‌కేలి, కర్రెమర్క, మోస్ల, ముండేర్, పదేడ, పరాల్‌నార్, పూంబాడ్, గగన్‌పల్లి... ఇంకా ఎన్నో గ్రామాల్లో మూకుమ్మడి హత్యాకాండలకు పాల్పడ్డారు. వందలాది ఆదివాసీ యువకులను ఎస్‌పీఓలుగా చేర్చుకుని వాళ్లను కరడుగట్టిన నేరస్తులుగా తయారు చేసారు. స్వయంగా మహేంద్ర కర్మ ఎన్నో గ్రామాల్లో సభల పేరుతో, పాదయాత్రల పేరుతో ముందుండి దాడులకు నాయకత్వం వహించాడు. ఎంతో మంది మహిళలపై తన పశు మూకలను ఎగదోసి అత్యాచారాలు చేయించిన అతని హీన చరిత్రను ఎవ్వరూ మర్చిపోలేరు. లొంగిపోని గ్రామాలను కాల్చి వల్లకాడులు చేయడంలో, దొరికిన వాళ్లను అమానుష హింసలకు గురి చేయడంలో, హత్య చేయడంలో ఇతడు ప్రత్యక్షంగా పాల్గొన్న వుదాహరణలెన్నెన్నో. ఇలా మహేంద్ర కర్మ బస్తర్ ప్రజల మనస్సులో అత్యంత అమానుష హంతకుడిగా, రేపిస్టుగా, బందిపోటుగా, బడా పెట్టుబడిదార్ల నమ్మకమైన ఏజెంటుగా నిలిచిపోయాడు. ఇతనిని శిక్షించాలని బస్తర్ వ్యాప్తంగా ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా పార్టీని, పీఎల్‌జీఏను డిమాండ్ చేస్తూ వచ్చారు. అందుకు క్రియాశీల సహకారాన్ని అందించడానికి సైతం ఎందరో స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. పలు మార్లు ప్రయత్నాలు జరిగినప్పటికీ చిన్న చిన్న పొరపాట్ల మూలంగా, ఇతర కారణాలతో ఇతను బతికిపోయాడు. చివరకు, మే 25న ప్రజల క్రియాశీల మద్దతుతో నిర్వహించిన ఈ వీరోచిత దాడి ద్వారా పీఎల్‌జీఏ మహేంద్ర కర్మను హతమార్చి బస్తర్ ప్రజల పీడ విరగడ చేసింది.

**ఈ చర్య ద్వారా సల్వాజుడుం గూండాల చేతిలో, ప్రభుత్వ సాయుధ బలగాల చేతిలో దారుణ హత్యకు గురైన వెయ్యికి పైగా ఆదివాసులందరి తరఫున, అత్యంత అమానుష హింసకు, అవమానాలకు, అత్యాచారాలకు గురైన వందలాది అక్కాచెల్లెళ్లందరి తరఫున, తమ ఇండ్లను, పశువుల్ని, కోళ్లు-మేకలను, వంటపాత్రలను, బట్టలను, ధాన్యాన్ని, పంటలను సర్వస్వం కోల్పోయి అమానుష పరిస్థితుల్లో జీవించే దుస్థితికి చేరుకున్న వేలాది బస్తర్ వాసులందరి తరఫున పీఎల్‌జీఏ ప్రతీకారం తీర్చుకుంది. కొంపా గూడు కోల్పోయి, నిలువ నీడ లేక, దిక్కుతోచక, తమ వాళ్లు ఎవరు బతికున్నారో ఎవరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయో కూడ తెలియని అయోమయ పరిస్థితిలో చెల్లాచెదురైన ప్రజలందరి ఆగ్రహావేశాలకు న్యాయమైన, ఆవశ్యకమైన వ్యక్తీకరణగానే ఈ చర్య జరిగింది.**

## ప్రజాస్వామ్యం అంటే?

ఈ దాడి జరిగిన వెంటనే ప్రధాని మన్మోహన్, యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్ వీరంతా దీన్ని ప్రజాస్వామ్యంపై, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. బీజేపీ అధ్యక్షుడు రాజనాథ్ సింగ్ దీనిపై మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ కలిసికట్టుగా నిలబడి నక్సలిజాన్ని, టెర్రరిజాన్ని ఎదుర్కోవాలని పిలుపునిచ్చాడు. **దోపిడీవర్గాల కావలి కుక్కలైన ఈ నాయకులకు అసలు ప్రజాస్వామ్యం అనే పదాన్ని వుచ్ఛరించే నైతిక అర్హత వుందా? నిన్న గాక మొన్న, మే 17న బీజాపూర్ జిల్లాలోని ఎడ్స్‌మెట్టలో ముగ్గురు చిన్నారులు సహా ఎనిమిది మంది ప్రజలను పోలీసు/పారామిలిటరీ బలగాలు హత్య చేసినపుడు వీళ్లు చెప్పే 'ప్రజాస్వామ్యం' ఏమైంది? కాంగ్రెస్ స్థానిక నాయకులే తప్పనిసరై 'నరమేధం'గా అభివర్ణించిన ఈ ఘాతుకంపై ఈ నేతలెవ్వరికీ గొంతు పెగల లేదెందుకు? మే 1న నారాయణపూర్ జిల్లా మదోహ్‌నార్ గ్రామానికి చెందిన ఫూల్‌సింగ్, జైసింగ్ అనే ఇద్దరు సోదరులను పోలీసు స్టేషన్‌కు పిలిపించి మరీ, యూనిఫారాలు తొడిగించి కాల్చి చంపి 'ఎన్‌కౌంటర్' అని చెప్పినపుడు వీళ్లు చెప్పే 'ప్రజాస్వామ్యం' పరవశించిపోయిందా మరి? జనవరి 20-23 మధ్య బీజాపూర్ జిల్లా పిడియా, దొడ్డి తుమ్‌నార్ గ్రామాలపై దాడులకు పాల్పడి 20 ఇళ్లను కాలబెట్టి, ఆఖరుకు ప్రజలు నడుపుకునే స్కూలును కూడా కాలబెట్టి బుగ్గి చేసినపుడు వీళ్ల 'ప్రజాస్వామ్యం'**

**వర్తిల్లిందా? ఫిబ్రవరి 6-9 మధ్య అబూజ్‌మాడ్‌గా పిలిచే అత్యంత వెనుకబడ్డ ఆదివాసీ ప్రాంతంలోని నిరుపేద మాడియా ప్రజల గ్రామమైన గట్టకల్‌పై దాడి చేసి ఇండ్లను దోచుకొని, ప్రజలను కొట్టి, హింసించి, గ్రామంలో నడిచే విప్లవ జనతన సర్కార్ స్కూలును కాల్చి బూడిద చేసినపుడు వీళ్ల 'ప్రజాస్వామ్యం' ఎక్కడ దాక్కుంది? సరిగ్గా 11 నెలల క్రితం 28 జూన్ 2012న సార్కిన్‌గూడలో 17 మంది ఆదివాసుల రక్తంలో స్నానమాడడం, 13 మంది యువతులపై లైంగిక అత్యాచారాలకు పాల్పడడం వీళ్ల 'ప్రజాస్వామ్య విలువల'లో భాగమేనా? మహేంద్ర కర్మ వంటి నరహంతకులకు, నందకుమార్ పటేల్ వంటి పాలకవర్గ తొత్తులకు మాత్రమే వర్తించే ప్రజాస్వామ్యమా ఇది? నిరుపేద బస్తర్‌వాసులకు, వృద్ధులకు, పసిపిల్లలకు, మహిళలకు వర్తించదా ఇది? వాళ్లను ఎంత మందినైనా, ఎన్ని సార్లయినా ఊచకోత కోయడం 'ప్రజాస్వామ్యం'లో భాగమేనా? ఈ ప్రశ్నలకు జవాబుందా ఈ దాడి గురించి గగ్గోలు పెడుతున్న వాళ్లలో ఎవరి వద్దనైనా?**

2005 నుండి 2007 వరకు కొనసాగిన సల్వాజుడుం ప్రజల ప్రతిఘటనతో ఓడిపోయింది. ఆ తర్వాత 2009లో దేశవ్యాప్త దాడిగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ-2 ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకు అమెరికా సామ్రాజ్యవాదులు మార్గదర్శకత్వం, సహాయ సహకారాలు అందించడంతో పాటు తమ స్పెషల్ ఫోర్సెస్‌ను ప్రత్యక్షంగా మోహరిస్తూ కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమ నాయకత్వాన్ని హత్య చేయడానికి ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో సాగుతున్న 'ప్రజలపై యుద్ధం'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 50 వేలకు పైగా పారామిలిటరీ బలగాలను ఛత్తీస్‌గఢ్‌కు పంపించింది. దీని ఫలితంగా నరమేధాలు, విధ్వంసం మరెన్నో రెట్లు పెరిగి పోయాయి. ఇప్పటికి 400 మంది దాకా అదివాసులను కేంద్ర, రాష్ట్ర సాయుధ పోలీసు, పారామిలిటరీ బలగాలు హతమార్చాయి. 2011 మధ్య నుండి ఇక్కడ శిక్షణ పేరుతో సైనిక బలగాల మోహరింపు మొదలైంది. ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో పాటు మొదట చిదంబరం, తర్వాత షిండే.. ఇద్దరూ రమన్ ప్రభుత్వం ఈ దాడిని నడుపుతున్న తీరుకు పరవశించిపోతూ ఎంత సహాయం కావాలంటే అంత అందిస్తామని వాగ్దానాల మీద వాగ్దానాలు చేసేస్తున్నారు. రమన్‌సింగ్ కూడ కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కొనియాడని సందర్భమే లేదంటే ఆశ్చర్యపోవల్సిందేమీ లేదు. **ఛత్తీస్‌గఢ్‌లో విప్లవోద్యమ అణచివేత విధానాల అమలుకు సంబంధించి పాలక బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల మధ్య ఎలాంటి విభేదాలు లేవు. కేవలం ప్రజల వత్తిడి వల్ల, అట్లాగే త్వరలో జరుగనున్న విధానసభ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని మాత్రమే కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు కొందరు సార్కిన్‌గూడ, ఎడ్స్‌మెట్ట వంటి నరమేధాలను ఖండించినట్టుగా పోజు పెట్టారు తప్ప నిజాయితీతో ఎంత మాత్రం కాదు. రాష్ట్రంలో రమన్‌సింగ్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల పట్ల గాని, అణచివేత విధానాల పట్ల గాని కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకత లేదు. అది కనబరుస్తున్న వ్యతిరేకత నిజమైనది కాదు. ఉత్తుత్తది, అవకాశవాదపూరితమైనది. విప్లవోద్యమ అణచివేత విధానాల అమలులో ఈ రెండు పార్టీలకు సమాన భాగస్వామ్యం వుంది. అంతే కాదు, ఆంధ్రప్రదేశ్ నుండి గ్రేహౌండ్స్ బలగాలు ఛత్తీసగఢ్‌లోకి తరచుగా చొరబడుతూ గతంలో కంచాల్ (2008), ఇటీవల పువ్వర్తి (ఏప్రిల్ 16, 2013) వంటి భారీ హత్యాకాండలకు పాల్పడ్డది కూడ కాంగ్రెస్ అనుసరిస్తున్న అణచివేత విధానాలలో భాగమే. ఇందుకే పీఎల్‌జీఏ కాంగ్రెస్ బడా నాయకులపై ఈ దాడికి పాల్పడ్డది.**

ఈరోజు దేశంలో మావోయిస్టు విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలని కంకణం కట్టుకున్న సోనియా-మన్మోహన్‌సింగ్-చిదంబరం -షిందే-జయరాం రమేష్‌ల పాలక ముఠా, ప్రత్యేకించి దండకారణ్య విప్లవోద్యమంపై కత్తిగట్టిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమన్‌సింగ్, హోంమంత్రి ననకీరాం కంవర్, మంత్రులు రాంవిచార్ నేతాం, కేదార్ కశ్యప్, విక్రం ఉ సెండి తదితరులు, గవర్నర్ శేఖర్ దత్తా, మహారాష్ట్ర హోంమంత్రి ఆర్.ఆర్. పాటిల్ తదితరులు, డీజీపీ రామ్‌నివాస్, ఏడీజీ ముకేష్ గుప్తా తదితర పోలీసు ఉన్నతాధికారులు తమకు ఎదురు లేదని విర్రవీగుతున్నారు. మహేంద్ర కర్మ కూడ వీళ్ల వలెనే జెడ్‌ప్లస్ సెక్యూరిటీ, బుల్లెట్‌ప్రూఫ్ వాహనాలు తనను ఎల్లప్పుడు కాపాడుతాయని భ్రమ పడ్డాడు. **ప్రపంచ చరిత్రలో హిట్లర్, ముస్సోలిని వంటి వాళ్లు కూడా తమకు ఎదురే లేదని ఇలాగే విర్రవీగారు. మన దేశ సమకాలీన చరిత్రలో ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి ఫాసిస్టులు కూడ ఇలాంటి భ్రమల్లోనే మునిగితేలారు. కాని ప్రజలు అజేయులు. చరిత్ర నిర్మాతలు. పిడికెడు మంది దోపిడీదార్లు, వాళ్ల కావలి కుక్కలు ఎన్నటికైనా చరిత్ర పెంటకుప్పలపైకే పోవల్సిన వాళ్లే.**

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను వెంటనే నిలిపివెయ్యాలని, దండకారణ్యంలో మోహరించిన అన్ని రకాల పారామిలిటరీ బలగాలను వెనక్కి తీసుకోవాలని, శిక్షణ పేరుతో భారత సైన్యాన్ని బస్తర్‌లో మోహరించే కుట్రలకు స్వస్తి చెప్పాలని, వాయుసైనిక బలగాల జోక్యాన్ని ఆపెయ్యాలని, జైళ్లల్లో మగ్గుతున్న విప్లవ కార్యకర్తలను, సాధారణ ఆదివాసులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, యూఏపీఏ, సీఎస్‌పీఎస్‌ఏ, మకోకా, ఏఎఫ్‌ఎస్‌పీఏ వంటి క్రూర చట్టాలన్నిటిని రద్దు చేయాలని, ప్రకృతి సంపదల దోపిడీ లక్ష్యంతో వివిధ కార్పొరేట్ కంపెనీలతో కుదుర్చుకున్న ఎంఓయూలను రద్దు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేయాల్సిందిగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కార్మికులకు, కర్షకులకు, విద్యార్థి-మేధావులకు, రచయితలకు, కళాకారులకు, మీడియా ప్రతినిధులకు, ప్రజాస్వామికవాదులందరికీ ఈ సందర్భంగా మరోసారి విజ్ఞప్తి చేస్తున్నది.

★

# మహేంద్ర కర్మ ఖతం - కాంగ్రెస్ బడా నాయకులపై దాడి

# ఫాసిస్టు సల్వాజుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లకు జవాబు

## వీరోచిత చర్యకు పాల్పడ్డ పీఎల్‌జీఏకు విప్లవ జేజేలు

మే 25, 2013న ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన ఒక డిటాచ్‌మెంట్, కాంగ్రెస్ పార్టీ బడా నాయకుల, కార్యకర్తల 20 వాహనాల కాన్వాయ్‌పై భారీ దాడి చేసి బస్తర్ పీడిత ప్రజల బద్ద శత్రువైన మహేంద్రకర్మ, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నందకుమార్ పటేల్‌లను మట్టుపెట్టింది. వీరితో పాటు మరో 28 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పోలీసులు ఈ వీరోచిత చర్యలో సంఘటనా స్థలంలోనే మరణించారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత విద్యాచరణ్ శుక్లతో పాటు మహేంద్ర కర్మ గార్డు ఆ తర్వాత మరణించారు. దీనితో మృతుల సంఖ్య 30కి చేరింది. కాగా ఈ సంఘటనలో కనీసం 30 మంది గాయపడ్డారు.

రానున్న విధానసభ ఎన్నికల రీత్యా 'పరివర్తనా యాత్ర' పేరుతో కాంగ్రెస్ బడా నాయకులందరూ బస్తర్ ప్రాంతంలో పర్యటిస్తున్న సందర్భంగా పీఎల్‌జీఏ ఈ దాడి జరిపింది. ఈ చర్య సందర్భంగా పోలీసుల నుండి, సెక్యూరిటీ గార్డుల నుండి పీఎల్‌జీఏ మొత్తం 23 తుపాకులను - తొమ్మిది ఏకే-47లు, ఏడు ఇన్సాస్ రైఫిళ్లు, రెండు ఎస్ఎల్ఆర్‌లు, ఐదు పిస్తోళ్లు స్వాధీనం చేసుకున్నది. వీటితో పాటు 1,030 తూటాలు, పది వాకీటాకీలు కూడ పీఎల్‌జీఏ వశమయ్యాయి. ఈ చారిత్రాత్మక దాడిలో ప్రజా పీడకుడిగా, హంతకుడిగా, రేపిస్టుగా, దోపిడీదారుడిగా, అవినీతిపరుడిగా పేరుమోసిన మహేంద్ర కర్మ కుక్కచావు చావడంతో, అవిభాజిత బస్తర్ ప్రాంతమంతటా పండుగ వాతావరణం నెలకొన్నది. గతంలో రాష్ట్ర హెూంమంత్రిగా పని చేసిన నందకుమార్ పటేల్ ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగించడంలో ముందు నిలిచిన చరిత్ర గలవాడే. ఇతని హయాంలోనే బస్తర్ ప్రాంతంలో మొట్టమొదటిసారి కేంద్ర పారామిలిటరీ బలగాల (సీఆర్‌పీఎఫ్) మోహరింపు జరిగింది. గతంలో కేంద్ర మంత్రిమండలిలో కొనసాగి హెూంశాఖ సహా అనేక కీలక శాఖలు నిర్వహించిన వీ.సీ. శుక్లా సామ్రాజ్యవాదులకు, దళారీ పెట్టుబడిదార్లకు, భూస్వాములకు నమ్మకమైన ప్రతినిధిగా సుదీర్ఘ కాలంగా పని చేస్తూ దోపిడీ విధానాల రూపకల్పనలో, అమలులో క్రియాశీల పాత్ర పోషించాడు. ఎమెర్జెన్సీ కాలంలో పరమ క్రూరుడిగా పేరుపొందిన ప్రజా శత్రువు ఇతడు. ఈ దాడి ప్రధానంగా మహేంద్ర కర్మను, అతనితో పాటు మరి కొందరు అభివృద్ధి నిరోధక కాంగ్రెస్ నేతలను నిర్మూలించే లక్ష్యంతో జరిగింది. అయితే ఈ భారీ దాడి సందర్భంగా గెరిల్లా బలగాలకు, సాయుధ పోలీసులకు మధ్య దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఎదురు కాల్పుల్లో చిక్కుకొని కొద్ది మంది నిర్దోషులు, ప్రజా శత్రువులు కాని కింది స్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు కూడ ప్రాణాలు కోల్పోయారు, గాయపడ్డారు. వీళ్ల మృతి పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ విచారం ప్రకటించింది. వాళ్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

ఈ వీరోచిత దాడికి నాయకత్వం వహించిన పీఎల్‌జీఏ కమాండర్లకు, దాడిని విజయవంతంగా నిర్వహించిన వీరయోధులకు, దీన్ని సఫలం చేయడంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రజలకు, యావత్ బస్తర్ ప్రాంత విప్లవ ప్రజానీకానికి 'క్రాంతి' విప్లవాభినందనలు తెలియజేస్తున్నది. ప్రజలపై దారుణ హింసా దౌర్జన్యాలకు, అమానుష హత్యాకాండలకు పాల్పడే ఫాసిస్టులను ప్రజలెన్నడూ క్షమించరని, వాళ్లెంత మొనగాళ్లయినా, ఎప్పటికైనా ప్రజల చేతిలో శిక్ష అనుభవించక తప్పదనే చారిత్రక సత్యం ఈ వీరోచిత దాడి ద్వారా మరోసారి రుజువయ్యింది.

### మహేంద్ర కర్మ - బస్తర్ ప్రజల బద్ధ శత్రువు

ఆదివాసీ నేతగా పిలవబడే మహేంద్ర కర్మ నిజానికి భూస్వామ్య మాంఝీ కుటుంబానికి చెందిన వాడు. ఇతని తాత మాస కర్మ, తండ్రి బొడ్డ మాంఝీ బ్రిటిష్ కాలం నుండి ప్రజా పీడకులుగా, విదేశీ పాలకులకు తొత్తులుగా వ్యవహరించారు. ఇతని తాత మాస హయాంలో నవ వధువులను బలవంతంగా ఎత్తుకెళ్లే దురాచారం కూడ కొనసాగేదంటే వీళ్ల వంశానికున్న దుశ్చరిత్రను అర్థం చేసుకోవచ్చు. వీళ్ల కుటుంబం అంతా బాగా భూములు కలిగి ఆదివాసులను అమానుష దోపిడీ పీడనలకు గురి చేసిన చరిత్ర గలదే. మహేంద్ర కర్మ 1975లో జగ్దల్‌పూర్‌లో న్యాయశాస్త్రం చదువుతూ మొదట ఏఐఎస్ఎఫ్ సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించాడు. 1978లో మొదటిసారి సీపీఐ తరపున ఎంఎల్ఏగా పోటీ చేసి ఎన్నికయ్యాడు. ఆ తర్వాత 1981 ఎన్నికలలో సీపీఐ టికెట్ దొరక్కపోవడంతో కాంగ్రెస్‌లో చేరాడు.

*(మిగతాది 51వ పేజీలో...)*